اهدنا الصراط المستقيم

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 1 సంచికలు 11 & 12 జూన్ & జూలై 2010 రూ. 30/-



هُوَ أَنشَأَكُم مِّنَ الْأَرْضِ وَاسْتَعْمَرَكُمْ فِيهَا فَاسْتَغْفِرُوهُ ثُمَّ
تُوبُوٓا إِلَيْهِ إِنَّ رَبِّى قَرِيبٌ مُّجِيبٌ

# అల్లాహ్




## అల్-ముజీబ్

الْمُجِيب

సమాధానమిచ్చువాడు

**THE ANSWERER**

"... ఆయనే మిమ్మల్ని భూమి నుండి పుట్టించి, దానిలో మిమ్మల్ని నివసింపజేశాడు. కనుక మీరు ఆయన క్షమాభిక్ష వేడుకోండి, తరువాత ఆయన వైపునకే పశ్చాత్తాపంతో మరలండి. నిశ్చయంగా నా ప్రభువు దగ్గరలోనే ఉన్నాడు. (మీ ప్రార్ధనలకు) జవాబిస్తాడు" (ఖుర్'ఆన్ 11:61)

* దగ్గరగా ఉండటమంటే భౌతికంగా కాదు. దగ్గరగా ఉండేది ఆయన జ్ఞానం. ఆయన సర్వజ్ఞాని

చెప్పు : " ఆయనే అల్లాహ్! ఒక్కడు. అల్లాహ్ ఎవరి అక్కరా లేనివాడు. ఆయనకు సంతానం లేదు మరియు ఆయన ఎవరి సంతానమూ కాడు. మరియు ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు. (ఖుర్'ఆన్ 112:1-4)

జమాద అల్ ఆఖిర్ - షాబాన్ హి.1431

# శాంతిబాట

మాసపత్రిక రూ. 30/-

సంపుటి 1 సంచిక 11&12 జూన్&జూలై 2010

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

Phone:9347046090 Email:velugubaata@gmail.com

ఎడిటర్:

**ఎమ్‌డి. అతహరుల్లా**

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**సహాయకులు:**

**వెలుగుబాట**

ఎడ్యుకేషనల్ సొసైటీ

మరియు

**ట్రూవిజన్**

ఎడ్యుకేషనల్ సొసైటీ

సభ్యులు

**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440

and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**
T. Srinivasa Rao
(Zakir)

**5 అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్‌ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ ఫాతిహా యొక్క తఫ్సీర్ ...

**8 ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ సమాజం ...

**14 హదీస్ విజ్ఞానం :** ఉల్లేఖకుల మధ్య ఉండే సంబంధం ఆధారంగా హదీస్ వర్గీకరణ ...

**16 ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** ఇస్లామ్‌కు పూర్వం అరబ్బు సమాజం వారి సాంఘిక పరిస్థితులు ...

**20 విశ్వాసం - త్యాగం :** ఇబ్రాహీమ్(అ) కుటుంబం చేసిన త్యాగంపై ప్రత్యేక వ్యాసం ...

**29 రెండవ ఖలీఫా - అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) :** ఉమర్(రజి) వారి గురించి ప్రవక్త(స) వారు చెప్పిన విషయాలు మరియు చరిత్రకారుల అభిప్రాయాలు ....

**33 ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్‌ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

**35 టెర్రరిజం :** టెర్రరిజానికి ఏ మతం పేరును అతికించకుండా, 'ఇస్లామ్'నే అతికించి ముస్లిములనే టార్గెట్‌గా ఎందుకు పెట్టుకున్నారు? కనులు మూసుకున్న మీడియా యొక్క కనులు తెరిపించే ప్రయత్నం. సెప్టెంబర్ 11, 2001 ట్విన్ టవర్స్‌పై దాడి - కారకులెవరు? - పరిశోధనాత్మక వ్యాసం

**43 ముస్లిం యువత - ఆలోచించండి! :** మధ్యయుగ కాలం - చదవక ముందు కాకరకాయ, చదివిన తరువాత కీకరకాయ ...

**47 ఖుర్బానీ :** ప్రత్యేక వ్యాసం

**57 ముహమ్మద్(స)వారు చేసిన హజ్జ్**

**61 పాఠకుల అభిప్రాయాలు**

**సంవత్సర చందా:**

**రూ. 200/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**

2-8-31, కోట బజార్,

సామర్లకోట-533440

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.

లేదా

క్రింది నెంబర్‌కు మీ వివరాలను **SMS** చేయండి.

**Cell : 9491103017**

ఈ పత్రికలో ప్రచురించిన వ్యాసాల గురించిగాని, లేదా ఇతర వివరాలకుగాని సంప్రదించండి

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు, *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# మానవాభివృద్ధి - మత సామరస్యం

మనిషి ఆలోచనల నుండి లేదా పరిశీలనల నుండి ఓ సిద్ధాంతం వెలుగులోకి వస్తుంది. అది నిజమా? కాదా? అది కేవలం ఓ వ్యక్తి యొక్క ఆలోచనేనా? మొదలైన ప్రశ్నలకు కాలమే జవాబు చెబుతుంది. చరిత్ర పుస్తకాల్లో ఇటువంటి సిద్ధాంతాలెన్నో ఉన్నాయి. అందులో ఒకటి మానవ నాగరికతకు సంబంధించింది. తొలి మానవుల గురించి, రాతి యుగం గురించి చరిత్రలో చెప్పడం జరిగింది. తొలి మానవుడికి, మృగానికి తేడా లేదని చాలామంది చెబుతారు. అప్పటి నుండి మానవత్వం అభివృద్ధి చెందుతూ వస్తుందని, ఆ విధంగా నేడు మనం ఆధునిక నాగరికతతో జీవించగలుగు తున్నామని కూడా చెబుతారు. కాని ఇది పూర్తిగా అసత్యమని ఆలోచించగలిగే ప్రతీ ఒక్కరికీ తెలుసు. కాని చరిత్ర పుస్తకాల ద్వారా మనం చిన్నతనం నుండీ నేర్చుకున్న ఈ సిద్ధాంతాలు మాత్రం చాలామందిని వదలడం లేదు. అందుకే చిన్నప్పటి నుండి పిల్లలకు నిజాలే చెబితే, కనీసం మన తరువాతి తరాలు అయినా సరే మంచి ఆలోచనలతో ముందడుగు వేస్తాయి.

మనిషి ఈ భూమిమీద పుట్టి వేల సంవత్సరాలు అయింది అని కొందరు, మరికొందరు ఆ సంఖ్యను లక్ష సంవత్సరాలు కూడా దాటించేశారు. మృగ లక్షణాలు కలిగిన అలనాటి మనిషి నుండి, నేటి ఆధునిక మనిషికి మధ్య మానవత్వంలో చాలా తేడా వుందని భావిస్తున్నారు.

కాబట్టి తొలి మానవునికి మరియు నేటి మానవునికి మధ్యనున్న ఈ మధ్య కాలంలో **మానవత్వం**లో ఎంతో అభివృద్ధి మనిషి సాధించి ఉండాలి. మనుష్యులు ఎంతో సామరస్యంతో బ్రతుకుతూ ఉండాలి. ఘర్షణలు, గొడవలకు అవకాశమే ఉండకూడదు. **కాని నేటి పరిస్థితి ఆ విధంగా ఉందా?**

తరతరాలుగా మానవుడు సాధించిన ఆ అభివృద్ధి ఎక్కడ కనిపిస్తుంది? ఒకనాడు రాళ్ళతో కొట్టుకుని చంపుకుని ఉండవచ్చు. తరువాత కత్తులు, ఈటెలను ఉపయోగించి చంపుకుని ఉండవచ్చు. కాని నేడు బాంబులతో చంపుకుంటున్నారు. ఒకనాడు ఒక్కడే కొంతమందిని చంపగలిగితే, నేడు ఒక్కడే కొన్ని లక్షల మందిని ఎక్కడో వేల కిలోమీటర్ల నుండి బాంబులు వేసి మరీ చంపగలుగుతున్నాడు.

కాబట్టి మనిషి మృగ లక్షణాల నుండి మానవత్వపు లక్షణాల వైపు అభివృద్ధి సాధించాడా? లేక

మానవత్వానికి దూరం అవుతూ మృగలక్షణాలను పొందడంలో అభివృద్ధిని సాధించాడా?

ఆదిమానవుని కాలంలోని మనుషులకీ ఆకలి దప్పులూ ఉన్నాయి. నేడూ ఉన్నాయి. తొలి మానవులకి నిద్ర, విశ్రాంతి, వినోదం అవసరమైనట్లే, ఈనాటి మానవునికి అవి అవసరమే.

- మనుష్యుల మధ్య ఐక్యత ఆనాడూ అవసరమైంది - క్రూర మృగాల బారి నుండి రక్షించుకోవడానికి.
- ఈనాడు కూడా ఐక్యత చాలా అవసరం - క్రూర మృగాల వంటి కొందరి మనుష్యుల నుండి రక్షించుకోవడానికి.

చరిత్రలో ఎన్నో తప్పులు జరిగాయి. వాటినుండి మనం గుణపాఠం నేర్చుకోవాలి. జరిగిన తప్పులు పదే పదే జరగకుండా మనం జాగ్రత్త పడితే, మన భావి తరాలు మనల్ని నాగరికులుగా గుర్తుంచుకుంటారు. మానవ అభివృద్ధిలో మతం అనేది అత్యంత ముఖ్యమైనది. అయితే ఈ మతం గురించి సరియైన అవగాహన నేటి తరంలో లోపించింది.

'మతం' అంటే ఇస్లామ్ ప్రకారం **'జీవన విధానం'**. ఒక విధానం లేకుండా ఏ మనిషీ శాంతిగా బ్రతకలేడు. ఉదయం లేచాక పళ్ళు తోముకుని, స్నానం చేసి, టిఫిన్ లేక వేరే ఆహారాన్ని భుజించి, ఉద్యోగం నిమిత్తమో, చదువుకోవడానికో, లేక మరో పనిచేయడానికో బయలుదేరడం, ఆయా పనులు నిర్వర్తిస్తూ మధ్యలో భోజనం, రాత్రి విశ్రాంతి తీసుకోవడం ఇలా ఓ సాధారణ విధానాన్ని పాటిస్తున్నాడు.

పళ్ళు తోముకోవడానికి పుల్లలను ఉపయోగించేవారున్నారు, బ్రష్‌లను ఉపయోగించేవారున్నారు. ఇక టూత్‌పేస్ట్‌లు వాడేవాళ్ళు రకరకాల కంపెనీల పేస్టులను ఉపయోగిస్తున్నారు. అలాగే స్నానం విషయంలో వాడే సబ్బులలో కూడా ఎన్నో రకాలున్నాయి. స్కూలుకి వెళ్ళే విద్యార్థుల యూనిఫామ్‌లు కూడా ఒకేలా ఉండవు. అన్ని స్కూళ్ళకి ఒకే యూనిఫాం ఎందుకుండదు? ఉద్యోగస్థులకు కూడా రకరకాల యూనిఫామ్‌లున్నాయి. పోలీసాఫీసరుగారు కాకీ డ్రెస్ వేసుకుంటే, లాయరుగారు నల్లకోటు, డాక్టర్‌గారు తెల్లకోటు వేసుకుంటారు. ఇటువంటి ఎన్నో వైవిధ్యాలను మనం సమాజంలో రోజూ చూస్తూనే ఉన్నాము. అంతేకాకుండా ఒకే ఇంటిలోనే ఎన్నో వైవిధ్యాలు కనిపిస్తాయి. అయినా సరే కుటుంబ సభ్యులు అందరూ కలిసే ఉంటారు.

**ఈ సామరస్యానికి పై వైవిధ్యాలు ఏమాత్రం అడ్డుకాలేదు.**

మనదేశంలో ఎన్నో భాషలున్నాయి. ఇంగ్లీష్ మన భాషకాక పోయినప్పటికీ, ఆ భాషకు కూడా మన దేశంలో గౌరవముంది.

మరి మనదేశంలో మతఘర్షణలు ఎందుకు జరుగుతున్నాయి? మన భారతదేశంలో ముఖ్యమైన మతాలు పదిలోపే ఉంటాయి. వీటిలో మాత్రం **సామరస్యం ఎందుకు లోపిస్తుంది?** ముస్లిమ్ మహిళ బురఖా ధరిస్తే, హిందూ మహిళకు ఎటువంటి అసౌకర్యమూ కలుగదు. బట్టలు సరిగ్గా ధరించకుండా ఒళ్ళంతా కనిపించేలా ఎవరైనా మహిళ తమ ఏరియాలో ఉంటే, అక్కడ ఉండే మిగిలిన స్త్రీలకి ఇబ్బంది అవుతుందిగాని,

పూర్తి శరీరాన్ని కప్పుకునేవారి వలన ఎటువంటి ఇబ్బందీ ఉండదు. మస్జిద్‌లో ముస్లిములు ప్రార్థన చేసుకోవడం వలన హిందువులకిగాని, హిందువులు దేవాలయాలలో ప్రార్థన చేసుకోవడం వలన ముస్లిములకు గాని ఎటువంటి ఇబ్బందీ లేదు.

మన సమాజంలో శారీరక వైకల్యానికి కారణమయ్యే పోలియోను తరిమేయడానికి చిత్తశుద్ధితో అందరూ పనిచేస్తున్నారు. అదే విధంగా మనుష్యులలో పైకి కనిపించని మతఘర్షణలను ప్రేరేపించే మనో వైకల్యాన్ని కూడా మన నుండి దూరం చెయ్యాలి.

ఈ మత ఘర్షణలను పెంచి పోషించే వారు కొందరున్నారు. వారిలో ముఖ్యులు రాజకీయ నాయకులు, రౌడీలు, గూండాలు, ప్రజల మధ్య విభేదాల వలన లాభపడే కొందరు స్వార్థపరులు. ఈ పనికోసం రాజకీయ నాయకులు తయారుచేసే కొందరు కిరాయి రౌడీలకు భారతీయులంతా కలిసి బుద్ధి చెప్పిన రోజున, మనమంతా ఒక్కటే అనే సత్యాన్ని తెలుసుకున్న రోజున, మనదేశం సూపర్‌పవర్ అవుతుంది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

**ఎక్కడి పరిస్థితులు ఎలా ఉన్నా సరే మనదేశంలో నిజానికి మతఘర్షణలకు ఆస్కారం లేదు.**

అయోధ్య తీర్పు వెలువడితే మత ఘర్షణలు, ఘోరాలు జరుగుతాయని 144 సెక్షన్ పెట్టి ప్రభుత్వం చాలా అప్రమత్తంగా వ్యవహరించింది. మీడియాను సున్నితంగా హెచ్చరించింది.

కాని భారతీయులు వీరందరికీ ఓ పెద్ద షాకిచ్చారు. ఈ షాక్‌ను మీడియా తట్టుకోలేకపోయింది. ఘర్షణలు జరిగితే మీడియావారికి కొన్ని రోజుల పాటు ఆహారం దొరికేది. అగ్నిలో ఆజ్యం పోసినట్లు ఆ ఘర్షణలను దశదిశలా వ్యాపింపజేయడానికి శతవిధాలా ప్రయత్నించి ఉండేవారు. ప్రభుత్వం మీడియాను హెచ్చరించినా సరే, చర్చా కార్యక్రమాలు ఏర్పాటుచేసి హద్దు మీరడానికి అన్ని మీడియా ఛానెళ్ళ వారు చాలా కష్టపడ్డారు. అయితే సంయమనం కోల్పోవద్దని మీడియాకు సాధారణ ప్రజలే హితబోధ చేసి హేట్సాఫ్ అనిపించుకున్నారు.

**కోర్టు తీర్పు తరువాత భారతీయుల వ్యవహరించిన విధానం గర్వించదగినది.**

రమదాన్, వినాయక నిమజ్జనం, అయోధ్య తీర్పు, కామన్‌వెల్త్ గేమ్స్‌కొరకు ఏర్పాటు చేసిన వసతులపై విమర్శలు, వరదలు మొదలైన ఎన్నో ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రభుత్వానికి ప్రజలు ఊరట నిచ్చారు.

ఘర్షణలు జరుగకపోడానికి కారణం పోలీసులుగాని, కర్ఫ్యూ వాతావరణం గాని కారణం కాదని నిస్సందేహంగా చెప్పవచ్చు. అయితే భద్రత కోసం ప్రభుత్వం ముందు చూపుతో జాగ్రత్త పడడాన్ని ఎంతైనా అభినందించాలి. హిందూ ముస్లిమ్ సోదరులు ఎటువంటి బావోద్వేగాలకు లోనుగాకుండా రాజకీయ నాయకులకు చెంప చెళ్ళుమనిపించారు.

మన ప్రజలు ఇంత హుందాగా ఎలా ప్రవర్తించగలిగారు? గత కొన్నేళ్లుగా వీరిలో అంత మార్పు వచ్చిందా? లేక అయోధ్య విషయంలో బాగా విసిగిపోయి, ఎటువంటి తీర్పు వచ్చినా ఫర్వాలేదు అని అనుకున్నారా?

మా అభిప్రాయం ప్రకారం 20 సంవత్సరాల క్రితం భారతీయులు ఎలా ఉన్నారో, ఈనాడు కూడా అలాగే ఉన్నారు. ఆనాడు ప్రజలను ఓ రాజకీయ పార్టీవారు తీవ్రంగా రెచ్చగొట్టి దారుణ మారణహోమానికి కారణమయ్యారు. అది భారతీయులందరికీ స్పష్టంగా అర్థమైంది. ఏ విధంగా తాము మోసపోవడం జరిగిందో ప్రజలు స్పష్టంగా తెలుసుకున్నారు. మాటీమ్‌లోని వారు గత 45 సంవత్సరాలలో వారి వారి ప్రాంతాలలో మత ఘర్షణలను ఏనాడూ చూడలేదు.

బ్రిటిష్‌వాడు **'విభజించు, పాలించు'** అనే సూత్రంతో, హిందూ ముస్లిముల సోదరభావాన్ని గాయపరిచాడు. ఆ తెల్లవాడి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న కొంతమంది దుర్మార్గులు ఆ గాయం మానకుండా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

**అల్లాహ్ దయవలన ఇప్పుడు ఉన్న సామరస్యం భారతదేశంలో ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాము.**

బాబ్రీ మస్జిద్ కూల్చివేతకు ముందు కూడా ఎందరో ముస్లిమ్ సోదరులు ఇలా చెబుతుండగా మేము విన్నాము : ''మన హిందూ సోదరులకు సంతోషంగా ఆ స్థలాన్ని వారికి ఇచ్చివేద్దాం''. ఇటువంటి అభిప్రాయాన్ని విద్యావేత్తలే కాకుండా, సామాన్యులు కూడా వ్యక్తం చేశారు. కాని ఇలా చేస్తే మన దేశంలోని ఓ ప్రముఖ జాతీయ రాజకీయ పార్టీ వారు, దేశంలోని మిగతా ప్రాంతాలలో కూడా ఇటువంటి వివాదాలు సృష్టించే అవకాశం కూడా ఉందని సందేహంలో పడ్డారు.

అయితే అయోధ్యలోని హిందూ, ముస్లిములు మాత్రం మస్జిద్ కూల్చివేతకు ముందూ, ఆ తరువాత మరియు ఇప్పుడు కూడా సామరస్యంగానే జీవిస్తున్నారు.

జస్టిస్ ఖాన్‌గారు తమ తీర్పులో చెప్పిన అతి ముఖ్యవిషయం : **మందిరాన్ని కూల్చి మస్జిద్ కట్టలేదు. శిథిలాలు ఉన్న ప్రాంతంలో మస్జిద్‌ను నిర్మించడం జరిగింది. ఆ నిర్మాణానికి అక్కడ ఉన్న శిథిలాలను ఉపయోగించడం జరిగింది.** ఈ సందర్భంగా ప్రపంచానికి ఇస్లామ్ గురించి తెలియజేయవలసిన గొప్ప సమయం ఇది అని కూడా క్లుప్తంగా మరియు స్పష్టంగా ఆయన చెప్పారు.

**యుద్ధం జరిగే సమయంలో సైతం** ఇతర మతాల వారి ఆరాధనా గృహాలపైగాని, వాటిలో ఉండే మతబోధకులపైగాని, స్త్రీలపైగాని, పిల్లలపై

గాని ఎటువంటి దాడి చేయకూడదని ముహమ్మద్(స)వారు ఆదేశించారు.

**కోర్టు తీర్పులో న్యాయం ఉందా?** అన్ని అంశాలను పరిగణనలోనికి తీసుకుని తీర్పునిచ్చారా? మొదలైన విషయాలపై వాదనలు పెంచుకోవడం అనవసరం. బాబ్రీ మస్‌జిద్ విధ్వంసానికి కారణమైన ఓ జాతీయ పార్టీ ముఖ్య నాయకుడు మరియు అతనితో అనుబంధం కలిగిన ఓ సంస్థకి చెందిన వ్యక్తి ఒకరు ఇప్పటికే ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు మొదలుపెట్టడం జరిగింది. ఆ సంస్థకు చెందిన వ్యక్తే ఈ మధ్యకాలంలో హైదరాబాద్‌లో రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి అక్కడ రెండు మత వర్గాల మధ్య మతకలహానికి కారణమయ్యాడు. అటువంటి వ్యక్తులపై కఠినంగా వ్యవహరించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

డా. సుబ్రమణ్యస్వామి 'ది హిందూ' పేపర్లో అయోధ్య తీర్పుపై ఓ వ్యాసం వ్రాశారు. మస్‌జిద్ ముస్లిములకు పవిత్రం కాదట. హిందువులకు దేవాలయం మాత్రం పవిత్రమైనదని అభిప్రాయపడ్డారు. ముస్లిములు ఎక్కడైనా నమాజ్ చేసుకోవచ్చు. హిందువులకు ఆ విధంగా కాదు. ముస్లిములకు మస్‌జిద్ ప్రార్థనా స్థలం మాత్రమే కాదు. వారి జీవితంలో అదొక ముఖ్యమైన భాగం. అదొక విజ్ఞాన కేంద్రం, యూనివర్శిటీ, సన్మార్గానికి శిక్షణనిచ్చే ముఖ్యమైన స్థలం. డా. సుబ్రమణ్యస్వామి వంటి వారిని చూసినప్పుడు, కొందరు చదువుకుని కూడా కేవలం డిగ్రీలు మాత్రమే సంపాదిస్తారని, జ్ఞానం సంపాదించడం లేదని స్పష్టంగా అర్థమౌతుంది. మరొక దిన పత్రికలో (12.10.2010) ఓ సీనియర్ శాసన సభ్యుడు ఈ విధంగా కామెంట్ చేశారు. "ఈ తీర్పు సంఘపరివార్‌కి మాత్రమే నచ్చిందని". ఇతరులెవ్వరికీ ఈ తీర్పు నచ్చలేదు అంటే, సంఘపరివార్‌కి నచ్చడం వల్లనే గొడవలు జరుగకుండా దేశం ప్రశాంతంగా ఉందా? ముస్లిములకు నచ్చకపోయినా గొడవలు జరగలేదు అంటే, ఘర్షణలలో ముస్లిముల పాత్ర లేదని తెలుస్తుంది. ఇది నిజమా? అని ఇక్కడ చర్చించనవసరం లేదు. కాని పోలీస్ వ్యవస్థకు, ఇంటెలిజెన్స్ వ్యవస్థకు మాత్రం ఏది నిజమో ఈ పాటికే స్పష్టంగా తెలిసి ఉంటుంది.

బాబ్రీ మస్‌జిద్ కూల్చివేత తరువాత జరిగిన అల్లర్లు పథకం ప్రకారం జరిగినవేగాని భారతీయుల మత విశ్వాసాలు అందుకు కారణం కాదని మాత్రం ఋజువయింది. **అల్లర్ల విషయంలో నిందమాత్రం ముస్లిములపై వేశారు.**

ముహమ్మద్(స)వారు బోధించిన దాని ప్రకారం తన ఇరుగు పొరుగున ఉన్న నలభై ఇళ్ళల్లో ఏ ఒక్కరు ఆకలితో ఉన్నాసరే, వారి ఆకలిని తీర్చకుండా కడుపు నిండా భోజనం చేసే 'ముస్లిమ్ దైవవిశ్వాసి కాడు'. ఆ ఇరుగు పొరుగువారు కేవలం ముస్లిములు మాత్రమే కాదు, వారు ఏ మత ధర్మానికి చెందిన వారైనా సరే.

ముహమ్మద్(స)వారు ముస్లిములతో తమ పొరుగువారితో మంచిగా వ్యవహరించమన్నారు. ఇంకనూ తమ పొరుగువారి గురించి చాలా చెప్పారు. ఎంతవరకూ చెప్పారంటే, చివరకు తమ ఆస్తిలో వారికి కూడా వాటా ఇవ్వవలసి వస్తుందేమోనని అనుమానం కలిగేటంతగా. ఆ ఇరుగు పొరుగువారు ముస్లిములే కాదు. ఎవ్వరైనా కావచ్చు. **ఇస్లామ్ ఎల్లప్పుడూ తోటివారిని ప్రేమించమంటుంది.**

అమెరికా కన్ను మన అభివృద్ధిపై పడింది. మనదేశం చుట్టూ అమెరికావాడు నెలకొల్పిన ఉగ్రవాద ఫ్యాక్టరీలనుండి, ఎటువంటి దాడినైనా వాడు చేయించగలడు. వారితో దాడి చేయించి, ఆ పాపాన్ని ఇస్లామ్ మరియు ముస్లిములపై నెట్టివేస్తాడు. **డబ్బున్నవాడి చేతిలో 'మీడియా' ఆటబొమ్మ అయింది.**

బాబ్రీ మస్‌జిద్‌ను కూల్చేసిన వారి గురించి కోర్టు పట్టించుకోలేదని, వారిని అలా వదిలేస్తే కట్టడాలను కూల్చివేయడం చట్టబద్ధమైనట్లు అవుతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సాకుగా చూపి దేశంలోని ఇతర ప్రాంతాలలో ఉండే కట్టడాలపై ఆ జాతీయ రాజకీయ పార్టీవారు మరియు వారి అనుబంధ సంస్థలు దాడి జరిపే పరిస్థితి రానివ్వబోమని ప్రభుత్వం మరియు న్యాయస్థానం ప్రజలకు భరోసా ఇస్తే, భారతీయులంతా స్వాగతిస్తారని మా నమ్మకం. ఆ విధంగా ప్రకటించవలసిన బాధ్యత కూడా వాటిపై ఉంది.

**'ఇస్లామ్' అనే అరబీ పదానికి అర్థం -'శాంతి'.** ఎవరో చేసిన దానికి 'ఇస్లామ్'ను నిందించడం హేయమైన పని. ఈ రెండు మతాల పేర్లు చెప్పుకుని ఎవరో కొందరు విద్వేషాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తే మనమెందుకు కలహించుకోవాలి?

హిందూ - ముస్లిమ్ భాయీ భాయీ అంటే సరిపోదు. ప్రాథమిక స్థాయి పాఠ్య పుస్తకాల నుండి డిగ్రీ స్థాయి పాఠ్య పుస్తకాల వరకూ, వాటిలో ముస్లిమ్‌లపై, ఇస్లామ్‌పై ద్వేషభావాన్ని కలిగించే విధంగా ఉన్న అసత్యాలను తొలగించి, వాస్తవాలను అందించడం ద్వారా భావిభారత పౌరులలో విద్వేషం కలగకుండా చెయ్యాలి.

ఏదో ఒక రూపంలో ఇతర ధర్మాలకు పాఠ్యపుస్తకాలలో మంచి ప్రాధాన్యత ఉంది. పాఠ్య పుస్తకాలలో 'ఇస్లామ్' గురించి కూడా ఇతర ధర్మాలవారే వ్రాస్తారు. ముహమ్మద్(స)వారి గొప్ప నిజాయితీ గురించి మరియు ఆయన యొక్క అత్యంత మానవీయత గురించి, ఆధునిక నాగరిక వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేసిన ముస్లిమ్ ఖలీఫాల గురించిగాని పాఠ్య పుస్తకాలలో తెలిపి ఉంటే, ఆ నిజాలు తెలుసుకునేలా విద్యార్థులను ఎడ్యుకేట్ చేసి ఉంటే, మెజారిటీ ప్రజలు తోటి ధర్మాన్ని గౌరవించి ఉండేవారు. అన్ని ధర్మాలను ప్రజలు గౌరవించిన రోజున, భారతదేశం నిజమైన లౌకిక రాజ్యంగానూ, మత సామరస్య దేశంగానూ ఖ్యాతి గడిస్తుంది.

**మనమంతా ఒక్కటిగా ఉందాం! మత సామరస్యంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి దేశాభివృద్ధికై సాయపడదాం!**

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో

# సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

**11**

## ఖుర్'ఆన్ తఫ్సీర్

(గత సంచిక తరువాయి)

**సూరహ్ ఫాతిహా:**

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో. **అన్ని పొగడ్తలు మరియు కృతజ్ఞతలు సకల లోకాలకు ప్రభువు, పోషకుడు అయిన అల్లాహ్ కొరకే. అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత. తీర్పు దినానికి సర్వాధికారి. నిన్నే మేము ఆరాధించేది మరియు నీ సహాయాన్నే మేము అర్థించేది. మాకు ఋజుమార్గం (సన్మార్గం) వైపునకు మార్గదర్శకత్వం వహించు. వారి మార్గం ఎవరిపై నీ అనుగ్రహాన్ని ప్రసాదించావో, నీ కోపానికి గురియైన వారిది కాదు, మార్గభ్రష్టులైనవారిది (వారి మార్గం) కాదు.**

**ఈ సంచికతో సూరహ్ ఫాతిహా యొక్క తఫ్సీర్ పూర్తవుతుంది.**

ఈ సూరహ్ యొక్క ఘనతను గురించి ఈ సంచికలో అందిస్తున్నాము.

**ఉమ్ముల్ కితాబ్ :**

ఈ సూరహ్‌ను 'ఉమ్ముల్ కితాబ్' అని అంటారు. ఎందుకంటే

(1) ఖుర్'ఆన్ ఈ సూరహ్‌తో ప్రారంభమైంది. అంతేకాకుండా

(2) నమాజ్‌లో పఠించే తొలి సూరహ్ కూడా సూరహ్ ఫాతిహా

(3) ఖుర్'ఆన్ యొక్క సంపూర్ణ అర్థాన్ని కలిగి ఉంటుంది.

ఇబ్నె జరీర్ చెప్పారు : ''అరబ్బులు ప్రతీ **'విశాల భావ గర్భితమైన'** విషయాన్ని అంటే ఎన్నో విషయాలను కలిగి ఉన్న దానిని **'ఉమ్మ్'** అని పిలుస్తారు. ఉదాహరణకు మెదడు చుట్టూ ఉండే చర్మం 'ఉమ్ముర్రాస్'. 'మక్కా' నగరాన్ని ఉమ్ముల్ ఖురా (గ్రామాలకు తల్లి వంటిది) అని ఆయన చెప్పారు. అన్ని గ్రామాలపై ఈ నగరానికి ఉన్న ఘనత అటువంటిది. **'భూమి తయారుకావడం మక్కా నుండే ప్రారంభమైంది'** అని అత్తబరీ (1:107)లో చెప్పబడింది.

సహీహ్ బుఖారీ 6వ సంపుటిలో పూర్తిగా ఖుర్'ఆన్ తఫ్సీర్(వివరణ) ఉంటుంది. ఈ సంపుటి హదీస్ నెం. 4474తో ప్రారంభమౌతుంది. ఈ హదీస్‌కు ముందుగా అందించిన పరిచయ వాక్యాలలో 'సూరహ్ ఫాతిహా'ను ఉమ్ముల్ కితాబ్ అని తెలియజేశారు. ఎందుకంటే ఇది ఖుర్'ఆన్‌లో తొలి సూరహ్ అని మరియు సలాత్(నమాజ్)లో చదవవలసిన తొలి సూరహ్ అని చెప్పారు.

ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు (ముహమ్మద్ ﷺ) జిబ్రీల్(అ) ఉన్నప్పుడు పైన తలుపు తెరుచుకున్నట్టుగా ఓ శబ్దం విన్నారు. జిబ్రీల్(అ) తల పైకెత్తి చెప్పారు: 'ఇది తెరుచుకున్న స్వర్గం యొక్క ఒక ద్వారం. ఇది ఈ రోజు తెరుచుకుంది మరియు ఇది ఇంతకు ముందెన్నడూ తెరవబడలేదు''. ఒక దైవదూత దాని నుండి క్రిందికి దిగారు. మరియు ఆయన (జిబ్రీల్) చెప్పారు, ఇతను భూమికి దిగిన దైవదూత, ఈ రోజుకు ముందెన్నడూ ఇతను దిగలేదు. అతడు (ఆ దైవదూత) ఆయన(ముహమ్మద్ ﷺ)కు సలామ్ చేసి చెప్పారు: ''స్వీకరించండి మీకు ఇవ్వబడిన రెండు జ్యోతుల శుభవార్తలను మరియు అవి మీకు పూర్వం ఏ ప్రవక్తకూ ఇవ్వబడలేదు: గ్రంథ ప్రారంభం (**అల్-ఫాతిహా సూరహ్**) మరియు **సూరహ్ అల్-బఖరా యొక్క చివరి వాక్యాలు.** మీరు అందులోని ఒక అక్షరాన్ని పఠించనైనా పఠించరు (అంటే ఇంకా పఠించడం పూర్తి చేయకుండానే), మీకు (ప్రతిఫలం) ఇవ్వబడుతుంది.

**(సహీహ్ ముస్లిమ్, 1877, పుస్తకం 6, అధ్యా. 43, సంపుటి 2; నసాయీ, సహీహ్, నెం. 913, పుస్తకం 11, అధ్యా. 25, సంపుటి 2)**

حَدَّثَنَا حَسَنُ ابْنُ الرَّبِيعِ وَ أَحْمَدُ بْنُ جَوَّاسٍ الْحَنَفِيُّ قَالَا: حَدَّثَنَا أَبُو الْأَحْوَصِ عَنْ عَمَّارِ بْنِ رُزَيْقٍ، عَنْ عَبْدِ اللهِ بْنِ عِيسَى، عَنْ سَعِيدِ ابْنِ جُبَيْرٍ، عَنِ ابْنِ عَبَّاسٍ قَالَ : بَيْنَا جِبْرِيلُ قَاعِدٌ عِنْدَ النَّبِيِّ ﷺ، سَمِعَ نَقِيضًا مِنْ فَوْقِهِ، فَرَفَعَ رَأْسَهُ، فَقَالَ : هٰذَا بَابٌ مِنَ السَّمَاءِ فُتِحَ الْيَوْمَ، لَمْ يُفْتَحْ قَطُّ اِلَّا الْيَوْمَ، فَنَزَلَ مِنْهُ مَلَكٌ فَقَالَ: هٰذَا مَلَكٌ نَزَلَ اِلَى الْأَرْضِ، لَمْ يَنْزِلْ قَطُّ اِلَّا الْيَوْمَ، فَسَلَّمَ وَقَالَ: أَبْشِرْ بِنُورَيْنِ أُوتِيتَهُمَا لَمْ يُؤْتَهُمَا نَبِيٌّ قَبْلَكَ، فَاتِحَةُ الْكِتَابِ وَخَوَاتِيمُ سُورَةِ الْبَقَرَةِ، لَنْ تَقْرَأَ بِحَرْفٍ مِنْهُمَا اِلَّا أُعْطِيتَهُ.

**అంతేకాకుండా, ఇటువంటి సూరహ్ పూర్వగ్రంథాలలో అవతరించ బడలేదు.**

أَخْبَرَنَا الْحُسَيْنُ بْنُ حُرَيْثٍ قَالَ : حَدَّثَنَا الْفَضْلُ بْنُ مُوسَى عَنْ عَبْدِ الْحَمِيدِ بْنِ جَعْفَرٍ، عَنِ الْعَلَاءِ بْنِ عَبْدِ ارَّحْمٰنِ، عَنْ أَبِيهِ، عَنْ أَبِي هُرَيْرَةَ عَنْ أُبِيِّ بنِ كَعْبٍ قَالَ : قَالَ رَسُولُ اللهِ ﷺ، : ((مَا أَنْزَلَ اللهُ عَزَّ وَ جَلَّ فِي التَّوْرَاةِ وَلَا فِي الْاِنْجِيلِ مِثْلَ أُمِّ الْقُرْآنِ وَهِيَ السَّبْعُ الْمَثانِي وَ هِيَ مَقْسُومَةٌ بَيْنِي وَ بَيْنَ عَبْدِي وَلِعَبْدِي مَا سَأَلَ))

ఉబై బిన్ కాబ్(రజి) చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : తౌరా (తౌరాత్) లేక ఇంజీల్‌లో ఉమ్ముల్ ఖుర్'ఆన్ (అల్-ఫాతిహా)వంటి దానిని అవతరింపజేయలేదు. ఇది తరచుగా పఠించు 7 ఆయత్‌లు (గలది) మరియు అల్లాహ్ (చెప్పారు) ఇది నాకు మరియు నా దాసునికి మధ్య పంచబడింది. మరియు నా దాసుడు అతడు అడిగిన దానిని కలిగి ఉంటాడు

**(నసాయీ, హసన్, 915, పుస్తకం 11, అధ్యా. 26, సంపుటి 2)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు (ముహమ్మద్ ﷺ) చెప్పారు. 'పఠించే వ్యక్తి ఆమీన్ అని చెప్పినప్పుడు 'ఆమీన్' చెప్పండి. ఒక వ్యక్తి (పలికిన) "ఆమీన్" దైవదూతలు పలికిన "ఆమీన్"తో కలిస్తే, అతని పూర్వపు పాపాలు క్షమించబడతాయి.

**(ఇబ్నెమాజా, సహీహ్, 852, పుస్తకం 5, అధ్యా. 14, సంపుటి 2)**

అలీ(రజి) చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశహరులు (ముహమ్మద్ ﷺ) **'వలద్దాల్లీన్'** తరువాత **'ఆమీన్'** చెబుతుండగా విన్నాను.

**(ఇబ్నెమాజా, సహీహ్, 854, పుస్తకం 5, అధ్యా.14, సంపుటి 2)**

حَدَّثَنَا مُحَمَّدُ بْنُ الصَّبَّاحِل وَ عَمَّارُ ابْنُ خَالِدٍ الْوَاسِطِيُّ قَالاَ : حَدَّثَنَا أَبُو بَكْرِ بْنُ عَيَّاشٍ، عَنْ أَبِي اِسْحَاقَ، عَنْ عَبْدِ الْجَبَّارِ بْنُ وَائِلٍ، عَنْ أَبِيهِ قَالَ: صَلَّيْتُ مَعَ النَّبِيِّ ﷺ، فَلَمَّا قَالَ : ﴿وَلَا الضَّآلِّينَ﴾ قَالَ : ((آمِينَ)).

అబ్దుల్ జబ్బార్ బిన్ వాయిల్ ఉల్లేఖనం : అతని తండ్రిగారు చెప్పారు: "నేను ప్రవక్త(స)వారితో సలాత్ చేశాను మరియు "వలద్దాల్లీన్" అని ఆయన చెప్పినప్పుడు, ఆయన 'ఆమీన్' చెప్పారు. మేము ఆయన నుండి అది విన్నాము.

**(ఇబ్నెమాజా, సహీహ్, 855, పుస్తకం 5, అధ్యా.14, సంపుటి 2)**

**ముస్లిమ్‌లు 'సలామ్' పలికినప్పుడు మరియు 'ఆమీన్' పలికినప్పుడు యూదులు చాలా ఎక్కువగా అసూయ పడేవారు**

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం : ప్రవక్త(స) చెప్పారు: 'సలామ్' మరియు 'ఆమీన్' (పలకడం) కంటే ఎక్కువగా మీపై అసూయపడినట్లుగా, యూదులు ఏ విషయంలోనూ మీపై అసూయపడరు.

**(ఇబ్నెమాజా, సహీహ్, 856, పుస్తకం 5 అధ్యా.14, సంపుటి 2)**

అబూసయీద్ బిన్ ము'అల్లా ఉల్లేఖనం: నేను మస్జిద్‌లో సలాత్ (నమాజ్) చేస్తుండగా, అల్లాహ్ యొక్క సందేశహరులు ﷺ నన్ను పిలిచారు. కాని నేను ఆయనకు బదులివ్వలేదు. తరువాత నేను చెప్పాను, "ఓ రసూలుల్లాహ్ ﷺ నేను సలాత్ (నమాజ్) చేస్తున్నాను. ఆయన ﷺ చెప్పారు, "అల్లాహ్ చెప్పలేదా: "ఓ విశ్వాసులారా! అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు మీకు జీవనమిచ్చే దానివైపునకు, మిమ్మల్ని పిలిచినప్పుడు దానికి జవాబు నివ్వండి..." (ఖుర్'ఆన్ 8:24). తరువాత ఆయన చెప్పారు, "నేను మస్జిద్ నుండి బయటికి వెళ్ళే లోపు, నీకు ఖుర్'ఆన్‌లో కెల్లా గొప్ప సూరహ్‌ను చెప్పనా? తరువాత ఆయన నా చేతిని పట్టుకున్నారు. మరియు ఆయన ﷺ (మస్జిద్‌ను) వదిలి వెళ్ళేటప్పుడు నేను ఆయనకు చెప్పాను, "మీరు నాకు చెప్పలేదా, ఖుర్'ఆన్‌లో కెల్లా గొప్ప సూరహ్ నేర్పిస్తానని?". ఆయన ﷺ చెప్పారు, "అల్-హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్" (సూరహ్ అల్-ఫాతిహా) అది అస్సబా అల్-మసాని (మరలా మరలా పఠించబడే 7 వాక్యాలు) మరియు నాకివ్వబడిన గొప్ప ఖుర్'ఆన్.

**(సహీహ్ బుఖారీ, 4474, పుస్తకం 65, సూరహ్ 1 అధ్యా.1, సంపుటి 6)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స) చెప్పారు, "ఉమ్ముల్ ఖుర్'ఆన్ (ఖుర్'ఆన్‌కు తల్లి వంటిది) పదే పదే పఠించే 7 వాక్యాలు (అల్-మసానీ, సూరహ్ అల్-పాతిహా) మరియు గొప్ప ఖుర్'ఆన్.

**(సహీహ్ బుఖారీ, 4704, పుస్తకం 65, సూరహ్ 15, అధ్యా.3, సంపుటి 6)**

సూరహ్ ఫాతిహా అవతరణ సందర్భంగా షైతాన్ కూడా ఏడ్చాడని హాకిమ్ (1/560) మరియు జిహాబ్‌లో ఉల్లేఖించబడినట్లు తఫ్సీర్ గ్రంథాలలో చదివాము. అయితే ఆ హదీస్‌ల ప్రామాణికతపై వివరాలు త్వరలో అందజేస్తాము, ఇన్షా అల్లాహ్.

హిషామ్ బిన్ జుహ్రా నుండి స్వాతంత్ర్యం పొందిన బానిస అబూ అస్-సాయిబ్ ఉల్లేఖనం :

అబూహురైరా చెప్పగా నేను విన్నాను : 'అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : ఎవరైతే సలాత్ చేశారో దానిలో అతడు ఉమ్ముల్ ఖుర్'ఆన్ (అల్-ఫాతిహా) పఠించలేదో, అది లోపం, అది లోపం, అది లోపం, అసంపూర్ణం. నేను (అబూ అస్-సాయిబ్) చెప్పాను, 'ఓ అబూ హురైరా, నేను కొన్నిసార్లు

ఇమామ్ వెనుక ఉన్నాను. అతను నన్ను చేతిపై పొడిచి చెప్పారు, 'స్వయంగా దానిని పఠించు, ఓ పర్షియన్! ఎందుకంటే రసూలుల్లాహ్(స) చెప్పగా నేను విన్నాను: **'అల్లాహ్ చెబుతారు, నేను సలాత్‌ని నాకు మరియు నా దాసునికి మధ్య రెండు సగాలుగా విభజించాను.** మరియు నా దాసుడు దేనిని కోరాడో దానిని కలిగి ఉంటాడు. "అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: పఠించు, 'అల్-హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్' అని దాసుడు చెప్పినప్పుడు అల్లాహ్ చెబుతారు: 'నా దాసుడు నన్ను పొగిడాడు'. మరియు అతడు 'అర్రహ్మా నిర్రహీమ్' చెప్పినప్పుడు, అల్లాహ్ చెబుతారు: 'నా దాసుడు నన్ను స్తుతించాడు'. మరియు 'మాలికి యౌమిద్దీన్' అని అతను చెప్పినప్పుడు, అల్లాహ్ చెబుతారు, 'నా దాసుడు నా ఘనతను స్తుతించాడు' మరియు ఒక సందర్భంలో 'నా దాసుడు నా శక్తికి విధేయత చూపాడు మరియు అతడు 'ఇయ్యాకన అబుదు వ ఇయ్యాక నస్తయీన్' చెప్పినప్పుడు, అల్లాహ్ చెబుతారు: ఇది నాకు నా దాసునికి మధ్య ఉన్నది మరియు నా దాసుడు తాను అడిగిన దానిని కలిగి ఉంటాడు మరియు దాసుడు 'ఇహ్దినస్ సిరాతల్ ముస్తఖీమ్.....వలద్దాల్లీన్' చెప్పినప్పుడు ఇది నా దాసుని కొరకు మరియు నా దాసుడు ఏదైతే అడిగాడో అది పొందుతాడు'."

**(నసాయీ, సహీహ్, 910, పుస్తకం 11, అధ్యా. 23, సంపుటి 2)**

أَخْبَرَنَا قُتَيْبَةُ عَنْ مَالِكٍ، عَنِ الْعَلَاءِ بْنِ عَبْدِ الرَّحْمٰنِ أَنَّهُ سَمِعَ أَبَا السَّائِبِ - مَوْلَى هِشَامِ بْنِ زُهْرَةَ - يَقُولُ: سَمِعْتُ أَبَا هُرَيْرَةَ يَقُولُ: قَالَ رَسُولُ اللهِ ﷺ: ((مَنْ صَلَّى صَلَاةً لَم يَقْرَأْ فِيهَا بِأُمِّ الْقُرْآنِ فَهِيَ خِدَاجٌ هِيَ خِدَاجٌ هِيَ خِدَاجٌ غَيْرُ تَمَامٍ)) فَقُلْتُ: يَا أَبَا هُرَيْرَةَ! انِّي أَحْيَانًا أَكُونُ وَرَاءَ الْإِمَامِ فَغَمَزَ ذِرَاعِي فَقَالَ: اقْرَأْ بِهَا يَا فَارِسِيُّ! فِي نَفْسِكَ فَانِّي سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: ((يَقُولُ اللهُ عَزَّ وَجَلَّ: قَسَمْتُ الصَّلَاةَ بَيْنِي وَبَيْنَ عَبْدِي نِصْفَيْنِ فَنِصْفُهَا لِي وَنِصْفُهَا لِعَبْدِي وَلِعَبْدِي مَا سَأَلَ)) قَالَ رَسُولُ اللهِ ﷺ: ((اقْرَءُوا، يَقُولُ الْعَبْدُ ﴿الْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِينَ﴾ يَقُولُ اللهُ عَزَّ وَجَلَّ: حَمِدَنِي عَبْدِي، يَقُولُ الْعَبْدُ: ﴿الرَّحْمٰنِ الرَّحِيمِ﴾ يَقُولُ اللهُ عَزَّ وَجَلَّ: أَثْنَى عَلَيَّ عَبْدِي، يَقُولُ الْعَبْدُ: ﴿مٰلِكِ يَوْمِ الدِّينِ﴾ يَقُولُ اللهُ عَزَّ وَجَلَّ: مَجَّدَنِي عَبْدِي، يَقُولُ الْعَبْدُ: ﴿إِيَّاكَ نَعْبُدُ وَ إِيَّاكَ نَسْتَعِينُ﴾، فَهٰذِهِ الْآيَةُ بَيْنِي وَبَيْنَ عَبْدِي وَلِعَبْدِي مَا سَأَلَ. يَقُولُ الْعَبْدُ: ﴿اهْدِنَا الصِّرٰطَ الْمُسْتَقِيمَ صِرٰطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّينَ﴾ فَهٰؤُلَاءِ لِعَبْدِي وَلِعَبْدِي مَا سَأَلَ)).

సూరహ్ ఫాతిహాలో మొదటి భాగంలో దాసుడు 'అల్లాహ్'ను స్తుతిస్తాడు. రెండవ భాగంలో దాసుడు తనకు కావలిసిన దాని కొరకు అల్లాహ్‌కు మనవి చేసుకుంటాడు.

**ఈ సూరహ్‌కు సూరతుష్షిఫా అనే పేరు కూడా ఉంది. అంటే రోగాన్ని నయం చేసే సూరహ్ అని అర్థం.**

అబూ సయీద్ ఖుద్రీ ఉల్లేఖనం: మేము ఒక చోట ఆగాము మరియు ఓ స్త్రీ వచ్చి చెప్పింది : "మా తెగ నాయకుడు కాటువేయబడ్డాడు. మీలో ఎవరైనా 'రుఖ్యా' చేసేవారున్నారా?" మాలో నుండి ఒక వ్యక్తి లేచి ఆమెతో వెళ్లాడు. అతను 'రుఖ్యా' బాగా చేస్తాడని మేము అనుకోలేదు. అతను **సూరహ్ ఫాతిహా**తో రుఖ్యా చేశాడు. మరియు అతనికి నయమయింది. వారు మాకు కొన్ని గొఱ్ఱెలు ఇచ్చారు మరియు మేము పాలు త్రాగాము. మేము అడిగాము : 'నీవు రుఖ్యా బాగా చేయగలవా?' అతను చెప్పాడు : నేను రుఖ్యా కొరకు ఏదీ చదవలేదు సూరహ్ ఫాతిహా తప్ప. నేను చెప్పాను: 'వాటిని అక్కడే ఉంచండి. మనం ప్రవక్త(స)వారి దగ్గరకు వెళ్ళేవరకూ. మేము ప్రవక్త(స)వారి దగ్గరకు వచ్చి ఆయనకు ఈ విషయం గురించి చెప్పాము మరియు ఆయన అన్నారు : 'అతనికి అది రుఖ్యా అని ఎలా తెలిసింది?' వాటిని పంచండి మరియు మీతో నాకు ఓ భాగాన్ని.

**(సహీహ్ ముస్లిమ్, 5735, పుస్తకం 39, అధ్యా. 23, సంపుటి 6)**

ఉసామా బిన్ షరీఖ్ ఉల్లేఖనం : కొందరు పల్లెటూరి వ్యక్తులు అడిగారు: ఓ రసూలుల్లాహ్(స)! మేము వైద్యం చేయవచ్చా? ఆయన చెప్పారు: "ఔను, ఓ అల్లాహ్ దాసులారా! వైద్యం చేయించుకోండి. వాస్తవానికి అల్లాహ్ ఏ రోగాన్ని సృష్టించ లేదు దానికి నయం లేకుండా లేక పరిష్కారం (మెడిసిన్) లేకుండా. ఒక్క రోగానికి తప్ప". వారు అడిగారు 'ఓ రసూలుల్లాహ్! అది ఏమిటి?' ఆయన చెప్పారు : "వృద్ధాప్యం"

**(తిర్మిజీ, సహీహ్, 2038, పుస్తకం 26, అధ్యా. 2, సంపుటి 4)**

అబ్దుల్లా ఉల్లేఖనం : ప్రవక్త(స)వారు చెప్పారు : "**అల్లాహ్ ఏ రోగాన్నీ దింపలేదు దానికి పరిష్కారం (మెడిసిన్) లేకుండా.**

**(ఇబ్నెమాజా, సహీహ్, 3438, పుస్తకం 31, అధ్యా. 1, సంపుటి 4)**

కాబట్టి అనారోగ్యంగా ఉన్నప్పుడు అందుబాటులో నున్న వైద్యంతో అనారోగ్యాన్ని నయం చేయించుకోవాలి. 'ఇస్లామ్' దవా (మెడిసిన్) మరియు దువా (ప్రార్థన) రెండింటిని పరిష్కారంగా చూపింది.

**అందుబాటులో వైద్యం ఉన్నా సరే, వైద్యాన్ని నిర్లక్ష్యం చేసి దువా పైనే ఆధారపడటం సున్నత్‌కి వ్యతిరేకం.**

---

సూరహ్ అల్-ఫాతిహా యొక్క తఫ్సీర్ పూర్తయింది.
సూరహ్ **అల్-బఖరా** యొక్క తఫ్సీర్
వచ్చే సంచిక నుండి ఇన్షా అల్లాహ్ ప్రారంభమౌతుంది.

**సన్మార్గ బోధకుడు**
**నాయకుడు**
**ఆదర్శనీయుడు**

ప్రపంచ శాంతి దూత

# ముహమ్మద్ (స) వారి

**బోధనలు ఆచరణలు**

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్ధిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్'ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

## ఉత్తమ సమాజం




**"మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము, మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము ....." (ఖుర్'ఆన్ 2:143)**

"And thus we have made you a **median [i.e. just] community** that you will be witnesses over the people and the Messenger will be a witness over you ....."

**"మీరే మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించే (బోధించే)వారు మరియు చెడును నిషేధించే (నిరోధించే)వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు ..." (ఖుర్'ఆన్ 3:110)**

"You are the **best nation** produced [as an example] for man kind. You enjoin what is right and forbid what is wrong and believe in ALLAH ....."

పై రెండు ఆయత్‌ల ద్వారా అల్లాహుతాలా "ముస్లిమ్ సమాజాన్ని" (1) ఓ మధ్యస్థ సమాజంగానూ (2) ఉత్తమ సమాజంగానూ చేశారని సులభంగా అర్థమౌతుంది.

**మధ్యస్థ సమాజం**

ఇటువైపుగాని, అటువైపుగాని వాలిపోకుండా సమతుల్యంగా ఉండే న్యాయశీలమైన సమాజం. అంటే అతి లక్షణాలు లేని సమాజం. దైవారాధన పేరుతో సంసారాన్ని మరియు అన్నీ వదులుకుని సన్యాసుల్లో కలిసిపోవడం ఓ అతి లక్షణమయితే, దైవారాధన చేయడానికి తమకు సమయం లేదు అని చెబుతూ, సంసార సుఖాలు, స్వలాభం కోసమే బ్రతకడం మరో అతి లక్షణం. ఈ రెండు అతిలక్షణాల వ్యవస్థకు మధ్యస్థ మార్గాన్ని ఇస్లామ్ సూచించింది.

**అదే** "దైవారాధన మరియు సంసారిక జీవితంతో" కూడిన వ్యవస్థ. ఇది ఉత్తమ వ్యవస్థ (Best system). సంసార సుఖాలను అనుభవిస్తూ అల్లాహ్ ఆరాధనకై ఆదేశించడం జరిగింది.

ఇస్లామ్‌లో సంసారం చేయడం ధర్మ సమ్మతం. భార్యాభర్తలిరువురి మధ్య శారీరక సుఖం కూడా ధర్మసమ్మతమే. ఇస్లామ్‌లో ధర్మ సమ్మతమైన ఏ పని అయినా సరే, అల్లాహ్ పేరుతో చేస్తే అది ప్రార్థనే అవుతుంది.

కాబట్టి ఖుర్ఆన్ మరియు సున్నత్ ప్రకారంగా జీవించే ప్రతీ వ్యక్తి ఎల్లప్పుడూ దైవారాధనలో ఉన్నట్లే. కాబట్టి **ఆరాధన** కొరకు **సర్వసంగ పరిత్యాగి** కానవసరం లేదు.

**ఉత్తమ సమాజం**

అల్లాహుతాలా ఖుర్ఆన్‌లో వర్ణించిన ఆ ఉత్తమ సమాజంలోని వారికి మూడు లక్షణాలుంటాయి.

(1) అల్లాహ్‌యందు విశ్వాసం కలిగి ఉంటారు

(2) మంచిని ఆదేశిస్తారు మరియు

(3) చెడును నిషేధిస్తారు.

**అల్లాహ్ యందు విశ్వాసం కలిగితే, ఆ ముస్లిమ్‌కి ఖుర్ఆన్ గ్రంథంపై విశ్వాసం కలుగుతుంది. ఖుర్ఆన్ ద్వారా మంచీచెడును తెలుసుకో గలుగుతాడు. ఆ విధంగా తెలుసుకున్న మంచిని బోధిస్తూ, చెడును నిరోధిస్తే, ఆ వ్యక్తి అల్లాహ్ చెప్పిన ఉత్తమ సమాజంలోని ఓ సభ్యుడౌతాడు.**

"మీరే మానవజాతి కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు ....." ఆయత్‌లో "**మీరే**" అని ఎవరిని ఉద్దేశించి చెప్పారు?

కేవలం ఓ వ్యక్తినా? లేక కొద్దిమంది వ్యక్తులనా?

**కాదు మొత్తం సమాజాన్ని**. సమాజంలోని ప్రతీ ఒక్కరినీ!

కాబట్టి మంచిని ఆదేశించడం మరియు చెడును నిరోధించడం కేవలం ఓ 'ఆలిమ్'గాని లేదా తనపై స్వయంగా 'దాయీ' అని ముద్ర వేసుకుని తిరిగే ఓ వ్యక్తి యొక్క బాధ్యత కాదు.

ఈ బాధ్యత ముస్లిములందరిపై ఉంది. కాబట్టి ముస్లిము లందరూ మంచీ చెడు తెలుసుకుని, అల్లాహ్ మనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తే, అప్పుడు మన సమాజం ఉత్తమ సమాజమౌతుంది.

**వంట చేసుకోవడానికి బద్ధకించి, కొంతడబ్బు ఖర్చుపెట్టి ఓ వంట మనిషిని ఏర్పాటు చేసుకోవచ్చు.**

**కాని తినడానికి బద్ధకించి, కొంతడబ్బు ఖర్చుపెట్టి ఓ వ్యక్తిని తినడం కోసం ఏర్పాటు చేసుకుంటామా?**

మీరు ఖర్చుపెట్టి తినిపిస్తానంటే ఎంతమందైనా ముందుకు వస్తారు. కాని మీ ఆకలి తీరదు కదా!

డబ్బు ఖర్చుపెట్టి మనిషి ఎన్నో బాధ్యతల నుండి తప్పించు కుంటున్నాడు. తల్లిదండ్రులను 'వృద్ధాశ్రమం'లో చేర్పిస్తున్నారు. పిల్లలను హాస్టల్స్‌లో చేర్పిస్తున్నారు.

అదే విధంగా 'దాయీ' అని పిలువబడే ఓ వ్యక్తిపై డబ్బు ఖర్చుపెట్టి, తమ బాధ్యత తీరిపోయిందని ఊహించుకుని ఎందరో సన్మార్గం నుండి దూరమై పోతున్నారు.

మంచిని ఆదేశిస్తూ, చెడును నిరోధించే ముస్లిమ్ సమాజం ఉత్తమ సమాజం అనడంలో ఎటువంటి సందేహాన్నీ ఎవరూ వ్యక్తం చేయలేరు. ఇటువంటి ఉత్తమ సమాజంలో మనమందరం సభ్యులం కావాలి.

ముహమ్మద్(స)వారి కాలంలోనూ, ఆ తరువాతి కాలంలోనూ "22 లక్షల చదరపు మైళ్ళ ముస్లిమ్ భూభాగం"లో ఎందరో అల్లాహ్ విధేయులున్నారు. కాబట్టి వారు ఖుర్ఆన్ ఆదేశాల ప్రకారంగా ఓ ఉత్తమ వ్యవస్థను ప్రపంచానికి అందించి ఉండాలి కదా!

దానిని ప్రజలందరూ సమ్మతించాలి కదా!

**ఆ విధంగా జరిగిందా?**

నిజంగా అదే జరిగింది!

నేటి ఆధునిక ప్రపంచంలో అమలులో ఉన్న ఎన్నో ఉత్తమ వ్యవస్థలను అందించింది కేవలం ముస్లిములే (అల్లాహ్‌కు విధేయులే!). ఇది కేవలం మా నోటిమాట కాదు. ఆధారాలను అందిస్తున్నాము.

క్రిందటి సంచికలో "ద గ్రేట్ ఎవరు?" వ్యాసంలో కొన్ని విషయాలను తెలియజేశాము.

**జీవనోపాధి**

ముఖ్యంగా మానవుడు రెండు రకాలుగా సంపాదిస్తాడు -

1. **ఉద్యోగం ద్వారా** 2. **వ్యాపారం ద్వారా**

నేడు ఎక్కువమంది ఉద్యోగానికే ప్రాధాన్యత నిస్తున్నారు. వ్యాపారంలో లాభాలు మాత్రమే కాకుండా నష్టాలు కూడా ఉంటాయని, ఉద్యోగమైతే జీవితంలో సెటిల్ అయిపోయినట్లే అని భావించడంతో నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతుంది.

ఉన్నత చదువులు చదివాము కాబట్టి మంచి ఉద్యోగాలే

కావాలంటున్నారు. చిన్న ఉద్యోగం చేయాలంటే చిన్నతనంగా భావిస్తున్నారు. 22 లక్షల చదరపు మైళ్ళ భూభాగానికి నాయకుడైన ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి), తన నౌకరు కూర్చున్న ఒంటె ప్రక్కన నడుస్తూ వెళ్ళడాన్ని చిన్నతనంగా భావించలేదు.

ప్రపంచంలో ఏ చక్రవర్తికీ లేనంత సామ్రాజ్యాన్ని కలిగి ఉన్నా సరే, 14 చిరుగులున్న చొక్కాకు మాసికలు కుట్టుకున్న ఉమర్(రజి) ఏనాడూ సిగ్గు పడలేదు. అందువలన రాజ్యంలో ఆయన విలువగాని, గౌరవాలుగాని లేశమాత్రం కూడా తగ్గలేదు.

ముహమ్మద్(స)వారు ప్రజలను కష్టపడి బ్రతకమని బోధించారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతో తినే ఆహారం ఉత్తమమైన ఆహారమని ఆయన స్పష్టంగా చెప్పారు.

ఈ వివరాలు చాలా స్పష్టంగా ప్రామాణిక ఆధారాలతో సహా క్రిందటి సంచికలో వివరించాము.

**ఉచిత విద్య**

ఈ మధ్య కాలంలో ఈ రాష్ట్రంలో ఉచిత విద్య అందరినీ ఆకర్షించింది. 'శాంతిబాట' 2 మరియు 3వ సంచికలలో 'ఇస్లామ్‌లో మస్జిద్ పాత్ర' వ్యాసంలో కొన్ని చారిత్రక విషయాలను అందించాము. అబ్బాసిద్ ఖలీఫాల కాలంలో ప్రతీ బాలుడు, అతడు రైతు కొడుకైనా, ధనవంతుని కొడుకైనా సరే, అతనికి ప్రాథమిక విద్య తప్పనిసరి. వారికి ఉచిత విద్యను అందించడమే కాకుండా, స్కాలర్‌షిప్‌లు కూడా ఇచ్చేవారు.

పేద విద్యార్థులకు ఉచిత వసతి గృహ సౌకర్యాన్ని కలుగజేశారు. ఆనాడు ఎటువంటి రిజర్వేషన్లు లేవు.

ప్రస్తుత కాలంలో చాలామందిలో ఉన్న అతిపెద్ద అపోహ ఏమిటంటే, కేవలం రిజర్వేషన్ల వల్లనే ఓ వర్గం అభివృద్ధి చెందుతుందని, అవి లేకపోతే వెనుకబడిపోవడం జరుగుతుందని.

కాని ఇక్కడ ఓ చారిత్రక వాస్తవాన్ని ప్రజలు మర్చిపోతున్నారు. ముహమ్మద్(స)వారు మక్కాలో జన్మించక పూర్వం అక్కడి అరబ్బులు ప్రపంచంలో ఆర్థికంగా వెనుకబడినవారే! ముహమ్మద్(స)వారు ఇస్లామ్‌ని బోధించి, వారికి నైతిక శిక్షణను ఇచ్చారు. ఆయన మరణించిన 15 సంవత్సరాలలోపే ఓ అతిపెద్ద భూభాగం ముస్లిముల స్వంతమైంది. వారి ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

**కేవలం 23 సంవత్సరాలలోనే అనాగరిక సమాజం, నాగరికంగా మారిపోయి, ఆ తరువాత మరో 15 సంవత్సరాలలోనే, ఎవరూ చేరుకోలేనంత గొప్ప స్థాయికి ఆ సమాజం చేరుకోగలిగింది అంటే, ఆ చారిత్రక అద్భుతానికి కారణమేమిటో తెలుసుకుని దానినే పాటిస్తే ఎటువంటి వారైనా సరే ఉత్తమ స్థాయికి చేరుకోగలరని నాయకులకు ఎందుకు ఆలోచన రాలేదు?**

కేవలం 40 సంవత్సరాలలోపు ఊహించని ఇటువంటి అద్భుతమైన మార్పుకు కారణమైనది ఇస్లామ్. **ఉన్నత విద్యావేత్తలు, మేధావులు ఈ విషయాన్ని ఎలా మిస్ అయిపోయారు?**

చరిత్రను మనం అభ్యసించేది అందుకొరకే. కాని చరిత్రలో నిజాలని వక్రీకరించి బోధిస్తున్నారు.

కాబట్టి కేవలం రిజర్వేషన్ల వల్లనే అభివృద్ధి సాధ్యం అనుకోవడం ఓ భ్రమ మాత్రమే. ఆర్థిక సహకారం ఒక్కటే అభివృద్ధికి కారణం కాదు.

**ఆత్మ విశ్వాసం**

ముహమ్మద్(స)వారు ప్రజలలో తన బోధనల ద్వారా ఆత్మ విశ్వాసాన్ని కలుగజేశారు. ఆ 'ఆత్మ విశ్వాసానికి' మూలం అల్లాహ్‌పై ఉండే విశ్వాసం. అందువల్లనే వారి ఆత్మవిశ్వాసం చాలా ధృడంగా మారింది. ఇది లేనప్పుడు మనిషి అభివృద్ధి పథంలోకి రాలేడు.

శరీరంపై పుండు వస్తే ఆయింట్‌మెంట్ పూస్తారు. అది తాత్కాలికంగా తగ్గి మరలా వస్తే మరలా పూస్తారు. అయితే ఈ విధంగా ప్రతీసారి పూసే బదులు, ఆ పుండుకు మూలకారణాన్ని కనుగొని, దానిని నయం చేస్తే అసలు సమస్య తీరిపోతుంది. కాబట్టి **ఏ సమస్యకైనా శాశ్వత పరిష్కారం కావాలి**.

రిజర్వేషన్ ద్వారా ఓ ఉద్యోగం వచ్చినంత మాత్రాన, ఆ వ్యక్తిగాని ఆ వ్యక్తి కుటుంబం గాని అభివృద్ధి చెందిపోవడం జరుగదు. సమస్యలను పరిష్కరించుకోగలిగే ఆత్మవిశ్వాసం వారిలో కలగాలి.

ఇదంతా మీకు ఓ లెక్చర్‌గా అనిపించవచ్చు. ఆచరణకు సాధ్యం కానిదిగా కూడా మీరు భావించవచ్చు.

అందుకే ఓ వాస్తవ సంఘటన ద్వారా మీకు పై విషయాన్ని వివరించ దలిచాము.

## అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) వృత్తాంతం

అజ్ఞాన కాలంలో ఇతని పేరు 'అబ్ద్ అమ్ర్' 'అబ్దుల్ కాబా'. ఈయన ఇస్లామ్ స్వీకరించాక, ముహమ్మద్(స) వారు ఈయన పేరును అబ్దుర్రహ్మాన్‌గా మార్చారు.

మహాప్రవక్త ముహమ్మద్(స)వారి (అష్రె ముబష్షరా) పదిమంది ముఖ్య అనుచరులలో ఈయన ఒకరు.

మక్కా నగరంలో బహుదైవారాధకులు పెట్టే హింసలు శృతి మించడంతో, ఆ నేపథ్యంలో ముస్లిములు మక్కా నగరం వదిలి మదీనా నగరానికి వలస వచ్చేశారు. ఎంతోమంది కట్టుబట్టలతో మదీనా చేరారు. ఈ విధంగా వలస వచ్చిన ముస్లిమ్‌లను **ముహాజిరీన్‌లు** అన్నారు. వీరిని మదీనాలోని ముస్లిములు ఆదరించారు. ఈ విధంగా ముహాజిరీన్‌లను ఆదరించిన మదీనా ముస్లిములను **అన్సారులు** (సహాయకులు) అన్నారు.

ఒక్కొక్క ముహాజిర్‌కు అండగా ఒక్కొక్క అన్సార్ నిలబడి అతని ఆస్తిలో సగభాగాన్ని మనస్ఫూర్తిగా పంచడం జరిగింది. ఈ విధంగా ముహాజిరీన్‌లకు మరియు అన్సారులకు మధ్య ధృడమైన సోదరబంధం ఏర్పడింది.

**అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)** ఒకప్పుడు మక్కాలో ధనవంతులు. కాని

ఇప్పుడు అతని దగ్గర ఆ సంపద లేదు. మదీనా నగరానికి వలస వచ్చిన ఈయనకి 'అన్సార్' అయిన **సాద్ బిన్ రబీ'అహ్**(రజి)ని సోదరునిగా ముహమ్మద్(స) జత చేశారు.

**సాద్**(రజి)కూడా ఇతర అన్సారుల వలే చాలా దయతో, ఉదారంగా **అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్**(రజి)తో ఇలా చెప్పారు :

''నా సోదరా! మదీనా ప్రజలలో నాకు ఎక్కువ సంపద ఉంది. నాకు రెండు తోటలున్నాయి. మరియు నాకు ఇద్దరు భార్యలున్నారు. నీకు రెండు తోటలలో ఏది ఇష్టమౌతుందో చూడు మరియు నేను దానిని నీ కొరకు వదిలివేస్తాను. మరియు ఇద్దరు భార్యలలో ఎవరు నీకు నచ్చారో మరియు ఆమెకు నీ కొరకు విడాకులిస్తాను''.

కాని అబ్దుర్రహ్మాన్(రజి)వారు చెప్పిన సమాధానం: **''అల్లాహ్ నీ కుటుంబంలో మరియు నీ సంపదలో శుభాలను కలుగుజేయుగాక! కాని నాకు బజారు (మార్కెట్) ఎక్కడ ఉందో కాస్త చూపించండి''.**

(ఈ వివరాలు సహీహ్ బుఖారీలో ఉన్నాయి. హదీస్ నెం.3780)

అబ్దుర్రహ్మాన్‌వారు మార్కెట్‌కి వెళ్ళి అతి తక్కువ వనరులతో వ్యాపారం చేశారు. వస్తువులను కొనడం, అమ్మడం చేశారు. ఆయన లాభాలు చాలా తొందరగానే పెరిగాయి. త్వరలో ఆయన అవసరాలకు సరిపోయేటంత సంపాదించుకున్నారు. కాబట్టి వివాహం చేసుకున్నారు.

ఆయన వస్త్రాలపై సువాసన గుభాళిస్తుండగా ప్రవక్త(స)వారి వద్దకు వెళ్ళారు. అది చూచి, ''ఓ అబ్దుర్రహ్మాన్!'' అంటూ సంతోషంతో ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచారు ప్రవక్త(స).

తనకు వివాహం జరిగిందని అబ్దుర్రహ్మాన్ చెప్పారు. భార్యకు మహ్ర్ ఎంత ఇచ్చారని ప్రవక్త(స)వారు అబ్దుర్రహ్మాన్‌ని అడిగారు. ''ఖర్జూరపు పిక్క బరువున్న బంగారం''.

'ఇస్లామ్'లో స్త్రీగాని, స్త్రీ కుటుంబంగాని వరుడికి కట్నమివ్వదు. పెళ్ళి కొడుకు, తాను చేసుకోబోయే స్త్రీకి కొంత మహ్ర్ చెల్లించాలి.

అదే విధంగా ఇస్లామ్‌లో పెళ్ళి ఎంతో నిరాడంబరంగా జరుగుతుంది. నేడు అట్టహాసంగా జరుగుతున్న వివాహ వేడుకలు ఇస్లామ్ సాంప్రదాయానికి విరుద్ధమైనవి. ముహమ్మద్(స)వారి ముఖ్య అనుచరులైన పదిమందిలో ఒకరైన అబ్దుర్రహ్మాన్‌గారు వివాహం చేసుకున్న సమయంలో ప్రవక్త(స)వారు అక్కడ లేరు. వాస్తవానికి ఆయనకి ముహమ్మద్(స)వారి కంటే ముఖ్యులు ఎవరుంటారు? దీనిని బట్టి తప్పనిసరిగా అందరినీ పిలిచి వివాహం చేసుకోవలసిన అవసరం లేదు అని తెలుస్తుంది. వివాహం అయిన తరువాతైనా చెప్పుకోవచ్చు.

''నీవు వలీమా(విందు) ఇవ్వాలి అది ఒక గొఱ్ఱెతో అయినప్పటికీ'' అని ప్రవక్త(స)వారు సంతోషంగా అబ్దుర్రహ్మాన్‌కి తెలియజేశారు.

కాబట్టి వరుడు తప్పనిసరిగా పెళ్ళి విందు ఏర్పాటుచేయాలి. ఆ విందు కూడా అతని స్థోమతపై ఆధారపడి ఉంటుంది. స్త్రీకి విందు ఏర్పాటు చేయవలసిన అవసరం లేదు.

అబ్దుర్రహ్మాన్‌గారి వ్యాపారం దినదినం పెరుగుతూ ఉంది. మక్కా నుండి మదీనాకు వలసవెళ్ళి, అక్కడ శాంతిగా బ్రతుకుతున్న ముస్లిములను, అక్కడ కూడా బ్రతకనివ్వకూడదని, మక్కా అవిశ్వాసులు యుద్ధాన్ని తలపెట్టారు.

పెద్దగా ఆయుధ సామాగ్రిగాని, గుఱ్ఱాలు గాని, ఒంటెలుగాని లేని అతి స్వల్ప సంఖ్యలో ఉన్న ముస్లిములపైకి, సాయుధులైన మక్కావారు బద్ర్ ప్రాంతంలో యుద్ధం చేశారు.

అల్లాహ్ కరుణతో స్వల్ప సంఖ్యలో నున్న ముస్లిములే విజయం సాధించారు. ఆ యుద్ధంలో కూడా అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) పాల్గొన్నారు. వీరోచితంగా పోరాడారు.

ఆ తరువాత జరిగిన ఉహద్ యుద్ధంలో ధృడంగా నిలబడ్డారు. ఆయన శరీరంలో లోతుగా 20 కంటే ఎక్కువ గాయాలయ్యాయి.

ఈ యుద్ధాలలో కేవలం ఆయన శారీరకంగా మాత్రమే ధర్మ పోరాటం చెయ్యలేదు, ఆయన తన సంపదను కూడా ధర్మపోరాటంలో వెచ్చించారు.

ఒకసారి ప్రవక్త(స)వారు సైన్యాన్ని పంపుతున్నారు. అందుకొరకు విరాళాలు ఇవ్వమని ప్రవక్త(స)వారు పిలుపునిచ్చారు. అబ్దుర్రహ్మాన్ గారు తన ఇంటికి వెళ్ళి వెంటనే తిరిగి వచ్చారు. ఆయన తన దగ్గరున్న 4వేల దీనార్లు (బంగారు నాణాల)లో 2వేల దీనార్లను తన కుటుంబం కొరకు ఉంచి, 2వేల దీనార్లను అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడానికి ఇచ్చారు.

ప్రవక్త(స)వారి జీవితంలోని చివరి గజ్వా తబూక్. ఈ ప్రాంతం మదీనాకు 1000 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో పుంది. కాబట్టి రవాణా సౌకర్యం చాలా ముఖ్యం. ఈ యుద్ధానికి మనుష్యులకంటే ఎక్కువగా సామాగ్రి మరియు ఆర్థిక వనరుల అవసరమేర్పడింది. యుద్ధం చేయబోయేది బైజాన్‌టియన్ల (రోమన్ల) సైన్యంతో.

కొంతమంది యుద్ధానికి వస్తామని ఎంతో ప్రాధేయపడినా సరే, రవాణా సౌకర్యం అందరికీ కలిగించలేక ముహమ్మద్(స) ప్రజల కోరికను అంగీకరించలేక పోయారు. ఆ సంవత్సరంలో మదీనాలో కరువు పరిస్థితులు కూడా నెలకొని ఉన్నాయి.

యుద్ధానికి అనుమతి లేక చాలామంది విచారంగా ఉన్నారు. అప్పుడు ప్రవక్త(స) తన అనుచరులకు యుద్ధ విరాళం కొరకు ఆయన(స) పిలుపు నిచ్చారు. పిలుపుకు వెంటనే వారంతా ప్రతిస్పందించారు. అందరికంటే ముందు ఉన్నది అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి). ఆయన 200 ఔకియాల బంగారాన్ని విరాళంగా ఇచ్చారు. అప్పుడు ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు, అబ్దుర్రహ్మాన్(రజి) తప్పు చేస్తున్నారని, తన కుటుంబానికి ఏదీ వదలలేదని ప్రవక్త(స)వారికి చెప్పారు.

'అబ్దుర్రహ్మాన్! నీ కుటుంబానికి ఏదైనా మిగిల్చావా?' అని ప్రవక్త(స)వారు అడిగారు. 'ఔన'ని ఆయన సమాధానమిచ్చారు. నేను ఇచ్చిన దానికంటే వారికి మిగిల్చింది ఎక్కువేనని ఆయన సమాధాన మిచ్చినప్పుడు ''ఎంత?'' అని ప్రవక్త(స)వారు అడిగారు.

పోషణ, మేలు మరియు ప్రతిఫలాన్ని ఏదైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వాగ్దానం చేశారో'' అని సమాధానమిచ్చారు. తబూక్ యుద్ధానికి సైన్యం బయలుదేరింది. ఇక్కడ ఓ ముఖ్య సంఘటన జరిగింది. సలాత్(నమాజ్) చేయవలసిన సమయం అయినప్పుడు, ఆ సమయంలో ప్రవక్త(స)వారు అక్కడ లేరు. ముస్లిములు అబ్దుర్రహ్మాన్ (రజి)వారిని తమకు ఇమామ్‌గా ఎన్నుకున్నారు.

దాదాపు మొదటి రకాత్ పూర్తి అవుతుండగా, ప్రవక్త(స)వారు జమాత్‌తో పాటు కలిసి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) వెనుక సలాత్ (నమాజ్) చేశారు. కనీసం ఒక్క రకాత్‌కైనా సరే, ప్రవక్తల ఇమామ్ అయిన ముహమ్మద్(స)వారి ముందు ఇమామత్ చేయడం కంటే గౌరవం ఇంకేముంటుంది?

ఈ నమాజ్ ప్రయాణంలో ఉండగా చేయడం జరిగింది. మస్జిద్‌లో ఇమామత్ కాదని పాఠకులు గమనించాలి.

ముహమ్మద్(స)వారి మరణం తరువాత, ప్రవక్త(స)వారి కుటుంబ అవసరాలను, బాగోగులను ఈయన పట్టించుకునేవారు.

ఒకసారి ఈయన 40వేల దీనార్లకు ఓ భూమిని కొని, దానిని బనూ జహ్రా (ముహమ్మద్(స)వారి తల్లిగారైన అమీనా వారి బంధువులకు), ముస్లిములలోని పేదవారికి, ప్రవక్త(స)వారి సతీమణులకు పంచారు.

ప్రవక్త(స)వారి ప్రార్థన వలన, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)వారి సంపదలో అల్లాహ్ శుభాలను కలుగజేశారు. ప్రవక్త(స)వారి అనుచరులందరిలో ఆయనే అత్యంత ధనవంతుడు.

అతని వర్తక బిడారం చాలా పెద్దదయింది. మదీనాకు అవసరమైన సకల వస్తువులు తీసుకురాబడేవి. వారు ఉత్పత్తి చేసిన వాటిలో మిగిలినవి ఎగుమతి చేసేవారు.

ప్రశాంతంగా ఉన్న మదీనాలో ఒకరోజు పొలిమేరల నుండి గట్టిగా గడగడమంటూ శబ్దాలు వినబడ్డాయి. ఆ శబ్దం రాను రాను పెరుగుతుంది. దానితో పాటు ధూళి మరియు ఇసుక సుడిలా తిరుగుతూ గాలిలో ఎగురుతుంది. మదీనా ప్రజలు ఓ పెద్ద వర్తక బిడారం మదీనా నగరంలో ప్రవేశిస్తుందని చాలా తొందరగానే అర్థం చేసుకోగలిగారు. వ్యాపార సామాగ్రితో ఏడు వందల ఒంటెలు మదీనా నగరంలో ప్రవేశించాయి. వీధులన్నీ రద్దీ అయిపోయాయి. ప్రజలు ఆశ్చర్యంతో చూస్తూ నిలుచున్నారు.

ఆయిషా(రజి) ఈ గందరగోళాన్ని విని అడిగారు : ''మదీనాలో జరుగుచున్న దేమిటి?''. అది సిరియా నుండి తీసుకురాబడిన అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)గారి వ్యాపార సామాగ్రి అని ఆమె(రజి)కు తెలియజేశారు.

''ఇంత గందరగోళం ఓ వర్తక బిడారం చేసిందా?'' ఆమె అపనమ్మకంతో అడిగారు.

''ఔను, ఓ విశ్వాసుల మాతృమూర్తీ! అవి ఏడువందల ఒంటెలు''.

ఆ సమయంలో ఆమె(రజి) ఓ విషయాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు.

నేను రసూలుల్లాహ్(స) (ఇలా) చెబుతుండగా విన్నాను : ''అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ప్రాకుతూ స్వర్గంలో ప్రవేశించడాన్ని నేను చూశాను''.

ఎందుకు ప్రాకుతూ వెళుతున్నారు?

అబ్దుర్రహ్మాన్(రజి) స్నేహితులు కొందరు ఆయిషా(రజి) చెప్పిన ఈ హదీస్ గురించి ఆయన వద్ద ప్రస్తావించారు, ముహమ్మద్(స)వారినుండి ఒకటి కంటే ఎక్కువసార్లు ఆయన ఈ విషయాన్నే విని ఉన్నారు. ఆ విషయం జ్ఞాపకం వచ్చింది. ఆయన వెంటనే ఆయిషా(రజి)వారి దగ్గరికి వెళ్ళి చెప్పారు : ''ఓ అమ్మా! మీరు రసూలుల్లాహ్(స)వారి దగ్గరి నుండే విన్నారా?''

''ఔను''అని ఆమె(రజి) సమాధానమిచ్చారు.

''నేనెన్నడూ మర్చిపోలేని ఓ హదీస్‌ను నాకు గుర్తు చేశారు''

ఆయన మిక్కిలి ఆనందంతో, ''నాకు సాధ్యమైతే స్వర్గంలోకి నిలుచునే ప్రవేశించడానికి ఇష్టపడతాను, ఓ అమ్మా! నేను మీకు ప్రమాణం చేస్తున్నాను. ఈ మొత్తం వ్యాపార బిడారాన్ని, వస్తు సామాగ్రితో సహా, అల్లాహ్ మార్గంలో ఇచ్చి వేస్తాను''.

ఆయన ఆ విధంగానే చేశారు. అంత పెద్ద వర్తక బిడారాన్ని మదీనా మరియు దాని చుట్టుప్రక్కల ప్రాంత ప్రజలకు పంచివేశారు.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) ఎటువంటివారో చెప్పడానికి కేవలం ఓ సంఘటనను మాత్రమే ఇక్కడ చెప్పాము.

ఈయన ఎంతో సంపాదించారుగాని, ఆ సంపదను ఆయన ప్రేమించ లేదు. ఆ సంపద ఆయనని పాడు చేయలేకపోయింది.

ఆయన ఔదార్యం ఇక్కడితో ఆగిపోలేదు. ఆయన రెండు చేతులతో బహిరంగంగానూ, రహస్యంగానూ దానాలు ఇచ్చారు. ఆయన ఇచ్చిన వాటిని తెలుసుకుంటే నిజంగా ఎవరైనా ఆశ్చర్యచకితులవుతారు.

40వేల దిర్హముల వెండి, నలభైవేల దీనార్ల బంగారం, 200 ఔఖియాల బంగారం, అల్లాహ్ మార్గంలో ఉన్న ముజాహిద్‌లకు 500 గుఱ్ఱాలు, 500 ఒంటెలను మరో ముజాహిద్ సమూహానికి, బదర్ యుద్ధంలో పాల్గొని మరియు జీవిస్తున్న వారికి 400 దీనార్ల బంగారం. విశ్వాసుల మాతృమూర్తులకు కూడా ఓ పెద్ద ఆస్తిని వారసత్వంగా అందించారు.

ఆయన ఔదార్యం గురించి ఆయిషా(రజి) చెప్పారు : ''(స్వర్గంలోని ఓ నీటిధార) సల్‌సబీల్ నీటిని అల్లాహ్ ఆయనచే త్రాగించుగాక!

ఈయన సంపాదించిన సంపద ఆయనను మార్చలేదు మరియు పాడుచెయ్యలేదు.

ఆయన తన నౌకర్లతో మరియు సహాయకులతో ఉండగా, వారికి ఆయనకి మధ్య తేడాని ఎవరూ గుర్తించలేని విధంగా ఉండేవారు.

ఒకరోజు ఆయన చేస్తున్న ఉపవాసాన్ని విరమించడానికి ఆహారం తీసుకురాబడింది. ఆయన ఆ ఆహారం వంక చూసి చెప్పారు:

"ముసాబ్ బిన్ ఉమైర్ చంపబడ్డారు. ఆయన నాకంటే మేలైనవారు. ఆయన శవాన్ని కప్పడానికి మాకేదీ దొరకలేదు, ఆయన తలను కప్పితే కాళ్ళు కప్పబడేవికావు, అది తప్ప (ఇంకేమీ లేదు). తరువాత అల్లాహ్ ప్రాపంచిక (అనుగ్రహాలను మాకు) అనుగ్రహించారు. నేను నిజంగా భయపడుతున్నాను. మన ప్రతిఫలాన్ని మనపై ముందుగానే (ఈ లోకంలోనే) అనుగ్రహించారేమోనని" (అంటే పరలోకంలో తగ్గు తుందేమో నని ఆయన భయం కావచ్చు). **ఆయన ఏడవడం ప్రారంభించారు, వెక్కి వెక్కి ఏడుస్తూ తినలేకపోయారు.**

ఒకనాడు ఈ విశ్వాసులకి తినడానికి తిండి, ధరించడానికి వస్త్రాలు లభించడం కష్టమయ్యేది. ఆ కష్టాలను వారు ఎంతమాత్రం మర్చిపోలేదు. తరువాతి కాలంలో అల్లాహ్ యొక్క అనుగ్రహం వారిలో విధేయతను మరింత పెంచింది.

పైన తెలిపిన అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌గారి వృత్తాంతాన్ని బట్టి **మీకు ఏమర్థమయింది?**

తన దగ్గర ఏ ఆర్థిక వనరులు లేనప్పుడు, వాటిని స్వచ్ఛందంగా ఇస్తానన్న ఓ సోదరుని సహాయాన్ని కూడా నిరాకరించి, మార్కెట్‌లో ఏదైనా పనిచేసి కొంత సంపాదించిన దానితో గాని లేదా ఉన్న ఓ కొద్ది వాటితోనే (అది కొంత చిల్లరే కావచ్చు) వ్యాపారం ప్రారంభించి, అందరి కంటే గొప్ప ధనవంతులయ్యారు.

అల్లాహ్ మార్గంలో ఆ సంపదలోని ఎక్కువ భాగాన్నే ఖర్చుపెట్టారు. అయినా సరే ఆ సంపద వృద్ధి చెందుతూనే ఉంది. ఆ సంపదను చూచి ఆయన ఏనాడూ గర్వపడలేదు. ఆయన కాలుమీద కాలేసుకుని దర్జాగా బ్రతకలేదు. యుద్ధాలలో పాల్గొని గాయపడ్డారు. కష్టాలని మరిచిపోలేదు. అవినీతిని దరి చేయనియ్యలేదు. సంపద తనను మార్చలేదు సరికదా, అది ఆయనలో అల్లాహ్‌పై విధేయతను పెంచింది. నిరాడంబరతను పెంచింది.

ఓ మంచి సంకల్పం, దానికి తగ్గ ఆచరణ ఉంటే ఇన్షా అల్లాహ్, అల్లాహ్ యొక్క అనుగ్రహం పొంగి పొరలుతుంది. అల్లాహ్ ఆదేశాలకు లోబడి సంపాదిస్తే, అల్లాహ్ మార్గంలో దానిలోని కొంత ఖర్చుపెడితే, జకాత్ ఇస్తే, ఆ సంపదలో వృద్ధి కలుగుతుందని అల్లాహ్ వాగ్దానం చేశారు.

మన దగ్గర ఏమీ లేకపోవచ్చు. ఖుర్ఆన్ ఉంది. ముహమ్మద్(స)వారి బోధనలున్నాయి. ఆ ఆదేశాల కనుగుణంగా మంచి సంకల్పంతో మనం ఓ ముందడుగు వేస్తే, ఇన్షాఅల్లాహ్ అల్లాహ్ అనుగ్రహం మనపై వర్షిస్తుంది. అది గొప్పది. ఇప్పుడు చెప్పండి. ఇక రిజర్వేషన్లు మనకవసరమా?

ఏ రిజర్వేషన్ మరియు ఏ ఆర్థిక సహకారం అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) గారిని అంత గొప్పవారిగా చేసింది? వీరిని మనకు వాస్తవ ఉదాహరణగా అల్లాహ్ చూపించారు.

ఇంత స్పష్టమైన ఉదాహరణలను చూసి కూడా నేటి ముస్లిమ్ సమాజం అన్ని రంగాలలో అభివృద్ధి చెందకపోతే ఈ ముస్లిమ్ సమాజాన్ని **'చేతిలో ఆహారాన్ని ఉంచుకుని తినలేని దురదృష్టవంతుని'**తో పోల్చవచ్చు.

ఉత్తమ సమాజాన్ని నిర్మించి, పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ఇన్షాఅల్లాహ్ ఈ రోజే నిర్ణయం తీసుకుందాం!

(ఇంకా వుంది)

## చందా వివరాలు

**ఆగస్ట్, 2010 (సంపుటి 2, సంచిక 1) నుండి**

**'శాంతిబాట' మాసపత్రిక**

**సంవత్సర చందా రూ. 200/- చేయడమైనది**

**విడిప్రతి వెల : రూ. 17/-**

**మనియార్డర్ ద్వారా చందాను పంపవలసిన చిరునామా:**

Velugubaata Educational Society
2-8-31, Kota Bazar, Samalkot - 533440
East Godavari District

**మూడు లేదా అంతకంటే ఎక్కువ చందాలను పంపగోరువారు క్రింది బ్యాంక్ ఎకౌంట్‌లో జమచేయగలరు.**

SBI A/c No. 10428633092, A.U. Campus Branch, Waltair, Visakhapatnam, A/c Holder Name: Nagireddi Srinivasa Rao

**మీరు డిపాజిట్ చేసే మొత్తానికి బ్యాంక్ ఛార్జీ (రూ. 25/-) అదనంగా కలిపి డిపాజిట్ చేయమని కోరుతున్నాము.**

Bank **ద్వారా గాని** Money Order **ద్వారాగాని చందా చెల్లించినవారు 9491103017కి** SMS **ద్వారాగాని, కాల్ చేసిగాని వివరాలను తెలియజేయవలసిందిగా కోరుతున్నాము.**

## మనవి

**ఈ సంచికతో 1 సంవత్సరం పూర్తి అయింది.**

**కాబట్టి సంవత్సర చందా పంపవలసిన వారు**

**వచ్చే సంచిక విడుదలయ్యే లోపు పంపమని**

**కోరుతున్నాము**

Science of Hadith

# హదీస్ విజ్ఞానం

(గత సంచిక తరువాయి)

**క్రిందటి సంచికలో ఖుద్సీ, మర్ఫూ, మౌఖూఫ్ మరియు మఖ్తూ హదీస్‌ల గురించి చెప్పుకున్నాము. ఏ హదీసైనా ప్రవక్త(స)వారి వరకూ ఉంటే అది మర్ఫూ (ఉన్నతమైనది)అని, ఓ సహాబి వరకూ ఉంటే దానిని మౌఖూఫ్ అని మరియు ఓ తాబయీ వరకూ ఉంటే దానిని మఖ్తూ అని పిలుస్తారు.**

**పై వర్గీకరణ ఓ నిర్ధిష్టమైన ప్రామాణికుని (particular authority)పై ఆధారపడి ఉంటుంది.**

2

ఈ సంచికలో మరో వర్గీకరణను గురించి తెలుసుకుందాం!

ప్రవక్త(స)వారి మరణానంతరం, కాలం గడిచేకొద్దీ హదీస్‌లను తెలియజేసేవారి సంఖ్య సనద్‌లో పెరగడంతో, హదీస్‌ల ప్రామాణికతను నిర్ణయించే విషయంలో నిష్పక్షపాతమైన ఓ క్రమశిక్షణను అనుసరించ వలసి వచ్చింది.

ప్రవక్త(స)వారి నుండి బోధనను విన్న సహాబీ, ఆ హదీస్‌ను తెలియ జేసేవారు. ఆ సహాబీ నుండి ఓ తాబయీ, ఆ తాబయీ నుండి ఓ తబేతాబయీ, ఆయన నుండి మరొకరు, ఆ మరొకరు నుండి మరొకరు ఆ హదీస్‌ను తెలుసుకోవడం జరిగింది. ఈ విధంగా ప్రవక్త(స)వారి దగ్గర నుండి ఈ హదీస్‌ను గ్రంథస్థం చేసేవారి (ముహద్దిస్) వరకూ ఓ లింక్ (సంబంధం) ఏర్పడింది. ఈ విధంగా 'సనద్'లో ఉండేవారి మధ్య ఏర్పడిన సంబంధంపై ఆధారపడి చేయబడిన వర్గీకరణ :

1. సనద్‌లో ఉండే వ్యక్తుల మధ్య సంబంధం పూర్తిగా ఉండడం (**ముస్నద్** - బలపరచబడినది)
2. సనద్‌లో ఉండే వ్యక్తుల మధ్య సంబంధం తెగిపోకుండా (అంతరాయం లేకుండా) కొనసాగడం (**ముత్తసిల్**)
3. సనద్‌లో ఉండే వ్యక్తుల మధ్య సంబంధం తెగిపోవడం (**మున్‌ఖతి**)
4. అసలు సనద్ అనేదే లేకపోవడం (**ముఅల్లఖ్**)
5. సనద్‌లో ఉండే వ్యక్తుల మధ్య సంబంధం సందేహం కలిగి ఉండడం (**ము'అదల్**)
6. సనద్‌లో ఉండే వ్యక్తుల మధ్య సంబంధంలో కొంత భాగం సడలించబడటం (**ముర్సల్**)

---

**గమనిక: ఈ శీర్షిక యొక్క ప్రధానోద్దేశ్యం ఏమిటంటే, హదీస్ విజ్ఞానం యొక్క గొప్పతనాన్ని పాఠకులకు అర్థం అయ్యేవిధంగా తెలియజేయడం. 'హదీస్'లా అంటూ తేలిగ్గా కొట్టి పారేసేవారు చాలామంది ఉన్నారు. వారిలో ఉన్న అపోహలను కూడా తొలగించాలి. అందుకొరకు క్లిష్టమైన పదాలను వివరించడానికి తేలికపాటి భాషను ఉపయోగిస్తున్నాము. హదీస్‌లపై మంచి అవగాహన ఉన్నవారికి ఈ భాష కొంచెం ఎబ్బెట్టుగా అనిపించవచ్చు. అందరికీ అర్థం కావాలనే మా సంకల్పాన్ని అర్థం చేసుకోగలరు.**

---

1. **ముస్‌నద్** : ఈ హదీస్‌ను అందజేసిన వ్యక్తి తన జీవితంలో నేర్చుకోవడానికి ఏ కాలమైతే అనువైనదో, ఆ కాలంలో తన గురువుగారి దగ్గరి నుండి నేర్చుకున్న దానిపై ఆధారపడ్డారు. అదే విధంగా ఆ గురువు గారు కూడా మరో గురువు వారిపై ఆధారపడ్డారు. ఈ 'సనద్' (ఉల్లేఖకుల పరంపర) ఓ సహాబీను చేరేవరకూ ఉంటుంది. మరియు ఆ 'సహాబీ' ప్రవక్త(స)వారి నుండి గ్రహించి తెలియజేయడం జరిగింది.

**ఉదా:** హదీస్‌ను తెలియజేసే వ్యక్తి → గురువుగారు (→ గురువుగారు) → తబే తాబయీ → తాబయీ → సహాబీ → ప్రవక్త(స).

అంటే సనద్‌లో సంబంధం తెగిపోలేదు. ముస్నద్ హదీస్ 'పూర్తి సనద్'తో ఉంటుంది. ఇస్‌నాద్ నుపయోగించిన తొలి వ్యక్తి ఇబ్నె షిహాబ్ అల్-జుహ్రి (హి. 124).

ప్రతీ సహాబీ తాను అందజేసిన హదీస్‌లను విడివిడిగా సేకరించ బడినవాటికి కూడా 'ముస్‌నద్' పదాన్ని ఉపయోగించవచ్చు. అంటే ఓ సహాబీగారు అందజేసిన అన్ని హదీస్‌లను ఓ సమూహంగా కూర్చబడటం. ప్రారంభంలో అటువంటి 'ముస్‌నద్'ను సేకరించిన వారు :

**యహ్యా బిన్ అబ్దుల్ హమీద్ అల్-హుమ్మాని** (హిజ్రీ. 228), కూఫా మరియు **ముసద్దద్ బిన్ ముసర్‌హద్** (హిజ్రీ 228), బస్రా. ఈ పద్ధతిలో సేకరించిన సహాబీల హదీసుల కూర్పులో ఇప్పటికీ ఉన్న పెద్ద సేకరణ ఇమామ్ అహమద్ బిన్ హంబల్ (హిజ్రీ 241) వారిది.

ఈ ముస్నద్ అహమద్ దాదాపు 30వేల హదీస్‌లను కలిగి ఉంది. ఇటువంటిదే మరొక సేకరణ అండలూసియాకు (స్పెయిన్‌కు) చెందిన విద్వాంసులు 'బఖీ బిన్ మఖ్‌లద్ అల్-ఖుర్తుబీ' (హిజ్రీ. 276). కాని ఇప్పుడు వీటి జాడలేదు.

2. **ముర్సల్** : ఒక తాబయీ మరియు ప్రవక్త(స)వారి మధ్య ఒకరుగాని

లేదా ఎక్కువమంది సహాబీలుగాని ఉంటారు. అయితే ముర్సల్ హదీస్‌లో 'తాబయీ' మరియు ప్రవక్త(స)వారి మధ్యనుండే లింక్ తెగిపోయింది. అంటే సహాబీ పేరు లేదు.

ఉదాహరణకు "ప్రవక్త(స) చెప్పారు ....." అని ఓ తాబయీ చెప్పిన హదీస్ - ముర్సల్ హదీస్ అవుతుంది.

3. **మున్ఖతి**: 'తాబయీ' తరువాత వచ్చే వారిలో ఎవరైనా లేకపోతే (సాధరణంగా ఏ విద్వాంసుడైతే ఈ హదీస్‌ను గ్రంథస్థం చేస్తున్నారో అతనికి సమీపవ్యక్తి మిస్ అయితే) ఆ హదీస్‌లు 'మున్ఖతి' అంటారు. ప్రామాణీకుని పేరు చెప్పకుండా "ఓ వ్యక్తి నాకు చెప్పారు ..." అని హదీస్‌లో ఉంటే, ఆ హదీస్‌కు కూడా 'మున్ఖతి' అనే పదాన్ని వాడవచ్చు.

4. **ముత్తసిల్**: ఇస్నాద్ అంతా బాగానే ఉంటుంది. వీరి మధ్య నుండే సంబంధంలో కూడా అంతరాయం ఉండదు. కాని ఆ హదీస్‌ను తెలియజేసేవారిలో ఒకరు ఎన్నడూ తనకు సమీపంగా ఉండే ప్రామాణీకుని నుండి హదీస్‌ను వినలేదు, ఆ వ్యక్తి అతని కాలంలో జీవించిన వ్యక్తి అయినప్పటికీ (అంటే ఆ ఇద్దరూ ఒకే కాలం వారే గాని ఒకరి నుండి మరొకరు వినలేదు).

5. **ము'అదల్**: ఇస్నాద్‌లో (హదీస్‌లను తెలియజేసే వారిలో) వరుసగా ఉండేవారిలో ఒకరికంటే ఎక్కువమంది లేకపోతే అది ము'అదల్ అవుతుంది.

6. **ము'అల్లఖ్**: హదీస్‌ను తెలియజేసేవారు మొత్తం ఇస్నాద్‌నే వదిలేస్తే, అది ము'అల్లఖ్ అవుతుంది.

   ఉదా: 'అల్-మువత్తా'లో ఇమామ్ మాలిక్‌గారు కొన్నిసార్లు చెప్పారు, "ఇది నాకు చేరింది, రసూలుల్లాహ్(స)వారు చెప్పారు ....."

అబూ బకర్ అల్-అబ్‌హరీ (హిజ్రీ 375)గారి ప్రకారం, అల్-మువత్తాలో మొత్తం **1726** హదీసులున్నాయి. వాటిలో

600 **మర్ఫూ** హదీస్‌లు

613 **మౌఖూఫ్** హదీస్‌లు

285 **మఖ్తూ** హదీస్‌లు

228 **ముర్సల్** హదీస్‌లు,

## ముర్సల్ హదీస్ యొక్క ప్రామాణికత :

ముర్సల్ హదీస్‌కు బహువచన పదం : 'మరాసిల్'

ప్రవక్త(స)వారికి మరియు తాబయీకి మధ్య లింక్ తెగిపోయిందంటే, అది రెండు రకాలుగా జరగవచ్చు.

1. ఓ సహాబీ పేరు మాత్రమే మిస్ కావచ్చు లేదా 2. ఓ సహాబీ మరియు ఈ తాబయీ కంటే పెద్దవారైన మరో తాబయీ అంటే ఇద్దరు కూడా మిస్ అయివుండే అవకాశం కూడా ఉంది.

సహాబీ పేరు మాత్రమే తాబయీ వదిలేస్తే, ఆ హదీస్‌ను ప్రామాణికంగానే తీసుకోవచ్చు. ఎందుకంటే 'తాబయీ' తప్పనిసరిగా 'సహాబీ' నుండే వింటారు. ఇస్నాద్‌లో 'సహాబీ'గారి పేరు వదిలేయడం వలన ప్రామాణికతపై ప్రభావం ఉండదు. ఎందుకంటే సహాబీలందరూ విశ్వసనీయులు.

అయితే 'తాబయీ' పేరు వదిలేస్తే .....

ఈ 'తాబయీ'లలో పెద్దవారైన సయీద్ బిన్ ముసయ్యబ్ (హిజ్రీ 94) మరియు అతా బిన్ అబీ రబహ్ (హిజ్రీ 114) స్వీకరించవచ్చు. ఎందుకంటే, వీరి మరాసిల్ పరిశోధనల తరువాత, సహాబీల ద్వారానే అందుకున్నట్లు ఋజువైంది.

1. అబూదావూద్ (హిజ్రీ 275) రెండు పరిస్థితులలో ముర్సల్ హదీస్‌ను ఆమోదించారు. (1) ఆ విషయానికి సంబంధించి ముస్నద్ హదీస్ దొరకనప్పుడు (2) ముస్నద్ హదీస్ లభించి, దానికి ముర్సల్ హదీస్ వ్యతిరేకం కానప్పుడు.

2. హాకిమ్ (హిజ్రీ 405) పెద్దవారైన తాబయీల ముర్సల్ హదీస్‌లను కాకుండా మిగతా వాటిని సమ్మతించలేదు. జ్ఞానమనేది (ప్రత్యక్షంగా) విన్నదానిపై ఆధారపడుతుందిగాని, (పరోక్షంగా) తెలియ జేయబడిన దానిపై కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

3. ఖతీబ్ అల్ బగ్దాదీ (హిజ్రీ 462) హాకిమ్ గారు అభిప్రాయ పడినట్లే అభిప్రాయపడ్డారు. ఖతీబ్‌గారు ఓ ఉదాహరణను ఇచ్చారు. ముస్నద్ మరియు ముర్సల్‌కు సంబంధించిన ఆ ఉల్లేఖనం స్వీకరించవచ్చు. కారణం ఇస్నాద్‌లో అంతరాయం లేకపోవడం.

ఆ హదీస్ యొక్క **మతన్** ఏమిటంటే, **"ఏ వివాహం ధర్మ సమ్మతం కాదు సంరక్షకుని అనుమతితో తప్ప"**.

ఖతీబ్‌గారు షు'బా మరియు సుఫ్యాన్ సౌరి వరకూ ఉండే రెండు ఇస్నాద్‌లను తెలియజేశారు.

**సుఫ్యాన్ సౌరి మరియు షు'బా → అబూ ఇష్‌హాక్ → అబూ బుర్దా** → ప్రవక్త(స).

పై ఇస్నాద్ **'ముర్సల్'** ఎందుకంటే అబూ బుర్దా **'తాబయీ'**, ఆయన ప్రవక్త(స)వారి నుండి ప్రత్యక్షంగా ఉల్లేఖిస్తున్నారు.

అయితే ఖతీబ్ గారు ఆ తరువాత 'యూనుస్ బిన్ అబీ ఇష్‌హాక్' వరకూ ఉన్న 3 ఇస్నాద్‌లను ఇచ్చారు :

**యూనుస్ బిన్ అబీ ఇస్‌హాఖ్ → అబూ ఇష్‌హాక్ → అబూ బుర్దా → అబూ మూసా** → ప్రవక్త(స).

మరో ఇద్దరు ఉల్లేఖకులు కూడా ఇదే విధంగా ఉల్లేఖించారు. వారిద్దరూ కూడా అబూమూసా(రజి) సహాబీ పేరు నుంచారు. ఆయన నుండే అబూ బుర్దా తెలియజేశారు.

అస్ సౌరి మరియు షు'బా ఒక కాలంలో అబూ ఇష్‌హాక్ గారి నుండి వింటే, మిగతా 3 ఉల్లేఖనాలు ఆయన నుండి వేర్వేరు కాలాల్లో విన్నవి.

**(మరొక వర్గీకరణ వచ్చే సంచికలో)**




సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి మీపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

## సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

**3**

**7. ఇస్లామ్‌కి పూర్వపు అరబ్బులలో నిరక్షరాస్యత దాదాపు 100 శాతం**

అరబ్బులలో ఏ కొద్దిమందో తప్ప, దాదాపు అందరూ నిరక్షరాస్యులే అని చెప్పవచ్చు. ఇది అక్కడ ఇస్లామ్ పున:ప్రారంభానికి ముందున్న పరిస్థితి. తమ తాత ముత్తాతలు ఏదైతే అనుసరించారో, అది నిజమైనా కాకపోయినా సరే దానినే నమ్మారు. వారిలో చాలా కొద్దిమంది మాత్రమే వ్రాయగలరు మరియు చదువగలరు. కొందరికి వైద్యం తెలుసు. ఇక్కడ గమనించ వలసిన విషయమేమిటంటే వారు అనుసరించే వైద్య విధానం మూఢనమ్మకాలపై ఆధారపడినది కాదు, తరతరాల నుండి వైద్యం చేయడం ద్వారా పొందిన అనుభవంపై ఆధారపడింది.

వారు నిరక్షరాస్యులే కావచ్చు. జ్ఞానం లేకపోవచ్చు. అయితేనేం వారు సహజసిద్ధమైన వివేకంతో నేర్చుకోవడానికి గొప్ప పొటన్షియల్ చూపారు ఎప్పుడైతే నిజమైన జ్ఞానం ముహమ్మద్(స)వారి ద్వారా వారికి అందిందో, వారిలోని చాలామంది ఉన్నత విద్వాంసులుగా మారారు. అంతేకాకుండా న్యాయమూర్తులుగా కూడా ప్రావీణ్యం సంపాదించారు.

**నూరు శాతం నిరక్షరాస్యత నుండి అరబ్బులు నూరుశాతం అక్షరాస్యతను సాధించారు.**

కేవలం ఖుర్‌ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల ద్వారానే ఇది వారికి సాధ్యమైంది. తరతరాలుగా వారు సాధించలేనిది ఇస్లామ్ వలన సాధ్యమైంది.

చదువుకున్నవారు ఉన్నారా? అని సందేహపడే ఓ సమాజంలో పూర్తి అక్షరాస్యత సాధించబడి అక్కడ అందరూ చదువుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇది 1400 సం॥ల క్రితం జరిగింది. ఆ తరువాత 500 సం॥లకు పైగా ముస్లిమ్ సమాజంలో నిరక్షరాస్యత అనేదే లేదు.

**మరి మన భారతదేశంలోని నేటి ముస్లిమ్ సమాజంలో నెలకొన్న 'నిరక్షరాస్యత'కు కారణమేమిటి?**

**'ఇస్లామ్'కి దూరం కావడం వల్లనే వీరిలో నిరక్షరాస్యత పెరిగింది.** కాని వాస్తవం ఇలా ఉంటే, 'ఇస్లామ్' వల్లనే ముస్లిమ్‌లు చదువుకు దూరమయ్యారని ప్రచారం చేసి, ముస్లిములను ఇస్లామ్‌కు చాలా దూరం చేసి, వారు ఇంకా వెనుకబడేలా చేశారు. 'స్త్రీ' చదువుకుంటే, ఆ చదువు సమాజమంతా వ్యాపిస్తుందని 1400 సం॥ల క్రితం ముహమ్మద్(స)వారు చేసిన బోధన గురించి ఇప్పటి వారిలో చాలామందికి తెలియదు. వారికి తెలియజేయాలనే ప్రయత్నాలు కూడా జరగలేదు.

**ముస్లిమ్ మహిళలు అందరూ విద్యావంతులు కావాలి. అది సున్నత్.**

'ఇస్లామ్' గురించి ముహమ్మద్(స)వారు బోధించేటప్పుడు, ఆయనని వ్యతిరేకించి హింసలకు గురిచేసిన అరబ్బులు సైతం ముహమ్మద్(స) వారి సుగుణాలను పొగిడారు. నేటి ముస్లిములలో చాలామందికి ముహమ్మద్(స)వారి జీవితచరిత్ర గురించి ఏమాత్రం తెలియదంటే అతిశయోక్తి కాదు.

ఆ మహనీయుని గురించి తెలియజేయడానికి నేడు 'దాయీ'లుగా పిలువబడేవారికి నోరు పెగలదు. ప్రవక్త(స)వారి జీవిత చరిత్ర గురించి తెలుసుకుంటే కనీస దైవభీతి ఉన్న ప్రతి ఒక్కరికి ఖుర్‌ఆన్ చదవాలని అనిపిస్తుంది. కాబట్టి నేటి ముస్లిమ్ సమాజంలో చదువుకున్న ప్రతీ ఒక్కరూ, వారు విద్యార్థులైనా, ఉపాధ్యాయులైనా ప్రవక్త(స)వారి జీవిత చరిత్రను మీ తోటి ముస్లిమ్‌లకి చదివి వినిపించండి. దీని కొరకు ప్రత్యేకమైన ధార్మిక శిక్షణ ఏదీ అవసరం లేదు.

కాబట్టి ఆనాడు అంటే 1400 సంవత్సరాల క్రితం ఏ విధంగా 100 శాతం అక్షరాస్యతను సాధించారో, ప్రపంచ జ్ఞాన కేంద్రాలుగా మదరసాలను ఏర్పాటు చేసి ప్రపంచం నలుమూలల నుండి విద్య కొరకు ప్రజలు వచ్చేలా ఎలా చేయగలిగారో, ఏ విధంగా ఆధునిక సైన్స్‌కి పునాదులు వేయగలిగారో, అదే విధంగా నేడు కూడా జరిగితే, ముస్లిములలో సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమౌతుంది.

**ఇస్లామ్‌కి పూర్వపు అరబ్బుల నీతి మరియు నాటి సంఘ పద్ధతులు**

ఇస్లామ్‌కి పూర్వం అరబ్బులు చాలా విషయంలో అప్రియంగా ఉండేవారు. ఎక్కువ మొత్తంలో మద్యం(ఆల్కహాల్) త్రాగేవారు. జూదం కూడా వారికి అలవాటుగా ఉండేది. ఊరికినే యుద్ధాలు చేసుకునేవారు (క్రిందటి సంచికలో వివరించడం జరిగింది). వారిలో ఉండే కొన్ని చెడు

లక్షణాలను క్రిందటి సంచికలో వివరించాము.

ఏ సమాజంలోనైనా మంచివారు మరియు చెడ్డవారు ఉంటారు. వీరంతా ఇంత మూర్ఖంగా ప్రవర్తించే రోజుల్లో కూడా మంచి ప్రవర్తన కలిగిన వారూ ఉన్నారు.

ఈ వ్యాసంలో స్పష్టంగా తెలియజేయాలనుకున్న విషయమేమిటంటే, వారిలో చాలా గొప్ప సుగుణాలు కూడా ఉన్నాయి. అవి ఆ కాలంలో మిగతా సమాజాలలోని వారి కంటే ఉన్నతమైనవని చెప్పవచ్చు.

నాణేనికి ఒకవైపు గురించే ఇంతవరకూ చెప్పడం జరిగింది. ఇక నాణెం రెండవ వైపు గురించి కూడా తెలియజేయవలసి ఉంది.

**అరబ్బుల యొక్క మంచి లక్షణాలు :**

**1. సహజ సిద్ధమైన తెలివితేటలు :**

వారిలోని ఈ సహజ సిద్ధమైన వివేకం చాలా రూపాలను కలిగి ఉంది. మొట్టమొదటగా చెప్పవలసింది వారికుండే **అమోఘమైన జ్ఞాపకశక్తి.** ముందుగా మనం విశాలమైన వారి భాష గురించి తెలుసుకోవాలి.

అరబీ భాషలో **'తేనె'** అర్థాన్నిచ్చే పదాలు 80 ఉన్నాయి. **'నక్క'** అర్థాన్నిచ్చే పదాల సంఖ్య 90, **'సింహం'** అర్థాన్నిచ్చే పదాలు 500 ఉండగా, **'ఒంటె'** అర్థాన్నిచ్చేవి 1000 ఉన్నాయి. **కత్తి** (ఖడ్గం) అర్థాన్నిచ్చే పదాలు 1000 ఉన్నాయి. ఈ పదాలన్నీ కూడా వారు గుర్తుంచుకో గలిగేవారంటే వారి జ్ఞాపకశక్తి ఎటువంటిదో మీరే ఆలోచించండి.

చదవడం, వ్రాయడం తెలియని అరబ్బులు కూడా, కవిత్వాన్ని చాలా ఎక్కువగా ప్రేమించేవారు. ఎంతగా ప్రేమించే వారంటే ఇతర సమాజాల్లోని చదువుకున్నవారు, నాగరీకులు తమ భాషను ఎంతగా ప్రేమించారో అంత కంటే చాలా ఎక్కువగా వీరు ప్రేమించేవారు. తమ కవిత్వాన్ని భద్రపరచడానికి మరియు దానిని తమ భావితరాల వారికి అందించడానికి, వారు తమ నోటి ద్వారా చెప్పడం పైనా మరియు వారికున్న అమోఘమైన జ్ఞాపకశక్తి పైనే ఆధారపడేవారు, సుధీర్ఘమైన పద్యాలను సైతం జ్ఞాపకముంచుకునేవారు. తమ భాషపై వారికున్న ప్రేమ వారి జ్ఞాపకశక్తిని మరింత అభివృద్ధి చేసింది.

ఎప్పుడైతే ఈ అరబ్బులు 'ముస్లిమ్'లుగా మారారో, అప్పటి నుండి వారు తమకు సహజ సిద్ధంగా లభించిన ఈ లక్షణాన్ని (జ్ఞాపకశక్తిని) 'ఇస్లామ్'కి సేవ చేయడంలో ఉపయోగించారు. అందువల్లనే ముహమ్మద్(స)వారి అనుచరులు ఆ రోజులలో 'ఖుర్'ఆన్'ను కంఠస్థం చేశారు. అంతేకాకుండా వారిలోని కొందరయితే వందల సంఖ్యలో, మరి కొందరయితే వేల సంఖ్యలో హదీస్‌లను (ప్రవక్త(స)వారి బోధనలను) కంఠస్థం చేశారు. ఆ బోధనలను మాత్రమే కాదు ఆ బోధనలు ముహమ్మద్(స)వారి నుండి విన్న ఉల్లేఖకుల పరంపరను (పేర్లతో సహా) యధాతథంగా కంఠస్థం చేయడం జరిగింది. కొన్ని బోధనలలో ఉల్లేఖించినవారి హావభావాలను కూడా వాటితో పాటు కంఠస్థం చేశారు. ఆ విధంగా ప్రవక్త(స)వారి బోధనలను భావితరాల ముస్లిమ్‌లకి అందించారు.

వీరు అమాయకత్వంతో సృష్టికర్త విషయంలో ఎన్నో అసత్యాలను నమ్మారు. కాని వీరి విశ్వాసం సంక్లిష్టమైనటువంటి ఏ వ్యవస్థపైనా ఆధారపడ లేదు. ఉదాహరణకు గ్రీకు తత్వవేత్త, ఎన్నో అసత్యాలపై ఆధారపడటం వలన అతని ఫిలాసఫీ చాలా సంక్లిష్టంగా ఉంటుంది.

అతడు సత్యాన్ని అంగీకరించాలంటే, ముందుగా అతనిలో సంక్లిష్టంగా నున్న ఆ అసత్య అనుమాన వాక్యాలు అన్నీ నాశనం కావాలి. అప్పుడుగాని అతడు సత్యాన్ని అంగీకరించలేడు.

కాని సగటు అరబ్‌కు మాత్రం, ఇటువంటి సంక్లిష్టమైనటువంటి విశ్వాస వ్యవస్థ ఏదీ లేదు. అంతేకాదు వారు 'అల్లాహ్'ను సైతం విశ్వసించేవారు. రాబోయే పేజీలలో ఈ విషయం చర్చించబడుతుంది, ఇన్షాఅల్లాహ్!

వారిలో దైవ విశ్వాసంపై ఉన్న అసత్య భావనలను చాలా సులభంగా ఖండించ గలగడం జరిగింది. ఆ విధంగా అరబ్బులు సహజంగానే సత్యాన్ని (ఇస్లాం సందేశాన్ని) స్వీకరించడానికి సంసిద్ధం కాగలిగారు.

**2. ఉదార గుణం**

ఈ గుణం అరబ్బులలో బాగా పాతుకుపోయింది. ఒక అరబ్బుకు ఒంటె తప్ప స్వంతంగా ఏమీ లేనప్పుడు కూడా అతడిని చూడటానికి ఎవరైనా అతిథి వస్తే, అతడు మరొక ఆలోచన చేయకుండా ఒంటెను కోసి మరియు దాని మాంసాన్ని అతిథికి తినిపిస్తాడు.

**3. ధైర్యం**

యుద్ధ రంగంలో చనిపోయిన వ్యక్తిని అరబ్బులు విశేషంగా పొగుడుతారు. అంతేకాదు సహజసిద్ధంగా మంచంపై చనిపోయిన వ్యక్తిపై చతురోక్తులు విసురుతారు (వ్యంగ్యంగా మాట్లాడుతారు).

ఓ అరబ్బు వ్యక్తి తన సోదరుని చావుపై ఇలా వ్యాఖ్యానించాడు: "అతడు చంపబడితే, అతని తండ్రి, సోదరుడు మరియు బాబాయి కూడా అతనికంటే పూర్వమే చంపబడ్డారు. అల్లాహ్ సాక్షి, సహజ కారణాల వలన మనం చనిపోము".

అరబ్బులు తమ వ్యక్తిగత గౌరవం కంటే, తమ వంశం మరియు తెగ గౌరవానికే ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చేవారు. ఒకవేళ ఎవరైనా తమ గౌరవంపై దాడిచేస్తే, దానిని తమ జీవితాలతోనే ఎదుర్కొనేవారు.

కొందరు అకారణంగానూ మరికొందరు స్వార్థంతోనూ యుద్ధాలు చేసినప్పటికీ, చాలామంది అరబ్బులు న్యాయాన్ని నిలబెట్టడం కొరకు యుద్ధాలు చేశారు (పోరాడారు). తరచుగా తమకోసం కాకుండా బలహీనులు, వృద్ధులు, అగత్యపరుల కొరకు యుద్ధం చేసేవారు.

ఒకవేళ అగత్యపరుడికిగాని లేక దౌర్జన్యానికి గురైన వ్యక్తిగాని వారి సహాయాన్ని మరియు రక్షణను కోరినప్పుడు వారు గనుక సహాయం చేయలేక పోయినట్లయితే, అది వారి వ్యక్తిత్వంపై పడిన మచ్చగా భావించేవారు.

**4. స్వేచ్ఛను ప్రేమించేవారు మరియు బానిసగా (లేదా లోబడి) ఉండడాన్ని మరియు చులకన గావించబడటాన్ని ద్వేషించేవారు :**

ద్వీపకల్పం యొక్క విశాలమైన ఎడారి అరబ్బుల నివాసం. వారు స్వతంత్ర్యంగా జీవించేవారు మరియు స్వాతంత్ర్యాన్ని ప్రేమించేవారు. అంతేగాని ఏ రాజుకి గాని పరిపాలకునికిగాని లొంగి ఉండేవారు కాదు. రోమన్ సామ్రాజ్యాలు మరియు పర్షియన్ సామ్రాజ్యాలు పరిపాలన చేస్తున్న కాలంలో కూడా, వారెవరూ అరబ్బుల జీవితాలలో జోక్యం కలుగజేసుకోలేదు.

అరబ్బులకు వారి గౌరవం వారి ప్రాణం కంటే ఎక్కువ. ఒకవేళ ఎవరైనా ఓ అరబ్ వ్యక్తిని అవమానం పాలు చేయడానికి ధైర్యం చేస్తే, వానిని చంపే విషయంలో ఇక అతనికి రెండో ఆలోచన అనేది ఉండదు.

ఏ విధంగా వారు గౌరవాన్ని మరియు స్వేచ్ఛను ప్రేమిస్తారో తెలియడానికి (అది చాలా తీవ్రమైనప్పటికి) ఉదాహరణగా ఒక విషయం చెప్పుకోవచ్చు. 'అల్ హీరా' రాజు - 'అమ్ర్ బిన్ హింద్'. ఒకసారి అతడు తన అనుచరులతో చాలా అహంకారంతో అన్నాడు, "నా తల్లికి సేవ చేయడానికి నిరాకరించిన ఏ అరబ్బు తల్లి గురించైనా మీకు తెలుసా? వారు చెప్పారు, "ఔను, పేద కవి 'అమ్ర్ బిన్ ఖుల్తూమ్' యొక్క మాతృమూర్తి".

ఆ రాజు తనను చూడటానికి 'అమ్ర్ బిన్ ఖుల్తూమ్'ని ఆహ్వానించాడు. మరియు తన తల్లిని చూడటానికి ఇబ్నె ఖుల్తూమ్ తల్లిని కూడా ఆహ్వానించాడు. ఆ రాజు తన తల్లికి ఓ సూచన చేశాడు, వారి భోజనం పూర్తయ్యేటప్పుడు, వడ్డించే పళ్ళాన్ని తీసుకోమని అతిధిని అడగమని తన తల్లికి చెబుతాడు రాజు. అంటే ఏదో విధంగా తన తల్లికి అమ్ర్ తల్లిచేత సేవ చేయించుకోవాలి. అంతే.

ఆమెకు ఏ విధంగా అయితే చెప్పబడిందో, అదే విధంగా ఆ రాజు తల్లి చేసింది. అమ్ర్ బిన్ ఖుల్తూమ్ తల్లి "అవసరమైనవారు స్వయంగా వడ్డించుకోవాలని" సమాధాన మిచ్చారు. రాజుగారి తల్లి మరలా అదే విషయాన్ని మనవి చేసి, ఆమె తనకు సేవ చేయాలని పట్టుబట్టారు.

కాని సేవ చేయడానికి బదులు అమ్ర్ బిన్ ఖుల్తూమ్ తల్లి గావు కేక పెట్టింది. "ఏమి అవమానం! ఓ తగ్లీబ్" (తగ్లీబ్ అనేది ఆమె తెగపేరు). ఆమె కొడుకు ఆమె ఆర్తనాదాన్ని విన్నాడు. తనకు మరియు తన తల్లికి జరిగిన ఈ బహిరంగ అవమానానికి రెచ్చిపోయి దగ్గరలో వ్రేలాడుతున్న కరవాలాన్ని తీసుకుని రాజు తలపై ఒకే దెబ్బ వేసి చంపేశాడు.

వీరు ఎవరికీ లొంగడానికి ఇష్టపడరు. చస్తారు లేక చంపుతారు. అందుకనే ఏ సామ్రాజ్యాధినేత కూడా వీరివైపు కన్నెత్తి కూడా చూడలేదు. కాని విచిత్రమేమిటంటే, అల్లుడికి వ్యతిరేకంగా కత్తి దూయరు. ఆ కారణం చేతనే కూతురు పుడితే అవమానంగా భావించేవారు. ఎందుకంటే అల్లుడుతో యుద్ధం చేయలేరు కనుక.

**5. సత్యత, వాగ్ధానాన్ని నిలబెట్టు కోవడం మరియు నిజాయితీ :**

సాధారణంగా, అరబ్బులు అబద్ధాలు చెప్పడం నుండి తప్పించు కుంటారు. ఈ వాస్తవానికి మంచి ఉదాహరణ ఏమిటంటే, అబూ సుఫ్యాన్ వారి వృత్తాంతమే. అది అతడు ఇస్లామ్ స్వీకరించడానికి ముందు జరిగిన సంఘటన. బహుదైవారాధకుడుగానూ మరియు ఇస్లామ్‌కి బద్ధ శతృవుగా ఉన్నప్పుడు అబూ సుఫ్యాన్ పొరుగు దేశానికి వ్యాపార నిమిత్తం వెళ్ళడం జరిగింది. అతడు ఆ దేశ రాజైన హిరక్ల్ ని కలిశాడు. ప్రవక్త(స)వారి గురించి హిరక్ల్ ప్రశ్నలు అడగడం ప్రారంభించాడు. మక్కాలోని కొత్త ధర్మం గురించి అడిగాడు. అబూ సుఫ్యాన్‌కు ఇది బాగా ఉపయోగించు కోగలిగే అవకాశమే! అయినా సరే ప్రవక్త(స)వారి గురించి నిజాయితీగా చెప్పారు. ముహమ్మద్(స)వారి గొప్ప గుణాల గురించి, సత్యంతో కూడిన ఆయన ప్రసంగాల గురించి మరియు ఆయన ఉన్నత వంశావళి గురించి చెప్పారు.

రాజకీయంగా ఆలోచిస్తే, ఇది అతను చేసిన తెలివితక్కువ పని అని ఎవరికైనా అనిపించవచ్చు. ఎందుకంటే అటువంటి రాజు ఒకవేళ ఇస్లామ్ స్వీకరిస్తే, ఆ తరువాత తమ అరబ్బులపై యుద్ధానికి రావచ్చు.

కాని అబూసుఫ్యాన్ అబద్ధమాడలేదు. తన తెగపై మచ్చపడుతుందని.

**నమ్మకద్రోహం చేయరు:** నమ్మకంగా ఉండడమనేది అరబ్బుల యొక్క ముఖ్య లక్షణం. అయితే ఒకొక్కసారి ఇది చాలా తీవ్రరూపం దాల్చేది. సరికాని మార్గంలో అనవసరంగా ఒక్కొక్కసారి హింసాత్మకంగా మారేది.

కత్తిని వంట ఇంట్లో కూరగాయలు తరగడానికి మాత్రమే కాకుండా హత్యకు కూడా ఉపయోగించవచ్చు. కత్తితో ఎవరైనా హత్య చేస్తే, ఆ తప్పు కత్తిని ఉపయోగించేవారిదే కాని కత్తిది కాదు కదా!

నమ్మకద్రోహం చేయకపోవడం ఉత్తమ లక్షణమే. అయితే అది సరియైన మార్గంలో ఉండాలి. ఇస్లామ్ వీరి నమ్మకాన్ని సరియైన దిశలో ఉంచింది.

ఒక వ్యక్తి ఎంత నమ్మకస్తుడైనా సరే, తన బంధువు లేదా స్నేహితుడు చెడ్డవాడైతే అతనికి సహకరించడాన్ని ఇస్లామ్ నిషేధించింది.

**చేసిన వాగ్ధానానికి కట్టుబడి ఉండటం :** ఇస్లామ్‌కి పూర్వం హారిస్ బిన్ ఇబాద్ బక్ర్ తెగకు సంబంధించిన వివిధ ఉపతెగలు కలిసిన సైన్యానికి నాయకత్వం వహించాడు. వారి లక్ష్యం తగ్లీబ్ తెగపై యుద్ధం చేయడం. కాని నాయకుడైన హారిస్‌కు వ్యక్తిగతంగా మరో లక్ష్యం కూడా ఉంది. అదేమిటంటే, తగ్లీబ్ తెగ నాయకుడైన ముహల్‌హల్‌ని పట్టుకుని చంపాలి. అతడు తన కుమారున్ని చంపాడు కనుక.

అయితే అతనికి ఉన్న సమస్య ఏమిటంటే, 'ముహల్‌హల్' ఎలా ఉంటాడో అతనికి తెలియదు. ఎన్నడూ అతనిని చూడలేదు. అందువలన అతనిని గుర్తుపట్టలేక పోయాడు. అయితే హారిస్‌కు చిక్కిన యుద్ధఖైదీతో అతను ఇలా అన్నాడు "ముహల్‌హల్ బిన్ రబీ'ఆ ఎక్కడున్నాడో చెబితే, నీకు స్వేచ్ఛ నిస్తాను".

అప్పుడు యుద్ధ ఖైదీ అడిగాడు "నేను అతనిని నీకు చూపిస్తే (నాకు స్వేచ్ఛ నిస్తావనే) నీ వాగ్ధానం ఉంది!". హారిస్ ఔనని చెప్పాడు. అప్పుడు యుద్ధ ఖైదీ చెప్పాడు "అయితే ఆ వ్యక్తిని నేనే". ముహల్‌హల్‌కు ఎటువంటి హాని చేయకుండా, హారిస్ అతనిని వెళ్ళిపోనిచ్చాడు.

వాగ్ధానాన్ని నిలబెట్టుకున్న హారిస్‌ను ప్రశంసించాలి.

**మరొక ఉదాహరణ :**

నోమాన్ బిన్ మున్‌జిర్ తన కుమార్తెను 'కిస్రా'కు ఇచ్చి వివాహం చెయ్యడానికి అంగీకరించలేదు. అందువలన అతని జీవితానికి కిస్రా వలన ప్రమాదముంది.

అందుకని మొదట తన కుటుంబాన్ని మరియు ఆయుధాలను 'హానీ బిన్ మస్'ఊద్ అష్షైబానీ' సంరక్షణలో ఉంచి, కిస్రా దగ్గరికి నోమాన్ వెళ్లాడు. అతని పట్ల కిస్రా కఠినంగా ప్రవర్తించాడు.

కిస్రా 'హానీ'కి సందేశం పంపాడు. అతని సంరక్షణలో నోమాన్ ఉంచినదంతా తనకు అప్పగించాలని ఆదేశించాడు. కాని హానీ తిరస్కరించాడు. హానీ మరియు అతని తెగపై యుద్ధం చేయడానికి కిస్రా సైన్యాన్ని పంపాడు.

హానీ తన తోటి తెగ వారందరినీ సమీకరించి వారి ముందు ఇలా ప్రసంగించాడు:

"ఓ బక్ర్ తెగ ప్రజలారా! (యుద్ధరంగం నుండి) పారిపోయి రక్షించుకో బడేవానికంటే చంపబడనివాడే ఉత్తముడు. వాస్తవానికి ముందుగా నిర్దేశించడం నుండి హెచ్చరిక ఎవరినీ కాపాడదు. మరియు నిజానికి, సహనం విజయానికి కారణమౌతుంది. నేను చావుకు సరే అంటాను గాని అవమానానికి మరియు పిరికితనానికి కాదు.

చావువైపు వెళ్ళడమే మేలు దాని నుండి తిరిగిపోవడం కంటే. ఛాతీపై పొడవడం మేలు, వెనుక వైపు పొడవడం కంటే. ఓ బక్ర్ ప్రజలారా! పోరాడండి, మనందరం చనిపోయే వరకూ."

"**జీవించాలా?**" లేక "**చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలా?**" ఏదో ఒక దానిని ఎన్నుకోవలసి వచ్చినప్పుడు 'హానీ' రెండవదానినే ఎంచుకున్నాడు. తన జీవితంలో చాలా తరచుగా ఇటువంటివి జరుగుతున్నప్పటికి, అతను చావుకే సిద్ధమయ్యాడు కాని అతనికి జీవితమే లభించింది. జీ ఖార్ యుద్ధంలో బక్ర్ తెగ పరాక్రమంతో పోరాడి తమ పర్షియన్ శత్రువులపై విజయం సాధించారు.

**6. కష్టకాలాలలో సహనం వహించడం మరియు అవసరాలకు సరిపడా లేకపోయినా తృప్తి పడటం :**

అరబ్బులు ఆహారాన్ని మితంగా తింటారు. ఎక్కువగా తినే వ్యక్తిని చిన్న చూపు చూస్తారు. వారు తమ భోజనాన్ని పూర్తి చేసేముందు, సాధారణంగా ఇలా చెబుతారు : 'తిండిపోతు తెలివిగా వెళ్ళిపోయాడు'.

కష్టకాలాలలో సహించగలిగే అసాధారణ సామర్థ్యం అరబ్బులకు ఉంది. ఈ లక్షణం వల్లనే వారు ఎన్నో తరాలుగా కఠినమైన ఎడారిలో నివశించగలిగారు. ఆ ప్రాంతంలో ఆహారం మరియు నీరు తక్కువ. పర్వత దారులు, ఎడారి యొక్క తీవ్రమైన వేడి - ఇవేమీ వారిని కలవరపెట్టలేదని అనిపిస్తుంది.

వారు ఇస్లామ్ స్వీకరించగానే, అంతకు పూర్వం కంటే ఇంకా ఎక్కువ సహనాన్నే వారు చూపించారు. కష్ట కాలాలలో ఎన్నో రోజులపాటు కొన్ని ఖర్జూరాలతోనూ మరియు నీటితోనూ గడపగలిగారు.

**7. ప్రతీకారం తీర్చుకునే అవకాశమున్నాసరే కరుణ చూపడం :**

యుద్ధంలో తమ శత్రువులపై తమదే పైచేయి అయినప్పుడు, అతనిని చంపగలిగి కూడా వారిపై కరుణ చూపి వదిలేసిన సంఘటనలు కూడా చాలా ఉన్నాయి. గాయపడిన శత్రువులను చంపేవారు కాదు.

అరబ్బులు అంటే కేవలం అనాగరికులు, మూర్ఖులు, రాక్షసులు అనే విధంగా చాలామంది భావిస్తుంటారు. కాని చాలా విషయాలలో ఆనాడు మిగతా ప్రపంచంలో ఎందరో నాగరిక సమాజాలలో బ్రతికినవారి కంటే కూడా వీరు చాలా విషయాలలో గొప్పవారని చెప్పుకోవచ్చు. అయితే వారికున్న కొన్ని చెడు లక్షణాలనే భూతద్దంలో చూపించి, విశేషంగా ప్రచారం చేశారు. అయితే వారిలో ఉన్న ఎన్నో గొప్ప లక్షణాలను కూడా చెడుగానే చిత్రీకరించడం జరిగింది.

**ఇస్లామ్‌కి పూర్వపు అరబ్బుల గురించి నిజనిజాలు తెలియకపోతే, ఆ తరువాతి కాలంలో వారిపై ఇస్లామ్ ఎంత గొప్ప ప్రభావాన్ని వేసిందో పూర్తిగా తెలుసుకోవడం సాధ్యం కాదు. వారికి ఉన్న ఎన్నో అసమాన లక్షణాలను సరియైన మార్గంలో పెట్టి, తరతరాలుగా వెనుకబడిన ఆ జాతిని ప్రపంచపు సగభాగానికి కేవలం 36 సం॥లలో చక్రవర్తులను చేసిన ఘనత 'ఇస్లామ్'ది.**

ప్రవక్త(స)వారి జీవితచరిత్ర ప్రారంభం నుండి ఇంతవరకూ అందించిన విషయాలను బట్టి, అల్లాహ్ తన చిట్టచివరి ప్రవక్త మరియు సందేశహరుణ్ణి అరబ్బులలోనే ఎంచుకోవడానికి గల కారణం పాఠకులకు ఈ పాటికే అర్థమై ఉంటుంది.

ఆ రోజుల్లో ప్రపంచంలో ఎన్నో నాగరీక సమాజాలున్నాయి. కాని ఆ సమాజాలలోని ఏదో ఒక సమాజాన్ని ఎన్నుకోకుండా, ఎడారిలో నివశించే ఓ అరబ్బు సమాజాన్నే అల్లాహ్ ఎన్నుకోవడం జరిగింది.

ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా శిక్షణ పొందిన ఆయన అనుచరులు అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పటికీ ముహమ్మద్(స)వారు స్థాపించిన ఆదర్శ సమాజానికి గొప్ప ఉదాహరణగా నిలిచారు.

*వచ్చే సంచికలో*

*ముహమ్మద్(స)వారి జననం గురించి,*

*ఆ జననానికి ముందు జరిగిన*

*కొన్ని ముఖ్యమైన సంఘటనల గురించి*

*వివరంగా అందిస్తాము, ఇన్షా అల్లాహ్!*

# విశ్వాసం త్యాగం

**ఇబ్రాహీమ్(అ)**

ప్రపంచంలోని ముస్లిములు ఏ ప్రాంతంలో నివశిస్తున్నాసరే, మక్కాలోని 'కాబా' మస్‌జిద్ దిశకు అభిముఖంగా ఉండేలా నిలుచుని సలాత్ (నమాజ్) చేస్తారు. కాబట్టి 'కాబా' ఉండే దిశ (అంటే ఖిబ్లా) ప్రతి ముస్లిమ్ యొక్క దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన అంశం.

కాబా మస్‌జిద్‌ను నిర్మించిన ఇద్దరు ప్రవక్తలు ఇబ్రాహీమ్(అ) మరియు ఇస్మాయీల్(అ). వీరిద్దరూ తండ్రీ కొడుకులు. వీరి త్యాగం అనన్య సామాన్యమైనది. ఇబ్రాహీమ్(అ) - 'ఖలీలుల్లాహ్' (అల్లాహ్‌కు స్నేహితుడు) మరియు ఇస్మాయీల్(అ) - 'జబీహుల్లాహ్' (అల్లాహ్ ఆదేశాన్ని పాటించడానికి జిబాహ్‌కు సిద్ధపడినవారు).

ఎందరో ప్రవక్తలకు పితామహుడైన ఇబ్రాహీమ్(అ)వారి గురించి ఖుర్'ఆన్ మరియు హదీస్‌లలో గల కొన్ని ముఖ్యమైన విషయాలను ఇక్కడ అందిస్తున్నాము.

ఇబ్రాహీమ్(అ)వారి తండ్రి 'ఆజర్'. ఇతను విగ్రహాలు తయారు చేసేవాడు.

**ఖుర్'ఆన్‌లో అల్లాహ్ ఇలా చెబుతున్నారు :**

మేము ఇబ్రాహీమ్‌కు భూమ్యాకాశాలపై ఉన్న మా సామ్రాజ్య వ్యవస్థను చూపించాము.

ఆ పిదప రాత్రి చీకటి అతనిపై క్రమ్ముకున్నప్పుడు, అతను ఒక నక్షత్రాన్ని చూసి : "ఇది నా ప్రభువు" అని అన్నాడు. కాని, అది అస్తమించగానే, "అస్తమించే వాటిని నేను ప్రేమించను!" అని అన్నాడు.

ఆ తరువాత ఉదయించే చంద్రుణ్ణి చూసి : "ఇది నా ప్రభువు!" అని అన్నాడు. కాని అది అస్తమించగానే, ఒకవేళ నా ప్రభువు నాకు సన్మార్గం చూపకపోతే నేను నిశ్చయంగా, మార్గభ్రష్టులైన వారిలో చేరిపోయే వాడను!" అని అన్నాడు.

ఆ తరువాత ఉదయించే సూర్యుణ్ణి చూసి: "ఇది నా ప్రభువు, ఇది అన్నిటికంటే పెద్దగా ఉంది!" అని అన్నాడు. కాని అది కూడా అస్తమించగానే, "ఓ నా జాతి ప్రజలారా మీరు అల్లాహ్‌కు సాటి (భాగస్వామ్యము) కల్పించే దానితో వాస్తవంగా నాకెలాంటి సంబంధం లేదు!" అని అన్నాడు.

(ఇంకా ఇలా అన్నాడు): "నిశ్చయంగా నేను ఏక దైవసిద్ధాంతం (సత్య ధర్మం) పాటించేవాడనై, నా ముఖాన్ని భూమ్యాకాశాల సృష్టికి మూలాధారి అయిన ఆయన (అల్లాహ్) వైపునకే త్రిప్పుకుంటున్నాను. మరియు నేను అల్లాహ్‌కు సాటి (భాగస్వాములు) కల్పించేవారిలో చేరినవాడను కాను."

**(ఖుర్'ఆన్ 6:75-79)**

అతను తన తండ్రితో మరియు తన జాతివారితో: "మీరెవరిని ఆరాధిస్తున్నారు?" అని అడిగినపుడు , వారన్నారు: "మేము విగ్రహాలను ఆరాధిస్తున్నాము మరియు మేము వాటికే ఎల్లప్పుడు భక్తులమై ఉంటాము".

(ఇబ్రాహీమ్) అన్నాడు : "మీరు వీటిని పిలిచినప్పుడు ఇవి మీ మొర ఆలకిస్తాయా?

"లేదా, మీకేమైనా మేలు చేయగలవా? లేదా హాని చేయగలవా?"

వారన్నారు: "అలా కాదు! మేము మా తండ్రితాతలను ఇలా చేస్తూ ఉండగా చూశాము".

అతను అన్నాడు : "ఏమీ? మీరు ఎప్పుడైనా ఆలోచించారా? మీరెవరిని ఆరాధిస్తున్నారో?

"మీరు గానీ మరియు మీ పూర్వీకులైన మీ తాతముత్తాతలు గానీ (ఆలోచించారా)?

"ఎందుకంటే! నిశ్చయంగా, ఇవన్నీ నా శత్రువులే! కేవలం ఆ సర్వలోకాల ప్రభువు తప్ప! **(ఖుర్'ఆన్ 26:70-76)**

**సర్వలోకాల ప్రభువుగురించి ఇబ్రాహీమ్(అ) ఇలా చెప్పారు :**

"ఆయనే నన్ను సృష్టించాడు. కాబట్టి ఆయనే నాకు మార్గదర్శకత్వం చేస్తాడు.

ఆయనే నాకు తినిపించేవాడు మరియు త్రాగించేవాడు.

మరియు నేను వ్యాధిగ్రస్తుడనైతే, ఆయనే నాకు స్వస్థత నిచ్చేవాడు.

మరియు ఆయనే నన్ను మరణింపజేసేవాడు, తరువాత మళ్ళీ బ్రతికింప జేసేవాడు.

మరియు ఆయనే తీర్పు దినమున నా తప్పులను క్షమిస్తాడని నేను ఆశిస్తున్నాను." **(ఖుర్'ఆన్ 26:77-82)**

**ఇబ్రాహీమ్(అ) అల్లాహ్‌ను ఇలా ప్రార్థించారు :**

"మరియు ఓ నా ప్రభూ! నాకు వివేకాన్ని ప్రసాదించు మరియు నన్ను సద్వర్తనులలో కలుపు.

మరియు తరువాత వచ్చే తరాల వారిలో నాకు మంచి పేరును ప్రసాదించు.

మరియు సర్వసుఖాల స్వర్గానికి వారసులయ్యే వారిలో నన్ను చేర్చు.

మరియు నా తండ్రిని క్షమించు. నిశ్చయంగా, అతడు మార్గభ్రష్టులలోని వాడే!

మరియు అందరూ తిరిగి బ్రతికింపబడే రోజు నన్ను అవమానంపాలు చేయకు." **(ఖుర్'ఆన్ 26:83-87)**

అతను తన తండ్రితో ఇలా అన్నప్పుడు: "ఓ నాన్నా! వినలేని మరియు చూడలేని మరియు నీకు ఏ విధంగానూ సహాయపడలేని వాటిని, నీ వెందుకు ఆరాధిస్తున్నావు?

"ఓ నాన్నా! వాస్తవానికి, నా వద్దకు వచ్చిన జ్ఞానం నీ వద్దకు రాలేదు, కావున నీవు నన్ను అనుసరిస్తే, నేను నీకు సరైనమార్గం చూపుతాను."

"ఓ నాన్నా! షైతాన్‌ను ఆరాధించకు. నిశ్చయంగా షైతాన్ అనంత కరుణామయునికి అవిధేయుడు.

"ఓ నాన్నా! నిశ్చయంగా, నీవు అనంత కరుణామయుని శిక్షకు గురి అయ్యి, షైతాన్ యొక్క స్నేహితుడవు(వలి) అయిపోతావేమోనని నేను భయపడుతున్నాను!"

(అతని తండ్రి) అన్నాడు : "ఓ ఇబ్రాహీమ్! ఏమీ? నీవు నా దేవుళ్ళకు విముఖత చూపుతున్నావా? ఒకవేళ నీవిది మానుకోకపోతే నేను నిన్ను రాళ్ళు రువ్వి చంపివేస్తాను. కావున నీవు నా నుండి చాలా దూరమైపో!"

(ఇబ్రాహీమ్) అన్నాడు: "నీకు సలాం! నీ కొరకు నా ప్రభువు క్షమాపణను వేడుకుంటాను.నిశ్చయంగా, ఆయన నా యెడల ఎంతో దయాళువు."

**(ఖుర్'ఆన్ 19:42-47)**

**ఖుర్'ఆన్‌లో మరొక ఆయత్‌లో ఇదే విషయాన్ని చెప్పడం జరిగింది.**

...... ఇక ఇబ్రాహీమ్ తన తండ్రితో : "నేను తప్పక నిన్ను క్షమించమని (నా ప్రభువును) వేడుకుంటాను. ఇది తప్ప, నీ కొరకు అల్లాహ్ నుండి మరేమీ పొందే అధికారం నాకు లేదు" అని మాత్రమే అనగలిగాడు. (అల్లాహ్‌తో ఇలా ప్రార్థించాడు): "ఓ నా ప్రభూ! మేము నిన్నే నమ్ముకున్నాము మరియు నీ వైపునకే పశ్చాత్తాపంతో మరలుతున్నాము మరియు నీ వైపుకే మా గమ్యస్థానముంది. **(ఖుర్'ఆన్ 60:4)**

పై వాక్యం స్పష్టంగా అర్థం కావడానికి 'సహీహ్ బుఖారీ' నుండి ఓ హదీస్‌ను ఇక్కడ అందిస్తున్నాము.

**అబూహురైరా(రజి) ఉల్లేఖనం : పునరుత్థాన దినం నాడు ఇబ్రాహీమ్(అ) తన తండ్రి 'ఆజర్'ని కలుస్తారు. అతని ముఖం నల్లగా ధూళితో కప్పబడి ఉంటుంది. ఇబ్రాహీమ్(అ) (అతనితో) చెబుతారు: 'నాకు అవిధేయత చూపించ వద్దని నీకు నేను చెప్పలేదా?'. అతని తండ్రి సమాధానమిస్తాడు: 'ఈ రోజు నీకు నేను అవిధేయత చూపను'. ఇబ్రాహీమ్(అ) చెబుతారు : 'ఓ అల్లాహ్! నీవు వాగ్దానం చేశావు పునరుత్థాన దినమున నన్ను అవమానంపాలు చేయనని, మరియు నా తండ్రిని అగౌరవపరచడం మరియు శపించడం కంటే ఎక్కువ అవమానకరం ఇంకేముంటుంది? అప్పుడు (అతనితో) అల్లాహ్ చెబుతారు: 'నేను అవిశ్వాసులపై స్వర్గాన్ని నిషేధించాను'. తరువాత అతనికి వివరించబడుతుంది. 'ఓ ఇబ్రాహీమ్! చూడు! నీ పాదాల క్రింద ఏముంది? ఆయన చూస్తారు. అక్కడ ఓ జీఖ్ (లేక హైనా - ఓ జంతువు) రక్తసిక్తమైనది కనిపిస్తుంది. దాని కాళ్లనుపట్టి (నరక)అగ్నిలోకి విసిరివేయ బడుతుంది.**

**(సహీహ్ బుఖారీ, 3350, పుస్తకం 60, అధ్యా.8, సంపుటి 4)**

(ఇబ్రాహీమ్(అ)వారి తండ్రి జంతువు రూపంలోకి మార్చబడి అగ్నిలోకి విసిరివేయబడతాడు. అతని 'ముస్లిమ్ కుమారుని' మధ్యవర్తిత్వం తనకు ఉపయోగ పడలేదు. ఎందుకంటే అతడు అవిశ్వాసి. ఆ తరువాత ఇబ్రాహీం(అ) తన తండ్రి బాధ్యతను వదిలేస్తారు)

**ఇబ్రాహీమ్(అ)వారితో అతని జాతి ప్రజలు ఇలా అన్నారు :**

వారన్నారు: 'మేము మా తండ్రి తాతలను, వీటినే ఆరాధిస్తూ ఉండగా చూశాము'.

(ఇబ్రాహీమ్) అన్నాడు : 'వాస్తవానికి, మీరు మరియు మీ తండ్రితాతలు స్పష్టంగా మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు'.

వారన్నారు: 'ఏమీ? నీవు మా వద్దకు ఏదైనా సత్యాన్ని తెచ్చావా? లేదా నీవు మాతో పరిహాసమాడుతున్నావా?

(ఇబ్రాహీమ్) అన్నాడు : 'అలా కాదు! భూమ్యాకాశాల ప్రభువే మీ ప్రభువు! ఆయనే వాటన్నింటినీ సృజించాడు. మరియు నేను ఈ విషయం గురించి మీ ముందు సాక్ష్యమిస్తున్నాను.

'మరియు నేను అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను, మీరు వెళ్ళిపోయిన తరువాత మీ విగ్రహాలకు విరుద్ధంగా తప్పక యుక్తి పన్నుతాను'.

తరువాత అతను ఒక పెద్ద (విగ్రహం) తప్ప అన్నింటినీ ముక్కలు ముక్కలుగా చేశాడు, బహుశా వారు దాని వైపునకు మరలుతారని!

వారన్నారు : 'మా ఆరాధ్య దైవాలతో ఈ విధంగా ప్రవర్తించిన వాడెవడు? నిశ్చయంగా, వాడు దుర్మార్గుడు'.

(కొందరు) ఇలా అన్నారు : 'ఇబ్రాహీమ్ అనే ఒక యువకుడు, వీటిని గురించి ప్రస్తావిస్తూ ఉండగా మేము విన్నాము'.

(ఇతరులు) అన్నారు : 'అయితే, అతనిని ప్రజల కళ్ళ ముందుకు

తీసుకురండి, బహుశా వారు సాక్ష్యమిస్తారేమో!'

(అతనిని తెచ్చిన తరువాత) వారు అడిగారు: 'ఓ ఇబ్రాహీమ్! ఏమీ? నీవేనా మా ఆరాధ్య దైవాలతో ఇలా వ్యవహరించిన వాడవు?'

(ఇబ్రాహీమ్) జవాబిచ్చాడు : 'కాదు కాదు! వారిలోని ఈ పెద్దవాడే ఇలా చేశాడు! అవి మాట్లాడగలిగితే వాటినే అడగండి!'

వారు తమలో తాము సమాలోచనలు చేసుకుంటూ ఇలా అనుకున్నారు: 'నిశ్చయంగా స్వయంగా మీరే దుర్మార్గులు!'

కాని తరువాత వారి బుద్ధి తలక్రిందులై వారు ఇలా అన్నారు : 'వాస్తవానికి, నీకు తెలుసు కదా, ఇవి మాట్లాడలేవని!'

(ఇబ్రాహీమ్) ఇలా అన్నాడు : 'అలా అయితే! మీరు అల్లాహ్‌ను వదలి, మీకెలాంటి లాభంగానీ, నష్టంగానీ చేకూర్చలేని వాటిని ఆరాధిస్తారా?

ధిక్కారం! మీపై మరియు అల్లాహ్‌ను వదలి మీరు ఆరాధించే వాటి (దైవాల)పై! ఏమీ? మీరు ఏ మాత్రమూ తెలివిని ఉపయోగించరా?'

వారన్నారు: 'మీరేమైనా చేయదలుచుకుంటే! ఇతనిని కాల్చివేయండి, మీ ఆరాధ్య దైవాలకు తోడ్పడండి'.

మేము (అల్లాహ్) ఆజ్ఞాపించాము : 'ఓ అగ్నీ! నీవు ఇబ్రాహీమ్ కొరకు చల్లగా సురక్షితంగా అయిపో!'

మరియు వారు ఇబ్రాహీమ్‌కు కీడు తలపెట్ట గోరారు కాని మేము వారినే నష్టంలో పడవేశాము.

**(ఖుర్'ఆన్ 21:53-70)**

పై ఖుర్'ఆన్ వాక్యాలకు వివరణ తఫ్సీర్ గ్రంథాలలో ఉంది. ఆ విషయాలలో ముఖ్యమైనవి పాఠకుల ప్రయోజనార్థం ఇక్కడ అందిస్తున్నాము.

**నగరంలోని వారు అందరూ ఒక పూర్తి నెలరోజుల పాటు కట్టెలను సేకరించడంలో మునిగిపోయారు. ఆ కట్టెలను కాల్చి ఆ మంటలో ఇబ్రాహీమ్(అ)వారిని వేయాలని వారి నిర్ణయం. వారు కట్టెలకు నిప్పు అంటించి అది భయానకంగా మండేలా వారం రోజుల పాటు రాజేసారు. వాటి జ్వాలలు ఆకాశాన్ని అంటుకుంటున్నాయా అనిపించేలా.**

**అగ్ని బాగా ప్రజ్వరిల్లినప్పుడు పూర్తి భయంకరంగా మారినప్పుడు, దానిలోకి ఇబ్రాహీమ్(అ)వారిని విసిరివేయాలని నిర్ణయించుకున్నారు. కాని ఆ అగ్ని ఎంత తీవ్రతతో మండుతున్నదంటే, ఏ ఒక్కరూ దానిని సమీపించడానికి ధైర్యం చేయలేకపోయారు. అప్పుడు వారికి షైతాన్ ఉపాయం చెప్పాడు. తాళ్ళతో ఎగురవేయడానికి ఉపయోగించే సాధనాన్ని ఉపయోగించి మంటల్లో విసరమని.**

**ప్రజలు అల్లాహ్ స్నేహితుడిని మంటల్లో తోయడానికి సన్నద్ధమవుతుండగా భూమ్యాకాశాలలోని సకల జీవులు, దైవదూతలు ఇబ్రాహీమ్(అ)వారి పరిస్థితికి ఒకే విధంగా కేకలు వేసారు. అప్పుడు అల్లాహుతాలా వారందరికి అనుమతినిచ్చారు ఇబ్రాహీమ్(అ)వారికి సహాయం చేయడానికి. తమ సహాయం ఆయనకు అవసరమా అని దైవదూతలు ఇబ్రాహీమ్(అ)వారిని అడిగినప్పుడు, తనను కాపాడటానికి అల్లాహ్ చాలు అని మరియు ఆయన తనని గమనిస్తూనే ఉంటారని సమాధానమిచ్చారు.**

**జిబ్రీల్(అ)వారు కూడా తాను సహాయం అందించాలా అని అడిగినప్పుడు ఇబ్రాహీమ్(అ) బదులిచ్చారు 'నాకు తప్పకుండా సహాయం అవసరం, కాని అది అల్లాహ్ నుండే (రావాలి), మీ నుండి కాదు".**

**ఖుర్'ఆన్ (21:69)లో అల్లాహ్ అగ్నిని ఇలా ఆజ్ఞాపిస్తున్నారు :**

**'ఓ అగ్నీ! నీవు ఇబ్రాహీమ్ కొరకు చల్లగా సురక్షితంగా అయిపో!'**

**అగ్ని చల్లబడి ఆయనకు సౌకర్యంగా మారింది. అది ఆయనకు ఆహ్లాదకరంగా మారింది. అంటే మంట మంటలాగే ఉందిగాని, అది ఇబ్రాహీమ్(అ)వారి శరీరాన్ని తాకలేదు. అది ఆయన చుట్టూ ఉన్న ఇతరత్రా అన్ని కాలిపోయినా సరే. ఆయనకు కట్టిన తాడు కాలిపోయింది.**

**కొన్ని చారిత్రక ఆధారాలను బట్టి ఆయన అగ్నిలో ఏడు రోజులు ఉన్నారని, ఆయన తన పూర్తి జీవితంలో ఆ ఏడు రోజులే ఎంతో సౌకర్యాన్ని పొందిన రోజులుగా ఆయన గుర్తుచేసుకునేవారని తెలుస్తుంది.**

'మరియు నేను మిమ్మల్ని - మరియు అల్లాహ్‌కు బదులుగా మీరు ప్రార్థిస్తున్న వాటిని - అందరినీ వదిలి పోతున్నాను. మరియు నేను నా ప్రభువును ప్రార్థిస్తాను. నేను నా ప్రభువును ప్రార్థించి విఫలుడను కానని,నమ్ముతున్నాను''**(ఖుర్'ఆన్ 19:48)**

ఇబ్రాహీమ్(అ)వారికి 'శారా'వారితో వివాహం జరిగింది.

ఆయన జీవితంలోకి **హాజిరా** వారు ఎలా ప్రవేశించారో తెలియడానికి సహీహ్ బుఖారీ నుండి ఓ హదీస్‌ను ఇక్కడ అందిస్తున్నాము.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : ఇబ్రాహీమ్(అ) అబద్ధం చెప్పలేదు మూడు అబద్ధాలు తప్ప. వాటిలో రెండు అల్లాహ్ కొరకు (చెప్పారు). '**నా ఆరోగ్యం బావుండలేదు**' అని చెప్పినప్పుడు మరియు (నేను ఈ పని చేయలేదు గాని) **ఆ పెద్ద విగ్రహమే దానిని చేసిందని**' ఆయన చెప్పారు.

(ఇక మూడవది) ఇబ్రాహీమ్(అ) (ఆయన భార్య) 'శారా'తో (ప్రయాణంలో) వెళుతున్నప్పుడు, క్రూరంగా పరిపాలించే రాజులలోని ఒక క్రూరమైన రాజుయొక్క భూభాగాన్ని దాటారు.

ఎవరో ఆ పాలకునికి చెప్పారు, 'ఆ మనిషి (ఇబ్రాహీమ్) చాలా అందమైన స్త్రీతో కలిసి ఉన్నారు'. కాబట్టి అతడు ఇబ్రాహీమ్(అ)వారి కొరకు పంపాడు మరియు ఆయనను అడిగాడు శారా గురించి. 'ఆ స్త్రీ ఎవరు?' ఇబ్రాహీమ్(అ) చెప్పారు, '**ఆమె నా చెల్లెలు**'. ఇబ్రాహీమ్(అ) శారా దగ్గరికి వెళ్ళి చెప్పారు, 'ఓ శారా! ఈ భూభాగంపై నువ్వు మరియు నేను తప్ప విశ్వాసులు లేరు. నీ గురించి అతడు నన్ను అడిగాడు మరియు నీవు నా సోదరివి అని అతనికి నేను చెప్పాను, కాబట్టి నా మాటను ఖండించకు'. ఆ క్రూర పాలకుడు శారాను పిలిపించాడు మరియు ఆమె అతని దగ్గరకు వచ్చినప్పుడు, ఆమెను తన చేతితో పట్టుకుందామని ప్రయత్నించాడు. కాని అతని చేయి బిగుసుకు పోయింది. అతడు శారాను అడిగాడు, 'నా కొరకు

అల్లాహ్‌ను ప్రార్థించు మరియు నేను నీకు హాని చేయను'. కాబట్టి శారా అల్లాహ్‌ను అర్థించారు అతనికి నయం కావాలని. మరియు అతనికి నయమైంది.

రెండవసారి ఆమెను పట్టుకోవడానికి ప్రయత్నించాడు, కాని అతని చేయి ఇంతకు పూర్వం కంటే బాగా బిగుసుకుపోయింది. అతడు మరలా శారాకు మనవి చేసుకున్నాడు, 'నా కొరకు అల్లాహ్‌ను ప్రార్థించు మరియు నేను నీకు హాని చేయను'. శారా అల్లాహ్‌ను మరలా అర్థించారు. మరియు అతను బాగయ్యాడు. తరువాత అతడు తన భటులలో నుండి ఒకరిని పిలిచి (ఎవరైతే ఆమెను తీసుకువచ్చారో) చెప్పాడు, 'నీవు నా దగ్గరకు ఓ మనిషిని తీసుకు రాలేదు ఓ దెయ్యాన్ని తీసుకువచ్చావు'.

ఆ క్రూర పాలకుడు '**హాజిరా**'ను శారాకు నౌకరుగా ఇచ్చాడు. శారా వెనక్కి (ఇబ్రాహీమ్) దగ్గరకు వచ్చారు ఆయన సలాత్ (నమాజ్) చేస్తుండగా. ఇబ్రాహీమ్(అ) తన చేతితో సైగచేసి అడిగారు, 'ఏమి జరిగింది?' ఆమె సమాధానమిచ్చారు, 'అవిశ్వాసి, అనైతిక వ్యక్తి యొక్క దుష్టపన్నాగాన్ని అల్లాహ్ నాశనం చేశారు. మరియు **'హాజిరా'**ను నా సేవకొరకు ఇచ్చాడు.

(అబూహురైరా తరువాత వింటున్న వారితో ఇలా చెబుతూ వివరించారు : 'ఆమె (హాజిరా) మీ తల్లి, ఓ బనీ మా-ఇస్-సమా (అంటే అరబ్బులు))

**బనీ మా-ఇస్-సమా**కు అర్థం 'ఆకాశ జలపుత్రులు'. ఎందుకంటే అరబ్బుల జీవనాధారం వర్షంతో పెరిగే పచ్చికబయళ్ళపై ఆధారపడి ఉంటుంది.

**(సహీహ్ బుఖారీ, 3358, పుస్తకం 60, అధ్యా. 8, సంపుటి 4)**

'శారా'వారికి పిల్లలు కలగలేదు. ఇబ్రాహీమ్(అ)వారు 'హాజిరా'వారిని వివాహం చేసుకున్నారు. వారిద్దరికి జన్మించిన కుమారుడు - ఇస్మాయీల్(అ). ఈయన ద్వారా అరబ్బు జాతి మక్కాలో విస్తరించింది. అందుకే 'హాజిరా'వారిని అరబ్బులకు మాతృమూర్తి అన్నారు.

## ఎడారిలో మాతృమూర్తి

ఇబ్రాహీమ్(అ)వారికి తన భార్యతో అభిప్రాయ బేధాలొచ్చినప్పుడు, ఆయన ఇస్మాయీల్(అ)ని మరియు అతని తల్లి (హాజిరా)ని దూరంగా తీసుకు వెళ్ళారు.

మెడనుండి క్రింది వరకూ ఉన్న వస్త్రాన్ని ధరించిన తొలి మహిళ ఇస్మాయీల్(అ)వారి మాతృమూర్తి. శారా(ఇబ్రాహీమ్(అ)వారి మొదటి భార్య)కు తన అడుగుజాడలు తెలియకుండా ఉండటానికి ఆమె ఆ వస్త్రాన్ని ఉపయోగించారు. ఇబ్రాహీమ్(అ) ఆమెను మరియు చనుబాలు త్రాగే కుమారుడు 'ఇస్మాయీల్(అ)ను 'కాబా'కు దగ్గరగా ఉండే ప్రదేశానికి (ఇప్పుడు) జమజమ్ ఉన్నచోటులో చెట్టు క్రిందకు మస్జిద్ యొక్క ఎత్తైన ప్రదేశానికి తీసుకువచ్చారు.

ఆ రోజుల్లో మక్కాలో ఎవరూ లేరు. నీరు కూడా లేదు. ఆయన ఇద్దరిని అక్కడ కూర్చోబెట్టి వారి దగ్గరలో ఖర్జూరాలున్న తోలు సంచిని మరియు కొంచెం నీరుగల ఓ చిన్న నీటితిత్తిని ఉంచారు. నీటితిత్తి నుండి ఇస్మాయీల్(అ) తల్లి నీటిని త్రాగేవారు తన బిడ్డ కొరకు ఆమెలో 'పాలు' పెరిగేవి.

(ఇబ్రాహీమ్(అ)వారు) ఇంటివైపు బయలుదేరారు.ఇస్మాయీల్(అ) తల్లిగారు ఆయనను అనుసరించారు. వారు 'కదా'ని చేరుకున్నప్పుడు, ఆమె ఆయనని వెనుక నుండి పిలిచారు, 'ఓ ఇబ్రాహీమ్! మీరెక్కడకు వెళుతున్నారు, ఎవరి సహవాసంలో సంతోషం కలుగుతుందో అటువంటి ఎవరూ లేని, ఏదీలేని ఈ లోయలో మమ్మల్ని వదిలి?

అవే మాటలను ఆమె చాలా సార్లు పలికారు, కాని ఆయన ఆమె వంక వెనుతిరిగి చూడలేదు. అప్పుడు ఆమె అడిగారు, "ఆ విధంగా చేయమని అల్లాహ్ మిమ్మల్ని ఆదేశించారా?".

ఆయన అన్నారు "ఔను".

"**అయితే ఆయన (అల్లాహ్) మమ్మల్ని నిర్లక్ష్యం చేయరు**" అని ఆమె అన్నారు.

వారికి కనిపించనంత దూరం 'సనియా'కు చేరుకున్నాక, ఆయన (అంటే ఇబ్రాహీమ్) కాబా వైపు తిరిగి రెండుచేతులు ఎత్తి క్రింది దువా చేశారు.

**"ఓ మా ప్రభూ! వాస్తవానికి నేను నా సంతానంలో కొందరిని నీ పవిత్ర గృహం (కాబా) దగ్గర పైరు పండని, ఎండిపోయిన కొండలోయలో నివశింపజేశాను. ఓ మా ప్రభూ! వారిని అక్కడ సలాత్ (నమాజ్) స్థాపించడానికి ఉంచాను. కనుక నీవు ప్రజల హృదయాలను, వారివైపు ఆకర్షింపజెయ్యి మరియు వారు కృతజ్ఞులై ఉండటానికి వారికి జీవనోపాధిగా ఫలాలను సమకూర్చు" (ఖుర్'ఆన్ 14:37)**

ఆమె వెనక్కి తన చోటుకు వచ్చి నీటితిత్తి నుండి నీటిని త్రాగారు. ఆమె బిడ్డ కొరకు ఆమెలో పాలు పెరిగాయి. నీటితిత్తిలోని నీరు అంతా అయిపోయాక, ఆమెకు దాహం వేసింది మరియు ఆమె బిడ్డకు కూడా దాహంగా ఉంది. అతని(బిడ్డ)వైపు ఆందోళనతో చూస్తున్నారు. ఆమె తన బిడ్డ వంక చూసి సహించే శక్తిలేక, అతనిని వదిలి అక్కడికి సఫా పర్వతం దగ్గరగా ఉందని గ్రహించి, దానిపై నిలుచుని లోయ వంక నిశితంగా చూస్తున్నారు ఎవరైనా కనిపించవచ్చేమోనని, కాని ఆమెకు ఎవరూ కనిపించలేదు.

తరువాత ఆమె సఫా పర్వతాన్ని దిగి లోయను చేరుకున్నాక, ఆమె తన దుస్తులను దోపుకుని, తీవ్రమైన బాధ కష్టాలలో ఉన్న వ్యక్తిలా లోయలో పరుగెత్తారు, ఆ లోయను దాటి మర్వా పర్వతాన్ని చేరేవరకూ. అక్కడ ఆమె నిలుచుని ఎవరైనా కనిపిస్తారేమోనని చూస్తున్నారు, కాని ఆమెకు ఎవరూ కనిపించలేదు.

(ఆ రెండు కొండల మధ్య) ఆమె ఇటూ అటూ చాలాసార్లు పరుగెత్తారు. అప్పుడామె స్వగతంలో చెప్పుకున్నారు, 'నేను వెళ్ళి నా బిడ్డ పరిస్థితి చూడటం మేలు'. ఆమె వెళ్ళి, చావు బతుకులలో ఉన్నట్టున్న తన బిడ్డను చూశారు. అతని ఆ స్థితిని చూసి సహించలేక పోయారు. (తనలో) చెప్పుకున్నారు, 'నేను వెళ్ళి చూస్తే, నాకు ఎవరైనా కనిపించవచ్చు'. ఆమె వెళ్ళి సఫా పర్వతాన్ని అధిరోహించి చాలా సేపు చూశారు.

ఆమె ఈ విధంగా ఏడుసార్లు చేశారు. (అంటే సఫా పర్వతం నుండి మర్వా పర్వతానికి మధ్య 7 సార్లు).

ప్రవక్త (ముహమ్మద్-స) చెప్పారు, వాటి (సఫా మరియు మర్వాల) మధ్య ప్రజలు సయీ చేసే (నడిచే) సాంప్రదాయానికి ఇదే మూలం.

ఆఖరిసారిగా ఆమె 'మర్వా'ను చేరుకున్నప్పుడు మరలా ఆమె (స్వగతంలో) చెప్పుకున్నారు, 'నేను వెనక్కి వెళ్ళి బిడ్డ పరిస్థితిని చూడటం మేలు'. కాని అకస్మాత్తుగా ఓ కంఠస్వరం వినబడింది. ఆమె తనకు తాను నిశ్శబ్దంగా ఉండాలని చెప్పుకుని శ్రద్ధగా విన్నారు. ఆమె ఆ స్వరం మరలా విని చెప్పారు, 'మీ మాటలు నాకు వినిపించాయి. మీ దగ్గర సహాయం ఉందా?'

ఆయన దైవదూత జిబ్రీల్(అ). జిబ్రీల్(అ) నేలను తన కాలిమడమతో కొట్టారు. నీరు బయటకి ఉబికి వచ్చింది. దాని చుట్టూ బేసిన్ వలే ఆమె తయారు చేశారు.

ఈ విధంగా తన చేతులను ఉపయోగించి, నీటితిత్తిని తన చేతులతో నింపడం ప్రారంభించారు. మరియు దాని నుండి కొంత నీరు తోడాక నీరు బయటకు వస్తూనే ఉంది.

ప్రవక్త(స)వారు చెప్పారు, ఇస్మాయీల్(అ)వారి తల్లిపై అల్లాహ్ కరుణను కురిపించుగాక! ఆమె జమ్‌జమ్‌ను అలా ఉండనిస్తే (అంటే ప్రవాహాన్ని ఆపడానికి ప్రయత్నించకుండా లేక నీటి తిత్తిని నింపడానికి అందులోని నీటిని పైకెత్తకుండా ఉంటే), జమ్‌జమ్ (భూమినుండి పైకి ఉబికి వస్తున్న ఆ నీరు) ఒక 'నది' గా మారి భూమిపై ప్రవహిస్తూ ఉండేది''.

ప్రవక్త(స)వారు చెప్పారు, 'తరువాత ఆమె (నీటిని) త్రాగారు మరియు బిడ్డచేత త్రాపించారు. ఆ దైవదూత ఆమెతో చెప్పారు:

**'నిర్లక్ష్యం చేయబడ్డారని భయపడవద్దు. ఇది అల్లాహ్ యొక్క గృహం దీనిని ఈ బాలుడు మరియు అతని తండ్రి నిర్మిస్తారు మరియు అల్లాహ్ ఎన్నడూ తన ప్రజలను నిర్లక్ష్యం చేయరు'**

ఆ (కాబా) గృహం ఆ సమయంలో ఎత్తైన ప్రదేశంలో ఓ చిన్న కొండను పోలి ఉంది. పెద్ద వానలు వచ్చినప్పుడు అవి గుట్టకు కుడివైపుకు మరియు ఎడమవైపుకు ప్రవహించేవి.

జుర్‌హుమ్ తెగవారు కొందరు వచ్చేవరకూ ఆమె ఆ విధంగా నివశించారు (లేక) జుర్‌హుమ్ కుటుంబం ఆమె మరియు ఆమె బిడ్డ ప్రక్కగా వెళ్ళడం జరిగింది. 'కదా' మార్గం నుండి వస్తున్నారు గనుక వారు మక్కా క్రింది భాగాన ఆగారు. **వారు ఒక పక్షిని చూశారు.**

వారు అన్నారు, ''ఈ పక్షి ఖచ్చితంగా నీటి చుట్టూ ఎగురుతుంది, ఈ లోయలో నీరు లేదని మాకు తెలిసినప్పటికీ'. వారు ఒకరో ఇద్దరో దూతలను నీటిమూలాన్ని కనుగొనడానికి పంపారు. వారు నీటిని చూసి తిరిగి వచ్చారు నీటి గురించి వారికి తెలియజేయడానికి. కాబట్టి, వారంతా (నీటి వైపు) వచ్చారు.

ప్రవక్త(స) చెప్పారు: 'ఇస్మాయీల్(అ)వారి మాతృమూర్తి నీటికి సమీపంలో కూర్చున్నారు. వారు ఆమెను అడిగారు 'మీతో ఇక్కడ ఉండటానికి అనుమతి నిస్తారా?'. ఆమె సమాధన మిచ్చారు, 'అలాగే, కాని ఈ నీటిపై మీకు హక్కు ఉండదు'. దానికి వారు అంగీకరించారు.

ప్రవక్త(స) చెప్పారు : వారి సహచర్యం ఆమెకు సంతోషం కలిగిస్తుండడంతో, ఆ పరిస్థితులు ఇస్మాయీల్(అ)వారి మాతృమూర్తికి స్వాంతన నిచ్చాయి. వారు అక్కడే స్థిరపడిపోయారు, తరువాత కాలంలో తమ కుటుంబాల కొరకు కబురు పంపారు. వారు వచ్చి వీరితోపాటు స్థిరపడిపోయారు. ఆ విధంగా కొన్ని కుటుంబాల వారు (అక్కడ) శాశ్వత నివాశమేర్పరచుకున్నారు.

ఆ బిడ్డ (ఇస్మాయీల్) పెరిగి పెద్దవాడయ్యారు మరియు వారి నుండి అరబీ భాష నేర్చుకున్నారు. మరియు (అతని సుగుణాల వలన) వారిచే ప్రేమించ బడ్డారు మరియు ఆయనతో పాటు వారి అభిమానం పెరిగింది. ఆయన యుక్తవయస్సుకు చేరుకున్నప్పుడు వారిలోని స్త్రీకి ఇచ్చి వివాహం జరిపించారు.

తన వారిని చూడాలని ఇబ్రాహీమ్(అ)వారికి అనిపించింది.

ఆ విషయాన్ని తన భార్య (శారా) ముందు బహిర్గత పరిచారు. (మక్కాలో)నేను వదిలిన నాపై ఆధారపడిన వారిని చూడాలను కుంటున్నాను.

ఇస్మాయీల్(అ)వారి మాతృమూర్తి మరణించారు. ఇస్మాయీల్(అ) వారికి పెళ్ళి అయింది. తరువాత ఇబ్రాహీమ్(అ) వచ్చారు. తన కుటుంబాన్ని వదిలి చాలా కాలమయింది. చూడాలని వచ్చారు. కాని ఆయనకు ఇస్మాయీల్(అ) కనిపించలేదు. అతని గురించి ఇస్మాయీల్(అ)వారి భార్యను ఆయన అడిగినప్పుడు, ఆమె సమాధానమిచ్చారు 'ఆయన మా జీవనోపాధి కొరకు బయటకు వెళ్ళారు'.

తరువాత ఆయన వారి స్థితి గురించి మరియు వారి జీవన విధానం గురించి ఆమెను అడిగారు. ఆమె సమాధాన మిచ్చారు, 'మేము దారిద్ర్యంలో జీవిస్తున్నాము. మేము కష్టాలతో మరియు లేమితో జీవిస్తున్నామని ఫిర్యాదు చేసారు. ఆయన అన్నారు, ''నీ భర్త ఇంటికి వచ్చినప్పుడు, అతనికి నా సలాము అందజేయి మరియు (నీ ఇంటి) గడపను మార్చమన్నానని అతనికి చెప్పు'.

ఇస్మాయీల్(అ) వచ్చినప్పుడు అతనికి ఏదో అసాధారణ భావం కలిగింది, అతడు తన భార్యను అడిగారు, 'ఎవరైనా చూడటానికి వచ్చారా?'. ఆమె సమాధానమిచ్చారు, 'ఔను, ఫలానా వర్ణన గల ఓ ముసలాయన వచ్చారు మరియు మీ గురించి నన్ను అడిగారు మరియు నేను ఆయనకు తెలియజేశాను, మన జీవన స్థితిగతుల గురించి అడిగారు. మనం కష్టాల్లో మరియు బీదరికంలో జీవిస్తున్నట్లు ఆయనకు చెప్పాను'.

ఇస్మాయీల్(అ) చెప్పారు, 'నీకు ఆయన ఏదైనా సలహా ఇచ్చారా?'. ఆమె సమాధాన మిచ్చారు, 'ఔను, మీకు సలాము అందజేయమని మరియు నీ ఇంటి గడప మార్చమని ఆయన నాకు చెప్పారు'.

ఇస్మాయీల్(అ) చెప్పారు, 'ఆయన నా తండ్రిగారు మరియు నీకు

విడాకులివ్వమని ఆయన నన్ను ఆదేశించారు. మీ ఇంటికి వెళ్ళిపో'. ఆ విధంగా, ఇస్మాయీల్(అ) ఆమెకు విడాకులిచ్చి వారిలోని (జుర్‌హుమ్ తెగలోని) మరో స్త్రీని వివాహం చేసుకున్నారు.

తరువాత అల్లాహ్‌కు ఇష్టమైనంత కాలం వారికి ఇబ్రాహీమ్(అ) దూరంగా గడిపారు. మరలా ఇబ్రాహీమ్(అ) (మక్కాలో) విడిచిపెట్టిన తనవారిని చూడాలనే ఆలోచన వచ్చింది. ఆయన తన భార్య (శారా)తో తన ఉద్దేశాన్ని చెప్పారు.

మరోసారి వచ్చారు. కాని ఇస్మాయీల్(అ) కనిపించ లేదు. ఇస్మాయిల్(అ) భార్య దగ్గరికి వచ్చి ఇస్మాయీల్(అ)వారి గురించి ఆమెను అడిగారు. ఆమె చెప్పారు, 'మాకు ఉపాధి కొరకు ఆయన బయటికి వెళ్ళారు'. ఇబ్రాహీమ్(అ) ఆమెను అడిగారు, **'మీకు ఎలా గడుస్తుంది?'** వారి జీవన స్థితిగతుల గురించి అడిగారు. ఆమె సమాధాన మిచ్చారు, **"మేము బాగున్నాము మరియు లోటు లేదు"**. తరువాత ఆమె అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

మరియు ఆమె ఇబ్రాహీమ్(అ) వారికి చెప్పారు, 'మీరు కాస్త ఉంటారా ఏదైనా కొంత తిని మరియు త్రాగడానికి?'

ఇబ్రాహీమ్(అ) అడిగారు, ''ఏ రకమైన ఆహారాన్ని మీరు తింటున్నారు?' ఆమె చెప్పారు, 'మాంసం'. ఆయన అన్నారు, 'మీరు ఏమిటి త్రాగుతున్నారు?'. ఆమె చెప్పారు, 'నీరు'.

ఆయన అన్నారు, 'ఓ అల్లాహ్! వారి మాంసం మరియు నీళ్ళలో శుభాలను కలుగజేయండి'.

(ఈ సందర్భంగా) ప్రవక్త(స) చెప్పారు, ''ఆ సమయానికి వారు ధాన్యాలు కలిగిలేరు. మరియు వారు ధాన్యాలను కలిగి ఉంటే, వాటిలో శుభాలను కల్గించమని ఆయన అల్లాహ్‌ను ప్రార్థించేవారు''.

ప్రవక్త(స) చెప్పారు, ''ఎవరైనా తను బ్రతకడం కొరకు ఈ రెండు వస్తువులనే (మాంసం మరియు నీరు) కలిగి ఉంటే, అతని ఆరోగ్యం మరియు విధానంపై చెడు ప్రభావం కలుగుతుంది, అతను మక్కాలో నివశిస్తే తప్ప'.

ప్రవక్త(స) చెప్పారు, ''అప్పుడు ఇబ్రాహీమ్(అ) ఇస్మాయీల్(అ)వారి భార్యతో చెప్పారు, 'నీ భర్త వచ్చినప్పుడు, నా సలాము అందజేయి మరియు అతనికి చెప్పు తన గడపను స్థిరంగా ఉంచమన్నానని'.

ఇస్మాయీల్(అ) (ఇంటికి) వచ్చినప్పుడు, 'నీ దగ్గరకు ఎవరైనా వచ్చారా?'

ఆమె సమాధాన మిచ్చారు, 'అవును, మంచిగా కనిపించే ఓ ముసలాయన నా దగ్గరకు వచ్చారు, ఆ విధంగా ఆయనను గౌరవంగా వర్ణిస్తూ చెప్పారు, ఆయన మీ గురించి అడిగారు మరియు నేను తెలియజేశాను, మన జీవనాధారం గురించి ఆయన అడిగారు. మనం మంచి స్థితిలో ఉన్నామని ఆయనకు నేను చెప్పాను.

ఇస్మాయీల్(అ) ఆమెను అడిగారు, 'ఆయన నీకేదైనా సలహా ఇచ్చారా?' ఆమె చెప్పారు, 'అవును, మీకు తన సలాము అందజేయమని మరియు నీ గడపను స్థిరంగా ఉంచుకోవాలని ఆదేశించారు'. అప్పుడు ఇస్మాయీల్(అ) చెప్పారు, 'ఆయన నా తండ్రిగారు మరియు నీవే ఆ గడపవి. నిన్ను నాతో పాటే ఉంచుకోమని ఆయన నన్ను ఆదేశించారు'.

తరువాత అల్లాహ్‌కు ఇష్టమైనంతకాలం వారి నుండి ఇబ్రాహీమ్(అ) దూరంగా ఉన్నారు. మరోసారి ఇబ్రాహీమ్(అ)వారికి (మక్కాలో) విడిచిపెట్టిన తన కుటుంబాన్ని చూడాలనే ఆలోచన వచ్చింది. కాబట్టి ఆయన తన భార్యకు (శారాకు) తన నిర్ణయాన్ని చెప్పారు.

ఆ తరువాత వారిని చూడటానికి వచ్చారు.

ఆయన ఇస్మాయీల్(అ)ని జమ్‌జమ్ దగ్గర చెట్టు క్రింద తన బాణాలను పదును చేసుకుంటుండగా చూశారు. ఇబ్రాహీమ్(అ)ను అతను చూసినప్పుడు, ఇస్మాయీల్(అ) లేచారు. ఎలా అయితే ఒక కుమారుడు తన తండ్రితో, ఒక తండ్రి తన కుమారునితో ప్రవర్తిస్తారో అలా ప్రవర్తించారు. ఇబ్రాహీమ్(అ) చెప్పారు, 'ఓ ఇస్మాయీల్! అల్లాహ్ నాకొక ఆదేశ మిచ్చారు'. ఇస్మాయీల్(అ) చెప్పారు, 'మీ ప్రభువు మీకు ఏది ఆదేశించారో అది చేయండి.'

ఇబ్రాహీమ్(అ) అడిగారు, ''నీవు నాకు సహకరిస్తావా?''

ఇస్మాయీల్(అ) చెప్పారు, 'నేను మీకు సహకరిస్తాను'.

ఇబ్రాహీమ్(అ) చెప్పారు, ''ఇక్కడ ఓ గృహాన్ని నిర్మించమని అల్లాహ్ నన్ను ఆదేశించారు, చుట్టూ ఉన్న నేలకంటే ఎత్తుగా నున్న గుట్టను చూపిస్తూ'.

ప్రవక్త(స) చెప్పారు, ''అప్పుడు వారు (కాబా) గృహం యొక్క పునాదులను పెంచారు (గోడలు కట్టారు). ఇస్మాయీల్(అ) రాళ్ళను తీసుకొచ్చారు. ఇబ్రాహీమ్(అ) నిర్మాణం గావించారు. మరియు గోడలు ఎత్తుగా అయినప్పుడు, ఇస్మాయీల్(అ) ఓ రాయిని తీసుకువచ్చి ఇబ్రాహీం(అ)వారి కొరకు ఉంచారు. ఆయన దానిపై నిలుచుని నిర్మాణం పనిగావించారు. (ఇస్మాయీల్(అ)వారు ఉంచిన ఆ రాయిని అల్-మఖామ్ అంటారు. ఇది ఇప్పటికీ కాబా మస్జిద్ మరియు జమ్‌జమ్‌కి మధ్యలో ఉంది. దానిపై ఉన్న ఇబ్రాహీమ్(అ)వారి పాద గుర్తులను చూడవచ్చు.)

ఇస్మాయీల్(అ) ఆయనకు రాళ్ళు అందిస్తుండగా, మరియు వారిద్దరూ చెబుతున్నారు : 'ఓ మా ప్రభూ! మా ఈ సేవను స్వీకరించు. నిశ్చయంగా, నీవు మాత్రమే సర్వం వినేవాడవు. సర్వజ్ఞుడవు.'(ఖుర్‌ఆన్ 2:127)

ప్రవక్త(స) చెప్పారు, ''గృహ నిర్మాణాన్ని ఇద్దరూ పూర్తి గావించి కాబా చుట్టూ 'ఓ మా ప్రభూ! మా ఈ సేవను స్వీకరించు. నిశ్చయంగా, నీవు మాత్రమే సర్వం వినేవాడవు. సర్వజ్ఞుడవు.' పఠిస్తూ ప్రదక్షిణ చేశారు.
**(సహీహ్ బుఖారీ, నెం. 3364 & 3365, పుస్తకం 60, అధ్యా. 9, సంపుటి 4)**

(ఇస్మాయీల్(అ)వారి మాతృమూర్తిని మక్కాకు తీసుకురావడం దగ్గర నుండి కాబా నిర్మాణం వరకూ జరిగిన పై సంఘటనల గురించి సహీహ్ బుఖారీ, సంపుటి 4లో రెండు హదీస్‌లు ఉన్నాయి. ఈ రెండూ కూడా ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖించారు. వాటి నెంబర్లు 3364 మరియు 3365.

దాదాపుగా రెండింటిలో వాక్యాలు ఒకేలా ఉన్నప్పటికి కొన్ని అదనపు వివరాలు 3365లో ఉన్నాయి. అందువలన, 3365 హదీస్‌లో చెప్పిన అదనపు వివరాలను మరియు 3364లో చెప్పిన అత్యధిక భాగాన్ని పైన అందించడం జరిగింది. పాఠకులు గమనించగలరు.)

పై సుధీర్ఘమైన హదీస్ ద్వారా 'హాజిరా' వారిని, ఇస్మాయీల్(అ)ను మక్కాలో వదలిపెట్టి వచ్చాక, ఇబ్రాహీమ్(అ)వారు మూడుసార్లు తన కుటుంబాన్ని చూడటానికి వచ్చారని తెలుస్తుంది. అయితే ఈ మూడింటికి ముందు, ఇస్మాయీల్(అ)వారి యుక్త వయస్సుకు ముందరి కాలంలో మక్కా వచ్చారని ఖుర్‌ఆన్ ద్వారా తెలుస్తుంది.

ఈ వాక్యాల గురించి తరువాయి వ్యాసం ఖుర్బానీలో వివరించడం జరిగింది.

ఇస్మాయీల్(అ)వారిని పాలు త్రాగే వయస్సులో మక్కాలో వదిలి వచ్చాక, 4 సార్లు ఇబ్రాహీమ్(అ) మక్కా వెళ్ళినట్లు ఖుర్‌ఆన్ మరియు హదీస్ ద్వారా ప్రామాణిక ఆధారాలున్నాయి. ఇవి కాక, ఇతర సందర్భాలలో ఆయన మక్కా విచ్చేసారా? లేదా? అనేది తెలియదు.

తన కుటుంబాన్ని చూడటానికి మక్కా వెళ్ళిన నాలుగు సార్లలో మొదటిసారి తన కుమారుడు ఇస్మాయీల్(అ) బాలుడుగా ఉన్నప్పుడు, (కలలో అల్లాహ్ ఆదేశించిన ప్రకారం) తన ఒక్కగానొక్క కుమారుడైన ఇస్మాయీల్(అ)వారిని జిబహ్ చేయడానికి వచ్చారు.

కుమారుడు ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా, అల్లాహ్ ఆదేశం ప్రకారం ఆచరించమని సిద్ధపడి తన సహనశీలతను చూపించారు. ఇక నాల్గవసారి (అంటే ఇస్మాయీల్(అ)వారిని ఇబ్రాహీమ్(అ)వారు కలిసిన రెండవ సారి) కాబా గృహం నిర్మాణ విషయంలో అల్లాహ్ యొక్క ఆదేశాన్ని వినిపించడానికి వచ్చారు.

పై విషయాలను బట్టి తెలిసేది ఏమిటంటే, పాలు త్రాగే వయస్సులో కుమారున్ని ఎడారిలో వదిలి వచ్చేశాక తన కుమారుడిని రెండుసార్లు మాత్రమే కలిసినా, ఆ రెండు సార్లు కూడా అల్లాహ్ యొక్క ఆదేశాన్ని తీసుకుని వచ్చారు.

ఈ రెండుసార్లు కూడా ఎటువంటి అభ్యంతరం తెలపకుండా అల్లాహ్ ఆదేశాన్ని శిరసావహించడానికి సిద్ధపడిన సహనశీలుడు - ఇస్మాయీల్(అ). ఆయన గురించి ఖుర్‌ఆన్‌లో ఒక చోట ఇలా చెప్పారు అల్లాహుతాలా :

**"మరియు ఈ గ్రంథం (ఖుర్‌ఆన్)లో వచ్చిన ఇస్మాయీల్ గాథను ప్రస్తావించు. నిశ్చయంగా, అతను సత్య వాగ్దానాలు చేసేవాడు మరియు ఒక సందేశహరుడు మరియు ఒక ప్రవక్త.**

**మరియు అతను తన కుటుంబం వారిని సలాత్(నమాజ్) మరియు జకాత్ (విధి దానం)లను పాటించమని ఆజ్ఞాపించేవాడు మరియు తన ప్రభువుకు ప్రీతిపాత్రుడుగా ఉండేవాడు." (ఖుర్‌ఆన్ 19:54-55)**

**రెండవ కుమారుడు ఇస్‌హాఖ్(అ) వారి జననం :**

ఇబ్రాహీమ్(అ)వారి మొదటి భార్యయైన 'శారా'వారికి సంతానం కలగలేదు. ఇబ్రాహీమ్(అ)వారికి దాదాపు 80 సంవత్సరాలు పైబడ్డాక తొలి కుమారుడు ఇస్మాయీల్(అ)వారు పుట్టారు.

దాదాపు ఆయనకు 100 సం॥ల వయస్సులో రెండవ కుమారుని జననం గురించి **శుభవార్త** అందుతుంది. అప్పటికి ఇబ్రాహీమ్(అ)వారు మరియు 'శారా'వారు ఇద్దరూ వృద్ధులే.

మరియు వాస్తవానికి మా దూతలు శుభవార్త తీసుకొని ఇబ్రాహీమ్ వద్దకు వచ్చారు. వారు అన్నారు: "నీకు శాంతి కలుగు గాక (సలాం)!" అతను "మీకూ సలాం (శాంతి కలుగు గాక!)

అని జవాబిచ్చాడు. తరువాత అతను అతి త్వరగా, వేపిన దూడను (వారి ఆతిధ్యానికి) తీసుకొని వచ్చాడు.

కానీ వారి చేతులు దానివైపు పోకపోవటం చూసి వారిని గురించి అనుమానంలో పడ్డాడు మరియు వారి నుండి అపాయం కలుగుతుందేమోనని భయపడ్డాడు! వారన్నారు : "భయపడకు! వాస్తవానికి మేము లూత్ జాతి వైపునకు పంపబడిన (దూతలము)"

అతని (ఇబ్రాహీమ్) భార్య (అక్కడే) నిలబడి ఉండెను, అప్పుడామె నవ్వింది, పిదప మేము **ఆమెకు ఇస్‌హాఖ్ యొక్క మరియు ఇస్‌హాఖ్ తరువాత యాఖూబ్ యొక్క శుభవార్తను ఇచ్చాము.**

ఆమె (ఆశ్చర్యంతో) అన్నది : "నా దౌర్భాగ్యం! నాకిప్పుడు బిడ్డ పుడతాడా? నేను ముసలిదానిని మరియు నా ఈ భర్త కూడా వృద్ధుడు. (అలా అయితే) నిశ్చయంగా, ఇది చాలా విచిత్రమైన విషయమే!

వారన్నారు: **"అల్లాహ్ ఉత్తరువు విషయంలో మీరు ఆశ్చర్య పడుతున్నారా? ఓ (ఇబ్రాహీమ్) గృహస్థులారా! మీపై అల్లాహ్ కారుణ్యం మరియు ఆయన శుభాశీస్సులు ఉన్నాయి! నిశ్చయంగా, ఆయనే సర్వస్తోత్రాలకు అర్హుడు, మహత్త్వపూర్ణుడు."** **(ఖుర్‌ఆన్ 11:69-73)**

యాకూబ్(అ)వారి సంతానమే బనీ ఇస్రాయీల్‌వారు.

మొదటి కుమారుని సంతానం - అరబ్బులు

రెండవ కుమారుని సంతానం నుండి జన్మించినవారు -యూదులు

మరియు ఇబ్రాహీమ్ ఇలా ప్రార్థించిన విషయం (జ్ఞాపకం చేసుకోండి): "ఓ నా ప్రభూ! ఈ నగరాన్ని (మక్కాను) శాంతి నిలయంగా ఉంచు మరియు నన్నూ నా సంతానాన్నీ విగ్రహారాధన నుండి తప్పించు! **(ఖుర్‌ఆన్ 14:35)**

"సర్వస్తోత్రాలకు అర్హుడైన అల్లాహ్ నాకు వృద్ధాప్యంలో కూడా **ఇస్మాయీల్** మరియు **ఇస్‌హాఖ్‌లను** ప్రసాదించాడు. నిశ్చయంగా, నా ప్రభువు ప్రార్థనలను వినేవాడు. **(ఖుర్‌ఆన్ 14:39)**

**ఇబ్రాహీమ్(అ)వారి గురించి అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఇలా తెలియజేస్తున్నారు:**

**ఇబ్రాహీమ్ యూదుడూ కాడు మరియు క్రైస్తవుడూ కాడు! కాని అతను హనీఫ్ (ఏకదైవ సిద్ధాంతంపై ఉన్నవాడు), ముస్లిమ్ (అల్లాహ్‌కు విధేయుడు) మరియు అతడు ఏమాత్రం ముష్రిక్ (అల్లాహ్‌కు సాటి కల్పించేవాడు) కాడు.**
**(ఖుర్'ఆన్ 3:67)**

**ఖలీలుల్లాహ్ (అల్లాహ్ స్నేహితుడు)కు దగ్గరి సంబంధం కలిగిన వారెవరో క్రింది ఖుర్'ఆన్ వాక్యంలో అల్లాహ్ తెలియజేస్తున్నారు :**

> నిశ్చయంగా, ఇబ్రాహీమ్‌తో దగ్గరి సంబంధం గలవారంటే, అతనిని అనుసరించే వారు మరియు ఈ ప్రవక్త (ముహమ్మద్) మరియు (ఇతనిని) విశ్వసించిన వారు. మరియు అల్లాహ్‌యే విశ్వాసుల సంరక్షకుడు. **(ఖుర్'ఆన్ 3:68)**

ఇబ్రాహీమ్(అ)వారికి అల్లాహ్‌పై ఎంత గొప్ప విశ్వాసం ఉందో ఖుర్'ఆన్ మరియు ప్రామాణిక హదీస్‌లు స్పష్టం చేస్తున్నాయి. విగ్రహారాధకులైన తన తండ్రిని మరియు తన జాతివారిని వ్యతిరేకించి, చివరికి వారందరూ ఆయనని అగ్నిలో వేసే సమయంలో, దైవదూతలు సహాయం చేయడానికి సిద్ధపడినా కూడా వారి సహాయాన్ని తిరస్కరించి, అల్లాహ్ యొక్క సహాయంపై ఆధారపడిన విశ్వాసి - ఇబ్రాహీమ్(అ).

అల్లాహ్ అనుగ్రహంతో ఆ అగ్ని కూడా ఆయనకు సౌకర్యంగా మారిపోయింది. కేవలం అల్లాహ్ యొక్క సహాయంపైనే ఆధారపడే వారికి, అల్లాహ్ ఏ విధంగా అనుగ్రహిస్తారో తెలుసుకోవడానికి ఇబ్రాహీం(అ)వారి జీవితమే ఓ ఉదాహరణ.

ఆయన ఎన్నో కఠినమైన పరీక్షలకు గురయ్యారు. విశ్వాసం యొక్క స్థాయి పెరిగేకొద్దీ పరీక్ష యొక్క స్థాయి కూడా పెరుగుతుంది. అదే విధంగా అల్లాహ్ యొక్క అనుగ్రహం కూడా అంతకు మించిన స్థాయిలోనే అందుతుంది.

వృద్ధాప్యంలో లేకలేక కలిగిన కుమారుడిని, మరియు తన రెండవ భార్యను ఆహారం, నీరు దొరకని ప్రదేశంలో విడిచి రావలసి వచ్చింది. తన కుటుంబాన్ని అల్లాహ్ సంరక్షణలో వదిలాననే ధైర్యంతో ఆ పరీక్షను కూడా తట్టుకున్నారు. ఒక్కగానొక్క ఆ బిడ్డ ఎక్కడో మక్కాలో జీవిస్తున్నాడు అని తృప్తి పడ్డారు. కాని ఆ బిడ్డను కూడా జిబహ్ కొరకు సిద్ధం చేయవలసి వచ్చింది.

వృద్ధుడైన ఆయనకు ఉన్న ఒక్కగానొక్క కుమారుడిని జిబహ్ చేయడానికి సిద్ధపడి ఆ పరీక్షను కూడా తట్టుకున్నారు.

ఇబ్రాహీమ్(అ)వారు మూడు అబద్ధాలు చెప్పినట్లుగా హదీస్‌లో ఉంది. అయితే వాటిని మనం అబద్ధాలుగా భావించకూడదు. 'ముహమ్మద్(స)వారిపై జరుగుచున్న దుష్ప్రచారం' పుస్తకంలో ఒక హదీస్‌ను అందించాము. అందులో ప్రతీ ప్రవక్త పునరుత్థాన దినమున తన పాపాన్ని గుర్తు చేసుకుని ... అని ఉంటుంది. నిజానికి అవి పాపాలు కాదని, ప్రవక్తలు తమ విషయంలో జరిగే అతి చిన్న పొరపాట్లను కూడా వారు పాపాలుగా భావిస్తారని అక్కడ పూర్తి వివరణ ఇవ్వడం జరిగింది. అదే విధంగా ఇబ్రాహీమ్(అ)వారి విషయంలో, ఆయన చెప్పిన వాటిని, మనం అనుకునే అబద్ధాలుగా భావించ కూడదు. ఈ విషయంపై విద్వాంసులు చాలా ఆసక్తికరంగా వివరణ లిచ్చారు. అయితే స్థలాభావం వలన ప్రస్తుతం వాటిని ఇక్కడ అందించడం లేదు. మరొక వ్యాసంలో ఆ వివరాలను, ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.

ఇబ్రాహీమ్(అ)వారి మొదటి భార్య 'శారా'వారికి కూడా అల్లాహ్‌పై ఎంత విశ్వాసం ఉందో 23వపేజీలో ఇచ్చిన హదీస్ ద్వారా అర్థమౌతుంది. చెడు సంకల్పంతో తాకాలని అనుకున్న క్రూరుని చేతిని బిగుసుకు పోయేలా చేసి, తన దాసురాలి గౌరవాన్ని అల్లాహ్ కాపాడారు. ఆమె అల్లాహ్‌కు 'దువా' చేయగనే, అతడు మామూలు స్థితికి వచ్చాడు. ఆమె దువాను అల్లాహ్ స్వీకరించారు.

ఇబ్రాహీమ్(అ)వారి రెండవ భార్య 'హాజిరా'వారి త్యాగం గురించి ఆలోచిస్తే, ఆమె విశ్వాసం ఎంత గొప్పదో అర్థమౌతుంది. పాలిచ్చే ఓ తల్లి, తన బిడ్డ ఆకలితో ఏడుస్తుంటే, ఎంత మనోవ్యథకు గురవుతుందో అందరికీ తెలిసిన విషయమే! తన చుట్టూ ఇరుగు పొరుగు వారుంటే, తాను ఏకాకి అయినప్పటికీ కూడా తన బిడ్డ కొరకు ఏ సహాయం గురించైనా వారిని అడిగే అవకాశం ఉంది. కాని నీరు కూడా దొరకని ఎవ్వరూ లేని ఓ ఎడారిలో పసిబిడ్డతో జీవించడానికి ఏ స్త్రీ అయినా అంగీకరించగలదా?

భర్త ఏమీ చెప్పకుండా వెళ్ళిపోతుంటే, పదేపదే అడుగుతూ వెంబడిస్తే, 'అల్లాహ్' (సంరక్షణలో నేను నిన్ను వదిలి వెళుతున్నాను) అనే సమాధానాన్ని భర్త నుండి విని, అల్లాహ్ (రక్షణ)లో ఉండటంలోనే నాకు తృప్తి ఉంది' అని చెప్పి ఆమె వెనక్కి వచ్చేశారంటే 'అల్లాహ్' యొక్క సంరక్షణ గురించి ఆమెకు ఎంత విశ్వాసముందో!

అంతటి అమోఘమైన విశ్వాసాన్ని కలిగిన దాసులపై అల్లాహ్ అనుగ్రహం పొంగిపొరలుతుంది.

బిడ్డ పరిస్థితి చూసి హృదయం ద్రవించి, ఒక కొండనుండి మరొక కొండకు పరుగులు తీశారు. అల్లాహ్ సంరక్షణలో ఉన్నానని ఆమెకు తెలిసినా, మానవ ప్రయత్నాన్ని ఆమె ఆపలేదు. ప్రయత్నిస్తే ఏదో ఒక పరిష్కారం దొరకుతుందని, ఆ పరిష్కారం చూపేది కూడా 'అల్లాహ్'యే నని ఆమెకు తెలుసు.

భర్తతో సంతోషంగా గడపవలసిన పరిస్థితి నుండి, ఆహారం మరియు నీరు దొరకని చోట దాహంతో, అల్లాహ్ సంరక్షణే చాలు అనుకుని, ఆకలితో దయనీయమైన పరిస్థితిలో ఉన్న పసిబిడ్డను చూసి, తన బిడ్డ కొరకు ఆ తల్లి పడుతున్న ఆందోళన చూసి అనంత కరుణామయుడైన 'అల్లాహ్' కరుణ పొంగిపొరలకుండా ఉంటుందా?

అల్లాహ్‌పై ఆమెకున్న విశ్వాసం మరియు ఆమె త్యాగం జమ్‌జమ్

నీటిని భూమిపైకి తెచ్చింది. ఈ నీటి గొప్పతనం గురించి మరో వ్యాసంలో చెప్పుకుందాం.

'నిర్లక్ష్యం చేయబడుతున్నావని భయపడవద్దు' అని అల్లాహ్ ఇచ్చిన భరోసాను జిబ్రీల్(అ)వారు, ఇస్మాయీల్(అ) మాతృమూర్తి 'హాజిరా'వారికి వినిపించారు.

అల్లాహ్ తన దాసులను ఎన్నడూ నిర్లక్ష్యం చెయ్యరు.

భర్తకు దూరమై, ఒక్కగానొక్క బిడ్డతో జీవిస్తున్న ఆమెకు, తనకు ఆ ఒక్క కుమారుడు కూడా దూరం అయ్యే పరిస్థితి ఏర్పడింది. తన భర్త అల్లాహ్ ఆదేశంతో తన కుమారుడిని జిబహ్ చేయడం కొరకు సిద్ధమయ్యారు.

తన భర్తను ఆ పని చేయకుండా ఆమె ఆపలేదు. అల్లాహ్ ఆదేశాన్ని స్వీకరించారామె. ఆ బాలుడిని జిబహ్ చేస్తే, ఆమె ఒంటరి అయిపోతుంది. ఏ మాతృమూర్తికైనా ఇంతకంటే వేదన కలిగించే పరిస్థితులు ఇంకేముంటాయి?

అయినా సరే, అల్లాహ్‌పై ఆమెకున్న విశ్వాసం, ఆమె వేదనను జయించింది.

విశ్వాస పరీక్షలలో నెగ్గి భర్తకు తగిన భార్య అనిపించుకున్నారామె.

భర్తను గౌరవించడంలో, అల్లాహ్‌ను విశ్వసించడంలో ఈ మాతృమూర్తి స్త్రీలకు ఓ వాస్తవ ఉదాహరణ.

ఇబ్రాహీమ్(అ)వారు తన మొదటి భార్యను చెల్లెలు అని చెప్పడానికి కారణం, క్రూరుడైన ఆ రాజు ఏ స్త్రీ అయినా తన తండ్రి మరియు సోదరునితో వెళ్తే ఆ స్త్రీని వదిలేసేవాడు. తన భార్య గౌరవాన్ని కాపాడటానికే ఆయన ఆ విధంగా చెప్పారు. **భార్య గౌరవాన్ని కాపాడటం భర్త యొక్క బాధ్యత.**

ఇబ్రాహీమ్(అ)వారు తన కోడళ్ళని అడిగిన ప్రశ్న - **'మీకు ఎలా గడుస్తుంది?'** వారిని వారి కుటుంబ జీవన స్థితిగతుల గురించి అడిగారు.

'మేము దారిద్ర్యంలో జీవిస్తున్నాము. మేము కష్టాలతో మరియు లేమితో జీవిస్తున్నామని' ఫిర్యాదు చేసింది మొదటి కోడలు.

**"మేము బాగున్నాము మరియు లోటు లేదు"**. అని రెండవ కోడలు చెప్పి, ఆ తరువాత ఆమె అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

మొదటి కోడలికి తృప్తి లేదు. రెండవ కోడలు అల్లాహ్‌పై విశ్వాసంతో తమకి కలిగిన దానికి తృప్తి పడి, తన భర్త గౌరవాన్ని కాపాడుతూ, అతనికి కృతజ్ఞత చూపారు. అందుకే రెండవ కోడలిని జాగ్రత్తగా చూసుకోమని ఇబ్రాహీమ్(అ) తన కుమారుడిని ఆదేశించారు.

భార్యా బిడ్డలను కష్టపడి పోషించవలసిన బాధ్యత భర్తకు ఉంది. అలాగే భార్య గౌరవాన్ని కూడా భర్త కాపాడాలి. పోషించే భర్తకు కృతజ్ఞత చూపిస్తూ, ఎవరితోనో పోల్చుకుని భర్తను చులకన చేయకుండా ఉన్న దానితో తృప్తి పడుతూ భర్తను గౌరవించవలసిన బాధ్యత భార్యపై ఉంది.

భార్యాభర్తల నుద్దేశించి ఖుర్‌ఆన్‌లో అల్లాహుతాలా స్పష్టంగా చెప్పారు : **వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు** (ఖుర్‌ఆన్ 2:187).

ఇస్మాయీల్(అ)వారు తన తండ్రి అల్లాహ్ ఆదేశం తీసుకొచ్చినప్పుడు బాలుడుగా ఉండి కూడా 'జిబహ్'కు సిద్ధమై, తన మరణం తన తల్లిదండ్రులకు బాధ కలుగకుండా ఉండాలని తన తండ్రి పలికిన మాటలు ఆయనకు అల్లాహ్‌పై ఎంత గొప్ప విశ్వాసముందో తెలియజేస్తున్నాయి. రెండవసారి ఆయన వచ్చినప్పుడు గడప మార్చమన్నారు. తండ్రి మాటను జవదాటలేదు. మూడవసారి వచ్చినప్పుడు గడపను స్థిరంగా ఉంచుకోమన్నారు. ఆ ఆదేశాన్ని కూడా ఆయన స్వీకరించారు. నాల్గవ సారి కాబా నిర్మాణం కొరకు సహాయం కొరకు వచ్చారు. తండ్రి మాటను గౌరవించారు.

**ఇబ్రాహీమ్**(అ), **ఇస్మాయీల్**(అ), **తల్లి హాజిరా**, **ఇస్మాయీల్**(అ) వారి భార్య - అల్లాహ్‌పై అచంచలమైన విశ్వాసం కలిగిన కుటుంబం.

తల్లీ మరియు తండ్రి దూరంగా జీవిస్తున్నప్పటికీ, తండ్రిని తల్లి గౌరవించారు. తండ్రితోపాటు కలిసి లేకపోయినా, తండ్రి యొక్క ప్రతీ ఆదేశాన్ని కొడుకు స్వీకరించాడు. మావయ్యగారని తెలియకపోయినా సరే, ఆ కోడలు అతిథిని గౌరవించి, భర్త గౌరవాన్ని నిలబెట్టారు.

సాధారణంగా వీరు ఉన్న పరిస్థితులలో ఏ కుటుంబం ఉన్నా సరే, వారి మధ్య గౌరవాలు, ఆప్యాయతలు ఉండకపోవచ్చు. కాని ఇబ్రాహీమ్(అ) వారి కుటుంబం ఆ విధంగా ఉండగలగడానికి ఏకైక కారణం - వారందరికీ **అల్లాహ్‌పై నున్న విశ్వాసం.**

ప్రపంచ వ్యాప్తంగా ముస్లిమ్‌లు చేసుకునే రెండు పండుగలలో ఒక పండుగ వీరి త్యాగానికి గుర్తుగా చేసుకోబడుతుంది. హజ్జ్ చేయడం, కాబా ప్రదక్షిణం, రెండు కొండల మధ్య సయీ చేయడం, ఖుర్బానీ ఇవ్వడం, జమ్‌జమ్ నీరు - 1400 సం॥ల నుండి ఈ త్యాగధనులని ముస్లిమ్‌లకు గుర్తు చేస్తూనే ఉన్నాయి. అల్లాహ్ కరుణ వలన ఖయామత్ వరకూ ఇది కొనసాగుతూనే ఉంటుంది.

**విశ్వాసం ఎంతటి త్యాగానికైనా సిద్ధం చేస్తుంది.**

**ఆ త్యాగాన్ని మించిన అనుగ్రహం**

**అల్లాహ్ నుండి పొంగిపొరలుతుంది.**

# అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)

# రెండవ ఖలీఫా

## త్వరలో సీరియల్ ప్రారంభం

**మంచివారు ప్రతీ విషయంలోనూ మంచిగా ఉండక పోవచ్చు. ఒకరిలో ఉండే ఇతర లక్షణాలను అతని మంచి లక్షణాలు డామినేట్ చేసినప్పుడు, అతనిని మంచివాడుగా తోటివారు అర్థం చేసుకుంటారు. లోపాలకు అతీతంగా ఉంటూ, ప్రజలను సన్మార్గంలో నడిపించడానికి జన్మించినవారు దైవప్రవక్తలు.**

**అన్ని మంచి లక్షణాలు ఏకకాలంలో ఒకే వ్యక్తిలో ఉండడం అసాధ్యమని భావిస్తారు. అది అసాధ్యం కాదు. అందుకు వాస్తవ ఉదాహరణ అల్లాహ్ యొక్క సందేశహరులు ముహమ్మద్(స). ఆయన సకల లోకాలకు కారుణ్యంగా పంపబడ్డారని ముస్లిమ్‌లకు తెలుసు. కాని ఎందరో విభిన్న రంగాలకు చెందినవారు, వివిధ విశ్వాసాలకి చెందినవారు, చరిత్రకారులు కూడా ముహమ్మద్(స)వారి యొక్క గొప్పతనాన్ని ప్రకటించారు. అలా వారు చెప్పడానికి గల కారణాలను విశ్లేషించి చూపారు.**

**అయితే మత దురభిమానంతోనో లేక మరే విధమైన ఇతర ప్రయోజనాల కోసమో కొందరు ఆయనను విమర్శించడమే పనిగా పెట్టుకుని, చరిత్రను మరియు నిజాలను వక్రీకరిస్తూ కోట్లాది రూపాయలను ఈ పనికోసం వినియోగిస్తూనే ఉన్నారు. ఎంత ఖర్చు చేసి ఎంత పెద్ద శిఖరాన్ని నిర్మించినా, ఆ శిఖరం సూర్యోదయాన్ని ఆపలేదు. మానవ చరిత్రలో ముహమ్మద్(స)వారు మహోన్నతులు.**

**దానికి సాక్ష్యంగా ఆయన జీవితంలోని ప్రతీ సూక్ష్మ విషయం గ్రంథస్థం చేయబడింది. ఇది ఎవరో చేసిన రచన కాదు. వాటి ప్రామాణికత నూటికి నూరు శాతమని ఏ కాలంలోనైనా ఎవరైనా పరీక్షించి తెలుసుకోగలరు.**

**చరిత్రలో ఆ మహనీయుని తరువాత చెప్పుకోదగిన మరో వ్యక్తి ఉన్నారు. ఆయనే ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి).**

**ఆయన ప్రజలను పాలించినట్లుగా చరిత్రలో ఇంకెవ్వరూ పాలించ లేదు. 22 లక్షల చదరపు మైళ్ళ భూభాగానికి నాయకుడైనా ఈయన మొత్తం రాజ్యంలోనే అందరికంటే అతి నిరాడంబరంగా బ్రతికే ఉమర్(రజి) వారి పేరు వింటే దుర్మార్గులకు వెన్నులో చలిపుట్టేది.**

**ఈయన జీవితం ఎందరినో కదిలించింది. భారతజాతిపిత మహాత్మ గాంధీగారు కూడా ఉమర్(రజి)వంటి ఓ పాలకుడు మన దేశానికి ఉంటే, మనదేశంలో నిజమైన ప్రజాస్వామ్యం వస్తుందని అభిప్రాయ పడ్డారు. ఆయన పరిపాలన ఎలా ఉండేదో ఒక్క మాటలో గాంధీగారు వర్ణించారు.**

దైవ సందేశహరులు 'ముహమ్మద్(స)'వారిని ప్రాణం కంటే మిన్నగా ప్రేమించిన ఉమర్(రజి)వారికి విపరీతమైన దైవభీతి ఉండేది. ఈ రెండు విషయాలే ఆయనను చరిత్రలో ఉత్తమ పరిపాలకుడుగా అందరిచే గౌరవించబడేలా చేశాయి.

ముందుగా ఉమర్(రజి)వారి గురించి ముహమ్మద్(స)వారు ఏమి చెప్పారో ఓ సారి జ్ఞాపకం చేసుకుందాం. ఆ తరువాత ఇతర చరిత్రకారులు ఏమి చెప్పారో తెలుసుకుందాం!

అబ్దుల్లా బిన్ ఉమర్ ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, ''నేను స్వప్నంలో బకెట్‌తో బావి నుండి నీరు తోడుతున్నట్లుగా చూశాను. తరువాత అబూబకర్ వచ్చి ఒకటో, రెండో బకెట్ల (నీటిని) తోడారు. మరియు అతను నీటిని తోడటంలో కొంత బలహీనత కనిపించింది. అల్లాహ్ ఆయనని క్షమించుగాక! తరువాత ఉమర్ బిన్ ఖత్తాబ్ వచ్చారు మరియు ఆ బకెట్ అతని చేతులలో పెద్దదై పోయింది. అంతగా కష్టపడి పనిచేసే అతని వంటి బలమైన వ్యక్తిని నేనెన్నడూ చూడలేదు. ఆయన చాలా ఎక్కువ నీటిని తోడారు ప్రజలు తృప్తిగా త్రాగారు మరియు అక్కడే కూర్చున్న వారి ఒంటెలకు త్రాపించారు.
**(సహీహ్ బుఖారీ, 3682, పుస్తకం 62, అధ్యా. 6, సంపుటి 5)**

మరో ఉల్లేఖనం(3676) చివరిలో ఇలా ఉంది: వహ్బ్, వారిలోని ఓ ఉల్లేఖకుడు చెప్పారు, వారి ఒంటెలు త్రాగి మరియు కూర్చునేవరకూ)

అబూ బకర్(రజి)వారి పరిపాలన దాదాపు మూడు సంవత్సరాలు మాత్రమే చేశారు. ఉమర్(రజి)వారు ఇస్లామీయ సామ్రాజ్యాన్ని 10 సంవత్సరాలు పాలించారు. ఆయన ఖలీఫాగా ఉన్న కాలంలో ప్రజలందరికీ న్యాయం జరిగింది.

హమ్జా యొక్క తండ్రిగారి ఉల్లేఖనం: అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు, ''నేను పడుకుని ఉండగా, నన్ను నేను (పాలు) త్రాగుతున్నట్లుగా చూశాను మరియు నాకు ఎంత ఆశ్చర్యం కలిగిందంటే దాని (పాల)యొక్క తడి నా గోళ్ళ నుండి బయటికి వస్తున్నట్లుగా గమనించాను. తరువాత నేను (పాలను) ఉమర్‌కు ఇచ్చాను. వారు (ప్రవక్త(స)వారి అనుచరులు) అడిగారు, ''(ఈ కల యొక్క) అర్థమేమిటి?'' ఆయన చెప్పారు, ''**అది జ్ఞానం**''.
**(సహీహ్ బుఖారీ, 3681, పుస్తకం 62, అధ్యా. 6, సంపుటి 5)**

సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ ఉల్లేఖనం: ఉమర్ బిన్ ఖత్తాబ్ అల్లాహ్ యొక్క సందేశహరుల(స)నుండి లోపలికి రావడానికి అనుమతి

నడిగారు (అప్పుడు) ఆయనతో కొంతమంది ఖురైషీ మహిళలు కూర్చుని ఎక్కువ ఖర్చుల గురించి అడుగుతున్నారు, వారి స్వరాలు రసూలుల్లాహ్(స)వారి స్వరం కంటే పెంచి. లోపలికి ప్రవేశించడానికి ఉమర్ అనుమతి అడిగినప్పుడు, ఆ స్త్రీలు వెంటనే పరదా వెనుక దాక్కున్నారు. రసూలుల్లాహ్(స) ఆయనకు లోపలికి రావడానికి అనుమతి నిచ్చారు. మరియు రసూలుల్లాహ్(స) చిరునవ్వు నవ్వుతుండగా ఉమర్(రజి) వచ్చారు. ఉమర్(రజి) చెప్పారు, ''ఓ రసూలుల్లాహ్! అల్లాహ్ మిమ్మల్ని ఎల్లప్పుడూ చిరునవ్వుతో ఉండేలా చేయుగాక!''. ప్రవక్త(స) చెప్పారు, ''ఇక్కడున్న ఈ స్త్రీలు, నాకు ఆశ్చర్యాన్ని కలిగించారు. నీ పిలుపు వినడమే తడవుగా వారు పరదా వెనుక దాక్కున్నారు.'' ఉమర్ చెప్పారు, ''ఓ రసూలుల్లాహ్! వారు భయపడటానికి నా కంటే మీకే ఎక్కువ హక్కు ఉంది''. తరువాత వారితో ఉమర్(రజి) ఇలా చెప్పారు, 'ఓ మీ ఆత్మలకు శత్రువులారా! రసూలుల్లాహ్(స)వారి కంటే ఎక్కువ నాకు భయపడు తున్నారా? వారు సమాధాన మిచ్చారు, అవును, మీరు రసూలుల్లాహ్(స) వారి కంటే ఎక్కువ స్ట్రిక్ట్‌గా ఉంటారు (మృదు స్వభావం కాదు) కనుక.

అప్పుడు అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు, ''ఓ ఇబ్నె ఖత్తాబ్! ఎవరి చేతులలో నా ఆత్మ ఉందో ఆయన సాక్షి! ఎప్పటికీ షైతాన్ తన దారిలో నువ్వు వెళుతుండగా చూస్తే వేరే మార్గం వైపు వెళతాడు.
**(సహీహ్ బుఖారీ, 3683, పుస్తకం 62, అధ్యా. 6, సంపుటి 5)**

అబూహురైరా ఉల్లేఖనం : ప్రవక్త(స) చెప్పారు, ''మీ ముందరి జాతిలో బనీ ఇస్రాయీల్ నుండి మార్గదర్శకత్వంతో స్ఫూర్తిని పొందిన వారున్నారు, వారు ప్రవక్తలు కానప్పటికీ మరియు అటువంటి వ్యక్తులు ఎవరైనా నా అనుచరులలో ఉన్నట్లయితే, అది ''ఉమర్''.
**(సహీహ్ బుఖారీ, 3689, పుస్తకం 62, అధ్యా. 6, సంపుటి 5)**

**అదే జరిగింది.**

చరిత్రలో 'ద గ్రేట్' అనే బిరుదుతో కొనియాడబడిన వారు కొందరున్నారు. వారిలో ఒకరైన అలెగ్జాండర్ ద గ్రేట్ గురించి మరియు అతని కంటే ఉమర్(రజి)వారి ఆధిక్యతను ఆధారాలతో సహా క్రిందటి సంచికలో అందించాము. వాస్తవానికి చరిత్రలో రాబోవు తరాలు ద గ్రేట్ అనడానికి అందరికంటే ఎక్కువ అర్హత కలిగినవారు 'ఉమర్(రజి)'.

అలెగ్జాండర్, జూలియస్ సీజర్ మరియు నెపోలియన్ లను గ్రేట్ అని పిలిచారు ఎందుకంటే వారు శక్తివంతమైన గవర్నర్లు మరియు పరిపాలకులు. పీటర్ మరియు ఫ్రెడరిక్ లను గొప్పవారిగా పిలవడానికి కారణం గందరగోళంలో ఉన్న తమ జాతులను క్రమబద్ధం చేసి అభివృద్ధి చేసినందుకు. మరో ఇద్దరు గొప్పవారిలో ఒకరు తెలివైన వారైతే మరొకరు గొప్ప న్యాయమూర్తి. వీరందరినీ కలిపితే, దానికి ఉదాహరణే ఉమర్(రజి) అని చెప్పవచ్చు.

**ఉమర్(రజి) ఏకకాలంలో ఓ విజేత, దూరదృష్టిగల ఓ రాజకీయవేత్త, ఓ సంస్కర్త, ఓ న్యాయమూర్తి మరియు ఓ ఆధ్యాత్మిక నాయకుడు.**

కొందరికి ఇది అతిశయోక్తిగా అనిపించవచ్చు. కాని సూక్ష్మ విషయాలను కూడా విశ్లేషించగలిగే చరిత్రకారులకు ఇది ఎంత నిజమో తెలుస్తుంది. గొప్ప స్థితికి చేరినవారు ఏ విధంగా ఆ స్థితికి చేరుకున్నారనేది కూడా చాలా ముఖ్యమైన విషయం. ఎన్నో తప్పులు చేసో, లేదా ప్రజలను ఇబ్బందుల్లో పడేసో పై స్థాయికి చేరుకున్న వారెందరో ఉన్నారు.

కాని ఉమర్(రజి)వారిలో అటువంటి లోపాలు కనిపించవు.

ఉదాహరణకు పర్షియాపై అలెగ్జాండర్ చేసిన దండయాత్రలో ఇస్తఖర్ జాతిలోని మగవారినందరిని ఆ పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నాక విచక్షణా రహితంగా ఊచకోత కోయించాడు. అతను గావించిన పాశవిక చర్యలలో అది ఒకటి మాత్రమే. ఇవి ఆయన ఖ్యాతిని మలినం చేశాయి.

ఇలా ఎందరో ఉన్నత స్థితిని పొందిన పాలకులలో లోపాలున్నాయి.

కాని ఇటువంటి ఏ లోపాలు ఉమర్(రజి)వారిలో కనిపించవు. ఆయన మిక్కిలి దైవభీతితో, వివేకంతో న్యాయమైన పరిపాలన అందించారు.

వక్రీకరణలో పాశ్చాత్యులు దిట్టలు కాబట్టి, ఈ మహానాయకునిపై కూడా ఎన్నో అభాండాలు వేశారు. ఉమర్(రజి)వారి చరిత్ర తెలిసిన వారికి అవి ఎంత ఘోర వక్రీకరణలో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఈ రోజుకీ ఉన్న చరిత్ర పుస్తకాలలో ముస్లిమేతర జాతుల విషయంలో ఉమర్(రజి) కఠినంగా వ్యవహరించినట్లు ఉంటుంది. చరిత్రలో ఈ విషయాలు చేరే సమయానికి మత దురభిమానం తీవ్రంగా ఉండేది. మత దురభిమానంతో ఈ విషయాలు వక్రీకరించబడ్డాయి.

ఉమర్(రజి)వారు తమ పాలనలో క్రైస్తవ 'చర్చ్' గంటలను మోగించ వద్దని కఠినంగా ఆదేశించినట్లు చెబుతారు. భద్రంగా ఉన్న అప్పటి కాలపు పుస్తకాలలో (ఉదా: కితాబుల్ ఖరజ్, తారిఖె తబరి) ఈ విషయాలున్నాయి. వాస్తవానికి ముస్లిములు మస్జిద్‌లలో సలాత్ (నమాజ్) చేసుకునే సమయాలలో మాత్రమే గంటలు మ్రోగించవద్దని ఆదేశించడం జరిగింది.

అదే విధంగా క్రైస్తవులు తమ పిల్లలకు బాప్తిజమ్ ఇవ్వకుండా ఆదేశించారంటారు. ఇబ్నె ఆతిర్ మరియు ఇతరులు వివరించిన దానిని బట్టి తగ్లబ్ తెగ కుటుంబాలు తమ పిల్లలకు బాప్తిజమ్ ఇవ్వకూడదని ఆదేశించినట్లు తెలుస్తుంది. తబరీ వ్రాసిన చరిత్రలో ఆ ఆదేశం గురించి ఇలా చెప్పబడింది : ''ఇస్లామ్ స్వీకరించిన వారి పిల్లలకు బలవంతంగా బాప్తిజమ్ ఇవ్వకూడదు''. ఎందుకంటే ఆ తెగవారి పిల్లలు అప్పటికే స్వచ్ఛందంగా ఇస్లామ్ స్వీకరించడం జరిగింది.

వారి పిల్లలను బలవంతంగా మార్చవద్దని ఆదేశించడం జరిగింది.

ఇదే విధంగా చాలా చరిత్ర పుస్తకాలలో క్రైస్తవులను ఉమర్(రజి)వారు అవమానించినట్లు మరియు చులకన చేసినట్లు వ్రాశారు.

కాని అవి ఏ మాత్రం నిజం కాదు. ముస్లిమేతరులు ఉమర్(రజి) పాలనలో గౌరవాన్ని పొందారేగాని, అవమానాన్ని కాదు. ఈ విషయాలను కూడా సందర్భాన్ని బట్టి, ఉమర్(రజి) జీవిత చరిత్ర శీర్షికలో అందిస్తాము, ఇన్షా అల్లాహ్.

గిబ్బన్ తన పుస్తకం 'The Decline and Fall of the Roman Empire''లో ఉమర్(రజి)వారి గురించి ఇలా చెప్పారు:

ఉమర్(రజి)వారి యొక్క అణుకువ మరియు నిరాడంబరత అబూబకర్ (తొలి ఖలీఫా)వారి సుగుణాల కంటే తక్కువేమీ కాదు.

ఆయన త్రాగేది నీరు. ధరించిన వస్త్రానికి 12 చోట్ల అతుకులు. అలాగే బోధించేవారు. ఈ విజేతకు సామంతుడుగా శిస్తును చెల్లించే పర్షియా దేశపు ప్రతినిధి ఉమర్(రజి)వారిని మదీనా మస్జిద్ మెట్లపై బిచ్చగాళ్ళ మధ్య పడుకుని ఉండగా చూశారు.

దాతృత్వానికి మూలం ఎకానమీ. పెరిగిన ఆర్థిక వనరులు, గతంలో మరియు వర్తమాన కాలంలో సేవలందించే విశ్వాసులకు ఉమర్(రజి)వారి చేత న్యాయమైన మరియు నిరంతర ప్రతిఫలాన్ని ఏర్పరచేలా చేశాయి. తన జీతం కొరకు ఎటువంటి శ్రద్ధ తీసుకోకుండా, ప్రవక్త(స)వారి తండ్రిగారి సోదరుడైన అబ్బాస్(రజి)కి పుష్కలంగా 25వేల దిర్హముల పెన్షన్‌ని ఆయన ఏర్పాటు చేశారు.

బద్ర్ యుద్ధంలో పాల్గొని జీవిస్తున్న వయస్సు పైబడిన యుద్ధ వీరులకు ఒక్కొక్కరికి 5,000 దిర్హములు ఏర్పాటు చేశారు. మరియు చివరిగా అందరికంటే తక్కువగా అందుకున్న ప్రవక్త(స)వారి అనుచరుల పెన్షన్ సంవత్సరానికి 3,000 దిర్హములు.

ఈయన పాలనలో మరియు ఈయన ముందరి ఖలీఫా (అబూబకర్)వారి కాలంలో, ఈ తూర్పు ప్రాంత విజేతలు అల్లాహ్‌కు మరియు ప్రజలకు నమ్మకస్తులైన సేవకులు. ప్రజాధనం శాంతి స్థాపకుడు మరియు యుద్ధం కొరకు ఉపయోగించబడింది.

న్యాయం మరియు దాతృత్వాల వివేకవంతమైన కలయిక ముస్లిమ్‌ల క్రమశిక్షణను నిలబెట్టింది మరియు ప్రజా ప్రభుత్వపు సమానత్వ మరియు పొదుపైన నియమాలతో ఓ యధేశ్చ పాలనను సవ్యంగా నడిపిస్తూ ఓ అరుదైన భావప్రకటనా సౌలభ్యంచే ముస్లిములను ఐక్యంగా ఉంచింది.

ముహమ్మద్(స)వారి అనుచరుల జీవితాలపై 1850లో వ్రాసిన పుస్తకం (Lives of Successors of Mahomet p. 281-82)లో వాషింగ్టన్ ఇర్వింగ్ ఇలా చెబుతున్నారు :

ఉమర్(రజి) యొక్క మొత్తం చరిత్ర ఆయనని గొప్ప మేధోశక్తి గలిగి, స్థిరమైన ధృడత్వం కలిగి, న్యాయ విషయంలో నిష్కగల వ్యక్తి అని తెలియజేస్తుంది. ఇస్లామీయ సామ్రాజ్య స్థాపకుడైన ఈయన ప్రవక్త(స) వారి నుండి స్ఫూర్తిని పొంది, అబూబకర్(రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో ప్రభుత్వ నిర్వహణలో ఆయనకు సహకరించి (వాటి ఫలితంగా) నిష్పక్షపాతమైన పరిపాలన అందించడానికి వివేకవంతమైన చట్టాన్ని స్థాపించి ముస్లిమ్‌ల విజయాలతో శీఘ్రంగా వ్యాపిస్తున్న సామ్రాజ్యమంతా అమలు చేసిన ఈయన ఎవరికన్నా ఎక్కువే.

సైన్యం మధ్యలో ఉండే ప్రముఖ సైనికాధిపతులపై మరియు ఎక్కడో సుదూర ప్రాంతాలలోని విజయ దృశ్యాలపై అతని ధృడమైన హస్తం పరిపాలించడానికి అతనికున్న అసాధారణమైన సామర్థ్యాన్ని తెలియజేస్తున్నాయి.

అతి నిరాడంబరమైన అతని అలవాట్లలోనూ మరియు వైభోవేతమైన ప్రదర్శనలు మరియు సౌఖ్యాలను తిరస్కరించడంలోనూ ఆయన ప్రవక్త(స)వారిని మరియు అబూబకర్(రజి)వారిని అనుకరించారు.

సైనికాధిపతులకి ఆయన వ్రాసే లేఖలలో వారికి అటువంటి రాజనీతిని గుర్తింపజేయాలని ఎడతెగని కృషి చేశారు. ఆయన చెప్పేవారు ''జాగ్రత్త! పర్షియన్ల వైభోగం వారి ఆహారం మరియు దుస్తుల రెండింటిలో ఉంటుంది. మీ దేశపు నిరాడంబరపు అలవాట్లనే ఉంచుకోండి మరియు అల్లాహ్ మిమ్మల్ని విజయులుగా కొనసాగిస్తారు, వాటి నుండి దూరమైతే మీ అదృష్టాలను ఆయన తిప్పివేస్తాడు. ఇది ఆయన యొక్క ధృడమైన పాపభీతితో కూడిన విధానం.

ఇదే ఆయనను తన అధికారుల భోగ విలాసాలను మరియు ఢాంబిక ప్రదర్శనలను తీవ్రంగా శిక్షించేలా చేసింది. ''ఆయన చేసిన అధికార పూర్వక ఆదేశాలలో కొన్ని ఆయన హృదయం మరియు మేధస్సు యొక్క యోగ్యతను తెలియజేస్తాయి. బిడ్డను ప్రసవించిన ఖైదీని బానిసగా అమ్మడాన్ని నిషేధించారు.

ఆయన వారం వారం పంచే ఖజానాలోని అదనంగా ఉండే మిగులు సొమ్మును అగత్యపరుల అవసరాలకు సరిపోయే విధంగా పంచేవారేగాని, తీసుకునే వారి యొక్క యోగ్యతలను పరిగణనలోనికి తీసుకొనేవారు కాదు. ఆయన చెప్పారు, ''**ఈ లోకంలో మన అవసరాలను తీర్చుకోవడానికి అల్లాహ్ మనకు మంచి వస్తువులను అనుగ్రహించారు (అంతేగాని) మన యోగ్యతలకు ప్రతిఫలంగా కాదు. యోగ్యత కలవారి ప్రతిఫలం పరలోకంలో ఇవ్వబడుతుంది.**''

ఇస్లామ్ బోధించిన పరమత సహనం ఈయన పాలనలో కనిపిస్తుంది. ఎదుటి వ్యక్తి అవసరాన్ని గుర్తించి సహాయం చేసేవారు. ప్రజలను ప్రేమించిన పాలకులు చరిత్రలో ఎందరో ఉన్నారు. కాని ఈయన పరిపాలించినట్లు ఎవరూ పరిపాలించలేదనేది వాస్తవం.

ఈయన జీవితచరిత్ర చదివాక, ప్రజా పాలకుడంటే ఉమర్(రజి)వలే ఉండాలని ఎలాంటి వారైనా అంగీకరిస్తారు. మరి ఇంతటి గొప్ప నాయకుడి గురించి పాఠ్య పుస్తకాల (Text Books)లో చోటు ఎందుకు దొరకలేదు?

అవినీతి రహిత సమాజాన్ని, ప్రజల భాగోగులను పట్టించుకునే ప్రజా ప్రభుత్వాన్ని అందిస్తామని, విద్యావంతులు పార్టీలు స్థాపిస్తున్నారు. కాని వీరు ఉమర్(రజి)వారి పరిపాలన గురించి తెలుసుకుంటే, ప్రజలందరూ సుఖసంతోషాలతో బ్రతికే ఓ రాజ్యాన్ని స్థాపించడానికి అవసరమైనటు వంటి *Illustrated Guide* ఉమర్(రజి)అని అతి స్పష్టంగా తెలుసుకో గలుగుతారు.

క్రిందటి సంచికలో ఉమర్(రజి)వారి గురించి వ్రాసిన వ్యాసం పాఠకులకు ఎంతగా నచ్చిందో ఈ సంచికలో 'పాఠకుల అభిప్రాయాలు' లో తెలియజేశాము. ఆ వ్యాసం నుండి పాఠకులు ఏదైతే గ్రహించాలని భావించామో, దాదాపు అందరూ దానిని గ్రహించారని తెలిసింది. అల్‌హమ్‌దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్.

ఉమర్(రజి) వారంటే ఆ రోజుల్లో చాలామందికి హడల్. అటువంటి వారిని ఆయన ఖలీఫాగా ఉన్న కాలంలో ఓ వృద్ధురాలు ఒక విషయంలో ఆయనను అందరి ముందూ నిలదీసి అడిగారు. అటువంటి ధైర్యాన్ని 'ఇస్లామ్' విశ్వాసుల్లో కలుగజేస్తుంది.

అందుకు ఉదాహరణగా దాదాపు ముస్లిములందరూ ఈ సంఘటననే ఉదహరిస్తారు. దానిని బట్టే ఉమర్(రజి)వారి స్థాయిని అర్థం చేసుకోవచ్చు. ఈ సంచిక ప్రెస్‌కు వెళ్ళడానికి ఒక రోజు ముందు ఊరూ, పేరూ వివరాలు లేని ఓ లెటర్ అందింది.

ఆ లెటర్‌లో ఉమర్(రజి)వారి వ్యాసంపై వ్యాఖ్యానిస్తూ మధ్యలో comparative study గురించి వ్రాయడాన్ని బట్టి, వ్రాసిన వారి తాపత్రయం అర్థమైంది. వ్రాసిన మాటలలో పొంతన లేదు. వ్రాసిన విషయాలపై వ్రాసిన వారికే నమ్మకం లేదు. హదీస్‌లపై సరియైన అవగాహన లేదు. ఉమర్(రజి) వంటి నాయకుని వ్యాసంపై మాట్లాడే వారికి ధైర్యం లేదంటే ఆశ్చర్యం వేసింది.

అలెగ్జాండర్ ఎన్నో దేశాలను జయించి గొప్ప సామ్రాజ్యాన్ని ఏర్పరచి ద గ్రేట్ అయ్యారని చరిత్ర పుస్తకాలలో చదువుకున్న వారికి, సామ్రాజ్య వైశాల్యం విషయంలో ఉమర్(రజి)వారిది అంతకంటే ఎక్కువ అనే విషయం తెలియజేయాలని, ఆయన ఏర్పరచిన ఉత్తమ వ్యవస్థల గురించి తెలియజేయాలని, చారిత్రక విషయాలలో చూపబడిన వివక్షను స్పష్టంగా చూపాలని ఆ వ్యాసాన్ని అందించడం జరిగింది.

ఉమర్(రజి)వారితో పోలిస్తే అలెగ్జాండర్ స్థాయి ఎటువంటిదో కూడా స్పష్టంగా చెప్పడం జరిగింది.

**ఉమర్(రజి)వారిని వేరే వ్యక్తులతో పోల్చవద్దని చెబుతూ, ఖుర్'ఆన్ గ్రంథాన్ని మాత్రం వేరే పుస్తకాలతో పోల్చవచ్చు** అని చెబుతుంటే ఉత్తరం వ్రాసిన వ్యక్తికి ఇస్లామ్ పట్ల ఎంత అవగాహన ఉందో మరియు ఎంత గౌరవముందో స్పష్టంగా అర్థమౌతుంది.

Comparative study పై విపరీతమైన అభిమానాన్ని పెంచుకుని వ్యక్తి పూజ (Hero Worship) వైపు మొగ్గుచూపుతున్నారు.

పేరు వ్రాయడానికి ధైర్యంలేనివారు లెటర్ వ్రాయకపోతేనే మంచిది. కంగారుగా చదివేసి, వ్రాసిన విషయాన్ని అర్థం చేసుకోకుండా ఏదో తప్పు ఉందని చెప్పాలని ప్రయత్నించడం వలన అది మమ్మల్ని మానసికంగా కృంగ దీస్తుందేమోనని అనుకోవడం వారి భ్రమ మాత్రమే.

మేము ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లపై ఉన్నంత కాలం ఎటువంటి ఆకాశరామన్న ఉత్తరాలు, ఇన్షా అల్లాహ్, మా విశ్వాసంపై ప్రభావం చూపలేవు.

ఎక్కువమంది నమ్మే ఓ సిద్ధాంతం ఏమిటంటే, పదిమంది పదే పదే ఓ అబద్ధాన్ని సత్యం అని చెబితే, ఆ అబద్ధాన్నే 'సత్యం'గా అందరూ నమ్ముతారని. ఇటువంటి వాటి ప్రభావం కొంత కాలమే పనిచేస్తుంది. అన్ని పరిస్థితులలోనూ మరియు అందరి మీద ఇవి పనిచేయవు. అల్లాహ్‌పై విశ్వాసముండి, సత్యమార్గంలో పనిచేసేవారిపై చీప్ ట్రిక్స్ ఇన్షాఅల్లాహ్ పనిచేయవని తెలుసుకుంటే మంచిది.

కంపేరేటివ్ స్టడీ తప్పు అని ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల ద్వారా స్పష్టమైన ఆధారాలను గత డిశంబర్, జనవరి సంచికలలో అందించిన దగ్గర నుండి, కంపేరేటివ్ స్టడీపై ఆధారపడి బ్రతికే ఎంతో మందికి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ప్రజలు ఇప్పుడు వారిని నిలదీస్తున్నారు. ఖుర్'ఆన్‌కి గాని, ఏదైనా సున్నత్‌గాని మేము వ్రాసింది వ్యతిరేకంగా ఉంటే, ప్రామాణిక ఆధారాలతో తెలియజేయండి. తప్పకుండా స్వీకరిస్తాం. మీ వివరాలు వ్రాయడానికి భయపడకండి.

ఉమర్(రజి)వారి జీవితాన్ని, ఆయన పరిపాలన ప్రపంచ విధానంపై ఎటువంటి ప్రభావాన్ని చూపిందో ఓ పరిశోధనాత్మక సీరియల్ ద్వారా అందించ బోతున్నాము. ఆ సీరియల్ ప్రారంభానికి ముందుగా ఆయన గురించి తెలిపే కొన్ని పరిచయ వ్యాసాలు అందించడం తప్పనిసరి అని భావించాము. ఈ సీరియల్ ప్రజల హృదయాల్లో కలకాలం నిలవాలని అల్లాహ్ పేరుతో కృషి చేస్తున్నాము.

ఇన్షా అల్లాహ్! వచ్చే సంచిక నుండిగాని లేదా ఆ తరువాయి సంచిక నుండి గాని ప్రారంభిస్తాము. మా చిన్ని ప్రయత్నం సఫలం కావాలని దువా చేయండి.

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువ్దాం - 11

## ధర్మం ..... DEEN .....

| తెలుగు / English | ఉచ్చారణ | اردو | عربی |
|---|---|---|---|
| వ్యవహారం,విషయం<br>matter; affair | = (అమ్రున్) | کام، معاملہ، حکم، حالت | أَمْر (pl أُمُور) |
| ధర్మపరాయణత, భయం, రక్షణ<br>piety; fear; protection | = (తఖ్వా) | ڈرنا، بچنا | تَقْوَى |
| సత్యం, నిజం, సవ్యమైనది<br>truth, true; right | = (హఖ్ఖున్) | مطابق، ٹھیک، ثابت | حَقّ |
| అసత్యం, అబద్ధం<br>falsehood | = (బాతిల్) | غلط، ناحق | بَاطِل |
| వివేకం<br>wisdom | = (హిక్మతున్) | حکمت، دانشمندی | حِكْمَة |
| పొగడ్త, స్తుతి, కృతజ్ఞత<br>praise | = (హమ్దున్) | تعریف؛ شکر | حَمْد |
| ధర్మం,న్యాయం,తీర్పు<br>religion; law; judgement | = (దీనున్) | دین، شریعت، بدلہ | دِين |
| పేదల హక్కు, విధిదానం<br>poor-due, charity | = (జకాతున్) | | زَكَاة |
| అమరగతి పొందినవారు, హాజరు<br>present | = (షహీదున్) | گواہ | شَهِيد (pl شُهَدَاء) |
| ప్రార్థన<br>prayer | = (సలాతున్) | نماز | صَلَاة |
| స్వచ్ఛమైనది, స్వయంగా ప్రకాశించేది<br>clear, self-expressive | = (ముబీన్) | ظاہر، بیان کرنے والا | مُبِين |
| కాంతి<br>light | = (నూరున్) | روشنی | نُور |

## విశ్వాసం ..... FAITH .....

| తెలుగు / English | ఉచ్చారణ | اردو | عربی |
|---|---|---|---|
| ఒక్కడు<br>one | = (అహదున్) | اکیلا | أَحَد (fg إِحْدَى) ఇహ్దా |
| ఆరాధ్యుడు<br>god; deity | = (ఇలాహున్) | معبود | إِلٰه (pl آلِهَة) ఆలిహా |
| భాగస్వామి<br>partner, associate | = (షరీకున్) | شریک، ساجھی | شَرِيك (pl شُرَكَاء) షురకా |
| సాక్ష్యం<br>witness | = (షహాదతున్) | گواہی، ظاہر، کھلی | شَهَادَة |
| ఒప్పందం, ప్రమాణం<br>covenant, oath | = (అర్షున్) | شاہی تخت | عَرْش |
| ఒప్పందం<br>covenant | = (అహ్దున్) | عہد، معاہدہ | عَهْد |
| అగోచరమైనది<br>unseen | = (గైబున్) | پوشیدہ، غیر حاضر | غَيْب |
| పుస్తకం<br>book | = (కితాబున్) | کتاب | كِتَاب (pl كُتُب) |
| వచనం<br>word | = (కలిమతున్) | بات | كَلِمَة |
| దైవదూత<br>angel | = (మలకున్) | فرشتہ | مَلَك (pl مَلَائِكَة) |
| ఒప్పందం<br>covenant, treaty | = (మీసాఖున్) | عہد | مِيثَاق |
| ఒక్కడు<br>one | = (వాహిదున్) | ایک | وَاحِد (fg وَاحِدَة) వాహిదా |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.**

***ఈ 11 నెలలలో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 53.6***

ఈ నెల నేర్చుకున్న పదాలు 1557 (అంటే ఈ 24 పదాలు ఖుర్'ఆన్‌లో 1557 చోట్ల చూడవచ్చు)

**source: www.emuslim.com**

ప్రతీ నెలా శాంతిబాటలో ఇస్తున్న 24 పదాలను 30 నెలలపాటు నేర్చుకుంటే ఖుర్'ఆన్‌లోని 64,282 పదాలను నేర్చుకోగలిగినట్లే

**కొంతమంది సోదరులు, తమకు అరబీ చదవడం రాదని, కాబట్టి అరబీ అక్షరాలను ప్రారంభం నుండి మొదలు పెడితే వారికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారికి అరబీ చదవడం నేర్చుకోవడానికి 7 రోజులు చాలు. అరబీ మొదటి నుండి నేర్పడం ఈ శీర్షిక యొక్క ఉద్దేశ్యం కానప్పటికిని, సోదరుల కోరికను కొంతమేరైనా తీర్చాలనే సంకల్పంతో 2వ సంచికలో అరబీ అక్షరాలను, వాటి గుణింతాలను ఇచ్చాము.**

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 12

## ఆచరణలు ..... DEEDS .....

| Telugu | English | Pronunciation | Urdu | Arabic |
|---|---|---|---|---|
| ఆచరణలు, పనులు | actions, deeds, works | = (ఆమాలున్) | اعمال | أَعْمَال |
| మంచి (ఆచరణ) | good (deed) | = (హసనతున్) | نیکی، بھلائی | حَسَنَة |
| చెడు | evil, bad | = (సయ్యిఅతున్ | برائی، گناہ | سَيِّئَة (سَيِّئَات pl) |
| మంచి, మేలు | good, better | = (ఖైరున్) | بہتر، بھلا، نیکی | خَيْر |
| చెడు, మిక్కిలి చెడు | evil, bad, worse | = (షర్రున్) | برائی | شَرّ |
| పాపం | sin | = (ఇస్మున్) | گناہ | إِثْم |
| పాపం | sin | = (జన్‌బున్) | گناہ | ذَنْب (ذُنُوب pl) |
| పాపం | sin | = (జునాహున్) | گناہ | جُنَاح |
| నిషేధం, న్యాయసమ్మతం కాదు | unlawful | = (హరామున్) | ممنوع | حَرَام |
| పేరు | name | = (ఇస్మున్) | نام | إِسْم (أَسْمَاء pl) |
| ప్రసంగం, వాక్కు | discourse; speech | = (హదీసున్) | بات | حَدِيث (أَحَادِيث) |
| మంచి | good | = (తయ్యిబతున్) | پاک | طَيِّبَة (طَيِّبَات pl) |

## అనుగ్రహాలు ..... BLESSINGS .....

| Telugu | English | Pronunciation | Urdu | Arabic |
|---|---|---|---|---|
| అనుగ్రహాలు | favors | = (ఆలా) | نعمتیں | آلَاء pl |
| అధికారి | authority; warrant | = (సుల్‌తాన్) | زور؛ حُجّت؛ سند؛ حکومت | سُلْطَان |
| అనుగ్రహం | grace | = (ఫజ్లున్) | مہربانی | فَضْل |
| నీరు | water | = (మా'ఉన్) | پانی | مَاء |
| ఆధిపత్యం,పరిపాలన | dominion, reign | = (ముల్కున్) | بادشاہت، غلبہ | مُلْك |
| అనుగ్రహం | favor | = (నీ'మతున్) | انعام، فضل | نِعْمَة |
| అందరు | all | = (అజ్‌మ'ఊన్, అజ్‌మ'ఈన్) | سَب کے سَب | أَجْمَعُون، أَجْمَعِين |
| అనుమతి | permission | = (ఇజ్‌నున్) | حکم، اجازت، | إِذْن |
| శిక్ష, శక్తి, దురదృష్టం | punishment; power; adversity | = (బాసున్) | سختی، آفت، لڑائی | بَأْس |
| అందరూ, ప్రతీ ఒక్కరూ | all, everybody | = (జమీ'ఉన్) | سَب، سارے | جَمِيع |
| సమానం, ఒకేస్థాయి | same, equal, level; fair | = (సవా'ఉన్) | برابر | سَوَاء |
| వర్గం | party, group | = (ఫరీఖున్) | گروہ | فَرِيق |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.**

***ఈ 10 నెలలలో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 54.9***

ఈ నెల నేర్చుకున్న పదాలు 1064 (అంటే ఈ 24 పదాలు ఖుర్'ఆన్‌లో 1064 చోట్ల చూడవచ్చు)

*source: www.emuslim.com*

**పై పదాలలో 'ఇస్మున్' అని రెండు పదాలు వచ్చాయి. కాని రెండూ వేర్వేరు. ఒక పదంలో 'س' అనే అక్షరం ఉంది. మరో పదంలో 'ث' అనే అక్షరం ఉంది. అదే విధంగా వీటిని పలకడంలో కూడా చిన్న వ్యత్యాసం ఉంది. వీటిని తెలుగులో వ్రాయడం కష్టం. కాబట్టి మేము ఇచ్చినట్టుగా కాకుండా ఈ పదాలను పలకడం విషయంలో వీటి ఉచ్ఛారణను అరబీ తెలిసినవారిని అడిగి తెలుసుకోండి.**

ఏ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశ్యం మాకు లేదు. అన్ని ధర్మాలను గౌరవిస్తున్నాం

# టెర్రరిజం

- క్రైస్తవ టెర్రరిజం ?
- సిఖ్ఖు టెర్రరిజం ?
- యూదు టెర్రరిజం ?
- కమ్యూనిస్ట్ టెర్రరిజం ?
- హిందూ టెర్రరిజం ?
- ఇస్లామిక్ టెర్రరిజం ?

తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు. ✓

**టెర్రరిజం అనేది ముస్లిములకే స్వంతమన్నట్లు, మీడియా ఎందుకు ముస్లిములనే టార్గెట్‌గా పెట్టుకుంది?**

తీవ్రవాదాన్ని 'ముస్లిము'లుగా మేము ఖండిస్తున్నాం. మానవులకు అపకారాన్ని తలపెట్టే ఏ పనినైనా మేం వ్యతిరేకిస్తాం. మానవులందరూ ఒకే జంట యొక్క వారసులని, ఖుర్'ఆన్ ద్వారా తెలుసుకుని ప్రపంచ ప్రజలందరినీ వారు హిందువులైనా, క్రైస్తవులైన లేక మరే ధర్మానికి చెందిన వారైనా సరే, వారిని మా సోదరులుగానే భావిస్తున్నాం. మా సోదరులపై జరిగే ఎటువంటి హింసనైనా నిర్ద్వందంగా ఖండిస్తున్నాం. కాని మీడియా వారి రెండు నాలుకల ధోరణిని వివరించాలనేది ఈ శీర్షిక యొక్క ప్రధానోద్దేశం కాబట్టి ఈ శీర్షికలో మీడియా భాషనే వాడుతున్నాం. మా భాష మాత్రం కాదు. వేరే ధర్మం వారి ఎవరికైనా బాధ కలిగితే, మీడియా వారి వలన ముస్లిములకు కూడా అంతే బాధ కలిగిందని అర్థం చేసుకుని, కొంత మంది ప్రోద్భలంతో మీ తోటి ముస్లిం సోదరులపై అనాగరికంగా వ్రాస్తున్న మీడియా వ్రాతలను ఖండించమని కోరుతున్నాం.

సెప్టెంబర్ 11, 2001 అమెరికా ట్విన్ టవర్స్‌పై దాడి

11 & 12

## కారకులెవరు?

ఈ దాడిపై చాలా అనుమానాలున్నాయి. ఇది ఉగ్రవాద దాడి కాదని స్వయంగా కొందరు అమెరికన్లే ప్రకటించారు.

"అమెరికా ప్రభుత్వమే తన దేశంలోని టవర్స్‌ని స్వయంగా ఎందుకు కూలుస్తుంది?" అని ప్రపంచంలో ఎవరైనా ఆశ్చర్యపోవచ్చేమోగాని మన దేశస్థులకి మాత్రం అంతగా ఆ విషయంలో ఆశ్చర్యం కలుగకపోవచ్చు.

ఇన్సూరెన్స్ డబ్బు వస్తుందని, ధాన్యం బస్తాలన్నీ తీసివేసి, వాటికి బదులు ధాన్యం మిల్లును ఊకతో నింపి మిల్లును స్వయంగా ఓనరే తగులబెట్టేసిన సంఘటనల వంటివి ఎన్నింటి గురించో ఇక్కడవారికి బాగా తెలుసు. స్వలాభం కోసం స్వంత ఇంటినే తగలబెట్టుకునే మహానుభావులు ఎందరో ఉన్నారు.

అమెరికా ఇరాఖ్‌పై యుద్ధం చేయాలనుకుంది. ప్రపంచానికి చూపడానికి బలమైన కారణమొకటి కావాలి. ఇరాఖ్‌లో విధ్వంసకర ఆయుధాలున్నాయని, ప్రపంచాన్ని సద్దామ్ హుస్సేన్ నాశనం చేసేస్తాడని గోల చేయడమే కాకుండా, తనకు వంతపాడే కొన్ని దేశాల వారి చేత కూడా అరిపించిన ఘనత అమెరికాది.

నిపుణులు మాత్రం అటువంటి ఆయుధాలేమీ ఇరాఖ్‌లో లేవు అన్నారు. అయినాసరే అమెరికా దాడి చేసింది. ఐక్యరాజ్య సమితికి అమెరికాను ఆపగలిగే శక్తి లేదనే విషయం అందరికీ తెలిసిందే. యుద్ధం ముగిసే వరకూ నిజంగానే ఇరాఖ్‌లో ఆయుధాలున్నాయని చెబుతూ ప్రపంచ ప్రజలను నమ్మించ గలిగింది. యుద్ధం ముగిసిన తరువాత ప్రపంచ ప్రజలకు ఓ నిజం తెలిసింది. ప్రపంచాన్ని నాశనం చేసేది అమెరికాయేనని. ప్రపంచంలో విధ్వంసం సృష్టించడానికి అమెరికా ఏమైనా చేయగలుగుతుందని.

ఇరాఖ్‌లో విధ్వంసకర ఆయుధాలు లేవని చివరికి అమెరికా కూడా ప్రకటించవలసి వచ్చింది. అయితే ఆ పాపాన్ని ఎవరో ఒక్కరి మీద నెట్టివేయాలి కాబట్టి, అప్పటి బ్రిటన్ ప్రధాని టోనిబ్లెయిర్‌గారు ఓ ఇరాఖీ టాక్సీ డ్రైవర్‌పై ఈ విషయాన్ని నెట్టివేశాడు. ఆ టాక్సీ -డ్రైవర్‌గారు సద్దామ్ హుస్సేన్ దగ్గర విధ్వంసకర ఆయుధాలున్నాయని చెప్పాడట. ఆ మాటలను ఈ పెద్దలు నమ్మేశారట.

ఈ విధంగా అనుకున్నది సాధించడం కోసం అమెరికా ఎటువంటి దుర్మార్గానికయినా సిద్ధపడుతుందని అందరికీ తెలిసినా సరే, నోరు మెదిపే సాహసం మాత్రం ఏ దేశమూ చేయలేదు. అయినాసరే ఇరాఖ్ విషయంలో నిజా నిజాలు ఆలస్యంగానైనా తెలిసాయి.

**అమెరికాలోని ట్విన్ టవర్స్ కూల్చబడి ఇప్పటికి 9 సంవత్సరాలు అయింది. ఇరాఖ్ విషయంలో నిజాలు బయటపడినట్లే, ట్విన్ టవర్స్ కూల్చివేత విషయంలో కూడా నిజాలు బయటపడ్డాయా?**

ఎందరో అమెరికన్ శాస్త్రవేత్తలు, ఉన్నత విద్యావేత్తలు మరియు మేధావులు ఈ దాడి విషయంలో అనుమానాలను వ్యక్తం చేసారు.

**ఖుర్'ఆన్ గ్రంథ అవతరణ మొదలైన తరువాత 1380 సం॥ల వరకూ 'ఇస్లామిక్' తీవ్రవాదం అనే పదం ఎక్కడా ఉపయోగించ బడలేదు. గత 20 సంవత్సరాలుగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. 'ఇస్లాం'కి తీవ్రవాదానికి అసలు సంబంధమే లేదని వివేకం గలవారికి సులభంగా అర్థమౌతుంది.**

పరిశోధనా వ్యాసాలు వ్రాశారు. రిపోర్ట్ తయారు చేశారు. సాక్ష్యాలన్నింటిని ఉపయోగించి వీడియోలు కూడా తయారుచేశారు. ఇవన్నీ ఇంటర్‌నెట్‌లో ఉన్నాయి.

**అయితే వీరందరి అనుమానాలు నిజమా?**

**చదివాక మీకే అర్థం అవుతుంది ఇన్షాఅల్లాహ్.**

**నిజమని చెప్పి పాఠకులను నమ్మించవలసిన అవసరం శాంతిబాటకు ఎంతమాత్రం లేదు. ఎందుకంటే ఈ దాడిని ఎవరు చేసినా గాని, ఆ చేసిన వారికి ముస్లిమ్‌లకి సంబంధం లేదు. అంతేకాకుండా ఆ దాడి చేసినవారికి మరియు ఇస్లామ్‌కి ఎటువంటి సంబంధమూ లేదు.**

**కాని నిందను 'ఇస్లామ్'పై నెట్టారు కాబట్టి, విశ్లేషించి చెప్పవలసిన బాధ్యత మాపై ఉందని భావించి కీలక వివరాలను ఈ శీర్షిక ద్వారా అందిస్తున్నాము.**

**అమెరికాపై అనుమానాలు కలగడానికి గల ముఖ్య కారణాలు :**

ఒకనాడు రష్యాపై గెరిల్లా యుద్ధం చేయడానికి, ఆఫ్ఘనిస్తాన్ నుండి రష్యా సేనలను తరిమికొట్టడానికి అమెరికా ప్రభుత్వం తన గూఢచారి సంస్థ (CIA) ద్వారా అల్-ఖైదా (database)ని ఏర్పాటు చేసి, మిలియన్ల డాలర్లు ఖర్చుపెట్టి, అల్-ఖైదా సభ్యులకు శిక్షణ (ట్రయినింగ్) ఇచ్చింది. రష్యా సేనలు ఆఫ్ఘనిస్తాన్‌ను వదిలి వెళ్ళిపోయాయి.

అమెరికా కోరుకున్న పని అయిపోయింది? రష్యా సైన్యం ఆఫ్ఘనిస్తాన్ వదిలి పోయింది. కాబట్టి ఇక ఈ అల్-ఖైదా లో ఉన్న సభ్యులు అమెరికాకు ఏమాత్రం అవసరం లేదు. వారికి అమెరికా నుండి అందే డబ్బు సరఫరా ఆగిపోయింది.


రష్యా ప్రభుత్వం ఆఫ్ఘనిస్తాన్ విషయంలో ఎటువంటి తప్పును చేసిందో, అమెరికా ప్రభుత్వం కూడా గల్ఫ్ విషయంలో అదే పనిచేసింది. ఈసారి అల్-ఖైదా అమెరికాపై తిరగ బడింది రష్యాపై ఏ విధంగా తిరగబడిందో అదే విధంగా.

అంటే అల్-ఖైదా అప్పుడూ, ఇప్పుడూ దురాక్రమణలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. దానిలో ఎటువంటి మార్పు లేదు. కాని మార్పు అమెరికా ప్రభుత్వం వైపే ఉంది. ఇంతకు ముందు దాడులు చేయడానికి అమెరికాయే అల్-ఖైదాకు ఆర్థిక సహాయం చేసింది. నేడు వారికి శత్రువయింది.

ఒసామా బిన్ లాడెన్ మీడియాకు అందించిన సందేశంలో **'అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌లో ఎయిర్‌బేస్ ఏర్పాటు చేసుకోవాలని అనుకుంటుంది'** అని చెప్పాడు. ఇలా చెప్పిన బిన్ లాడెన్ మరెవరో కాదు అమెరికా ప్రభుత్వానికి మాజీ స్నేహితుడు. అమెరికాతో కలిసి పనిచేసిన ఒసామాకు అమెరికా వ్యూహాల గురించి బాగా తెలుసు.

"సెప్టెంబర్ 16, 2001 తేదీన ఈ దాడి తాను చేయలేదని రెండవసారి మరలా ఒసామా బిన్ లాడెన్ ప్రకటించాడు. ఆఫ్ఘనిస్తాన్ దేశానికి అధికారిక అతిథిగా ఉన్న ఒసామా బిన్ లాడెన్ తన ప్రకటనలో **'నేను ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నాను మరియు (విధేయత చూపుతానని) అమీరుల్ మోమినీన్ (ముల్లా ఉమర్)కి వాగ్దానం చేశాను. అతను అటువంటి చర్యలకు (దాడులకు) అనుమతించరు".**

**FBI** (ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, అమెరికా) పదిమంది **'మోస్ట్ వాంటెడ్'** లిస్ట్‌లో ఒసామా బిన్ లాడెన్ ఫొటో ఉంది. అతనిపై 25 మిలియన్ డాలర్ల (దాదాపు 125 కోట్ల రూపాయల) బహుమతి కూడా ప్రకటించారు. ఈ ప్రకటన 1999 జూన్ నెలలో విడుదల చేశారు. అతని ఫొటో, అతని బయోడేటాను, రూపు రేఖలతో మొత్తం వివరాలు FBI వారి వెబ్‌సైట్‌లో ఉన్నాయి. ఆసక్తి గల వారు ఇంటర్‌నెట్‌లో చూడవచ్చు : http://www.fbi.gov/wanted/topten/usama-bin-laden




అంటే 1999వ సంవత్సరానికే అమెరికా ప్రభుత్వం కొన్ని దాడులలో ఇతనిని నేరస్తునిగా నిర్ణయించింది. ఆ విషయం FBI ప్రకటన ద్వారా అందరికీ తెలుసు. ఈ విషయం బిన్ లాడెన్‌కీ తెలుసు.

ఎప్పటికీ అమెరికా చేత నేరస్థుడనే ముద్ర బిన్ లాడెన్‌పై పడింది. అమెరికాకు దొరికితే ఎలాగూ చంపుతుంది. శిక్షలు విధించడానికి సాక్ష్యాలు, చట్టాలు, న్యాయం అమెరికాకు ఏమాత్రం అవసరం లేదనేది అందరికీ తెలిసిన విషయమే.

ఈ దాడి అతనే చేసి ఉంటే, తానే చేశానని చెప్పడం వలన అతని లిస్టులో మరో దాడి పెరుగుతుందే గాని ఈ దాడి అతడు చేశాడని నిరూపించ బడినా లేక చేయలేదని నిరూపించబడినా సరే, ఇతను దొరికితే అమెరికా ఎలాగూ చంపుతుంది.

అటువంటప్పుడు ఈ దాడి తానే చేశానని ధైర్యంగా, గర్వంగా చెప్పుకుని ఉండేవాడు కదా!


అలా ఎందుకు చెప్పలేదు?

కాని ఈ దాడి తాను చేయలేదనే చెప్పాడు.

**మరి ఈ దాడి బిన్ లాడెన్ చేయించకపోతే ఎవరు చేయించి ఉంటారు?**

బిల్డింగ్ మొత్తం కుప్ప కూలిపోయేటంతగా పవర్‌ఫుల్ బాంబ్ ఉపయోగించి ఉంటే, బిల్డింగ్ శకలాలు గాలిలో అన్నివైపులా వెదజల్లబడి ఉండేవి కదా! అలా ఎందుకు జరగలేదు.

టి.వి.లో చూస్తున్నప్పుడు, విమానం బిల్డింగ్‌లోకి చొచ్చుకు పోగానే, మంటలు వెదజెల్లబడ్డాయి. కాస్సేపటికి బిల్డింగ్ కుప్పలా కూలిపోయింది.



సాధారణంగా ఎన్నో అంతస్తులున్న పెద్ద బిల్డింగులను కూల్చివేసి అక్కడ కొత్త బిల్డింగులు కట్టవలసి వచ్చినప్పుడు,చుట్టుప్రక్కల బిల్డింగులకు నష్టం కలుగకుండా వరుస డైనమెట్లు ఉపయోగించి, పాత బిల్డింగులను అంచెలంచెలుగా కూల్చి, ఆ తరువాత అక్కడ కొత్త బిల్డింగ్ కడతారు. దీనినే కంట్రోల్డ్ ఎక్స్‌ప్లోజన్ అంటారు. ఆ విధంగా పాత బిల్డింగులను ఏ విధంగానైతే కూల్చి వేస్తారో, అదే విధంగా వరల్డ్ ట్రేడ్ సెంటర్స్‌ని కూల్చివేయడం జరిగినట్లుగా నిపుణుల కథనం.

కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలోనే 114 అంతస్థుల భవనం కూలిపోతుందా? విమాన తాకిడి వలన మరియు దానితోపాటు మంటల వలన కూలిపోయిందని కొందరు నిపుణులు చెబితే, అలా జరిగే అవకాశమే లేదని చాలామంది నిపుణులు చెప్పారు.

**మరో ముఖ్యమైన విషయం :**

ఆ దాడి జరిగిన వారంలో న్యూస్ పేపర్లలో ప్రచురించిన ప్రతీ విషయాన్ని జాగ్రత్తగా స్టడీ చేయడం వలన కొన్ని విషయాలు గుర్తున్నాయి. కాని సాక్ష్యం కొరకు అప్పటి ఆ పేపర్లు లేవు. కాని అల్లాహ్ దయవలన ఇంటర్‌నెట్‌లో అవన్నీ ఉండబట్టీ, ఈ వ్యాసం వ్రాసేటప్పుడు మరలా వాటిని ఒకసారి చదివి, ధృవీకరించుకోవడం జరిగింది.

అమెరికాలో బాగా పేరు ప్రఖ్యాతలున్న CNN టి.వి. ఛానెల్ వారు ప్రసారం చేసిన ఓ విషయం గురించి ఇక్కడ చెప్పాలి. వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూలిపోయిన సందర్భంగా 'పాలస్తీనా'లోని ముస్లిములు స్వీట్లు పంచుకుంటూ విందు చేసుకున్నారని CNN ప్రసారం చేసింది.

వాస్తవానికి ఆ వీడియో 10 సంవత్సరాల క్రితం తీసినది అని, ఇప్పటిది కాదని ప్రపంచవ్యాప్తంగా నిరసనలు తెలియజేయడం పేపర్లో చదవడం జరిగింది. గత 2 సంవత్సరాలుగా 'శాంతిబాట' మాసపత్రిక కోసం టెర్రరిజం శీర్షికకు సమాచారాన్ని సేకరిస్తుండగా, ఇంటర్‌నెట్‌లో CNN వారు ఈ విషయంపై ఇచ్చిన వివరణ కనబడింది.

అందరికీ వార్తలందించే Reuters వార్తా సంస్థ నుండే CNN వారు కూడా సమాచారాన్ని తీసుకున్నారట, అందులో కుట్ర ఏమీ లేదని CNN ప్రకటన విడుదల చేసింది. ఆ విషయంపై చాలా చర్చలు జరిగాయి.

ఏది నిజమో అల్లాహ్‌కే తెలుసు.

ట్రేడ్ సెంటర్స్ కూలిపోవడానికి ముందే ఆ సెంటర్స్‌కు కెమెరాలను ఎయిమ్ చేస్తూ కొందరు యూద మతానికి చెందిన యువకులు (Jews), కూలిన తరువాత ఆనందంతో డాన్సులు చేసారని కూడా సమాచారం ఉంది. మరి ఆ విషయాలను మీడియా ఎందుకు చూపించలేదని చాలామంది ప్రశ్నించడం జరిగింది.

వీటిని బట్టి ఇదంతా ఓ పథకం ప్రకారం జరిగిందని, దానిని ముస్లిములపై నెట్టి వేసి, 'ఇస్లామ్'ని ప్రపంచ ప్రజల దృష్టిలో చెడ్డగా చిత్రీకరించడానికే ప్రయత్నాలు జరిగాయనే అనుమానాలకు బలం చేకూరింది.

అదే విధంగా, దాడి జరగడానికి ముందురోజే వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో పనిచేసే 4000 మంది యూదులు (Jews) శలవు పెట్టినట్లు కూడా చెబుతున్నారు. ఇది నిజమా? కాదా? లేక ఒకవేళ వారు నిజంగా శలవు పెట్టి ఉంటే అది కాకతాళీయంగా జరిగిందా? లేక నిజంగానే జరిగిందా? వీటికి సంబంధించిన ఆధారాలు ఇంకనూ మాకు లభించలేదు.

**ఏది ఏమైనా పై విషయాలు, ప్రజలలో తీవ్రమైన అనుమానాలు కలుగజేశాయనేది మాత్రం వాస్తవం.**

అప్పటి నుండి నేటి వరకూ అమెరికా ప్రభుత్వ ప్రతినిధులు చేసిన వింత ప్రకటనలు ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చాయి.

1. FBI 1999 జూన్ నెలలో ప్రకటన విడుదల చేసి మరియు నవంబర్ 2001లో దానిని మరలా రివైజ్ చేసి 'ఒసామా బిన్ లాడెన్'ని పట్టుకుంటే లేదా సమాచారాన్ని తెలిపితే 25 మిలియన్ డాలర్ల బహుమతి ఇస్తామని ప్రకటించి నప్పుడు, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సైనికాధికారులు బిన్ లాడెన్‌ని చుట్టుముట్టి నప్పటికీ, అతనిని పట్టుకోకుండా వదిలేసి, వెనక్కి వచ్చేశారు ఎందుకు? ఈ విషయాన్ని గత సంవత్సరం నవంబర్ 29వ తేదీన అమెరికా ప్రతినిధే స్వయంగా తన నివేదికలో తెలియజేశారు. (శాంతిబాట గత సంచికలు చూడండి)
2. అంతమంది అమెరికన్ల చావుకి కారణమని భావించిన బిన్ లాడెన్ దొరికినా సరే వదిలేసి, ఇప్పటికీ FBI వారు ఇంటర్‌నెట్‌లో బహుమతి ప్రకటన ఉంచడం హాస్యాస్పదంగా లేదా?
3. ఖైదీలను తీవ్రహింసలకు గురిచేసి పైశాచిక ఆనందాన్ని అనుభవించే అమెరికన్ అధికారులు బిన్ లాడెన్‌ని మాత్రం ఎందుకు వదిలేశారు?

లేక అప్పటికే బిన్ లాడెన్ చనిపోవడం జరిగిందా?

## బిన్ లాడెన్ నిజంగా చనిపోయాడా?

**Bin Laden Already Dead** [http://www.foxmail.com/printer_friendly_story/0,3566,41576,00.html, accessed on 15th October, 2010]

**పై FoxNews రిపోర్ట్‌ను బట్టి ఊపిరితిత్తుల సమస్యతో బిన్ లాడెన్ చనిపోయాడని డిశంబర్ 26, 2001 ప్రచురించిన పై న్యూస్ బట్టి తెలుస్తుంది.**

"The coaliation troops are engaged in a mad search operation but they would never be able to fulfill their cherished goal of getting Usama alive or dead"

ఉసామా బిన్ లాడెన్‌ను సజీవంగాగాని లేదా నిర్జీవంగాగాని పట్టుకోవడం కోసం సైన్యం వెతుకుతుందని, వారి కోరిక ఎప్పటికీ తీరదని 2001వ సంవత్సరంలోనే రిపోర్ట్ చేయబడింది.

అటువంటప్పుడు 'బిన్ లాడెన్'ని చుట్టుముట్టిన తరువాత సైనిక అధికారులు అతనిని ఎందుకు వదిలేశారు? అతను చనిపోయి ఉంటే, చనిపోయాడని శవాన్ని చూపించవచ్చు. ఎందుకు అమాయకుల్లా అతనిని వదిలి వచ్చారు? ఇందులోని మర్మమేమిటి?

అంటే వారికి బిన్ లాడెన్ 'శవం' కూడా దొరకలేదా? శవం కూడా దొరకకపోతే ఆయనను చుట్టిముట్టినట్లుగా ఎలా చెప్పగలిగారు?

పైన తెలిపిన FoxNews రిపోర్ట్‌లో, అతని 'జనాజా'కి 30 మంది అతని సన్నిహితులు, అతని పర్సనల్ గార్డులు కూడా హాజరయ్యారని, ఆ సందర్భంగా గాలిలోకి గౌరవార్థం కాల్పులు కూడా జరిపారని చెప్పడం జరిగింది.

ఆయన శవాన్ని ఎక్కడ పాతిపెట్టారనేది స్పష్టంగా తెలియలేదు.

ఈ రిపోర్ట్‌ను ఖండించినవారు కూడా ఉన్నారు.

IntelCenter డైరక్టర్ Ben N. Venzke గారు The Associated Press వారికి చెప్పిన దానిని బట్టి, అతను చనిపోయి ఉంటే, వెంటనే అల్-ఖైదా ఆ సమాచారాన్ని విడుదల చేస్తుందట. కాబట్టి బిన్ లాడెన్ చనిపోయాడని ప్రచురితమైన ఫాక్స్ న్యూస్ ఐటమ్‌ని ఇంటెల్‌సెంటర్‌వారు ఖండించారు. వాషింగ్టన్‌లోని ఈ ఇంటెల్‌సెంటర్ టెర్రరిజానికి సంబంధించిన సమాచారాన్ని ఇంటర్‌నెట్‌లో ఎప్పటి కప్పుడు గమనిస్తూ, అమెరికా ప్రభుత్వానికి అందిస్తూ ఉంటుంది.

ఇంటెల్‌సెంటర్‌వారు అంత గ్యారంటీగా తెలుసుకోగలిగే వారే అయితే, ఒసామా బిన్ లాడెన్ ఎక్కడ ఉన్నాడో స్పష్టంగా అమెరికాకు చెప్పగలిగి ఉండేవారు. కాని చెప్పలేకపోయారు. అంటే ఆ విషయంలో వారు ఫెయిలయ్యారు. అదే విధంగా బిన్ లాడెన్ చనిపోయాడని విషయాన్ని కనుగొనడంలో కూడా ఫెయిల్ అయిఉండవచ్చు కదా!

అమెరికా ప్రతినిధులు ఇచ్చే పొంతనలేని ఎన్నో ప్రకటనల ద్వారా బిన్ లాడెన్ చనిపోయి ఉండవచ్చు అని బలంగా అనిపిస్తుంది. మరి అమెరికా ఈ విషయాన్ని ఎందుకు ధృవీకరించడం లేదు?

**అమెరికా ఏ దేశాన్ని నాశనం చేయాలని అనుకుంటుందో, అక్కడ బిన్ లాడెన్ ఉన్నాడని చెప్పడం కోసమే, అతను చనిపోలేదని చెబుతుందా? రాక్షసత్వంతో సగటున సంవత్సరానికి కనీసం ఒక లక్షమందిని చంపే అమెరికా ఏమైనా చేస్తుంది, ఏమైనా మాట్లాడుతుంది.**

**"అమెరికాలో ట్విన్ టవర్స్‌పై బిన్ లాడెన్ దాడిచేసాడని చెప్పడానికి, ఎఫ్.బి.ఐ. దగ్గర ఎటువంటి సాక్ష్యమూ లేదు".**

నిజమా? నిజంగా సాక్ష్యం లేదా?

**మరి ఎటువంటి సాక్ష్యం లేకపోతే ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధం ఎందుకు చేశారు? ఈ వ్యాసంలో ముందరి పేజీలో చెప్పడం జరిగింది. బిన్ లాడెన్‌ని పట్టుకుంటే 25 మిలియన్ డాలర్ల బహుమతి ఇస్తామన్న ప్రకటన చదివారు కదా! ఇంటర్‌నెట్ సౌకర్యమున్నవారు అది చూడండి. దానిలో ఇలా ఉంది:**

**CAUTION**

Usma Bin Laden is wanted in connection with the August 7, 1998, bombings of the United States Embassies in Dar es Salaam, Tanzania, and Nairobi, Kenya. These attacks killed over 200 people. In addition, Bin Laden is a suspect in other terrorist attacks through out the world.

**June 1999 Poster Revised November 2001.**

అంటే 2001 నవంబర్ నెలలో పోస్టర్‌ను FBI వారు అప్‌డేట్ చేశారు.

ట్విన్ టవర్స్‌పై దాడి జరిగింది సెప్టెంబర్ నెలలో. ఆ తరువాత రెండు నెలలకి అంటే నవంబర్ నెలలో రివైజ్ చేసిన పై పోస్టర్‌లో ఈ ట్విన్ టవర్స్‌పై దాడి గురించి ఎందుకు చెప్పలేదు? దారుస్సలామ్, టాంజేనియా, నైరోబి, కెన్యాలో అమెరికా ఎంబసీలపై జరిగిన దాడికి ఒసామా బిన్ లాడెన్ కారణమని, వాటివలన 200మంది చనిపోయారని, ప్రపంచంలో జరిగిన మిగిలిన దాడులలో ఇతను అనుమానితుడు అని చెప్పడం జరిగింది. అంటే 2001లో అమెరికాలో జరిగిన దాడిలో ఇతడు కేవలం అనుమానితుడే గాని, ఇతనే ఆ దాడి చేశాడని చెప్పడానికి ఎటువంటి సాక్ష్యం కూడా FBI దగ్గర లేదు అని స్పష్టమౌతుంది. సాక్ష్యం ఉంటే గనుక ఆ పోస్టర్‌లోనే ఆ దాడిని కూడా చేర్చేవారు కదా!

ఈ విషయంపై FBI తో 2006 సంవత్సరంలో ఒకరు మాట్లాడారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, దాడి జరిగిన 5 సంవత్సరాల తరువాత కూడా ఎఫ్.బి.ఐ. దగ్గర సాక్ష్యం లేదు.

**ఈ ఆశ్చర్యరకమైన ఇంటర్వ్యూ వివరాలన్నీ ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో అందిస్తాము.**

వచ్చే సంచికలో ఆ వివరాలు అందించే ముందు ఈ విషయంలో మీడియా పాత్ర గురించి చెప్పడం చాలా ముఖ్యం.

## 9/11 దాడిని ప్రసారం చేయడంలో మీడియా పాత్ర

ఎందరో సైంటిస్ట్‌లు ఇది ఓ పథకం ప్రకారంగా అమెరికా ప్రభుత్వం జరిపిన కుట్రేనని సాక్ష్యాధారాలతో వారు తయారుచేసిన వీడియోలు ప్రజలను ఆలోచింప జేసేవిగా ఉన్నాయి. వీటినే conspiracy theories అని అంటారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే ఇటువంటి వాటిని కాన్స్పిరసీ థీరీలని చెబుతూ ఊరికినే కొందరు కొట్టి పారేస్తారు.

ఇక్కడొక ముఖ్య విషయాన్ని మనం గమనించాలి.

ఉదాహరణకు మనదేశంలో ఓ ముఖ్యమంత్రిగారు ప్రజల మేలుకొరకు ప్రాజెక్టులు కట్టాలని ప్రకటన చేశారనుకోండి. ప్రతిపక్షాలవారు ఆ ప్రాజెక్టులు ప్రజల మేలుకోసం కాదని, ధనార్జన కోసమేనని కొన్ని ఆధారాలను చూపుతారు. అవి నిజం కావచ్చు లేదా కల్పితమైనా కావచ్చు అయినా సరే వాటిని మీడియా వారి ముందుంచుతారు.

ప్రభుత్వం చెప్పిన విషయాల కంటే, ప్రతిపక్షాలు లేవనెత్తిన విషయాలకే మీడియా ఎక్కువ ప్రాముఖ్యత నిస్తుంది. ప్రభుత్వానికి వ్యతిరేకమైన ఇటువంటి వాటిని మీడియా కొట్టి పారెయ్యదు.

అటువంటప్పుడు అమెరికా ట్విన్‌టవర్స్‌పై దాడి విషయంలో మాత్రం శాస్త్రవేత్తల అభిప్రాయాలను, అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే వార్తలను ఎందుకు మీడియా స్వీకరించలేదు. కారణమేమిటి?

ఇంటర్‌నెట్ వెబ్‌సైట్లలో సినిమా హీరోయిన్లపై అశ్లీల దృశ్యాలుండే వెబ్‌సైట్లను వెతికి వెతికి మరీ పట్టుకుని న్యూస్ స్టోరీలు తయారుచేసే వార్తా ఛానళ్ళ వారి కంటికి ఇటువంటి వీడియోలు కనిపించ లేదంటే, ఈ 21వ శతాబ్దంలో ఇంతకు మించిన ఆశ్చర్యకరమైన విషయం ఉంటుందా?

మన దేశంలో కొందరు ఈ విధంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు : అమెరికా ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపింది. అందుకే అమెరికాలో సెప్టెంబర్ 2001 తరువాత, మరలా అటువంటి దాడి జరగలేదు. అమెరికాను మనదేశం ఆదర్శంగా తీసుకోవాలి".

పూర్వం అమెరికాలో ఇటువంటి ఎన్నో ఉగ్రవాద దాడులు జరిగాయి. వారి దేశస్థులే ఆ దేశంపై ఎన్నోసార్లు దాడులు చేశారు. ఆ ఆధారాలను ఇదే శీర్షికలో ముందరి సంచికలలో అందించాము.

ఆఫ్ఘనిస్తాన్‌ని సర్వనాశనం చేసి చేతికి దొరికిన బిన్‌లాడెన్‌ని వదిలేసిన అమెరికా ప్రభుత్వం కంటే చేతకాని ప్రభుత్వం మరొకటి ప్రపంచంలో ఉంటుందా? ఇంత చేతకాని అమెరికా ప్రభుత్వం తమ దేశంలో మరో దాడి జరుగకుండా చర్యలు తీసుకోగలదా? ఇటువంటి దేశాన్ని మన దేశం ఆదర్శంగా తీసుకోవాలట!

అటువంటి దాడి మరొకటి జరగకపోవడానికి అసలు కారణం ఏమిటి?

1. "టవర్స్‌ను కూల్చివేసింది అమెరికా ప్రభుత్వమే కాబట్టి, మరో దాడికి అది పూనుకోలేదు కాబట్టి, అందువల్లనే అక్కడ రెండవ దాడి జరుగలేదు" అని అనుకోవాలా?
2. ఆ దాడిని సాకుగా చూపించి, ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధం చేసింది.
3. ప్రపంచానికి ప్రమాదం కలిగించే ఆయుధాలు ఉన్నాయంటూ ఇరాఖ్‌పై దాడిచేసింది గాని వాస్తవానికి ప్రపంచానికి అమెరికా వల్లనే ప్రమాదముందని, అమెరికా దగ్గర ప్రపంచ వినాశానికి కారణమయ్యే ఆయుధాలున్నాయని అందరికీ తెలిసిపోయింది.

ప్రపంచ దేశాలు ఎందుకు మౌనంగా ఉన్నాయి?

ఇక ఐక్యరాజ్య సమితి వలన ఉపయోగమేమిటి?

ఇండియా, చైనా అభివృద్ధి చెందుతున్నాయని అమెరికా అధ్యక్షుడు భయపడుతున్నాడు. ఇండియాకు ఐక్యరాజ్య సమితి సెక్యూరిటీ కౌన్సిల్‌లో సభ్యత్వ సీటు రాకుండా మోకాలు అడ్డుపెట్టేది అమెరికాయే.

హెడ్లీ తీవ్రవాదని అమెరికా ప్రభుత్వమే చెబుతుంది. హెడ్లీ ఇండియాలో ప్లాన్ చేసే బాంబుదాడుల గురించి మన ఇంటెలిజెన్స్‌కు సమాచారమిస్తుంది. కాని హెడ్లీ ఇటువంటి దాడులు చేయడానికి వీలుగా తమ దేశం నుండి స్వేచ్ఛగా రాకపోకలు జరుపుకోవడానికి కూడా అనుమతినిస్తుంది. హెడ్లీ ఇండియాకు వచ్చినప్పుడు ఆ సమాచారాన్ని ఇండియాకు అందిస్తే, మనదేశంలో అతనిని పట్టుకుని ఉండేవారము కదా!

హెడ్లీ నిజం చెప్పాడు గనుక, అతనికి అమెరికా ప్రభుత్వం శిక్ష తగ్గిస్తుందట. కేవలం ఓ 3 క్రెడిట్ కార్డులు దొంగిలించిన వాడికి, అమెరికా ప్రభుత్వం ఎన్నో సంవత్సరాల జైలు శిక్ష వేసినప్పుడు, ఉగ్రవాదంపై పోరు చేస్తున్నామని చెప్పి, ఉగ్రవాదిగా చిత్రించిన హెడ్లీపై అమెరికా అంత ప్రేమ ఎందుకు చూపుతుంది?

అంటే ఇండియాలో జరిగే దాడులకు సూత్రధారి అమెరికాయేనని ఎటువంటి వారికైనా అనుమానం కలుగక మానదు. హెడ్లీ వంటి అమెరికన్ ఏజెంట్ల ద్వారానే ఇటువంటి దాడులు జరుగుతున్నాయా?

FBI కి హెడ్లీ భార్య 2005లోనే హెడ్లీకి తీవ్రవాద సంస్థలకి సంబంధముందని సమాచారం అందించినా చర్య తీసుకోలేదని, ఆ విషయంలో FBI విఫలమయ్యిందని అంతర్జాతీయ మీడియా ఈ నెలలో బయట పెట్టింది. (అక్టోబర్ 16వ తేదీన 'సాక్షి' దినపత్రికలో, 17వ తేదీన ది హిందూ పేపర్లో ప్రచురితమైంది. ఇంటర్‌నెట్‌లో చాలా వెబ్‌సైట్లలో ఈ విషయాన్నే పోస్ట్ చేశారు).

2001 సెప్టెంబర్‌లో దాడి జరిగిన దగ్గరనుండి, ఉగ్రవాదంపై యుద్ధం చేస్తున్నామని ప్రపంచ ప్రజలకు చెప్పిన అమెరికా, షారూఖ్ ఖాన్ మొ॥న ముస్లిమ్ పేర్లతో ఉన్న భారతీయుల్ని సైతం తనిఖీ చేసిన అమెరికా వారు, తనిఖీ చేయవలసిన అవసరం లేకుండానే, స్వయంగా తీవ్రవాది భార్యే తన భర్త తీవ్రవాది అని అమెరికాలోని FBIకి సమాచారమిస్తే ఎందుకు పట్టించుకోలేదు. వెంటనే అతనిని అరెస్ట్ చేసి ఇంటరాగేట్ చేసి ఆ విషయాలను ప్రపంచానికి ఎందుకు తెలియజేయలేదు?

FBI నిజంగా ఈ విషయంలో ఫెయిలయ్యిందా? లేక హెడ్లీ అమెరికా ఏజెంట్ కాబట్టి అతని గురించి FBIకి ముందే ఈ విషయాలు తెలిసినా సరే నిశ్శబ్దంగా ఉందా? **ఈ నిశ్శబ్దానికి కారణం ఏమిటి?** హెడ్లీతో దాడులు చేయించేది అమెరికా ప్రభుత్వమేనా? అందుకే FBI నిశ్శబ్దంగా ఉందా? కాలమే నిజాలను బయటపెడుతుంది. వేచి చూద్దాం.

మరి అమెరికా వాని నక్కజిత్తులకు ఏమాత్రం తీసిపోని **మీడియాకు** మాత్రం అమెరికాపై అనుమానం కలుగలేదంటే మనం నమ్మగలమా?

**ఇవన్నీ చూస్తుంటే, అమెరికా మరియు ప్రపంచ మీడియా కలిసి ప్రపంచ ప్రజల చెవులలో ఓ పెద్ద పువ్వే పెట్టారు! ఇంకా పెడుతూనే ఉన్నారు. మనం పెట్టించుకుంటూనే ఉన్నాము.**

- డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు, M.S., Ph.D.

మధ్యయుగంలో ...

## ఖైదీల విషయంలో ముస్లిమ్‌ల ప్రవర్తన

**“మరియు అది తమకు ప్రీతికరమైనప్పటికీ, వారు నిరుపేదలకు మరియు అనాథలకు మరియు ఖైదీలకు ఆహారం పెట్టేవారై ఉంటారు.**

**వారు (నిరుపేదలు, అనాథలు, ఖైదీలతో అంటారు) : “వాస్తవానికి మేము అల్లాహ్ ప్రసన్నత కొరకే మీకు ఆహారం పెడుతున్నాము. మేము మీనుండి ఎలాంటి ప్రతిఫలంగానీ, లేదా కృతజ్ఞతలుగానీ ఆశించడం లేదు”**

(ఖుర్ఆన్ 76:8-9)

తమ ఆధీనంలో ఉన్న ఖైదీలకు ఆహారం పెట్టాలి. మనం తినగా మిగిలిన ఆహారం కాదు వారికి పెట్టేది. “**అది తమకు ప్రీతికరమైనప్పటికీ ....**” అని అల్లాహుతాలా చెప్పారు. అంటే ఆ ఆహారం మనకు ఎంతో ఇష్టమైనప్పటికీ వారికి తినిపించాలి.

అది కూడా మనం అల్లాహ్ కొరకు చేసే ఓ ఆరాధనే!

ముస్లిములను 13 సంవత్సరాలపాటు హింసలకు గురిచేసిన కారణంగా వారు మక్కా వదిలి మదీనాకు వలస వెళ్లారు. మదీనాలో ముస్లిములు దాదాపు 330 మంది. అయినప్పటికీ వారిని మక్కా ముష్రిక్‌లు వదలకుండా యుద్ధం చేయడానికి వచ్చారు. ముస్లిముల దగ్గర యుద్ధానికి అవసరమైన ఆయుధ సంపత్తిగాని, అశ్వబలంగాని, ఒంటెలు గాని లేవు. అయినప్పటికీ అల్లాహ్ అనుగ్రహంతో అల్ప సంఖ్యాకులైన ముస్లిములు మక్కావారిపై విజయం సాధించారు.

ఆ విజయంతో పాటు కొంతమందిని యుద్ధ ఖైదీలుగా పట్టుకున్నారు. వారంతా మక్కాలో తమను హింసించిన వారే గనుక, వాళ్ళను కూడా ఇక్కడ హింసించాలని కోరినాసరే, ముహమ్మద్(స)వారు అంగీకరించ లేదు.

వారికి కష్టం కలుగకుండా వారి బాగోగులు చూసుకోవడానికి, వారిని ముస్లిములకి పంచారు.

ఆ విధంగా యుద్ధఖైదీగా తన దగ్గరున్న వ్యక్తికి, ఓ ముస్లిమ్ కడుపు నిండా భోజనం పెట్టి, తాను మాత్రం ఖర్జూరంతో సరిపెట్టుకునేవాడు. ఎందుకంటే వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే.

ఖైదీల పట్ల దయతో వ్యవహరించమని ముహమ్మద్(స)వారు తన అనుచరులను ఆదేశించారు.

ఖైదీల బంధువులు కొంత పైకమిచ్చి, తమ వారిని విడుదల చేయించుకున్నారు. డబ్బు చెల్లించలేని **ఖైదీలలో ప్రతీ ఒక్కరూ మదీనాలోని పదేసిమంది బాలబాలికలకు చదువు నేర్పిస్తే, వారిని విడుదల చేశారు.** చదువురాని ఖైదీలను కూడా ఆ తరువాత విడుదల చేసేశారు.

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం :

**బద్ర్(యుద్ధం) రోజున, యుద్ధ ఖైదీలు తీసుకురాబడ్డారు. అబ్బాస్ కూడా తీసుకురాబడ్డారు పై వస్త్రం లేకుండా. ప్రవక్త (ముహమ్మద్- స) వారు అతని(కి సరిపడే) చొక్కాగురించి చూశారు. అబ్దుల్లా బిన్ ఉబై చొక్కా సరిపోతుందని తెలిసింది. కాబట్టి ప్రవక్త(స) స్వయంగా అతనికి తొడిగించారు. ఆ కారణం చేతనే ప్రవక్త (ముహమ్మద్ - స)వారు తన చొక్కాను తీసి అబ్దుల్లాహ్‌కు తొడిగించారు. ఇబ్నె ఉమర్ చెప్పారు: అతడు ప్రవక్త(స)వారి కొరకు చేశాడు కనుక ప్రవక్త(స)వారు అతనికి బహుమతిని ఇవ్వాలని అనుకున్నారు.**

**(సహీహ్ బుఖారీ, నెం. 3008, పుస్తకం 56, అధ్యా.42, సంపుటి 4)**

తమకు తిండి, బట్ట ఇబ్బందిగా ఉన్నాసరే, తమ ఆర్థిక పరిస్థితి బాగుండక పోయినాసరే, తమ ఖైదీలకు మాత్రం లోటు రానివ్వలేదు ముస్లిములు. వీరంతా ఖుర్ఆన్ ఆదేశాలను, ముహమ్మద్(స)వారి బోధనలను ఆచరించేవారు.

ఆధునిక యుగం లో ...

## ఖైదీల విషయంలో అమెరికన్ల ప్రవర్తన

1946 మరియు 1948 మధ్య కాలంలో అమెరికన్ వైద్యులు సుమారు 700 మంది ఓ జైలులో ఖైదీలకు, మానసిక వికలాంగులకు సుఖ వ్యాధులను అంటింపజేశారు. పెన్సిలిన్ ప్రభావం సిఫిలిస్‌పై ఏ విధంగా పనిచేస్తుందో పరీక్షించడానికి ఆ విధంగా వారికి వ్యాధిని తగిలించారు. సిఫిలిస్ అనే వ్యాధి వ్యభిచారం ద్వారా సంక్రమించే వ్యాధి. దీనినే సుఖవ్యాధి అని కూడా అంటారు. ఈ వ్యాధి కలిగిన వేశ్యలకు అధికారులు డబ్బు ఇచ్చి, తమ ఖైదీలతో పడుకునేలా చేశారు.

మగవాళ్ళకు ఆ వ్యాధులను అంటించడంలో వేశ్యలు సఫలం కాకపోతే, మగ ఖైదీల మర్మాంగాలపై, ముఖాలపై, చేతులపై గాట్లు పెట్టి దానిపై బాక్టీరియాను ఉంచేవారు. కొందరికయితే ఇంజెక్షన్ ద్వారా ఎక్కించేవారు. ఆ వ్యాధి సోకినవారికి యాంటీ బయోటిక్ మందులను ఇచ్చేవారు. అయితే ప్రతీ ఒక్కరికీ నయం అయినదీ లేనిదీ స్పష్టం కాలేదని చెబుతూ, ఈ విషయాలను వెలుగులోకి తీసుకువచ్చిన ఓ మహిళా ప్రొఫెసర్ చెప్పారు.

ఈ న్యూస్ న్యూయార్క్ టైమ్స్‌లో అక్టోబర్1న ప్రచురితమైంది. మన జాతీయ తెలుగు దిన పత్రికలో మరియు ఇతర పత్రికలలో కూడా ప్రచురితమైంది. ఈ విషయాలు వెలుగులోకి రావడంతో 64 సంవత్సరాల తరువాత దీనిపై అమెరికా ప్రభుత్వం క్షమాపణలు కోరింది. ఆలస్యమైనా నిజాలు తప్పక తెలుస్తాయి.

అమెరికన్ నల్లజాతీయులను మాత్రం ఈ వ్యాధిబారిన పడేసి, వారికి దశాబ్దాల తరబడి ట్రీట్‌మెంట్ ఇవ్వలేదని కూడా రిపోర్ట్ చేయబడింది. ఇవి జరిగిన మరో 20 సంవత్సరాలకి మతి స్థిమితం లేని పిల్లలకు హెపటైటిస్ రోగాన్ని, కొందరు వృద్ధులకు లైవ్ కాన్సర్ కణాలను ఇంజెక్ట్ చేయడం జరిగిందని కూడా రిపోర్ట్స్ ఉన్నాయి.

**మధ్యయుగకాలాన్ని విమర్శిస్తూ, ముస్లిములను రాక్షసులుగా**

**చిత్రీకరించే నేటి కీకరకాయ మేధావులు, చరిత్రకారులు,**

**విద్యావంతులను మేమడిగే ప్రశ్న ఒక్కటే.**

**ఈ కాలమ్‌లో వివరించిన విషయాలను బట్టి,**

**ఏ కాలం గొప్పది?**

**ఎవరి ప్రవర్తన గొప్పది?**

**కాలమెప్పుడూ మంచిదే.**

**అన్ని కాలాలలోనూ**

**మంచివారూ ఉన్నారు. చెడ్డవారూ ఉన్నారు.**

**ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల ప్రకారం**

**జీవించేవారు ఎప్పుడూ మంచివారే! మానవత్వం కలిగినవారే!**

**ఇస్లామ్‌పై మీలో ఉన్న అపోహలను చెరిపేయండి.**

'శాంతిబాట' తొలి సంచికలలో ముహమ్మద్(స)వారి ఓ బోధనను తెలియజేశాము.

ఓ వ్యక్తి తోటివారికి కష్టం కలిగిస్తుందని ఓ ముళ్ళకంపను ప్రజలు నడిచే దారి నుండి తొలగించాడు. అందుకు ప్రతిఫలంగా అతనికి అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదించాడు. ప్రతీ ముస్లిమ్ నమాజ్‌లు చేసేది, ఉపవాసాలుండేది, దానాలు చేసేది ఆ స్వర్గం కొరకే. అటువంటి స్వర్గాన్ని సునాయాసంగా ఓ ముళ్ళకంపని దారిలో నుండి తొలగించి పొందగలిగాడు.

ఆ ప్రతిఫలం అతనికి లభించడానికి కారణం అతని సంకల్పమే! తోటివారికి ముళ్ళు గుచ్చుకోకూడదని, తోటివారి మేలును కోరడం ఎంత గొప్పదో ఆ బోధన తెలియజేస్తుంది. ఇదే సంచికలో ఖుర్బానీ వ్యాసంలో అకారణంగా ఓ పక్షిని చంపకూడదని, అంతేగాకుండా జంతువుల ముఖాన్ని వికృతం చేయకూడదని ముహమ్మద్(స)వారు ఆదేశించిన విషయాలను తెలియజేశాము.

ఇస్లామ్ (శాంతి) ప్రేమను బోధించేదేగాని ద్వేషాన్ని కాదు.

ముహమ్మద్(స)వారి ఆదేశాలను పాటించే ఏ ముస్లిమ్ కూడా వ్యతిరేకించలేడు.

జంతువు ముఖాన్నే వికృతంగా చేయకూడదు అంటే, జంతువుకంటే మేలైన మనిషి ముఖాన్ని ఎలా వికృతం చేయగలడు? ముఖం మీద కొట్టవద్దని కూడా చెప్పారు.

కాబట్టి బాంబులు వేసి అకారణంగా మనుషులను చంపేవారు, దాడులతో మనుషులను వికృతంగా మార్చేవారు ఎవరైనా సరే, వారు ముస్లిములు ఎట్లా కాగలుగుతారు?

ఎవడో ఇస్లామ్ పేరు చెప్పి, దాడిచేస్తే దానికి బాధ్యత ఇస్లామ్ వహించాలా?

**కనీస జ్ఞానమున్న వారెవ్వరూ ఇస్లామ్‌తో తీవ్రవాదాన్ని కలిపి మాట్లాడరు.**

ఇస్లామ్ అంటే 'శాంతి'. శాంతి స్థాపనకు ఆచరణీయమైన మంచి మార్గాన్ని చూపింది.

**(64వ పేజీ తరువాయి ...)**

حـدَّثَنَا عَبْدُ العَزِيزِ بنُ عَبْدِ اللهِ : حدَّثَنا اِبْرَاهِيمُ عَنْ أنَسٍ :
أنَّ عُثـمـانَ دَعـا زَيْـدَ ابـنَ ثـابِتٍ، و عَبْدَ اللهِ بنَ الزُّبَير، و
سَـعِيدَ ابنَ الحَارِثِ ابنِ هِشامٍ فَنَسَخُوها في المَصَاحِفِ.
وقـالَ عُثمانُ للرَّهْطِ القُرَشِيِّيْنَ الثَّلاثَةِ : اِذَا اخْتَلَفْتُم أنْتُمْ
وزَيْـدُ بـنُ ثـابِـتٍ فـي شـيْءٍ مِنَ القُرْآنِ فاكْتُبُوهُ بِلِسانِ
قُرَيْشٍ فاِنَّما نَزَلَ بِلِسانِهِمْ، فَفَعَلُوا ذٰلکَ.

అనస్(రజి) ఉల్లేఖనం : జైద్ బిన్ సాబిత్, అబ్దుల్లా బిన్ జుబైర్, సయీద్ బిన్ ఆస్ మరియు అబ్దుర్రహ్మాన్ బిన్ హిషామ్ లను ఉస్మాన్(రజి) పిలిచారు. మరియు పుస్తక రూపంలో ఖుర్'ఆన్ వ్రాత ప్రతులను చాలా కాపీలు వ్రాశారు. ఉస్మాన్ (అ) ముగ్గురు ఖురైషీ వర్గానికి చెప్పారు, 'జైద్ బిన్ సాబిత్‌తో మీకు ఖుర్'ఆన్ యొక్క ఏదైనా విషయంపై తేడా వస్తే, దానిని ఖురైషీ భాషలో వ్రాయండి, ఖుర్'ఆన్ వారి భాషలో అవతరించింది కాబట్టి'. కాబట్టి వారు ఆ ప్రకారమే చేశారు. (జైద్ బిన్ సాబిత్(రజి) అన్సార్. ఖురైషీ కాదు)

**(సహీహ్ బుఖారీ, 3506, పుస్తకం 61, అధ్యా. 3, సంపుటి 4)**

ఈ సంచికతో

'శాంతిబాట'

మాసపత్రిక ఓ సంవత్సరాన్ని

పూర్తి చేసుకుని 2వ సంవత్సరంలో

ప్రవేశించేలా చేసిన

అల్లాహుతాలాకు

మా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ప్రామాణిక

ఇస్లామీయ సమాచారాన్ని

అందించ గలిగేలా

మాకు తోడుగా ఉన్న

పాఠక సోదర సోదరీమణులపై

అల్లాహ్ శ్రేయోశుభాలను

వర్షించుగాక! (ఆమీన్)

తేది 10 అక్టోబర్ 2010 న శాంతిబాట వెబ్సైట్

***www.saanthibaata.net***

ప్రారంభించడం జరిగింది.

ఇక ప్రపంచంలోని ఏ మూల మూలనున్నా సరే శాంతిబాట పత్రికను చదువుకోవచ్చు. అల్-హమ్దులిల్లాహ్!

ఇతర దేశాలలో నున్న మీ స్నేహితులకు మరియు బంధువులకు ఈ వెబ్సైట్ గురించి తెలియజేయండి.

మాకు అల్లాహ్ చాలు

అల్లాహ్ అనుగ్రహించినంత కాలం

ఈ పత్రిక ద్వారా

మా ధార్మిక సేవ

కొనసాగుతూనే ఉంటుంది.

ఎన్నో ఆసక్తికరమైన

విషయాలు

మరెన్నో

పరిశోధనా వివరాలను

ఇన్షాఅల్లాహ్

మీకు అందిస్తాము.

- శాంతిబాట టీమ్

9

*చదవక ముందు 'కాకరకాయ' చదివిన తరువాత 'కీకరకాయ'*

# మధ్యయుగ కాలం

## *Medieval Times*

యూరప్ చరిత్రకు సంబంధించి 5వ శతాబ్దం నుండి 15వ శతాబ్దం మధ్య కాలాన్నే మధ్యయుగ కాలం అంటారు. ఈ వ్యాసానికి పెట్టిన సబ్‌టైటిల్ 'చదవక ముందు కాకరకాయ చదివిన తరువాత కీకరకాయ'. ఈ తెలుగు సామెత గురించి చాలామందికి తెలుసు.

ఏ చదువూ లేక ముందు 'కాకరకాయ'ను 'కాకరకాయ' అని పిలిచేవ్యక్తి, చదువు నేర్చుకున్నాక 'కీకరకాయ' అన్నాడట. జ్ఞానం పెరగడానికి బదులు, ఉన్న జ్ఞానాన్ని పోగొట్టుకునే వారికి ఉపయోగించే ఈ సామెతను నేడు మన 'మీడియా'వారికి ప్రత్యేకంగా వాడవచ్చు. ఇటీవల (తేదీ 15.09.2010) ఓ జాతీయ ఇంగ్లీష్ పేపర్లో సెంటర్ పేజీలో ఓ వ్యాసం ప్రచురించబడింది. ముస్లిములను చాలా తక్కువ చేసి చూపించడానికి ఏ విషయం దొరుకుతుందా అని గోతికాడ గుంటనక్కలా మన మీడియా ఎదురు చూస్తూ ఉంటుంది. దానికి ఉదాహరణే ఆ పేపర్లో ప్రచురితమైన వ్యాసం.

ఆ వ్యాసం వ్రాసిన సదరు వ్యాసకర్తగారు తన శాయశక్తులా ప్రయత్నించారు. కాని తాను పక్షపాతం లేకుండా వ్రాశానని అందరిని నమ్మించడానికి ఓ చిన్న పేరాలో ఓ చోట హిందూ ఫండమెంటలిస్ట్ అనే ఓ పదాన్ని కూడా ఇరికించాడాయన. విషయమేమిటంటే -

ఓ ఇద్దరు ముస్లిమ్ యువకులు ఓ లెక్చరర్‌పై దాడిచేశారు. ఆ లెక్చరర్ తయారుచేసిన ఓ కొచన్ పేపర్లో ప్రవక్త ముహమ్మద్(స)వారిని అవమానించడం వలన ఆ దాడి జరిగినట్లు చాలాకాలం క్రితం పేపర్లో వచ్చింది. ఆ లెక్చరర్ పేరు జోసెఫ్. కాలేజీవాళ్ళు కూడా అతనిని ఉద్యోగం నుండి తీసివేశారు. ఈ సంఘటన జరిగింది కేరళ రాష్ట్రంలో.

ముహమ్మద్(స)వారిని కేరళ రాష్ట్రంలోనే కాదు, మన రాష్ట్రంలో కూడా ఓ మతవర్గంవారు అవమానిస్తూనే ఉన్నారు. ఆ మత వర్గానికి చెందిన టీచర్లు/ప్రొఫెసర్లు ఇస్లామ్‌పై పాఠ్యపుస్తకాలలో ఎటువంటి వ్రాతలు వ్రాస్తున్నారో మాకు పాఠకులు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో ఎవ్వరూ ఎటువంటి దాడికి పూనుకోలేదు. **చట్టాన్ని చేతుల్లోకి తీసుకోక పోవడం మంచి పరిణామమే! అభినందించాలి.**

అతి చిన్న విషయానికే గొడవపడి, ఆవేశంలో ఒకరినొకరు చంపుకున్న సంఘటనలెన్నో ప్రపంచంలో జరుగుతూనే ఉన్నాయి.

భారతదేశంలో మనకిష్టమైన వారినెవరినైనా అవమాన పరిచినప్పుడు, చట్టపరంగా అటువంటి వారిపై చర్య తీసుకునే విధంగా మన రాజ్యాంగం మనకు హక్కును కల్పించింది. దాడిచేయకుండా నిరసన తెలపవచ్చు. కనీసం నోటితో నిరసన తెలపడానికి కూడా ప్రయత్నించడం చేతకాని వారు కూడా మన సమాజంలో చాలా మందే ఉన్నారు.

అసలు వాస్తవం ఇలా ఉంటే, సదరు వ్యాసకర్తగారు ఇలా వ్రాశారు:

**"వారు ఇంకా మధ్యయుగ కాలంలోనే జీవిస్తున్నారు. వారికి మానవత్వ విలువలను గౌరవించడం తెలియదు".**

అతని వ్యాసాన్ని చదివాక, శాంతిబాట టీమ్‌లోని ఒకరు వెంటనే ఆ వ్యాసాన్ని ఖండిస్తూ ఎడిటర్‌గార్కి అదే రోజున ఈమెయిల్ ద్వారా అభిప్రాయాన్ని పంపడం జరిగింది. సదరు పేపర్‌వారు ఒకే వ్యాసంపై వచ్చే అభిప్రాయాలను ఎన్నో రోజులపాటు ప్రచురిస్తూ ఉంటారు. కాని ఈ వ్యాసం విషయంలో మాత్రం అభిప్రాయాలను ఒక్కరోజుకే పరిమితం చేశారు. మా అభిప్రాయాన్ని కూడా ప్రచురించలేదు.

బహుశా విమర్శలు ఎక్కువ వచ్చి ఉంటాయి. ఆ విమర్శలను ప్రచురిస్తే వారి ప్రతినిధి వ్రాసిన వ్యాసం ఎంత తక్కువ స్థాయిలో ఉందో అందరికీ అర్థమౌతుంది లేదా ప్రజలలో ఇస్లామ్ గురించి పాజిటివ్ అభిప్రాయం ఏర్పడే అవకాశముంది. ఆ రెండూ కూడా వారికి రుచించవు కదా! ఆ వ్యాసాన్ని విమర్శిస్తూ వ్రాసిన కొన్ని అభిప్రాయాలలో, ఓ వ్యక్తి సరియైన విధంగా అభిప్రాయపడ్డారు. 'లెక్చరర్' బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, అతను అమాయకుడేమీ కాదని అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

**మధ్యయుగ కాలమైనా, మరి ఏ కాలమైనా సరే, కాలమెప్పుడూ మంచిదే. అన్ని కాలాలలోనూ మంచివారూ ఉన్నారు, చెడ్డవారూ ఉన్నారు.**

1947వ సంవత్సరానికి ముందు, భారతీయుల దృష్టిలో బ్రిటిష్‌వారు దుర్మార్గులు. కాని ఇప్పుడు వారంటే భారతీయులకు ఎనలేని గౌరవం. బ్రిటిష్ వారికి మనం బానిసలుగా ఉన్నప్పుడు, ఆ కాలం మనకు కష్టకాలం. అదే కాలం బ్రిటిష్‌వారికి గర్వపడే కాలం.

7వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకూ ఉన్న కాలాన్ని యూరోపియన్లు అంధకార యుగంగా వర్ణిస్తారు. కారణం ఆ కాలంలో వారు నిజంగా అంధకారంలోనే ఉన్నారు. కాని అదే కాలంలో 'శాస్త్రీయ విజ్ఞానం'లో విప్లవాత్మకమైన మార్పులను ముస్లిమ్ శాస్త్రవేత్తలు తీసుకు వచ్చారు. ప్రజాపాలనలో ఉత్తమమైన వ్యవస్థను ముస్లిములు ప్రపంచానికి పరిచయం చేశారు. ప్రపంచపు తొలి సైంటిస్ట్ 'ఇబ్నె అల్-హైతమ్' వంటివారు సిద్ధాంతాలతో కాలం వెళ్లబుచ్చే సైన్స్‌కు ప్రయోగాలను తోడుచేసి ఆధునిక సైన్స్‌కు పునాది వేశారు. అన్ని రంగాలలోనూ ఆనాడు విద్యానిలయాలు **'ముస్లిముల మదరసాలే'**. ఆ కాలంలోనే తొలి యూనివర్సిటీలు ముస్లిమ్ సామ్రాజ్యంలో స్థాపించబడ్డాయి. ఉచితంగా చదువును అందించడమే కాకుండా, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను కూడా ఇచ్చేవారు.

ముస్లిమ్ స్పెయిన్ నుండి ఈ విజ్ఞానాన్ని నేర్చుకున్న యూరోపియన్లు

అభివృద్ధి చెందారు. యూరోపియన్లు అంధకారంలో ఉన్న ఆ కాలం ప్రపంచమంతటికీ అంధకారం కానే కాదు. ముస్లిములకది స్వర్ణయుగం.

'ఇస్లామ్'కి దూరమైన ముస్లిమ్‌లు ఈనాడు ఎంతో వెనుకబడ్డారు.

**కాబట్టి కాలమెప్పుడూ మంచిదే.**
**మనుష్యులలోనే మంచివారూ చెడ్డవారూ ఉంటారు.**

దొంగతనం చేస్తే ఇస్లామ్ చట్టం ప్రకారం చెయ్యి నరుకుతారని, కాబట్టి వీరు మధ్యయుగ శిక్షలను అమలుచేస్తున్నారని, వీరికి ఆధునిక నాగరికత తెలియదని విమర్శించే వారెందరో ఉన్నారు.

మరి **దొంగతనం చేయడం ఆధునిక నాగరికతకు చిహ్నమా?** కష్టపడి చెమటోడ్చి సంపాదించుకున్న వ్యక్తి సంపదను, ఓ వ్యక్తి దొంగిలిస్తే, ఆ కష్టపడ్డ వ్యక్తి ఎంత బాధకు గురవుతాడో నేటి ఆధునికులకు తెలియదా? ఆ విధంగా ఓ వ్యక్తిని బాధపెట్టడం మంచి నాగరికత అనిపించు కుంటుందా?

దొంగతనం చేస్తే చేతిని ఖండించే దేశాలలో, ఎంతమందికి ఆ విధంగా చేతులు నరకబడ్డాయో తెలుసుకోవాలని ఎప్పుడైనా అనుకున్నారా? అటువంటి శిక్ష విధించవలసిన పరిస్థితి ఆయా దేశాలలో ఓ 100 సంవత్సరాలలో ఎన్నిసార్లు వచ్చి ఉంటుంది?

అటువంటి కఠిన శిక్షలు అమలుపరిచే చోట విచ్చలవిడిగా దొంగతనాలు జరిగే అవకాశం ఉందా? **లేదు.**

పేదవాని కష్టాన్ని దోచుకు తింటూ అవినీతితో ధనవంతులౌతున్న ఇప్పటి మనకాలం ఆధునిక కాలమా? కానే కాదు. అయినప్పటికీ ఆధునిక నాగరికత అని గొప్పగా చెప్పుకుంటూ స్వయంగా తమను తాము మోసం చేసుకుంటున్నారు.

చరిత్రలో ఒక కాలాన్ని అయితే రాతియుగంగా వర్ణిస్తూ, అప్పటి మనుష్యుల నాగరికతను భయంకరంగా వర్ణిస్తారు. అంటే శతాబ్దాలు గడిచేకొద్దీ మానవునిలో మానవత్వం పెరుగుతూ వస్తుందని వారి భావం.

మరి ఈ ఆధునిక కాలంలో మానవత్వ విలువలున్నాయా?

కొన్నిచోట్ల కేవలం ఓ 100 రు॥ల కోసమే హత్యకు సిద్ధపడేవారు ఉన్నారనేది నమ్మలేని ఓ పచ్చి నిజం.

అమెరికా నాయకులకు గల్ఫ్ దేశాల ఆయిల్‌పై కన్నుపడింది. ఇరాఖ్‌లో వినాశకర ఆయుధాలున్నాయంటూ ప్రపంచానికి అబద్ధం చెప్పి, స్వయంగా **వినాశనాన్ని సృష్టించిన** అమెరికా వారి **నాగరికత** అంటే మన దేశంలోని కొంతమందికి ఎంతో మోజు. బాంబులతో ఇరాఖ్ దేశాన్ని నాశనం చేయడమే కాకుండా అక్కడి పర్యావరణాన్ని కలుషితం చేయడం ఆధునిక నాగరికతకు చిహ్నమా? లేక **రాక్షసత్వానికి చిహ్నమా?**

నీచమైన అక్రమ సంబంధాలు, వ్యభిచారం ప్రస్తుత కాలంలో బాగా ఎక్కువై పోయాయి. ఇది నేటి ఆధునిక నాగరికత. దైవప్రవక్త లూత్(అ)వారి కాలంలో హెూమో సెక్సువల్స్‌పై అల్లాహ్ యొక్క ఆగ్రహం పడి వారు నాశనమయ్యారు. కాని ఆ నీచకార్యాన్ని నేడు చాలా దేశాలలో చట్టబద్ధం చేశారంటే ఈ నాగరికత అభివృద్ధిని సూచిస్తుందా? లేక పతనాన్ని సూచిస్తుందా?

కాని భార్యాభర్తల మధ్య ఉండే పవిత్రబంధం ప్రకారం జీవిస్తే, వారు మధ్యయుగ కాలంలో జీవిస్తున్నట్లుగా భావిస్తున్నారు.

అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం ఆధునికంగానూ - నిజం చెప్పడం, మంచిగా బ్రతకడం మధ్యయుగం గానూ వర్ణించడం హేయంగా అనిపించడం లేదేమో!

ఈ మధ్య కాలంలో మనరాష్ట్రంలో ఎందరో అమ్మాయిలపై యాసిడ్ దాడులు జరిగాయి. ఎన్నో మానభంగాలు జరుగుతున్నాయి. ఆ అపరాధం చేసినవారిని వెంటనే బహిరంగంగా ఉరితీస్తే, ఆ శిక్ష గురించి అందరికీ తెలిసేలా చేస్తే, ఆ శిక్ష విధించడంలో పక్షపాతం వహించకుండా న్యాయంగా వ్యవహరిస్తే ఇటువంటి దారుణాలు, ఇన్షాఅల్లాహ్ ఆగిపోతాయి. కాదంటారా?

దొంగతనం చేసినప్పుడు ఇస్లామ్ ప్రకారం శిక్ష విధించే విషయంలో ఓ వాస్తవ సంఘటనను ఇక్కడ అందిస్తున్నాము.

దైవప్రవక్త **ముహమ్మద్**(స)వారు తన కుమార్తె '**ఫాతిమా**(రజి)వారిని' తనలోని ఓ భాగంగా చెప్పేవారు. ఆ కుమార్తెపై ఆయనకు చాలా ప్రేమ.

ఓ సారి మఖ్జూమ్ (అరబ్) తెగకు చెందిన ఒక స్త్రీ దొంగతనం చేసింది. దైవప్రవక్త(స) ఆమెకు హస్తఖండన శిక్ష విధించారు.

దానిపట్ల ఖురైష్ తెగవాళ్లు తీవ్ర ఆందోళన చెందారు. వారు పరస్పరం సంప్రదించుకుని ఈ విషయంలో దైవప్రవక్త ముహమ్మద్(స)తో ఎవరు మాట్లాడుతారు అని అన్నారు. అప్పుడు కొందరు సలహా ఇస్తూ ఈ విషయమై దైవప్రవక్త(స)తో మాట్లాడగల వారు హజ్రత్ ఉసామా బిన్ జైద్(రజి) మాత్రమేనని, ఆయన్ని దైవప్రవక్త(స) అమితంగా అభిమానిస్తారని అన్నారు. చివరికి వారంతా హజ్రత్ ఉసామా(రజి)ని దైవ ప్రవక్త(స)తో మాట్లాడి ఈ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు ఒప్పించారు. హజ్రత్ ఉసామా(రజి) దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి వారి విన్నపాన్ని ఆయన ముందుంచారు. అది విని దైవప్రవక్త(స) హజ్రత్ ఉసామా(రజి)తో ఇలా అన్నారు: **"ఏమిటి, నీవు అల్లాహ్ నిర్ణయించిన శిక్షలలో ఒక శిక్ష గురించి సిఫారసు చేయదలిచావా?"** అన్నారు. ఆ తరువాత ఆయన(స) లేచి నిలబడి ప్రజల ముందు ఉపన్యసించారు. ఆ ఉపన్యాసం చివర్లో ఆయన ఇలా అన్నారు -

**"స్థితిమంతుడు పేరు పలుకుబడి గల వ్యక్తి దొంగతనం చేస్తే అతడ్ని శిక్షించేవారు కాదు. ఈ కారణంగానే మీకు పూర్వం గతించిన జాతులు నాశనమయ్యాయి. అల్లాహ్ సాక్షి! ముహమ్మద్ కూతురు ఫాతిమా(రజి) దొంగతనం చేసినా సరే, నేనామె చేతిని నరికివేస్తాను."** (అబూదావూద్, సహీహ్ హదీస్, నెం. 4373, పుస్తకం 37, అధ్యా. 4, సంపుటి 5)

కన్న కూతురైనా సరే న్యాయం విషయంలో ఎటువంటి మినహాయింపు ఉండరాదని ముహమ్మద్(స)వారు స్పష్టం చేశారు.

**'న్యాయం' సమాజంలో ఎవరికైనా ఒక్కటేనని, సమాజంలో ఉన్నత తెగవారికైనా సరే శిక్ష అమలు విషయంలో నిష్పక్షపాతాన్ని ఆచరణలో చూపిన మహనీయుడు - ముహమ్మద్(స).**

ఈ రోజున ధనవంతులు, రాజకీయ నాయకులు తమ పిల్లలు బహిరంగంగా హత్యలు చేసినాసరే, చట్టం నుండి వారిని తప్పించ గలుగుతున్నారు. ఆ హత్య చేసిన సమయంలో తమ పిల్లలకు మతి స్థిమితం లేదని డాక్టర్లచేత సర్టిఫై చేయించి ఏదో విధంగా శిక్ష నుండి తమ పిల్లలను తప్పిస్తున్నారు.

ఈ విషయం బాగా చదువుకున్న వారికే గాకుండా, సామాన్య మానవునికి కూడా చాలా బాగా తెలుసు.

మరి **ఈ ఆధునిక సమాజం గొప్పదా?** లేక

ముహమ్మద్(స)వారు దైవధర్మం ఆధారంగా నిర్మించిన ఆ మానవీయ సమాజం గొప్పదా?

ఓసారి ఆలోచించండి.

మానవతా విలువలను నిజమైన ముస్లిమ్ ఎప్పుడూ గౌరవిస్తాడు.

**కాబట్టి కాలం ఎప్పుడూ మంచిదే. అన్నికాలాలలోనూ మంచివారూ ఉన్నారు. చెడ్డవారూ ఉన్నారు.**

**చరిత్ర వక్రీకరించబడింది. సత్యానికి ముసుగువేయబడింది. కాని అది తాత్కాలికమే. ముసుగు తొలిగి తప్పనిసరిగా సత్యం ఆలస్యంగానైనా సరే బయటపడుతుంది.**

'కాకరకాయ'ను 'కీకరకాయ' అంటున్న మీడియాను చూసి కనీస జ్ఞానమున్న ప్రతీ ఒక్కరూ నవ్వుతున్నారు. సత్యాన్ని చెప్పలేని ఈ మీడియా **మధ్యయుగ కాలంలో జీవిస్తున్నదా?** లేక ఆధునిక కాలంలో జీవిస్తున్నదా?

**ఆధునిక నాగరికత :**

ఆధునిక నాగరికత ఇస్లామ్ వల్లనే ప్రారంభమయింది. ఇస్లామ్ ప్రవేశపెట్టిన ఎన్నో ఉత్తమ వ్యవస్థలు ఈనాడు ప్రపంచంలోని ప్రతీ దేశంలోనూ అమలులో ఉన్నాయి. ఈ విషయంపై కొంత ప్రాథమిక సమాచారం క్రిందటి సంచికలో అందించాము. ఇన్షా అల్లాహ్! రాబోయే సంచికలలో పూర్తి వివరాలతో సహా అందిస్తాము.

చరిత్ర వక్రీకరించబడింది. హిస్టరీ పుస్తకాలలోని సమాచారాలలో **నిజమెంత? అబద్ధమెంత?** అని ఆలోచిస్తే, వాటిలో అసత్యాలు మరియు తప్పుడు కథనాలే ఎక్కువ ఉంటాయి. అటువంటి తప్పుడు వ్రాతలు, కథనాలు ఎక్కువగా ఇస్లామ్‌పైనే ఉంటాయి.


మనదేశ చరిత్రలో మాత్రం ఇటువంటి వక్రీకరణలు జరుగలేదా? చాలా ఘోరంగా వక్రీకరణ జరిగింది. తమ ఖర్చులకోసం టోపీలు కుట్టి అమ్ముకుని, ఖుర్ఆన్ కాపీలను వ్రాసి వాటిని అమ్ముకోవడం ద్వారా వచ్చిన సొమ్ముతో జీవించిన ముస్లిమ్ రాజులను దుర్మార్గులుగా మరియు పిచ్చివాళ్ళుగా వర్ణించారు.

కవులను పోషించిన ముస్లిమ్ రాజులను మాత్రం గొప్పవ్యక్తులుగా చరిత్రలో లిఖించారు.


చరిత్రకారులలో చిత్తశుద్ధి లేనప్పుడు, చారిత్రకాంశాలు తారుమారు అవుతాయి. మన దేశంలోని పాఠ్యపుస్తకాలలో వచ్చే ఎన్నో పాఠాలలో కూడా ప్రజలకు ముస్లిములపై ద్వేషం పెరిగే విధంగా వక్రీకరణలు జరిగాయి. జరుగుతున్నాయి. చిన్న వయస్సులో పిల్లల మనస్సులలో



స్పెయిన్‌లోని కార్డోబా మస్‌జిద్ మరియు యూనివర్శిటీ లోపలిభాగం, ఇది 785 సంIIలో స్థాపించబడింది. స్థాపించబడి ఇప్పటికి 1224 సంIIలు కావస్తున్న అతి పురాతన విశ్వ విద్యాలయం.



Qarawiyyin Mosque and University. ఖరవియ్యిన్ మస్‌జిద్ మరియు యూనివర్శిటీ, ఫెజ్, మొరాకో. 859 సంIIలో స్థాపించబడింది. (అంటే ఇప్పటికి ఇది స్థాపించబడి 1141 సంIIలు కావస్తుంది).



Al-Azhar University, Cairo. అల్-అజ్‌హర్ యూనివర్శిటీ, కైరోలో 22 జూన్, 972లో స్థాపించబడింది. ఈ యూనివర్శిటీ స్థాపించబడి, ఇప్పటికి 1037 సంIIలు కావస్తుంది.

ముస్లిమ్ సామ్రాజ్యాలలో స్థాపించిన ప్రపంచపు తొలి యూనివర్శిటీలు, స్టడీ సర్కిల్స్ మొదలైన వాటిగురించి, 2, 3 వ సంచికలలో వివరంగా తెలియజేశాము.

నాటుకున్న ఈ ద్వేషాలు, వారితోపాటు పెరుగుతూ ఉంటాయి.

200 సంవత్సరాలకు పైగా భారతీయులను బానిసలుగా చేసుకుని, భారతీయులను హింసించిన బ్రిటిష్‌వారి గురించి చరిత్ర పుస్తకాలలో ఎంతగానో చదివినప్పటికీ, చదువులు పూర్తయ్యాక లండన్‌లో స్థిరపడటానికి మరియు బ్రిటిష్‌వారితో చెలిమికి నేటి యువత ఉత్సాహం చూపిస్తుంది. ఎందుకని? అయితే ఇక్కడ మా ఉద్దేశ్యం వారితో శతృత్వం వహించమని ఎంతమాత్రం కాదు.

కాని అన్నదమ్ముల్లా బ్రతికే హిందూ ముస్లిమ్‌లను బ్రిటిష్‌వారు విభజించి పాలించడం కొరకు రాజేసిన అగ్ని మాత్రం ఇంకనూ రగులుతూనే ఉంది. దానికి కారణం మనకు పాఠశాలలో నేర్పబడుతున్న తప్పుడు చరిత్ర కూడా చాలా వరకూ కారణమౌతుంది.

మూడవ తరగతి చదువుకుంటున్న ఓ బాలిక, తన క్లాస్‌మేట్ అయిన ముస్లిమ్ బాలికతో 'మీ ముస్లిములు మంచివారు కాదంట కదా!' అని చెప్పి ఏమీ అనుకోవద్దని చెప్పడాన్ని బట్టి, మీడియా మరియు తల్లిదండ్రులు పిల్లలలో ఎటువంటి ద్వేష భావాన్ని పెంచుతున్నారో చూస్తుంటే ఇది ఆధునిక కాలమని ఎలా చెప్పగలం?

ఈ వ్యాసం ద్వారా ముస్లిమ్ టీచర్లను మేము కోరేది ఏమిటంటే, పాఠ్యపుస్తకాలలో అటువంటి అంశాలను మీరు గుర్తించినప్పుడు, వాటిని సదరు ఎడ్యుకేషన్ బోర్డ్ దృష్టికి తీసుకువెళ్ళండి. ఇది మీ బాధ్యత. మర్చిపోకండి.

ఒకవేళ మీ ప్రయత్నానికి ఎవరూ స్పందించకపోతే, కనీసం పిల్లలకైనా నిజాన్ని తెలియజేయండి. లేదా ఆ చరిత్ర పాఠాలు చెప్పే మీ కొలీగ్స్‌కు నిజాలు తెలియజేయండి. శాంతిబాట మొదటి సంచికలో ముస్లిమ్‌ల స్వర్ణయుగం గురించి వివరంగా తెలియజేశాము.

నేటి ముస్లిములు మధ్యయుగ కాలంలో జీవిస్తున్నారని, వారికి మానవత్వ విలువలను గౌరవించడం తెలియదన్న ఆ జాతీయ న్యూస్‌పేపర్ వ్యాసకర్తకు అసలు నిజం తెలియదు.

ముస్లిములు ఆనాడు ఉత్తమ నాగరికతలో జీవించడమే కాకుండా, ఆ నాగరికతను ప్రపంచానికి అందించారు. **మధ్యయుగ కాలం ముస్లిములకు స్వర్ణయుగం.** ముస్లిములకు స్వర్ణయుగమైన అదే కాలంలో, ప్రపంచంలో నీచంగా జీవించినవారే యూరోపియన్లు. అంటే ఇప్పుడు వారేదో మంచి నాగరికతలో జీవించేస్తున్నారని మా అభిప్రాయం కాదు సుమా!

ఎవరో ఒకరిద్దరిని చూపించి, మొత్తం ముస్లిమ్ సమాజాన్ని దుర్మార్గంగా చిత్రీకరించడం మీడియావారికి నేడు ఫ్యాషన్ అయిపోయింది. మీడియావారు తాము వ్రాసేవి తప్పా? లేక ఒప్పా? మేము వ్రాసిన వ్రాతల ప్రభావం సమాజంపై ఎలా ఉంటుందో? అని బాధ్యతతో ఆలోచించిన రోజున అటువంటి మీడియా రిపోర్టర్స్ మానవతా విలువలను గౌరవించిన వారవుతారని మా నమ్మకం.

హెచ్‌ఎం టీవీ చీఫ్ ఎడిటర్ రామచంద్రమూర్తిగారు విశాఖపట్నంలో తేది 4 అక్టోబర్ లో వీజేఎఫ్ క్లబ్‌లో ''జర్నలిస్టులు గర్వపడేలా ప్రవర్తించాలని, సిగ్గుపడే పనులు చేయరాదని'' అభిప్రాయపడ్డారు. **"ఉన్నది ఉన్నట్లు చూపేవారు, జరిగింది జరిగినట్లు రాసేవారే అసలైన జర్నలిస్టులని, అలాంటి వారికి సిగ్గుపడే అవసరం రాదన్నారు"**.

టీవీ ఛానెళ్ళ రేటింగ్ కోసం విపరీత పోకడలు చోటు చేసుకుంటున్నాయని, అయితే వారు చూపేది వాస్తవమో కాదో మరో చానెల్ చూసుకుంటే ఖచ్చితంగా తెలిసిపోతుందన్నారు. ముందు నుంచీ ఎలక్ట్రానిక్ మీడియా వుండి వుంటే 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత, 1984లో సిక్కుల ఊచకోత, 1995లో ఎన్టీఆర్‌ను గద్దె దింపడం వంటి సంఘటనలు జరిగినప్పుడు పరిస్థితి ఎలా వుండేదో ఊహించు కోవచ్చని ఆయన చెప్పారు.

ప్రపంచ వ్యాప్తంగా మీడియా పై ఉండే విశ్వసనీయత చాలా వేగంగా తగ్గుతూ పోతుంది.

సత్యాన్ని చెప్పడం ద్వారా, సద్విమర్శ చేయడం ద్వారా, జ్ఞానం కలిగిన వారిచేత చేయించే విశ్లేషణల ద్వారా మరలా మీడియా తన విశ్వసనీయతను పెంచుకోవడానికి ప్రయత్నించకపోతే, 'మీడియా'ను కూడా ఓ తీవ్రవాదిగా పరిగణించి సమాజం నుండి మీడియాను వెలివేసే రోజు చాలా దగ్గరలోనే వస్తుంది.

'చరిత్ర'ను వక్రీకరించకుండా ఉంటే, హిందూ ముస్లిమ్ సోదరుల మధ్య ద్వేషాన్ని పెంచేవిధంగా మేధావులు, విద్యావంతులు, మీడియా ప్రయత్నించకుండా ఉంటే, పిల్లలకు సత్యాన్ని మాత్రమే అందిస్తే, ఇన్షాఅల్లాహ్ భావి భారతదేశం ఓ శాంతి నిలయం అవుతుంది.

సమాజ శ్రేయస్సు కొరకు అందరూ ఓసారి ఆలోచించాలి.

**- శాంతిబాట టీమ్**

---

ఈ సంచిక మరియు గత సంచిక

ప్రత్యేక సంచికలు కావడం వలన

రెండేసి కలిపి ఒకే ప్రత్యేక సంచికగా అందించడం జరిగింది.

వచ్చే నెల నుండి

విడి సంచికలనే ఇన్షా అల్లాహ్ ప్రచురిస్తాము.

# ఖుర్బానీ قُربانى

**"మరియు అతను (ఇబ్రాహీమ్) అన్నాడు : "నిశ్చయంగా, నేను నా ప్రభువు (తీసుకునివెళ్ళే) వైపునకు వెళ్ళిపోతాను. ఆయనే నాకు మార్గదర్శకత్వం చేస్తాడు". (అతను ఇలా ప్రార్థించాడు): "ఓ నా ప్రభూ! నాకు సద్వర్తనుడైన (కుమారుణ్ణి) ప్రసాదించు!" కావున మేము అతనికి సహనశీలుడైన కుమారుని శుభవార్తనిచ్చాము. ఆ బాలుడు అతనికి తోడుగా శ్రమ చేయగల వయస్సుకు చేరుకున్నప్పుడు, అతను (ఇబ్రాహీమ్) అన్నాడు: "ఓ నా కుమారా! వాస్తవానికి నేను నిన్ను జిబహ్ చేస్తున్నట్లుగా కలలో చూశాను. ఇక నీ సలహా ఏమిటో చెప్పు!" అతను (ఇస్మాయీల్) అన్నాడు: "ఓ నాన్నా! నీకు ఇవ్వబడిన ఆజ్ఞను నెరవేర్చు. అల్లాహ్ కోరితే నీవు నన్ను ఓ సహనశీలునిగా పొందగలవు!" ఆ తరువాత వారిద్దరూ (అల్లాహ్) ఆజ్ఞను నెరవేర్చడానికి సిద్ధపడ్డారు. మరియు అతను (ఇబ్రాహీమ్) అతనిని (ఇస్మాయీల్‌ను) నుదుటిపై బోర్లా పరుండబెట్టాడు. మరియు మేము అతనిని పిలుస్తూ ఇలా అన్నాము : "ఓ ఇబ్రాహీమ్! వాస్తవంగా, నీవు కలను నిజం చేసి చూపించావు!" నిశ్చయంగా, మేము సజ్జనులకు ఇలాంటి ప్రతిఫలమిస్తాము. నిశ్చయంగా ఇదొక స్పష్టమైన పరీక్ష. మరియు మేము అతనికి (ఇస్మాయీల్‌కు) బదులుగా ఒక గొప్ప జబిఅహ్‌ను పరిహారంగా ఇచ్చాము. మరియు తరువాత వచ్చే తరాలలో అతని కీర్తిని నిలిపాము. "ఇబ్రాహీమ్‌కు శాంతి కలుగుగాక (సలాం)!"**

**(ఖుర్'ఆన్ 37:99-110)**

ఇబ్రాహీమ్(అస) అల్లాహ్ యొక్క ప్రవక్త మరియు సందేశహరులని పాఠకులకు బాగా తెలిసిన విషయమే. యూదులకు, క్రైస్తవులకు, ముస్లిములకు పితామహుడు ఆయన. కుమారునితో కలిసి 'కాబా' మస్‌జిద్‌ను నిర్మించినవారు. ఈయనకు వయస్సు పైబడిన కాలంలో, అల్లాహ్ అనుగ్రహంతో ఓ కుమారుడు కలిగాడు. లేక లేక కలిగిన ఆ కుమారునిపై ఆ తండ్రికి ఎంతటి వాత్సల్యముంటుందో మనం ఊహించుకోగలం.

ఆ కుమారుడు కూడా సహనశీలుడు. అల్లాహ్ యొక్క సందేశం (వహీ) ప్రవక్తలకు చాలా రకాలుగా అందుతుంది. అందులో ఒకటి - కల(స్వప్నం) రూపంలో తెలియజేయబడే వహీ.

లేక లేక కలిగిన తన కుమారున్ని స్వయంగా తనే జిబహ్ చేస్తున్నట్లు ఇబ్రాహీమ్(అ)వారికి కలవచ్చింది. అది అల్లాహ్ యొక్క ఆదేశం. ఉన్న ఒక్క కుమారున్ని కూడా ఖుర్బానీ ఇవ్వవలసిన పరిస్థితి వచ్చింది. ఇది మామూలు త్యాగం కాదు. ఇబ్రాహీమ్(అ)వారి త్యాగానికి గుర్తుగా మనం ఈదుల్ అజ్హా (బక్‌రీద్ పండుగ)ను చేసుకుంటున్నాము.

ఈ పండుగ ''సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన'' ముహమ్మద్(స)వారి త్యాగానికి గుర్తుగా కాకుండా, ఎందరో ప్రవక్తలకు పితామహుడైన ఇబ్రాహీమ్(అ)వారి త్యాగానికి గుర్తుగా మనం జరుపుకుంటున్నాము.

**చూశారా! మహాప్రవక్త ముహమ్మద్(స)వారు మనకు ఎటువంటి సంస్కారాన్ని నేర్పారో! ప్రవక్తలను గౌరవించడమే కాకుండా ఓ ప్రవక్తగారి త్యాగాన్ని గుర్తుచేసుకునేలా ముస్లిమ్ ఉమ్మత్‌కి ఎంత ఉత్తమ శిక్షణ నిచ్చారో!**

సద్వర్తనుడైన కుమారున్ని ప్రసాదించమని ఇబ్రాహీమ్(అ)వారు చేసుకున్న ప్రార్థనని స్వీకరించి అల్లాహుతాలా ఆయనకి సహనశీలుడైన కుమారున్ని ప్రసాదిస్తున్నట్లు శుభవార్త నిచ్చారు. ఇబ్రాహీమ్(అ)వారి సతీమణి 'శారా'వారికి సంతానం కలుగలేదు. ఓ రాజు ఆమెకు గృహసంబంధమైన విషయాలలో సహాయకారిగా ఉండటానికి 'హాజిరా'ను బహుమతిగా ఇచ్చారు, శారహ్(అ), ఆమెను తన భర్తకు బహుమతిగా ఇచ్చారు. 'హాజిరా'(అ)వారిని ఇబ్రాహీమ్(అ) వివాహం చేసుకున్నారు.

పై ఆయత్‌లో చెప్పిన 'సహనశీలుడైన' కుమారుడు 'హాజిరా'కు జన్మించారు. ఆయనకు 'ఇస్మాయీల్'అని పేరు పెట్టడం జరిగింది. కొన్ని ఉల్లేఖనాలను బట్టి ఈ కల వరుసగా 3 రోజులపాటు వచ్చిందని తెలుస్తుంది (ఖుర్తుబీ).

**ఇక్కడ ఓ ముఖ్య విషయాన్ని మనం గుర్తించాలి.**

తన మొదటి కుమారున్ని 'జిబహ్' చేయమని చెప్పే అల్లాహ్ యొక్క సందేశాన్ని (అంటే వహీ) తీసుకుని ఏ దైవదూత కూడా ఇబ్రాహీమ్(అ)వారి దగ్గరికి రాలేదు. ఈ ఆదేశం కేవలం కల ద్వారానే తెలియజేయబడింది. ఒక దైవదూత ఒక ప్రవక్తకు సందేశాన్ని వినిపించడానికి మరియు అటువంటి సందేశమే కలలో అందడానికి మధ్య చాలా తేడా ఉంది. దైవదూత ఏదైనా సందేశాన్ని తీసుకు రాగానే, ఆ సందేశాన్ని ప్రవక్తలు అమలు పరుస్తారు. ఆ విధంగా వారు అల్లాహ్‌కు తమ విధేయత చూపిస్తారు.

కాని **'కలలోనే వచ్చింది కదా'** అని ఇబ్రాహీమ్(అ) నిర్లక్ష్యం వహించ లేదు. దానిని ఆదేశంగా స్వీకరించి అల్లాహ్‌కు విధేయత చూపారు.

**ఇందులో ఎంతో వివేకముంది**. దీనిని బట్టి ఇబ్రాహీమ్(అ)వారికి అల్లాహ్ పట్ల ఉన్న విధేయత ఎంత గొప్పదో అర్థమౌతుంది.

ఇస్మాయీల్(అ), ఇబ్రాహీమ్(అ)వారికి తొలి సంతానం మాత్రమే కాకుండా, ఆ సమయానికి ఆయనే ఏకైక కుమారుడు. ఎంతటి కఠిన పరీక్ష ఇది.

''**ఆ బాలుడు అతనికి తోడుగా శ్రమ చేయగల వయస్సుకు చేరుకున్నప్పుడు** .....'' అని 102వ ఆయత్‌లో చెప్పడాన్ని బట్టి, ఆ సమయంలో ఆ బాలుడు ఊహ తెలియనివాడు కాదని, పరిస్థితులను అర్థం చేసుకోగల మానసిక ఆరోగ్యం కలిగినవాడని స్పష్టమౌతుంది. లేక లేక కలిగిన కుమారుడు మాత్రమే కాకుండా, చేతికి అంది వచ్చిన కుమారుడు - **ఇస్మాయీల్(అ)**.

కొందరు వ్యాఖ్యాతల ప్రకారం అప్పటికి ఇస్మాయీల్(అ)వారి వయస్సు 13 సంవత్సరాలు.

అల్లాహ్ ఆదేశం గురించి ఇబ్రాహీమ్(అ) తన కుమారునికి చెప్పినప్పుడు, ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా ఆయన వెంటనే ఆ ఆదేశాన్ని అమలు చేయడానికే సిద్ధపడ్డారు .

ఈ ఇస్మాయీల్(అ) మాత్రం సామాన్యులా? ఖలీలుల్లాహ్ (అల్లాహ్ యొక్క స్నేహితుని) కుమారుడు.

ఇక్కడ ఇబ్రాహీమ్(అ)వారికి అందిన వహీ - ''వహీ గైర్ మత్‌లూ''. అంటే పఠించబడిన దైవ సందేశం కాదు. కల రూపంలో వహీ అందింది. చాలామంది అంటుంటారు గ్రంథంలోని వాక్యాలే వహీ ద్వారా అందినవి అని, మరో విధమైన వహీ ఉండదని. అటువంటి మూర్ఖపు ఆలోచనల తోనే కొందరు హదీస్‌లను తిరస్కరిస్తారు.

**"ఇన్నా అల్లాహ్! (అల్లాహ్ కోరితే) నీవు నన్ను ఓ సహనశీలునిగా పొందగలవు"**.

ఈ మాటలలో ఎంతో వినయం చూపారు ఇస్మాయీల్(అ). తను ఒక్కడే సహనశీలుడు అని చెప్పకుండా, సహనశీలురలో ఒక్కరిగా ఆయనను చెప్పుకున్నారు. ఇక్కడ ''**ఇన్నా అల్లాహ్**'' అని చెప్పడం ద్వారా ఈ త్యాగానికి తను సిద్ధమైనప్పటికీ అది తన గొప్పతనంగా భావించకుండా అల్లాహ్ అంగీకారం పైనే ఉంచడాన్ని బట్టి ఆయన సమాధానంలో గర్వంగాని, అహంగాని ఏ కోశానా కనిపించలేదు. ఎంతో వినయం, విధేయతతో కూడి ఉన్నాయి ఆయన మాటలు.

ఈ వాక్యంలో మనమందరం నేర్చుకోవలసిన ఓ గొప్పపాఠం ఉంది. అదేమిటంటే,

**మనపై మనకు ఎంత ఆత్మవిశ్వాసం ఉన్నా సరే, అహంతో కూడిన మాటలతోగాని, ప్రగల్భాలతోగాని పెద్ద పెద్ద ప్రకటనలు చేయకూడదని, ఇటువంటి విషయంలో ఆచితూచి చాలా జాగ్రత్తగా పదాలు ఉపయోగించాలని తెలుసుకోవాలి. ఇటువంటి విషయంలో మనపై ప్రజలు దృష్టిపడే విధంగా కాకుండా, 'అల్లాహ్'పై విశ్వాసం ఉండేలా వారి దృష్టిని మరల్చాలి. మన శక్తిమేర వినయ విధేయతలను చూపించ వలసి ఉంది.**

కొన్ని చారిత్రక మరియు వ్యాఖ్యాన గ్రంథాల నివేదికలను బట్టి మనకు తెలిసేది ఏమిటంటే, ఈ పని (త్యాగం) చేయకుండా షైతాన్ ఇబ్రాహీమ్(అ)వారిని తప్పుదోవ పట్టించడానికి మూడుసార్లు ప్రయత్నించాడు మరియు ప్రతీసారి ఇబ్రాహీమ్(అ) 7 రాళ్ళను వానిపై విసిరి వాడిని అక్కడి నుండి పారద్రోలారు.

**ఇప్పటికీ ఈ చర్యకు గుర్తుగా మినా యొక్క మూడు స్తంభాలపై రాళ్లు రువ్వబడుతున్నాయి.**

చివరకు, ఇద్దరూ బలి ప్రదేశానికి వచ్చినప్పుడు, ఇస్మాయీల్(అ) తన తండ్రికి కొన్ని విషయాలు చెప్పారు, శరీరం ఎక్కువగా కదలకుండా, ఎక్కువగా తిరిగిపోకుండా, తండ్రి బట్టలపై రక్తపు మరకలు పడకుండా ఉండేలా తనను సరిగా కట్టమని, బట్టలపై ఆ రక్తపు చుక్కలు తల్లి చూస్తే విచారపడుతుందని. కత్తిని బాగా పదునుగా చేయమని, తన కంఠంపై వేగంగా పోనివ్వమని, ఆ విధంగా అతని చివరి శ్వాస సులభమౌతుందని. తరువాత తల్లి దగ్గరకు తిరిగి వెళ్ళినప్పుడు, తన సలాము ఆమెకు తెలియజేయమని, అతని చొక్కాను తీసుకు వెళ్ళాలంటే, సంతోషంగా తీసుకు వెళ్ళవచ్చని, దాని ద్వారా ఆమెకు అవసరమైన సౌకర్యాన్ని అది కలుగజేస్తుందని చెప్పడం జరిగింది. తన ఒక్కగానొక్క కుమారుని నోట ఇటువంటి మాటలు విన్న తండ్రి గుండె ఆ సమయంలో ఎలా స్పందిస్తుందో! తన కుమారునితో చెప్పారు, ''కుమారా! అల్లాహ్ నాపై ఉంచిన ఈ కార్యంలో నువ్వు నాకెంత సహాయకారివో!'' ఇలా చెప్పి, కుమారుడిని చెమర్చిన కళ్ళతో ముద్దు పెట్టుకుని ఆయనను కట్టారు (మజ్‌హరి).

103 ఆయత్‌లో చెప్పినట్లు ''... **అతనిని నుదుటిపై బోర్లా పరుండ బెట్టాడు** ...'' అయితే ప్రారంభంలో అతని ముఖం పైకి ఉండేటట్లుగా ఉంచి, అతని గొంతుపై కత్తిని కదిపినా, ఎన్నోసార్లు ప్రయత్నించి నప్పటికీ కోయబడలేదు. ఎందుకంటే అల్లాహ్ ఇష్టప్రకారం కత్తికి మరియు కంఠానికి మధ్య రాగి రేకు అడ్డువచ్చేది. అప్పుడు కుమారుడే తన తండ్రితో తన తలను క్రిందివైపు ఉంచమని అభ్యర్థించడం జరిగిందని కొన్ని వ్యాఖ్యాన గ్రంథాల ద్వారా తెలుస్తుంది.

**"ఓ ఇబ్రాహీమ్! వాస్తవంగా, నీవు కలను నిజం చేసి చూపించావు"** అని పై ఆయత్‌లో చెప్పబడింది. నిజానికి కలలో కూడా ఆయన తన కుమారుని జిబహ్ చేయడానికి కత్తిని కదపడం మాత్రమే చూశారు. **"మేము అతనికి బదులుగా ఒక గొప్ప జబీఅహ్‌ని పరిహారంగా ఇచ్చాము."**

కొన్ని హదీస్‌లను బట్టి, ఆకాశాల నుండి ఆ పిలుపు వినగానే ఇబ్రాహీమ్(అ) పైకి చూస్తే జిబ్రాయీల్(అ) ఓ గొఱ్ఱెతో కనిపించారు. మరికొన్ని నివేదికలనుబట్టి, ఆదమ్(అ)వారి కుమారుడైన హాబిల్ 'ఖుర్బానీ'గా ఏ గొఱ్ఱెను ఇచ్చారో అదే గొఱ్ఱె అని చెప్పడం జరిగింది. **నిజం అల్లాహ్‌కే తెలుసు**. తన కుమారునికి బదులుగా అల్లాహ్ పంపిన ఆ గొఱ్ఱెను బలి ఇవ్వడం జరిగింది. ఆ విధంగా బలి ఇవ్వబడిన జంతువును - 'అజీమ్' (గొప్పది) అన్నారు. ఎందుకంటే అల్లాహ్ యొక్క కరుణతో పంపబడింది కనుక.

నకిలీ ముస్లిముల గురించీ మరియు వారు ఒక మత ధర్మంవారితో

కలిసి చేస్తున్న దుష్ప్రచారం గురించి ఇతరుల కంటే 'శాంతిబాట' పాఠకులకు బాగా తెలుసు.

**జిబహ్‌కు సిద్ధపడింది ఇస్మాయీల్(అ) కాదని, ఇస్‌హాఖ్(అ) అని కాకినాడ నకిలీ ముస్లిమ్ సంస్థ చెబుతుంది. కాని ఖుర్బానీకి సిద్ధపడింది ఇస్మాయీల్(అ) వారే!**

ఈ విషయంలో కొందరు సృష్టించిన భిన్నాభిప్రాయాల గురించి స్పష్టంగా తెలియజేయ వలసిన అవసరముంది. ఆ కుమారుడు 'ఇస్‌హాఖ్'(అ) అని సహాబాలలో కొందరు చెప్పినట్లు, అది కాదని 'ఇస్మాయీల్'(అ) అని మరికొందరు సహాబాలు చెప్పారని కొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం జరిగింది.

అయితే పైన తెలిపిన రెండు సమూహాలలోనూ, ముగ్గురు పేర్లు కామన్‌గా ఉన్నాయి. రెండింటిలోనూ అలీ(రజి), ఇబ్నె అబ్బాస్(రజి) మరియు ఇబ్నె జుబైర్(రజి) ఉన్నారు.

తరువాత వచ్చిన వ్యాఖ్యాతలలో హాఫిజ్ ఇబ్న్ కసీర్ ఆ కుమారుడు ఇస్మాయీల్(అ) అని బలపరచడమే కాకుండా, ఇస్‌హాఖ్(అ) అని ఎవరైతే అభిప్రాయపడ్డారో వారి మాటలను ఆధారాలతో సహా ఖండించడం జరిగింది.

ఖుర్'ఆన్ గ్రంథాన్ని బట్టి మరియు బలమైన ఉల్లేఖనాలను బట్టి ఖుర్బానీ ఇవ్వడానికి ఇబ్రాహీమ్(అ) తీసుకెళ్ళిన కుమారుడు "ఇస్మాయీల్" (అ) అని స్పష్టంగా తెలుస్తుంది.

**సంబంధిత ఆధారాలు :**

1. త్యాగానికి సంబంధించిన ఈ సంఘటన గురించి ఖుర్'ఆన్ గ్రంథంలో 37వ సూరహ్‌లో చెప్పిన తరువాత, అదే సూరహ్‌లో 112వ ఆయత్‌లో ఇలా చెప్పబడింది. **"మరియు మేము అతనికి ఇస్‌హాఖ్ యొక్క శుభవార్తను ఇచ్చాము. అతను ఒక సద్వర్తనుడైన ప్రవక్త"**. అంటే బలి ఇవ్వడానికి సిద్ధం చేయబడినవారు ఇస్‌హాఖ్(అ)కాదని, అది మరొకరని స్పష్టంగా తెలుస్తుంది. ముందుగా ఇస్మాయీల్(అ)వారిని బలిప్రదేశానికి తీసుకెళ్ళి బలివ్వడానికి సిద్ధపడిన సంఘటన, మరియు అతనికి బదులుగా ఓ గొఱ్ఱెను జిబహ్ చేయడం, ఆ తరువాతనే అల్లాహ్ సజ్జనులకు ప్రతిఫల మిస్తానని వాగ్దానం చేయడం జరిగింది. ఆ తరువాత ఇబ్రాహీమ్(అ) వారికి ఇస్‌హాఖ్(అ)వారి జననం గురించి శుభవార్తను ఇవ్వడం జరిగింది. గొఱ్ఱెను జిబహ్ చేసిన తర్వాత ఇవ్వబడిన శుభవార్త ఇది. అంటే ఈ సంఘటన జరిగిన సమయానికి **ఇంకనూ ఇస్‌హాఖ్(అ) జన్మించలేదని స్పష్టంగా తెలుస్తుంది.**
2. ఈ శుభవార్తను జాగ్రత్తగా గమనించండి. ఇస్‌హాఖ్(అ) ప్రవక్త అవుతారని అల్లాహుతాలా తెలియజేస్తున్నారు. అంటే అతను బాలుడుగా ఉన్నప్పుడే జిబహ్ చేస్తే, ఇక ఆయన ప్రవక్త ఎలా కాగలుగుతారు? ఆ బలికి బదులుగా అల్లాహ్ ఓ గొఱ్ఱెపిల్లను పంపుతారని ఇబ్రాహీమ్(అ)వారికి ముందుగా తెలియదు కదా! కలలో కుమారునిపై కత్తిని కదపడం వరకే చూశారు. జిబహ్ చేశాక తన కుమారుడు మరణిస్తాడని తెలిసే సిద్ధపడ్డారు.

   తన కుమారుడు ప్రవక్త అవుతారనే శుభవార్తను అందుకున్న తరువాత గనుక ఈ కల వచ్చి ఉంటే, ఆ కలను ఆయన స్వీకరించి ఉండేవారు కాదు కదా! కాని ప్రవక్తలకు అసత్య కలలు రావు అని తెలుసుకోవాలి (అస్తగ్ఫిరుల్లాహ్). అంతేగాకుండా ఖుర్'ఆన్‌లో **11వ సూరహ్** (సూరహ్ హూద్)లోని **71వ ఆయత్**‌లో చెప్పబడిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ఓసారి గుర్తు తెచ్చుకుందాం.

   **"అతని (ఇబ్రాహీమ్) భార్య (అక్కడే) నిలబడి ఉండెను, అప్పుడామె నవ్వింది, పిదప మేము ఆమెకు ఇస్‌హాఖ్ యొక్క మరియు ఇస్‌హాఖ్ తరువాత 'యాఖూబ్' యొక్క శుభవార్తను ఇచ్చాము"**

   చూశారా! పై వాక్యంలో ఇస్‌హాఖ్(అ)వారి జననం గురించే కాకుండా, ఆయన పుట్టకుండానే, అతనికి కూడా పుట్టబోయే 'యాఖూబ్'(అ) వారి జననం గురించి చెప్పబడింది. అంటే ఇబ్రాహీమ్(అ)వారికి కుమారుడు మరియు మనవడి గురించి శుభవార్త అందింది.

   అంటే ఈ వాక్యాన్ని బట్టి ఇస్‌హాక్(అ) పెళ్ళి చేసుకుంటారని మరియు అతనికి బిడ్డ జన్మిస్తాడని స్పష్టంగా తెలుస్తుంది. అంటే ఇస్‌హాఖ్(అ) వారి వయస్సు యుక్తవయస్సు దాటిపోతుందని, వివాహం కూడా జరుగుతుందని ఎంత స్పష్టంగా ఈ వాక్యంలో తెలియజేయబడింది.

   ఈ వ్యాసం ప్రారంభంలో ఇచ్చిన ఖుర్'ఆన్ వాక్యాల ద్వారా బలి ఇవ్వడానికి నిర్ణయించుకున్న సమయానికి ఇబ్రాహీమ్(అ)వారి కుమారుని యొక్క వయస్సు తక్కువ. "ఆ బాలుడు అతనికి తోడుగా శ్రమ చేయగల వయస్సుకు చేరుకున్నప్పుడు ....." అంటే ఆ బాలుని వయస్సు తక్కువే కాకుండా వివాహ వయస్సు కాదని తెలుస్తుంది. అల్లాహ్ యొక్క వాక్కు సత్యమని ఇబ్రాహీమ్(అ) వారికి తెలుసు.

   కాబట్టి చిన్న వయస్సులో ఇస్‌హాఖ్(అ)వారిని జిబహ్ చేస్తే, వివాహం ఎలా జరుగుతుంది? యాఖూబ్(అ) అతనికి ఎలా సంతానం కాగలుగుతారు?

   కాబట్టి ఆ బాలుడు ఇస్‌హాఖ్(అ) ఎంతమాత్రం కాదు. ఆ బాలుడు **ఇస్మాయీల్**(అ). ఇబ్రాహీమ్(అ) తన కుమారుడు చనిపోతాడనే భావించారు.
3. ఖుర్'ఆన్ ప్రకటన బట్టి స్పష్టంగా తెలిసేది ఏమిటంటే జిబహ్ కొరకు దివ్య ఆదేశం వచ్చింది ఇబ్రాహీమ్(అ)వారి మొదటి కుమారుని గురించే. ఇబ్రాహీమ్(అ) తన మాతృభూమి నుండి వలస వెళ్ళేటప్పుడు తనకొక కుమారుని ప్రసాదించమని అల్లాహ్‌ను ప్రార్ధించారు. ఆయన ప్రార్ధనకు సమాధానంగా, ఆయనకు కుమారుడు కలుగుతాడనే శుభవార్త నిచ్చారు. తన తండ్రితో అతడు పనిచేయగలిగే వయస్సుకు చేరుకున్నప్పుడు అతడిని జిబహ్ చేయమని ఈ కుమారుని గురించే దివ్యాదేశం అందింది. ఈ వరుస సంఘటనలను బట్టి, ఆ కుమారుడు ఇస్మాయీల్(అ) అని స్పష్టంగా తెలుస్తుంది.
4. కుమారున్ని జిబహ్ ఇచ్చే ఈ సంఘటన మక్కా పరిసర ప్రాంతాలలో

జరిగింది. అందువల్లనే అరబ్బులలో హజ్జ్ యాత్రలో ఖుర్బానీ ఇవ్వడమనేది ఆచారంగా ఉండేది. అంతేకాకుండా, స్వర్గం నుండి తీసుకురాబడి జిబహ్ ఇవ్వబడిన గొఱ్ఱె యొక్క కొమ్ములు పవిత్ర కాబాలో సంవత్సరాల తరబడి వ్రేలాడుతూ ఉండేవి. దీనికి అనుకూలంగా ఉన్న ఎన్నో ఉల్లేఖనాలను హాఫిజ్ ఇబ్నె కసీర్ తెలియజేశారు. అమీర్ ష'బీ చెప్పారు: నేను స్వయంగా గొఱ్ఱె కొమ్ములను కాబాలో చూశాను. మరియు సుఫ్యాన్ చెప్పారు : ఆ గొఱ్ఱె కొమ్ములు కాబాలో నిరంతరం వ్రేలాడుతూనే ఉండేవి (హజ్జాజ్ ఇబ్నె యూసుఫ్‌వారి కాలంలో) కాబాలో మంటలు వ్యాపించే వరకూ. ఆ సమయంలో కొమ్ములు కాలి బూడిదై పోయాయి. (తఫ్సీర్ ఇబ్నె కసీర్)

దీనిని బట్టి స్పష్టమయ్యేది ఏమిటంటే ఇస్మాయీల్(అ)వారు మాత్రమే మక్కాలో నివశించారని. ఇస్హాఖ్(స)వారు అక్కడ నివశించలేదని. కాబట్టి జిబహ్ చేయమని వచ్చిన ఆదేశం ఇస్మాయీల్(అ)వారికి సంబంధించినదే. భిన్నాభిప్రాయాలు సహాబీల, తాబయీల మధ్య ఉన్నాయన్న విషయంపై ఇబ్నె కసీర్ ఇలా చెప్పారు:

"అల్లాహ్‌కే బాగా తెలుసు. ఈ మాటలన్నీ కాబ్ అల్-అహ్‌బార్ నుండే అందాయి. ఉమర్(రజి)వారి కాలంలో ఇతను ఇస్లామ్ స్వీకరించారు. ఆయన తన పూర్వ గ్రంథాల నుండి కొన్ని విషయాలు చెప్పడం ప్రారంభించారు. కొన్ని సంధర్భాలలో ఉమర్(రజి) ఆయన మాటలను వినడం జరిగింది. అదే విధంగా ఇతరులు కూడా. అతని మాటలను ఒకరినుండి మరొకరికి చేరడం జరిగింది. ఈ ఉల్లేఖనాలన్నీ ఓ హాస్యాస్పద మూట. ఈ ఉమ్మత్‌కి వాటిలో నుండి ఒక పదం కూడా అవసరం లేదు. అల్లాహ్‌కే బాగా తెలుసు."

**హాఫిజ్ ఇబ్నె కసీర్** మరో విషయాన్ని కూడా తెలియజేశారు :

"ధర్మ పరాయణుడైన ఖలీఫా 'ఉమర్ బిన్ అబ్దుల్-అజీజ్ కాలంలో ఒక యూద విద్వాంసుడు ఇస్లామ్ స్వీకరించాడు. ఖలీఫా అతనిని అడిగారు, "ఇబ్రాహీమ్(అ)వారి కుమారులలో ఎవరు జిబహ్‌కు ఆదేశించబడ్డారు". అతను చెప్పారు : అల్లాహ్ సాక్షి, ఓ అమీరుల్ మోమినీన్, **ఆయన ఇస్మాయీల్(అ)**. యూదులకు ఆ విషయం బాగా తెలుసు. కాని మీ అరబ్బులంటే వారికి అసూయ, అందుకే అలా చెబుతారు."

**ఈ వ్యాసం కొరకు మేము రిఫర్ చేసిన తఫ్సీర్ గ్రంథాలు:** తఫ్సీర్ ఇబ్నె కసీర్, మారిఫుల్ ఖుర్'ఆన్.

తఫ్సీర్ గ్రంథాల ద్వారా అందించిన పై విషయాలు చదివితే, జిబహ్‌కు సిద్ధపడిన కుమారుడు ఇస్మాయీల్(అ)వారేనని నిస్సందేహంగా అర్థమౌతుంది.

**అయినప్పటికీ మేము గమనించిన కొన్ని ముఖ్య విషయాలను కూడా పాఠకులకు అందించాలనుకుంటున్నాము. అవి :**

వ్యాసం ప్రారంభంలో ఇచ్చిన ఖుర్'ఆన్ వాక్యాలను శ్రద్ధగా మరోసారి గమనించండి.

(అతను ఇలా ప్రార్థించాడు): "ఓ నా ప్రభూ! నాకు **సద్వర్తనుడైన** (కుమారుణ్ణి) ప్రసాదించు!" కావున మేము అతనికి **సహనశీలుడైన** కుమారుని శుభవార్తనిచ్చాము. (37: 100,101)

"నాన్నా! నీకు ఇవ్వబడిన ఆజ్ఞను నెరవేర్చు. అల్లాహ్ కోరితే నీవు నన్ను ఓ **సహనశీలుని**గా పొందగలవు!" (37:102)

"మరియు మేము అతనికి ఇస్హాఖ్ యొక్క శుభవార్తను ఇచ్చాము. అతను ఒక **సద్వర్తనుడైన** ప్రవక్త" (37:112)

పైన తెలిపిన 4 ఆయత్‌లలో రెండు ప్రత్యేకమైన పదాలున్నాయి.

1. సద్వర్తనుడు **(సాలిహీన్)** 2. సహనశీలుడు (**హలీమ్, సాబిరీన్**).

హలీమ్ మరియు సాబిరీన్ అనే రెండు అరబీ పదాలను 'సహనశీలుడు'గా తెలుగులో అనువదించారు.

101వ ఆయత్‌లో ఇబ్రాహీమ్(అ) **సాలిహీన్** అయినటువంటి కుమారున్ని అనుగ్రహించమన్నారు. దానికి జవాబుగా అల్లాహ్ 102వ ఆయత్‌లో **హలీమ్** అయినటువంటి కుమారుని శుభవార్తనిచ్చారు.

ఇబ్రాహీమ్(అ)వారు ఈ విధంగా కోరుకునే సమయానికి, ఆయనకి సంతానం లేదు. ఒక్క కుమారుడు కూడా జన్మించలేదు. 'సాలిహీన్' వంటి కుమారున్ని అడిగితే 'హలీమ్'వంటి కుమారున్ని అనుగ్రహించారు.

సజ్జనులకు మంచి ప్రతిఫలమిస్తామంటూ, అల్లాహ్ వాగ్దానం చేసి **'సాలిహీన్'** అయినటువంటి ఇష్‌హాక్(అ)ను కుమారునిగా అనుగ్రహిస్తానని మరలా కొంతకాలానికి మరో శుభవార్త నిచ్చారు.

ఇక్కడ అల్లాహుతాలా ఇస్హాఖ్(అ)వారికి ఉపయోగించిన విశేషణ పదం "సాలిహీన్". ఏ కుమారుడూ లేని సమయంలో "సాలిహీన్" వంటి కుమారున్ని ప్రసాదించమని ఇబ్రాహీమ్(అ) అల్లాహ్‌ను వేడుకుంటే, 'హలీమ్' అయినటువంటి శుభవార్త నిచ్చారు. ఒకవేళ ఇస్‌హాక్(అ)వారే మొదటి కుమారుడు అయితే, ఇబ్రాహీమ్(అ) 'సాలిహీన్'ని అడిగినప్పుడు "సాలిహీన్"ని ప్రసాదిస్తున్నట్లుగా చెప్పి ఉండేవారు. ఈ పదాల ద్వారా ఇబ్రాహీమ్(అ)వారి మొదటి కుమారుడు మరియు జిబహ్ కొరకు సిద్ధపడినవారు - ఇస్మాయీల్(అ) అని స్పష్టంగా తెలుస్తుంది.

అల్లాహ్ యొక్క ప్రసంగం అమోఘమైనది. ఆయన వాడిన పదాలలో ఎన్నో సూక్ష్మ విషయాలు కూడా చాలా స్పష్టంగా ఉంటాయి. మానవ మాత్రునికి సాధ్యంకాని శైలి ఖుర్'ఆన్ శైలి.

క్రింది ఆయత్‌ను గమనించండి :

"సర్వ స్తోత్రాలకు అర్హుడైన అల్లాహ్ నాకు వృద్ధాప్యంలో కూడా **ఇస్మాయీల్** మరియు **ఇస్హాఖ్**లను ప్రసాదించాడు. నిశ్చయంగా, నా ప్రభువు ప్రార్థనలను వినేవాడు" (ఖుర్'ఆన్ 14:39)

పై వాక్యంలో ముందుగా చెప్పిన పదం ఇస్మాయీల్(అ). కాబట్టి పెద్ద కుమారుడు ఇస్మాయీల్(అ). ఖుర్'ఆన్‌లో పదాల క్రమం కూడా చాలా గొప్పగా ఉంటుంది.

**మరో ఉదాహరణ:**

లేక, మీరు : "నిశ్చయంగా **ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్, యాఖూబ్** మరియు వారి సంతతి వారంతా యూదులు మరియు క్రైస్తవులు" అని అంటారా? ఇంకా ఇలా అను : "ఏమీ మీకు బాగా తెలుసా? లేక అల్లాహ్‌కు (బాగా తెలుసా?) అల్లాహ్ నుండి తన వద్దకు వచ్చిన సాక్ష్యాన్ని దాచేవాని కంటే ఎక్కువ దుర్మార్గుడెవడు? మరియు మీ కర్మల నుండి, అల్లాహ్ నిర్లక్ష్యంగా లేడు!" (ఖుర్‌ఆన్ 2:140)

పై వాక్యంలో ఇచ్చిన పేర్ల ఏ వరుసక్రమంలో ఉన్నాయో గమనించండి. ముందుగా ఇబ్రాహీమ్(అ)వారి పేరు, తరువాత పెద్ద కుమారుడైన ఇస్మాయీల్(అ), తరువాత రెండవ కుమారుడైన ఇస్‌హాఖ్(అ) మరియు మనుమడు యూఖూబ్(అ)వారి గురించి చెప్పబడింది.

కాబట్టి అరబీ భాషను పూర్తిగా నిర్లక్ష్యం చేయకండి. అరబీ భాషలో ఖుర్‌ఆన్‌ను చదివిన తరువాత, మీకు అర్థమయ్యే భాషలో దాని అర్థాన్ని కూడా చదువుతూ ఉంటే మీరు సందేహంలో పడిపోకుండా ఉంటారు.

**జిబహ్‌కు ఆదేశించబడిన కుమారుని విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయంటూ కాకినాడ నకిలీ ముస్లిమ్ సంస్థ దుష్ప్రచారం చేస్తూ, ఆ తప్పును మౌలానా మౌదూదీగారిపై నెట్టివేస్తున్నారు. మౌలానా మౌదూదీ గారి తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ (ఉర్దూ)లో ఆ విషయాలు ఉన్నాయని, అందుకే వారు ఆ విధంగా ప్రచారం చేస్తున్నట్లు చెబుతున్నారు. అది నిజమా? కాదా? అని మౌలానా మౌదూదీగారి తఫ్సీర్ చదివితే, ఆయన ఈ విషయంలో ఏ విధమైన అనుమానానికి తావు లేకుండా స్పష్టంగా చెప్పారు. జిబహ్‌కు ఆదేశించ బడినవారు 'ఇస్మాయీల్'(అ) అని ఆయన చాలా స్పష్టంగా తెలియజేస్తూ, ముస్లిములకు ఆ అనుమానం ఎందుకొస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఈ సంఘటన విషయంలో మౌలానా మౌదూదిగారి తఫ్సీర్ బావుంది.**

**కాని దుష్ప్రచారకుల మాటలు విన్నవారందరూ ఈ పుస్తకాన్ని రిఫర్ చేయకపోవచ్చు. దుష్ప్రచారకుల మాటలను నమ్మి మోసపోవచ్చు. అందుకే నిజాన్ని తెలియజేస్తున్నాము. ఓ మతవర్గంవారికి అనుకూలంగా పనిచేసే ఈ దుష్ప్రచారకులు ముస్లిమ్‌లలో అనుమానాలను రేకెత్తించే విధంగా ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారు. దయచేసి జాగ్రత్త పడండి. ఇటువంటి వారికి దూరంగా ఉండండి.**

**ఖుర్బానీకి సంబంధించి పాఠకుల కోరిక మేరకు కొన్ని ముఖ్యమైన హదీస్‌లను ఇక్కడ అందిస్తున్నాము.**

### జుల్ హిజ్జా నెల ప్రారంభంలో ఏమి చేయాలి?

ఉమ్మె సలమా(రజి) ఉల్లేఖనం : ప్రవక్త(స) చెప్పారు : ఎవరైతే జుల్ హిజ్జా నెల యొక్క తొలి నెలవంకను చూస్తారో మరియు జిబహ్ ఇస్తామని అనుకుంటారో, అతని జుట్టు మరియు గోళ్ళను ఏమాత్రం తొలగించ కూడదు, అతడు తన ఖుర్బానీ పశువును జిబహ్ చేసేంతవరకూ.
**(నసాయీ, సహీహ్, నెం. 4366, పుస్తకం 43, అధ్యా. 1, సంపుటి 5)**

(ఖుర్బానీ ఇస్తామని నిర్ణయించుకున్నవారు, అది పూర్తయ్యేవరకూ తమ గోళ్ళనుగాని, జుట్టునుగాని కత్తిరించుకో కూడదు. అవి జిబహ్ పూర్తయ్యాకే చేయాలి. ప్రతీ ఒక్కరూ నెలవంకను చూడవలసిన అవసరం లేదు. జుల్-హిజ్జా ప్రారంభమైతే చాలు.)

తరువాయి హదీస్(నెం. 4367)లో అమ్ర్ బిన్ ముస్లిమ్ చెప్పిన ఉల్లేఖనంలో "**ఆ నెలలోని మొదటి పదిరోజులు**" అని ఉంది. అంటే అప్పటికి ఖుర్బానీ పూర్తయిపోతుంది.

### జుల్ హిజ్జా నెల మొదటి పదిరోజుల విశిష్ఠత

ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం: ప్రవక్త(స) చెప్పారు, ఈ (జుల్ హిజ్జా) 10 రోజులలో చేసిన మంచిపనులు ఇతర రోజులలో చేసే మంచి పనుల కంటే అల్లాహ్‌కు ప్రియమైనవి. అప్పుడు కొందరు సహాబాలు ప్రవక్త(స)వారిని అడిగారు, "జిహాద్ కంటేనా?".
ఆయన సమాధానమిచ్చారు, "జిహాద్ కంటే, (అయితే) ఓ వ్యక్తి తనను మరియు తన ఐశ్వర్యాన్ని ప్రమాదంలో ఉంచి (అంటే అల్లాహ్ కొరకు) మరియు తిరిగి రాకపోతే (షహీద్ అయితే) తప్ప.
**(సహీహ్ బుఖారీ, 969, పుస్తకం 13, అధ్యా. 11, సంపుటి 2)**

పై హదీస్‌లో జుల్ హిజ్జా 10 రోజుల యొక్క విశిష్ఠత తెలియజేయ బడింది. ఈ పది రోజులలో చేసే మంచి పనులు, ఇతర రోజులలో చేసిన వాటి కంటే ఎంతో ఆధిక్యత కలిగి ఉంటాయి. ఒక వ్యక్తి అల్లాహ్ కొరకు జిహాద్‌లో తన ఐశ్వర్యాన్ని ప్రాణాలని అర్పిస్తే, అతడు చేసిన జిహాద్ తప్ప, ఇతరత్రా జిహాద్ కంటే కూడా ఈ పది రోజులలో చేసే మంచి పనులకే ఆధిక్యత ఉందని స్పష్టంగా తెలుస్తుంది.

మా పాఠక సోదర సోదరీమణులందరికీ ఇన్షా అల్లాహ్ ఈ పది రోజులు మంచి ప్రతిఫల దినాలు కావాలని కోరుకుంటున్నాము.

### ఖుర్బానీ ఇవ్వడానికి తన దగ్గర ఏమీ లేకపోతే :

ఖుర్బానీ ఇవ్వడానికి స్థోమతలేని వ్యక్తి ఏమి చేయవచ్చో క్రింది హదీస్‌లో వివరించబడింది.

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశ హరులు ఓ వ్యక్తికి చెప్పారు: "నేను ఖుర్బానీ రోజును ఈద్ (పండుగగా) చేసుకోవాలని ఆదేశించబడ్డాను. దానిని ఈ ఉమ్మత్ కొరకు అల్లాహ్ ఆదేశించారు". ఆ వ్యక్తి అన్నాడు: "నాకు ఏమీ

దొరకకపోతే ఓ ఆడగొఱ్ఱె తప్ప దాని పాలద్వారా నాకు మేలు జరగడానికి నాకు ఇవ్వబడింది - నేను దానిని జిబహ్ చేయాలా?''

"లేదు. దానికి బదులు **నీ జుట్టు నుండి కొంత కత్తిరించు** మరియు నీ గోళ్ళను కత్తిరించు, నీ మీసాన్ని ట్రిమ్ చేయి మరియు మర్మాంగపు వెంట్రుకలను తీసివేయి మరియు నీవు అల్లాహ్ దగ్గర పూర్తి ప్రతిఫలాన్ని కలిగి ఉంటావు. నీవు ఖుర్బానీ ఇచ్చినట్లుగానే''
**(నసాయీ, సహీహ్, నెం. 4370, పుస్తకం 43, అధ్యా. 2, సంపుటి 5)**

**హజ్జ్‌లో తప్ప, ముహమ్మద్(స) వారెన్నడూ గుండు చేయించుకోలేదు. ప్రవక్త(స)వారు తన జీవితంలో హజ్జ్ సందర్భంగా ఒక్కసారే గుండు చేయించుకున్నారు. జుట్టు నుండి కొంత కత్తిరించుకుంటే సరిపోతుంది.**

**ఖుర్బానీ ఇచ్చే ప్రదేశం :**

అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు (స) మదీనాలో ఖుర్బానీ ఇచ్చే రోజున జిబహ్ చేశారు. అతను చెప్పారు : "ఆయన(స) **నహ్ర్** (జిబహ్ చేయబడే ఒంటె) **ఇవ్వనట్లయితే,** 'జబీహ' (జిబహ్ చేయబడే గొఱ్ఱెను) సలాత్ చేసే చోట ఖుర్బానీ ఇచ్చేవారు. **(నసాయీ, హసన్, నెం. 4372, పుస్తకం 43, అధ్యా. 2, సంపుటి 5)**

(ఒంటె వంటి పెద్ద జంతువులను జిబహ్ చేస్తే, దానిని నహ్ర్ అంటారు. చిన్న జంతువులను జిబహ్ చేస్తే దానిని 'జబీహ' అంటారు)

ఇబ్నె ఉమర్(రజి) నుండి నాఫి ఉల్లేఖనం "ప్రవక్త(స) తన ఖుర్బానీ పశువులను ముసల్లా దగ్గర జిబహ్ చేసేవారు మరియు ఇబ్నె ఉమర్ అదే విధంగా చేసేవారు.
**(అబూదావూద్, సహీహ్, నెం. 2811, పుస్తకం 16, అధ్యా. 8,9, సంపుటి 3)**

**సలాత్(నమాజ్)కు ముందే ఖుర్బానీ ఇస్తే అది చెల్లదు. మరలా ఖుర్బానీ ఇవ్వాలి.**

"ఎవరైతే సలాత్‌కు ముందు ఖుర్బానీ ఇచ్చారో, అదే ప్రదేశంలో మరో గొఱ్ఱెను జిబహ్ చెయ్యాలి మరియు ఎవరైతే (ఇంకనూ) జిబహ్ చేయలేదో, అతనిని అల్లాహ్ పేరుతో జిబహ్ చేయనివ్వండి'' (జున్‌దుబ్ బిన్ సుఫ్యాన్ ఉల్లేఖనం, **నసాయీ, సహీహ్, నెం. 4373, పుస్తకం 43, అధ్యా. 4, సంపుటి 5)**

**ఖుర్బానీ కొరకు అనుమతించని జంతువులు :**

ఏ పశువులను ఖుర్బానీ కొరకు అల్లాహ్ యొక్క సందేశహరులు ఇష్టపడేవారు కాదో లేక నిషేధించారో క్రింది హదీస్‌లో చెప్పబడింది. ముహమ్మద్(స)వారు చెప్పిన మాటలు :

"నాలుగు (రకాలు) ఖుర్బానీ కొరకు పనికి రావు : స్పష్టంగా ఒక కన్ను బావుండని జంతువు. స్పష్టంగా అనారోగ్యంతో ఉన్న జంతువు. స్పష్టంగా కుంటి నడకతో నడవలేని జంతువు. ఎముకులలో గుజ్జు కూడా లేనట్లుండే కృశించిపోయిన జంతువు''
(అబూ అజ్‌జహ్హాక్ ఉబైద్ బిన్ ఫైరుజ్ ఉల్లేఖనం, **నసాయీ, సహీహ్, నెం. 4374, పుస్తకం 43, అధ్యా. 5, సంపుటి 5)**

అంటే అనారోగ్యంగా ఉందని స్పష్టంగా తెలియాలి. అదే విధంగా దాని కన్ను బావుండని విషయం కూడా స్పష్టంగా తెలిసుండాలి. కుంటడం విషయంలో కూడా స్పష్టం కావాలి.

**మరో ఉల్లేఖనంలో -**

"అల్లాహ్ యొక్క సందేశహరులు(స) (పశువుల) కళ్ళను మరియు చెవులను పరీక్షించమని మరియు చెవుల ముందరి భాగం నుండి చీలిక ఉన్న జంతువును, చెవుల వెనుకభాగం నుండి చీలిక ఉన్న జంతువును, తోక కత్తిరించబడిన జంతువును, చెవిపై రంధ్రమున్న జంతువును జిబహ్ చేయవద్దని ఆదేశించారు''. (అలీ(రజి) ఉల్లేఖనం, **నసాయీ, హసన్, నెం. 4377, పుస్తకం 43, అధ్యా. 8, సంపుటి 5)**

"అల్లాహ్ యొక్క సందేశహరులు(స) పగిలిన కొమ్ముకున్న జంతువును ఖుర్బానీ ఇవ్వడాన్ని మాకు అనమతించ లేదు. నేను (ఉల్లేఖకుడు) సయీద్ బిన్ ముసయ్యబ్‌తో ప్రస్తావించాను. అతడు చెప్పాడు : "ఔను, సగం లేక ఎక్కువ (భాగం) కొమ్ము లేనట్లయితే'' (అలీ(రజి) ఉల్లేఖనం, **నసాయీ, హసన్, నెం. 4382, పుస్తకం 43, అధ్యా. 12, సంపుటి 5)**

పై హదీస్‌లో ఉల్లేఖకుల మాటలను బట్టి తెలిసేది ఏమిటంటే సగం లేదా అంతకంటే ఎక్కువ కొమ్ము లేని జంతువు.

**అరబీ భాషలో పశువుల వయస్సులను బట్టి వాటికి ప్రత్యేకమైన పేర్లున్నాయి. తరువాత రాబోయే హదీస్‌లు అర్థం కావాలంటే వాటి గురించి తెలుసు కోవడం తప్పనిసరి.**

**జజ'ఆ :** నాలుగు సంవత్సరాల వయస్సున్న ఆడ ఒంటె/ ఒక సంవత్సరం కంటే ఎక్కువ రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సుండే గొఱ్ఱె/ 3 సంవత్సరాల వయస్సున్న ఆవు లేక 5 సం။ల వయస్సుండే గుఱ్ఱం.

**ముసిన్నా :** మూడు సంవత్సరాల వయస్సుండే ఆడ పశువు / 3వ సంవత్సరంలో ప్రవేశించిన ఎద్దు లేక ఆవు.

సనీ (లేక) సనియ్యా రెండు పళ్ళు కలిగి ఉన్నది.

**జాబిర్(రజి) ఉల్లేఖనం :** అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: ముసిన్నా తప్ప దేనినీ జిబహ్ ఇవ్వకండి. అది కష్టమైతే జజ'ఆ గొఱ్ఱెను జిబహ్ ఇవ్వవచ్చు''
**(నసాయీ, సహీహ్, నెం. 4383, పుస్తకం 43, అధ్యా. 13, సంపుటి 5)**

**ఉఖ్బా బిన్ అమ్ర్ ఉల్లేఖనం :** అల్లాహ్ యొక్క సందేశహరులు(స) కొన్ని ఖుర్బానీ పశువులను తన అనుచరుల మధ్య పంచారు. మరియు నా వంతుగా జజ'ఆ గొఱ్ఱె వచ్చింది. నేను అన్నాను : ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా! నాకు జజ'ఆ గొఱ్ఱె వచ్చింది : ఆయన(స) అన్నారు: 'జిబహ్ ఇవ్వు'
**(నసాయీ, సహీహ్, నెం. 4385, పుస్తకం 43, అధ్యా. 13, సంపుటి 5)**

## 10మందికి ఒక ఒంటె, 7గురికి ఒక ఆవు

ఖుర్బానీ కొరకు ఇచ్చేవి - ఒంటెలు, ఆవులు, మేకలు మరియు గొఱ్ఱెలు. ప్రతీ ఒక్కరూ పెద్ద పశువులను ఖుర్బానీ ఇవ్వలేరు. ఎవరి ఆర్థిక స్థోమతను బట్టి వారు ఇవ్వవచ్చు. చిన్న జంతువైన మేక లేదా గొఱ్ఱెను ఇవ్వడం తప్పనిసరి (వాజిబ్). ఆవు లేదా ఒంటెను ఖుర్బానీ ఇవ్వడం ప్రశంస నీయమైనది.

**ఒక జంతువును ఇవ్వడం తప్పనిసరి. ఒకటి కంటే ఎక్కువ ఇస్తే ప్రశంసనీయం.**

**ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనం :** ఒక ప్రయాణంలో మేము అల్లాహ్ యొక్క సందేశహరులతో ఉన్నాము. ఖుర్బానీ ఇవ్వవలసిన రోజు వచ్చినప్పుడు, ఒంటెను పదిమంది మధ్య మరియు ఆవును ఏడుగురి మధ్య పంచుకున్నాము

**(నసాయీ, హసన్, నెం. 4397, పుస్తకం 43, అధ్యా. 15, సంపుటి 5)**

అంటే పది కుటుంబాల తరపున ఒక ఒంటెను ఖుర్బానీ ఇవ్వవచ్చు. 7 కుటుంబాల తరపున ఓ ఆవును ఖుర్బానీ ఇవ్వవచ్చు. ఈ పంపకాలు కేవలం 'ఖుర్బానీ'కు మాత్రమే వర్తిస్తాయి. అఖీఖాకు కాదు.

ఒక కుటుంబానికి ఒక ఖుర్బానీ పశువునివ్వాలి. ఉమ్మడి కుటుంబం అయితే, ఎన్ని కుంటుంబాలు కలిసి ఉన్నాయో అన్ని పశువులను ఇవ్వవలసి ఉంది.

## జిబహ్ సరిగ్గా చేయాలి :

షద్దాద్ బిన్ ఔస్ ఉల్లేఖనం : నేను విన్నాను. రసూలుల్లాహ్(స) చెప్పారు : ''అల్లాహుతాలా అన్నింటిలోనూ మేలును ఏర్పరిచారు, కాబట్టి మీరు చంపేటప్పుడు, సరిగ్గా చంపండి మరియు మీరు జిబహ్ చేస్తున్నప్పుడు, సరిగా జిబహ్ చేయండి. మీలో ఒకరు కత్తిని పదునుగా ఉంచండి మరియు **జిబహ్ చేసే జంతువుకు బాధ లేకుండా చేయండి**.

**(నసాయీ, సహీహ్, నెం. 4416, పుస్తకం 43, అధ్యా. 26, సంపుటి 5)**

అనస్(రజి) చెప్పారు : రసూలుల్లాహ్(స) రెండు కొమ్ములున్న అమ్‌లా (బలిసిన) గొఱ్ఱె పోతులను అల్లాహ్ పేరును ఉచ్చరిస్తూ అల్లాహు అక్బర్ చెబుతూ జిబహ్ చేశారు. ఆయన తన పాదాన్ని వాటి ప్రక్కలపై ఉంచి వాటిని స్వయంగా తన చేతితో జిబహ్ చేస్తుండగా నేను చూశాను''

**(నసాయీ, సహీహ్, నెం. 4420, పుస్తకం 43, అధ్యా. 28, సంపుటి 5)**

జిబహ్ చేయడం కూడా ఓ ఆరాధనే. ఏ వ్యక్తి అయినా సరే స్వయంగా జిబహ్ చేయడమే ఉత్తమం. ఆ తరువాత జంతువు యొక్క చర్మాన్ని తీసివేయడం, మాంసం కోయడం మొదలైన పనులు ఎవరి చేతనైనా చేయించవచ్చు.

## 3 రోజులు దాటితే ఖుర్బానీ మాంసాన్ని తినవచ్చా?

ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖనం: అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మూడురోజుల తరువాత ఖుర్బానీ పశువుల మాంసాన్ని తినడాన్ని నిరోధించారు.

**(నసాయీ, సహీహ్, నెం. 4428, పుస్తకం 43, అధ్యా. 35, సంపుటి 5)**

మూడు రోజుల తరువాత అంటే ఖుర్బానీ ఇచ్చిన 3 రోజుల తరువాత అని అర్థం. అయితే ఈ నిరోధం కేవలం ప్రారంభకాలంలోనే ఉంది. అప్పట్లో ఖుర్బానీ ఇచ్చేవారి సంఖ్య చాలా తక్కువ మరియు పేదవారు, అగత్యపరులు ఎక్కువగా ఉండేవారు. అందుకని పేదవారికి మేలు జరగాలని, మూడు రోజులలో ఆ మాంసం వారికి పంచబడే విధంగా ఆ నిరోధం అమలులో ఉండేది. ఆ తరువాతి కాలంలో పేదరికం తగ్గింది. మరియు ఖుర్బానీ ఇచ్చేవారి సంఖ్య పెరిగింది. తరువాత ఆ నిరోధం ఎత్తి వేయబడింది.

నుబైషా ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: 'మిమ్మల్ని నేను వాటి మాంసాన్ని మూడు రోజుల తరువాత తినడం నుండి నిరోధించాను ప్రతీ ఒక్కరూ దానిలో భాగాన్ని పొందాలని మాత్రమే. అల్లాహ్ ఇప్పుడు మనకు సమృద్ధిని అనుగ్రహించారు కాబట్టి, తినండి. నిల్వ ఉంచుకోండి మరియు ప్రతిఫలాన్ని అర్థించండి (దానాలు చేయడం ద్వారా). వాస్తవానికి, ఈ రోజులు తిని, త్రాగి మరియు అల్లాహ్‌ను స్మరణం చేసుకునే రోజులు.

**(అబూదావూద్, సహీహ్, నెం. 2813, పుస్తకం 16, అధ్యా. 9, సంపుటి 3)**

**ఏదైనా పక్షినిగాని, జంతువునుగాని కట్టివేసి, దానిని లక్ష్యంగా చేసుకుని దానిపై బాణాలు వేయడం మొదలైన వాటిని ముహమ్మద్(స)వారు నిషేధించారు.**

అబూ సాలబహ్ చెప్పారు : ''రసూలుల్లాహ్(స)వారు అన్నారు: లక్ష్యం కొరకు తీసుకున్న జంతువు ధర్మసమ్మతం కాదు''

**(నసాయీ, సహీహ్, నెం. 4443, పుస్తకం 43, అధ్యా. 41, సంపుటి 5)**

ఇబ్నె ఉమర్ ఉల్లేఖనం : ప్రాణమున్న దేనినైనా లక్ష్యంగా చేసుకున్న వారిని రసూలుల్లాహ్(స)వారు శపించారు.

**(నసాయీ, సహీహ్, నెం. 4446, పుస్తకం 43, అధ్యా. 41, సంపుటి 5)**

## రూపాన్ని వికృతం చేయకూడదు

ఇబ్నె ఉమర్(రజి) చెప్పారు : రసూలుల్లాహ్(స)వారు (ఇలా) చెప్పగా విన్నాను: జంతువు రూపాన్ని వికృతంగా చేసేవానిని అల్లాహ్ శపించుగాక!

**(నసాయీ, సహీహ్, నెం. 4447, పుస్తకం 43, అధ్యా. 41, సంపుటి 5)**

## ఊరికినే అకారణంగా ఏ పక్షిని చంపకూడదు :

అమ్ర్ బిన్ షరీద్ చెప్పారు :
షరీద్ చెప్పగా నేను విన్నాను, ''రసూలుల్లాహ్(స)వారు చెప్పగా విన్నాను: ''ఎవరైనా ఓ చిన్న పక్షిని కారణం లేకుండా చంపితే, అది పునరుత్థాన దినమున అల్లాహ్‌ను హృదయపూర్వకంగా అడుగుతుంది. ఓ ప్రభూ! ఫలానా ఫలానా నన్ను కారణం లేకుండా

చంపాడు మరియు ఏ ఉపయోగం కోసమూ అతను నన్ను చంపలేదు''

**(నసాయి, హసన్, నెం. 4451, పుస్తకం 43, అధ్యా. 42, సంపుటి 5)**

**ఓ పక్షిని అకారణంగా చంపకూడదు. జంతువు రూపాన్ని వికృతంగా చేయకూడదు. ముఖంపై కొట్టకూడదు.**

**ఎక్కడో ఆఫ్ఘనిస్తాన్‌లో ఓ మహిళ ముక్కును ఎవరో కోశారు. ఆమెకు అమెరికాలో ప్లాస్టిక్ సర్జరీ చేశారు. విపరీతమైన పబ్లిసిటీ ఇస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో ఆ సంఘటన ఎందుకొరకు జరిగినా, ఎలా జరిగినా, ఎవరు చేసినా సరే, దానిని ముస్లిములు తీవ్రంగా ఖండిస్తారు.**

**ఎందుకంటే జంతువు ముఖాన్నే వికృతంగా చేయకూడదన్న 'ఇస్లామ్' ఆదేశాన్ని పాటించే ముస్లిమ్, జంతువు కంటే మేలైన మనిషి ముఖాన్ని వికృతంగా ఎలా చేయగలడు!**

**ఖుర్బానీ పశువును జిబహ్ చేసినందుకు / మాంసాన్ని కోసినందుకు రుసుముగా డబ్బు తీసుకోవచ్చుగాని, ఖుర్బానీ పశువునుండి ఏమీ తీసుకోకూడదు.**

అలీ(రజి) ఉల్లేఖనం : బుద్న్ (ఖుర్బానీ కొరకు తెచ్చిన ఒంటెలను) జిబహ్ చేయడాన్ని మరియు వాటి మాంసాన్ని, చర్మాలను మరియు వాటిపై ఉన్న జీనును దానం చేయడాన్ని పర్యవేక్షించమని నన్ను ఆదేశించారు. మరియు కోసిన వ్యక్తికి కోసినందుకుగాను రుసుముగా (దాని నుండి) ఏదీ ఇవ్వవద్దని (ఆదేశించారు).

**(నసాయి, సహీహ్, నెం. 4447, పుస్తకం 43, అధ్యా. 41, సంపుటి 5)**

## ప్రవక్త(స)వారు చేసిన దువా

ఆయిషా(రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) కాళ్ళపై నలుపున్న, కళ్ళ చుట్టూ నలుపున్న మరియు క్రింది భాగం నల్లగా ఉన్న కొమ్ములున్న ఓ గొఱ్ఱెపోతు కొరకు ఆదేశించారు. మరియు అది ఆయన ముందుకు జిబహ్ చేయడం కొరకు తీసుకు రాబడింది. ఆయన చెప్పారు : "ఓ ఆయిషా! కత్తి తీసుకురా''. తరువాత ఆయన చెప్పారు : "రాయితో దానిని బాగా పదును చేయి''. ఆమె అదే విధంగా చేశారు. ఆయన కత్తి మరియు గొఱ్ఱెను తీసుకుని, దానిని నేలపై ఉంచారు జిబహ్ చేయడానికి మరియు చెప్పారు : (బిస్మిల్లాహి అల్లాహుమ్మ! తకబ్బల్ మిన్ ముహమ్మదిన్ వఆలి ముహమ్మదిన్ వమిన్ ఉమ్మతి ముహమ్మదిన్)

అల్లాహ్ పేరుతో, ఓ అల్లాహ్! దీనిని స్వీకరించు. ముహమ్మద్, ముహమ్మద్ కుటుంబం నుండి మరియు ముహమ్మద్ ఉమ్మత్ నుండి. తరువాత దానిని జిబహ్ చేశారు.

మొత్తం ఉమ్మత్ తరపున జిబహ్ చేయడం కేవలం ప్రవక్త(స)వారికి మాత్రమే ప్రత్యేకం.

**(అబూదావూద్, 2792, పుస్తకం 16, అధ్యా. 3,4, సంపుటి 3)**

### దువా

اَللّٰهُمَّ تَقَبَّلْ مِنِّي بِسْمِ اللّٰهِ اَللّٰهُ اَكْبَرُ

**బిస్మిల్లాహి, అల్లాహుమ్మ! తకబ్బల్ మిన్ని**

**ఆర్భాటాలకు పోవద్దు :**

అబూ సరీహా చెప్పారు : నేను సున్నత్ (ప్రవక్త సాంప్రదాయం) తరువాత నా కుటుంబం నాపై ఒత్తిడి చేయడం ప్రారంభించింది. ప్రజలు ఒకటిగాని రెండుగాని గొఱ్ఱెలను ఖుర్బానీ ఇస్తున్నారు, కాని ఇప్పుడు మన పొరుగువారు మనల్ని పిసినారి అని పిలుస్తున్నారు.''

**(ఇబ్నెమాజా, 3148, పుస్తకం 26, అధ్యా. 10, సంపుటి 4)**

అతా బిన్ యసార్ ఉల్లేఖనం : నేను అబూ అయ్యూబ్ అన్సారీని అడిగాను : రసూలుల్లాహ్(స)వారి కాలంలో మీ మధ్య ఖుర్బానీ ఏ విధంగా ఇవ్వబడుతుండేది? అతను చెప్పారు : ప్రవక్త(స)వారి కాలంలో ఒక వ్యక్తి ఒక గొఱ్ఱెను ఖుర్బానీ ఇచ్చేవాడు తన తరపున మరియు తన కుటుంబ సభ్యుల తరపున, వారు అందులో నుండి కొంత తినేవారు మరియు కొంత ఇతరులకు ఇచ్చేవారు. తరువాత ప్రజలు పోటీపడటం ప్రారంభించారు మరియు (ఈ రోజున) నీవు చూస్తున్నట్లుగా ఇలా మారిపోయింది.''

**(ఇబ్నెమాజా, 3147, పుస్తకం 26, అధ్యా. 10, సంపుటి 4)**

కాబట్టి ఒక గొఱ్ఱె ఒక కుటుంబానికి సరిపోతుంది. ఎక్కువ ఖుర్బానీ ఇవ్వడం ప్రశంసనీయమే. కాని అది అల్లాహ్‌పై భయభక్తులతో ఇవ్వాలి. తోటివారి ముందు గొప్ప కోసం ఇస్తే, ఈ పోటీ అనేది 'ఖుర్బానీ' యొక్క ఉద్దేశాన్నే మార్చివేసి, ఫలితం దక్కకుండా చేస్తుంది.

**'అరఫా' రోజున ఉపవాసం**

అబూ ఖతాదా ఉల్లేఖనం : "......అరఫా' రోజున ఉపవాసం గురించి అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అడగబడ్డారు. ఆయన చెప్పారు: అది ముందు వచ్చిన మరియు రాబోవు సంవత్సరం (పాపాలకి) పరిహారమౌతుంది.''

**(సహీహ్ ముస్లిమ్, 2746, పుస్తకం 13, అధ్యా. 36, సంపుటి 3)**

పై హదీస్‌లో 'అరఫా' రోజున అని స్పష్టంగా చెప్పారు. అరఫా రోజు లెక్కింపు 'మక్కా' పట్టణం ప్రకారంగా జరుగుతుంది. ఎందుకంటే అది హజ్జ్‌కు సంబంధించింది. హజ్జ్ మక్కాలో మాత్రమే జరుగుతుంది. ప్రపంచమంతా కాదు. కనుక మక్కాలో ఏ రోజు అయితే అరఫా అవుతుందో, ఆ రోజు మనం ఇక్కడ ఉపవాసం ఉండాలి. రమదాన్ నెల విషయం వేరు. పాఠకులు గమనించగలరు.

**ఖుర్బానీ మాంసాన్ని పంచడం**

ఈ వ్యాసంలో అందించిన ఖుర్'ఆన్ ఆయత్‌ల ప్రకారం మరియు ముహమ్మద్(స)వారి బోధనల ప్రకారం, యాచించే పేదవారికి మరియు యాచించని పేదవారికి పంచాలి. పేదవారు అన్నప్పుడు ఎల్లప్పుడూ బంధువులలో పేదవారికి ప్రాధాన్యత ఎక్కువ ఉంటుంది.

సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిమ్, అబూదావూద్, తిర్మిజీ, నసాయీ, ఇబ్నెమాజా హదీస్ గ్రంథాలలో మాంసాన్ని నిర్దిష్టమైన సమాన భాగాలుగా చేసి పంచమని చెప్పిన హదీస్‌లు లేవు.

ఖుర్బానీ పశువుల మాంసాన్ని, ఖుర్బానీ ఇచ్చిన కుటుంబం తినవచ్చు, నిల్వ ఉంచుకోవచ్చు. ఎంత పంచాలనేది వారి ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. దానిని పేదవారికి పంచాలి.

మన స్నేహితులు, బంధువులు కూడా ఖుర్బానీ ఇచ్చినప్పుడు, మనం వారికి కూడా మన ఖుర్బానీ మాంసాన్ని పంచడం కంటే ఖుర్బానీ ఇవ్వలేని పేదవారికి పంచడం ఉత్తమమని మా అభిప్రాయం.

ముస్లిములకి మాత్రమే కాకుండా, ముస్లిమేతర పేదలకు కూడా ఖుర్బానీ మాంసాన్ని పంచవచ్చు.

## ఖుర్బానీ - ముఖ్య విషయాలు క్లుప్తంగా

- **ఖుర్బానీ ఇవ్వాలనుకున్న వారు జుల్ హిజ్జా నెల 10 రోజుల వరకూ, అంటే ఖుర్బానీ పూర్తయ్యే వరకూ జుట్టు కత్తిరించుకో కూడదు.**
- **ఈ 10రోజులలో చేసే మంచిపనులు ఇతర రోజులలో చేసే మంచి పనులకంటే అల్లాహ్‌కు ఎంతో ప్రియమైనవి.**
- **అరఫా రోజున ఉపవాసముండి, ఆ రోజుకి ముందు సంవత్సరం మరియు రాబోవు సంవత్సరంలో జరిగే పాపాలకు పరిహారం (కప్ఫారా) అవుతుంది ఆ ఉపవాసం.**
- **స్థోమత గల ప్రతి ఒక్కరూ ఖుర్బానీ ఇవ్వండి.**
- **ఈద్ నమాజ్ పూర్తి కాకముందు ఖుర్బానీ ఇవ్వకూడదు.**
- **ఒక కుటుంబం కొరకు ఒక ఖుర్బానీ పశువు**
- **ఒక ఒంటె 10 కుటుంబాల కొరకు, ఒక ఆవు 7 కుటుంబాల కొరకు**
- **4 రకాల జంతువులు ఖుర్బానీ కొరకు పనికిరావు.**
- **ప్రజల ముందు చూపడానికి ఎక్కువ ఖరీదుగల జంతువును జిబహ్ చేస్తే ఎక్కువ పుణ్యమేమీ లభించదు.**
- **జిబహ్ చేసినప్పుడు సరిగ్గా చేయాలి.**
- **జిబహ్ చేసినవారికి అందుకొరకు డబ్బు రూపేణా లేదా మరో రూపేణా చెల్లించండి. జిబహ్ చేసినందుకుగానూ ఖుర్బానీ పశువుల నుండి రుసుముగా ఏదీ ఇవ్వకూడదు.**
- **ఖుర్బానీ మాంసాన్ని పేదలకు పంచాలి. సమాన భాగాలు చేయవలసిన అవసరం లేదు. మన కుటుంబం కొరకు కొంత ఉంచుకుని, మిగలినది పంచాలి. పేదలకు ఎప్పుడు పంచాలని అనుకున్నా సరే, మొదట బంధువులలో పేదవారికి తరువాత ఇతర పేదలకు పంచాలి.**

**అసమాన త్యాగానికి గుర్తుగా చేసుకున్న పండుగే - బక్‌రీద్. ఈ పండుగ సందర్భంగా ఇంటిల్లపాది కొత్త బట్టలు కొనుక్కుని ఆనందంగా గడుపుతారు. పండుగ అంటే ఆనందంగా గడపవలసిందే. కాని చాలామంది ఖుర్బానీ ఇవ్వరు. స్థోమత లేనివారు ఎలాగూ ఖుర్బానీ ఇవ్వలేరు. ఒక మధ్య తరగతి కుటుంబం కొత్త బట్టల కొరకు కనీసం 1000 రు॥లు అయినా ఖర్చు పెడతారు. కనీసం ఆ డబ్బుతో ఓ పెద్ద ఖుర్బానీ జంతువులో వాటా తీసుకోవచ్చు. అలా అయితే కొత్త బట్టలు త్యాగం చేయాలా? అని అడిగే వారుండవచ్చు. వారు మరొక్కసారి విశ్వాసం మరియు త్యాగం వ్యాసాన్ని చదవండి.**

మా పాఠకులందరికీ




~ శాంతిబాట టీమ్

# ఖుర్బానీ విషయానికి సంబంధించి ఎంచబడిన కొన్ని ముఖ్యమైన ఖుర్'ఆన్ ఆయత్‌లు

మరియు మేము ఇబ్రాహీమ్‌కు ఈ (కాబా) గృహం యొక్క స్థలాన్ని నిర్దేశించి అతనితో : "ఎవ్వరినీ నాకు సాటిగా (భాగస్వాములుగా) కల్పించకు. మరియు నా గృహాన్ని తవాఫ్ (ప్రదక్షిణ) చేసేవారి కొరకు, నమాజ్ చేసేవారి కొరకు, రుకూ (వంగే) మరియు సజ్దా (సాష్టాంగం) చేసేవారి కొరకు పరిశుద్ధంగా ఉంచు" అని అన్నాము.

మరియు ప్రజలకు హజ్జ్ యాత్రను గురించి ప్రకటించు : వారు పాదచారులుగా మరియు ప్రతి బలహీనమైన ఒంటె (సవారీ)మీద, విశాల (దూర) ప్రాంతాల నుండి మరియు కనుమల నుండి నీ వైపుకు వస్తారు.

వారు, తమ కొరకు ఇక్కడ ఉన్న ప్రయోజనాలను అనుభవించ డానికి మరియు ఆయన వారికి జీవనోపాధిగా ప్రసాదించిన పశువుల మీద, నిర్ణీత దినాలలో అల్లాహ్ పేరును స్మరించి (జిబహ్ చేయడానికి).

కావున దానిని (వాటి మాంసమును) తినండి మరియు లేమికి గురి అయిన నిరుపేదలకు తినిపించండి.

(ఖుర్'ఆన్ 22:26-28)

మరియు ప్రతి సమాజానికి మేము ధర్మాచారాలు (ఖుర్బానీ పద్ధతి) నిర్ణయించి ఉన్నాము. మేము వారి జీవనోపాధి కొరకు ప్రసాదించిన పశువులను, వారు (వధించేటప్పుడు) అల్లాహ్ పేరును ఉచ్ఛరించాలి. ఎందుకంటే మీఅందరి ఆరాధ్యదైవం ఆ ఏకైక ఆరాధ్యుడు (అల్లాహ్)! కావున మీరు ఆయనకు మాత్రమే ముస్లిము (విధేయు)లై ఉండండి. మరియు వినయ విధేయతలు గలవారికి శుభవార్త నివ్వు.

(వారికి) ఎవరి హృదయాలైతే, అల్లాహ్ పేరు ఉచ్ఛరించబడినప్పుడు భయంతో వణికిపోతాయో మరియు ఆపదలలో సహనం వహిస్తారో మరియు నమాజ్ స్థాపిస్తారో మరియు వారికి ప్రసాదించిన జీవనోపాధి నుండి ఇతరులపై ఖర్చు చేస్తారో!

ఖుర్బానీ పశువులను, మేము మీ కొరకు అల్లాహ్ యొక్క చిహ్నాలుగా చేశాము, మీకు వాటిలో మేలున్నది. కావున వాటిని (ఖుర్బానీ కొరకు) నిలబెట్టి వాటిపై అల్లాహ్ పేరును ఉచ్ఛరించండి. అవి (ప్రాణం విడిచి) ప్రక్కల మీద పడిపోయిన తరువాత మీరు వాటిని తినండి మరియు యాచించని పేదలకు మరియు యాచించే పేదలకు కూడా తినిపించండి. ఈ విధంగా మేము వాటిని మీకు ఉపయుక్తంగా చేశాము, బహుశా మీరు కృతజ్ఞులౌతారేమోనని.

(ఖుర్'ఆన్ 22:34-36)

**వాటి మాంసంగానీ, వాటి రక్తం గానీ అల్లాహ్‌కు చేరవు! కాని మీ భయభక్తులే ఆయనకు చేరుతాయి. మీకు సన్మార్గం చూపినందుకు, మీరు అల్లాహ్ ఘనతను కొనియాడటానికి, ఈ విధంగా ఆయన వాటిని మీకు వశపరిచాడు. సజ్జనులకు శుభార్తను వినిపించు.**

(ఖుర్'ఆన్ 22:37)

# ముహమ్మద్(స) వారు చేసిన హజ్జ్

జాఫర్ బిన్ ముహమ్మద్ ఆయన తండ్రి నుండి ఉల్లేఖించారు. ఆయన చెప్పారు, "మేము జాబిర్ బిన్ అబ్దుల్లాహ్‌ను సందర్శించాము. మేము ఆయన దగ్గరకు వచ్చినప్పుడు, ఆయన పరిచయం చేసుకోమని మమ్మల్ని అడిగారు, నా వంతు వచ్చేసరికి నేను చెప్పాను : 'నేను ముహమ్మద్ బిన్ అలీ బిన్ హుస్సేన్'. ఆయన తన చేతిని నా తలపై ఉంచి, నా చొక్కా యొక్క పై గుండీ మరియు మధ్య గుండీ తీసి, ఆయన చేతిని నా ఛాతీ మధ్య ఉంచి – ఆ సమయానికి నేను చిన్నవాడిని – చెప్పారు : 'స్వాగతం, బడలిక తీర్చుకోండి. ఓ మేనల్లుడా! నీవు ఏమి అడగాలనుకుంటున్నావో అది అడుగు'. కాబట్టి, నేను ఆయనని అడిగాను. ఆయన గుడ్డివారు. నమాజ్‌కు సమయం అయినప్పుడు, ఆయన నిలుచుని ఒక వస్త్రాన్ని కప్పుకున్నారు. దానిని ఆయన భుజంపై ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్న ప్రతీసారి, దాని పరిమాణం (సైజు) చిన్నది కావడం వలన పడిపోతూ ఉంది. మాతో సలాత్ (నమాజ్) చేశారు మరియు ఆయన దుప్పటి ఆయన ప్రక్కనున్న అలమరపై ఉంది.

నేను అప్పుడు చెప్పాను : **'రసూలుల్లాహ్(స)వారి 'హజ్జ్' గురించి నాకు తెలియజేయండి'**. ఆయన తన వ్రేళ్ళను కదుపుతూ ఉన్నారు వాటిలో 9 వ్రేళ్ళను మూసేవరకూ. మరియు చెప్పారు : ముహమ్మద్(స) హజ్జ్ చేయకుండా 9 సంవత్సరాలున్నారు. తరువాత, 10వ సంవత్సరంలో ఆయన(స) హజ్జ్ కొరకు వెళుతున్నట్లు ప్రజలకు ప్రకటించారు. కాబట్టి అసంఖ్యాకంగా ప్రజలు 'మదీనా'కు వచ్చారు. వారంతా రసూలుల్లాహ్(స) వారిని అనుసరించాలని మరియు ఆయన ఎలా చేస్తే ఆ విధంగా చేయాలని.

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) బయలుదేరారు మరియు మేమంతా (కూడా) ఆయనతో (హజ్జ్ కొరకు) బయలుదేరాము. మేము 'జుల్-హులైఫా'కు వచ్చినప్పుడు, అస్మా బిన్తె హుమైస్ "ముహమ్మద్ బిన్ అబూబకర్"కి జన్మనిచ్చారు. కాబట్టి ఆమె ఒకరిని రసూలుల్లాహ్(స)వారి దగ్గరికి పంపారు. ఆమె ఏమి చేయాలో అడగడానికి. ఆయన సమాధానమిచ్చారు : గుసుల్ చేసి వస్త్రాన్ని మర్మాంగం చుట్టూ బిగుతు చేసి, ఇహ్రామ్ స్థితిలోకి ప్రవేశించు".

"రసూలుల్లాహ్(స)వారు మస్జిద్‌లో నమాజ్‌చేసి ఆయన(స)యొక్క ఒంటె 'ఖస్వా'పై కూర్చుని (పయనమయ్యారు) అల్-బైదా శిఖరానికి చేరేవరకూ. జాబిర్ అన్నారు : ఆయన ముందు నా కనుచూపుమేరంత ప్రజలు స్వారీ చేస్తూ (కొందరు), నడుస్తూ (కొందరు) ఉన్నారు. దాదాపు అంత సంఖ్యలో ఆయన కుడివైపున, మరియు దాదాపు అంతే సంఖ్యలో ఆయన ఎడమ వైపున మరియు వారికి సరిపడినంత మంది ఆయన(స) వెనుక ఉన్నారు. మరియు ముహమ్మద్(స)వారు మా మధ్యలో ఉన్నారు. ఆయనపై ఖుర్'ఆన్ అవతరించబడుతూ ఉంది మరియు దాని అర్థం ఆయనకు తెలుసు. కాబట్టి రసూలుల్లాహ్(స)వారు ఏమి చేశారో మేము అది చేశాము. రసూలుల్లాహ్(స)వారు తౌహీద్ యొక్క తల్బియా పైకి పలకడం ప్రారంభించారు.

**లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లా షరీక లక లబ్బైక్! ఇన్నల్-హమ్ద వన్-ని'మాత లక వల్-ముల్క్ లాషరీక లక్**

(నేను హాజరయ్యాను, ఓ అల్లాహ్, నేను హాజరయ్యాను. నేను హాజరయ్యాను. నీకు భాగస్వామి లేడు. నేను వస్తున్నాను. పొగడ్తలన్నీ మీ కొరకే మరియు (మేము పొందే) అన్ని అనుగ్రహాలు నీవే, విశ్వ సామ్రాజ్యం నీదే. నీకు భాగస్వామి లేడు).

మరియు ప్రజలు తల్బియా చెప్పారు (ఇప్పటి)వారు చెబుతున్నట్లు. మరియు రసూలుల్లాహ్(స)వారు ఏదైనా విషయాలను చెప్పుకోవడం నుండి వారిని ఆపలేదు. కాని ఆయన తన 'తల్బియా'ను తిరిగి కొనసాగించారు. జాబిర్ చెప్పారు : మరియు మేము హజ్జ్ చేయడం కొరకు మాత్రమే సంకల్పించుకున్నాము. ఆయనతో (కాబా) గృహానికి వెళ్ళేవరకూ (మాకు) **'ఉమ్రహ్' గురించి సైతం తెలియదు.**, ఆయన (నల్లరాయి) మూలను తాకారు. మరియు వడివడిగా మూడు ప్రదక్షిణాలు మరియు నాలుగవదాని కొరకు మామూలుగా (అంటే వడివడిగా కాకుండా మామూలుగా) ఆయన నడిచారు. తరువాత ఇబ్రాహీమ్ స్థలానికి ఆయన వెళ్ళి పఠించారు :

> **"మరియు ఈ (కాబా) గృహాన్ని మేము మానవులకు తరచుగా సందర్శించే కేంద్రం (పుణ్యస్థలం)గా మరియు శాంతినిలయంగా చేసి, ఇబ్రాహీమ్ నిలబడిన చోటును మీరు నమాజ్ చేసే స్థలంగా చేసుకోమన్న విషయాన్ని (జ్ఞాపకం చేసుకోండి). మరియు మేము ఇబ్రాహీమ్ మరియు ఇస్మాయీల్‌లకు : "నా ఈ గృహాన్ని ప్రదక్షిణ చేసేవారి కొరకూ, ఏకాంత ధ్యానం (ఏతికాఫ్) పాటించే వారికొరకూ, వంగే (రుకూ) వారి కొరకూ మరియు సజ్దాలు చేసేవారి కొరకూ పరిశుద్ధంగా ఉంచండి" అని నిర్దేశించాము"** (ఖుర్'ఆన్ 2:125)

(కాబా) గృహానికి మరియు ఆయనకి మధ్య (ఇబ్రాహీమ్ నిలబడిన) స్థలం ఉన్నట్లుగా ఆయన(స) నిలుచున్నారు.

*- అతను చెప్పారు : నా తండ్రి చెప్పారు ఇబ్న్ నుఫైల్ మరియు ఉస్మాన్ చెప్పారు, సులైమాన్ చెప్పారు. నాకు తెలియదుగాని ప్రవక్త(స)వారి నుండి అతడు దానిని ప్రస్తావించారు -*

మరియు ఆయన(స) రెండు రకాత్‌లలో 'సూరహ్ ఇఖ్లాస్' మరియు సూరహ్ అల్-కాఫిరూన్ పఠించారు. ఆయన తిరిగి గృహానికి వచ్చి (నల్లరాయి ఉన్న) మూలను ముట్టుకున్నారు మరియు సఫా ద్వారం నుండి బయటికి వెళ్ళిపోయారు.

ఆయన సఫాను సమీపించినప్పుడు ఆయన పఠించారు :

**“నిశ్చయంగా సఫా మరియు మర్వాలు అల్లాహ్ చూపిన చిహ్నాలు. కావున ఎవడు (కాబా) గృహానికి హజ్జ్ లేక ఉమ్రహ్ కొరకు పోతాడో, అతడు ఈ రెంటి మధ్య ప్రదక్షిణ (స'యీ) చేస్తే, అతనికి ఎట్టి దోషం లేదు. మరియు ఎవడైనా స్వేచ్ఛాపూర్వకంగా మంచి కార్యం చేస్తే! నిశ్చయంగా, అల్లాహ్ కృతజ్ఞతలను ఆమోదించేవాడు, సర్వజ్ఞుడు”.** (ఖుర్'ఆన్ 2:158)

తరువాత ఆయన చెప్పారు: దానితో మనం ప్రారంభిద్దాం దేనితో అయితే అల్లాహ్ ప్రారంభించారో. మరియు ఆయన అస్-సఫా తో ప్రారంభించారు. దానిపైకి ఆయన ఎక్కారు గృహాన్ని చూడగలిగేటంత వరకూ, మరియు ఆయన తక్బీర్ (అల్లాహు అక్బర్) చెప్పారు, మరియు అల్లాహ్ యొక్క ఏకత్వం గురించి గట్టిగా అన్నారు మరియు చెప్పారు:

'లా ఇలాహ ఇల్లల్లాహ్ వహదహు లాషరీక లహు, లహుల్-ముల్కు వ లహుల్ హమ్దు యుహ్యీ వయుమీతు వహ్వ అలా కుల్లి షైఇన్ ఖధీర్ లా ఇలాహ ఇల్లల్లాహు వహదహు, అన్‌జజ వదహు, వనసర అబ్దహు, వ హజమల్-అహ్‌జాబ వహ్‌దహ్' (ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప మరియు ఆయన ఒక్కరు. అతనికి భాగస్వామి లేడు. ఆయనదే (విశ్వ) సామ్రాజ్యం. ఆయనకే పొగడ్తలన్నీ. మరియు ఆయనే చావు పుట్టుకలను ఇచ్చేవాడు మరియు ఆయన అన్నింటిని చేయగల సమర్థుడు. ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప. అతను ఒక్కడే. ఆయన తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడు, అతని దాసునికి సహాయం చేశాడు మరియు శతృ సమూహాలను నాశనం చేసింది ఆయనే). తరువాత ఆయన వారి మధ్య దువా చేశారు. మరియు ఈ పదాలను 3 సార్లు మరలా మరలా చెప్పారు. ఆయన(స) తరువాత మర్వాకి దిగారు. పర్వత వాలును దిగినప్పుడు, వడివడిగా లోయలోకి నడిచారు మరియు ఆయన(స) పైకి తిరిగి వచ్చినప్పుడు మర్వా చేరుకునేవరకూ మామూలుగా నడిచారు. . అక్కడ సఫా వద్ద చేసినట్లే చేశారు. మర్వా దగ్గర చివరి తవాఫ్ (ప్రదక్షిణ) పూర్తి చేసినప్పుడు, ఆయన(స) అన్నారు:

'ఇప్పుడు నాకు ఏదైతే తెలిసిందో అది ముందుగా తెలిసి ఉంటే, నేను నా ఖుర్బానీ పశువులను నాతో తీసుకువచ్చేవాన్ని కాదు, మరియు దీనిని 'ఉమ్రహ్'గా చేసేవాడిని. కాబట్టి మీలో ఎవరయితే మీతో హదీని కలిగి ఉండరో, అతనిని ఇహ్రామ్ స్థితినుండి బయటకి రానివ్వండి, మరియు దీనిని 'ఉమ్రహ్'గా చేసుకోనివ్వండి.

“కాబట్టి ప్రవక్త(స)వారు మరియు హదీ కలిగి ఉన్నవారు తప్ప, ప్రతీ ఒక్కరూ ఇహ్రామ్ స్థితిని వదిలి, వారి జుట్టును కత్తిరించుకున్నారు. సురాఖా బిన్ జు'షుమ్ నిలుచుని అన్నారు: **“ఓ రసూలుల్లాహ్! ఇది ఈ సంవత్సరం కొరకు మాత్రమేనా? లేక ఎప్పటికీనా?”** అప్పుడు రసూలుల్లాహ్(స)వారు ఒకచేతి వ్రేళ్ళను మరోచేతి వ్రేళ్ళతో పెనవేసి చెప్పారు : **'ఉమ్రహ్ హజ్జ్‌తో కలిసే ఉంటుంది. 'కాదు కాదు ఎప్పటికీ, ఎప్పటికీ - కాదు కాదు ఎప్పటికీ ఎప్పటికీ'**

(ఇంకా) చెప్పారు : మరియు అలీ(రజి) యమన్ నుండి ప్రవక్త(స)వారి ఖుర్బానీ పశువులను తనతో తీసుకు వచ్చారు. రంగు అద్దిన వస్త్రాలను ధరించి, కళ్ళకు సుర్మా పెట్టుకున్న ఫాతిమా(రజి) ఇహ్రామ్ స్థితి నుండి బయట ఉండటం ఆయన చూశారు, కాబట్టి అలీ(రజి) ఆమెను మందలించి చెప్పారు : 'ఇది చేయమని నిన్నెవరు ఆదేశించారు?' ఆమె సమాధాన మిచ్చారు 'మా నాన్నగారు'.

“మరియు అలీ(రజి) (తరువాత) చెప్పారు - ఆయన ఇరాఖ్‌లో ఉన్నప్పుడు - నేను ప్రవక్త(స)వారి దగ్గరకు వెళ్ళాను. ఫాతిమా(రజి) చేసిన పనికి సంబంధించి ఆమె ఏమి చెప్పారో దానిపై ఆయన తీర్పును కోరుతూ ఫిర్యాదు చేయడానికి కాబట్టి నేను ఆయనకు ఆమెను మందలించినట్లు మరియు ఆమె తన తండ్రి తనతో ఆ విధంగా చేయమని చెప్పిన విషయం చెప్పాను.”

ఆయన(స) చెప్పారు :'ఆమె సత్యాన్నే చెప్పింది, ఆమె సత్యాన్నే చెప్పింది'. నీవు హజ్జ్‌ను ప్రారంభించినప్పుడు ఏమి చెప్పావు?' (అని అడిగారు). నేను సమాధానమిచ్చాను.

నేను అన్నాను : 'ఓ అల్లాహ్! నేను ఇహ్రామ్‌లోకి వచ్చాను ఏ విధంగానైతే ముహమ్మద్(స)వారు ఇహ్రామ్‌లోకి వచ్చారో'

కాబట్టి ఆయన(స) అన్నారు: అట్లా జరిగితే, నాతో హదీ ఉంది గనుక ఇహ్రామ్ స్థితిని వదలకు.

(జాబిర్ చెప్పడం కొనసాగించారు:) ముహమ్మద్(స)వారు మదీనా నుండి మరియు అలీ(రజి)వారు యమన్ నుండి తీసుకువచ్చిన మొత్తం హదీ (ఖుర్బానీ పశువుల) సంఖ్య 100 అయింది.

కాబట్టి ప్రతీ ఒక్కరూ ఇహ్రామ్ స్థితిని వదిలి జుట్టు కత్తిరించుకున్నారు, ప్రవక్త(స)వారు మరియు ఎవరైతే హదీ (ఖుర్బానీ పశువులు) కలిగి ఉన్నారో వారు తప్ప.

(ఇంకనూ) చెప్పారు : “తర్వియా రోజున (జుల్-హిజ్జా 8వ రోజు), వారు మినాకు బయలు దేరినప్పుడు, వారంతా హజ్జ్ కొరకు ఇహ్రామ్ స్థితిలోకి వచ్చారు. రసూలుల్లాహ్(స)వారు (మినాకు) స్వారీ చేసుకుని వచ్చి జుహ్ర్, అస్ర్, మగ్‌రిబ్, ఇషా మరియు ఫజర్(ఉదయపు) సలాత్ (నమాజ్) అక్కడే చేశారు. ఆయన సూర్యుడు ఉదయించే వరకూ కాస్సేపు నిరీక్షించి, నమ్‌రా దగ్గర వెంట్రుకల (తో తయారుచేసిన) టెంట్‌ను ఏర్పాటు చెయ్యమని ఆదేశించారు. రసూలుల్లాహ్(స)వారు ముందుకు కొనసాగారు.

మరియు ఆయన(స) ముజ్దలిఫా వద్ద మష్'అరిల్ హరమ్ వద్ద ఆగుతారన్న విషయంలో ఖురైషీయులు సందేహ పడలేదు. అజ్ఞాన కాలపు (జాహిలియ్యా) రోజులలో వారు అలాగే చేసేవారు. కాని (ఆ విధంగా జరుగలేదు) రసూలుల్లాహ్(స)వారు అరఫా చేరేవరకూ ముందుకే సాగారు మరియు ఆయన కొరకు నమ్‌రా వద్ద నిలిపిన టెంట్‌ను చూశారు. సూర్యుడు దిగడం మొదలయ్యేవరకూ ఆయన అక్కడే విడిది చేశారు.

ఆయన తరువాత తన ఒంటె ఖస్వాను సిద్ధం చేయమని ఆదేశించారు మరియు దానిపై కూర్చున్నారు ఆయన లోయ మధ్యకు చేరే వరకూ. ఆయన ప్రజలకిచ్చిన ప్రసంగంలో చెప్పారు : మీ రక్తం మరియు సంపద

మీకు పవిత్రమైనది, ఈ రోజు పవిత్రత వలే, ఈ పవిత్ర నెలలో, ఈ పవిత్ర ప్రదేశంలో. నిశ్చయంగా, జాహిలియ్యాలో జరిగిన ప్రతీది నా కాలి క్రింద ఉంది (అంటే రద్దు చేయబడింది), (అది) నిష్ప్రయోజనం మరియు జాహిలియ్యా కాలంలోని రక్తపరిహార సొమ్ము రద్దు అయిపోయింది - మరియు నేను రద్దు చేసేతొలి రక్త పరిహార సొమ్ము మనదే.

- ఉస్మాన్ (ఉల్లేఖకులలోని ఒకరు) చెప్పారు : రబీఅహ్ కుమారుని రక్త పరిహారం. సులైమాన్ చెప్పారు: రబీఅహ్ బిన్ అల్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్'. వీరి (ఉల్లేఖకుల)లో ఒకరు చెప్పారు : "అతడు సాద్ తెగవారి వద్దకు పెంపకానికి పంపబడ్డాడు, కాని హుదైల్ యొక్క తెగ వాళ్ళు ఆయనను చంపివేసారు" -

మరియు జాహిలియ్యా వడ్డీ నా కాలి క్రింద ఉంది (రద్దు చేయబడింది). మరియు నేను రద్దు చేసే మొదటి వడ్డీ మనదే : అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వడ్డీ, ఆ మొత్తం అంతా రద్దు చేయబడింది.

**స్త్రీల విషయంలో అల్లాహ్‌కు భయపడండి**, వారిని అల్లాహ్ యొక్క అమానతుగా (వివాహబంధం లోకి) తీసుకున్నారు, మరియు వారి రహస్యాంగాలు మీకు ధర్మసమ్మతం అయ్యాయి అల్లాహ్ మాటలతో (అంటే భార్యాభర్తల బంధం ధర్మసమ్మతం). మరియు వారిపై మీకున్న హక్కు, మీకు ఎవరితో అయితే నడవడం ఇష్టం లేదో వారిని మీ పరుపుపై (కూర్చుండడానికి) అనుమతి నివ్వకూడదు. వారు ఒకవేళ (ఏదైనా తప్పు) చేస్తే, వారికి గాయం కాకుండా కొట్టండి.

మరియు మీపై వారికి ఉండే హక్కు - వారి పోషణ మరియు వారికి వస్త్రాలను ఏర్పాటు చేయడం (మీ) స్థోమతను బట్టి.

మరియు నేను మీ మధ్య ఒకటి వదిలి వెళుతున్నాను ఎప్పటివరకూ అయితే దానిని పట్టుకుంటారో అప్పటివరకూ దారి తప్పరు. అల్లాహ్ గ్రంథం.

**నా గురించి మీరు అడగబడతారు, కనుక మీరేమి చెబుతారు?**

వారు చెప్పారు : మేము సాక్ష్యమిస్తున్నాము నిస్సందేహంగా మీరు సందేశాన్ని ఇచ్చారు మరియు అందరికీ అందజేశారు మరియు నిజాయితీగా వ్యవహరించారు'. కాబట్టి ఆయన తన చూపుడు వ్రేలును ఆకాశం వైపు ఎత్తి మరియు ప్రజల వైపుకు దించుతూ చెప్పారు "ఓ అల్లాహ్, సాక్ష్యం కండి. ఓ అల్లాహ్ సాక్ష్యం కండి. ఓ అల్లాహ్ సాక్ష్యం కండి'.

"తరువాత బిలాల్ అజాన్ మరియు ఇఖామత్ చెప్పారు మరియు ఆయన జుహ్ర్ సలాత్ చేశారు, తరువాత ఇఖామత్ ఇచ్చారు మరియు అస్ర్ నమాజ్ చేశారు మరియు వాటి మధ్య (జుహ్ర్, అస్ర్ నమాజ్‌ల మధ్య) ఎటువంటి సలాత్ చేయలేదు.

తరువాత ఆయన ఖస్వాపై వెళ్లవలసిన చోటు (అరఫా పర్వత ప్రాంతం)కి ప్రయాణం చేశారు. మరియు ఆయన(స) తన ఒంటె వెనుకభాగాన్ని రాళ్ళకు అభిముఖంగా ఉంచి (నిలుచున్నారు) ఏ విధంగా అంటే కాలినడకన వెళ్ళే జన సమూహం ఆయన ముందు ఉండేటట్లుగా.

ఆయన(స) కిబ్లాకు అభిముఖంగా ఉండి నిలబడి ఉన్నారు సూర్యుడు అస్తమించి, ఆ కాంతి తగ్గి దాని చివరి భాగం అదృశ్యమయ్యే వరకూ.

"ఆయన(స) (తన ఒంటెపై) ఉసామాను ఆయన వెనుక కూర్చుండ బెట్టుకుని ప్రయాణం కొనసాగించారు. కాని జనసందోహపు రద్దీ ఖస్వాను నొక్కి వేసింది దాని తల జీను ముందరి భాగానికి తగిలే విధంగా. ప్రవక్త(స)వారు తన కుడిచేతిని ఊపుతూ చెప్పారు : 'నెమ్మదిగా, ఓ ప్రజలారా! నెమ్మదిగా ఓ ప్రజలారా!"

ఎప్పుడైనా ఆయన కొండను చేరితే దాని(ఒంటె) కళ్ళెంను వదులుగా చేసేవారు అది అదిరోహించగలగడానికి.

తరువాత ఆయన ముజ్‌దలిఫాకు వచ్చారు మరియు మగరిబ్ మరియు ఇషా (నమాజ్‌లను) ఒక అజాన్ మరియు రెండు ఇఖామహ్‌లతో కలిపేశారు (కలిపి చదివారు).

- ఉస్మాన్ (ఉల్లేఖించిన వారిలో ఒకరు) చెప్పారు : మరియు ఆయన వాటిమధ్య ఏ తస్బీ చేయలేదు -అప్పుడు వారు అంగీకారంలో ఉన్నారు (అంటే ఉల్లేఖించిన వారి మధ్య ఈ విషయంలో ఎటువంటి అభిప్రాయ బేధం లేదు) -

రసూలుల్లాహ్(స) ఆ తరువాత విశ్రాంతి తీసుకున్నారు తెల్లవారే వరకూ. అప్పుడు ఫజ్ర్ నమాజ్ చేశారు ప్రాత:కాలపు కాంతి ఆయనకు స్పష్టం అయినప్పుడు.

- సులైమాన్ (ఉల్లేఖించిన వారిలో ఒకరు) చెప్పారు : 'అజాన్ మరియు ఇకామత్‌తో'. వారు (ఉల్లేఖించిన వారు ఈ విషయంలో) అంగీకారంలో ఉన్నారు -

మష్'అరుల్ హరమ్‌కు ఖస్వాపై ఆయన(స) ప్రయాణిస్తున్నారు. మరియు దానిని అధిరోహించారు.

- ఉస్మాన్ మరియు సులైమాన్ (ఉల్లేఖించిన వారిలో ఇద్దరు) చెప్పారు : ఆయన కిబ్లాకు అభిముఖంగా ఉండి అల్లాహ్‌ను కీర్తించి తక్బీర్ మరియు తహ్‌లీల్ చెప్పారు. ఉస్మాన్ అదనంగా చెప్పారు : ఆయన (అల్లాహ్) యొక్క ఏకత్వాన్ని తదేకంగా పొగిడారు -

మరియు ఆయన నిలుచుని ఉన్నారు బాగా ప్రకాశవంతమయ్యే వరకూ. తరువాత అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఆ ప్రాంతాన్ని వదిలారు సూర్యుడు వాస్తవంగా పైకి లేవడానికి ముందే. మరియు ఫజ్ల్ బిన్ అబ్బాస్‌ను (ఒంటెపై) తన వెనుక కూర్చుండ బెట్టుకున్నారు.

-అతడు అందమైన జుట్టుతో, మంచి రంగుతో మరియు మంచి శారీరక ఆకృతి కలిగిన వ్యక్తి. ఒంటెపై వేసుకున్న గుడారంలో ఉండే స్త్రీ ప్రక్కనుండి వెళుతున్న ప్రతీసారి, వారివైపు అతను చూసేవాడు, అప్పుడు రసూలుల్లాహ్(స)వారు ఆయన చేతిని ఫజ్ల్ ముఖంపై ఉంచేవారు మరియు ఫజ్ల్ అతని ముఖాన్ని మరోవైపు తిప్పుకునేవాడు. (అతను తిప్పుకున్న వైపు ఎవరైనా వెళ్లినప్పుడు) రసూలుల్లాహ్(స)వారు మరలా ఆయన చేతిని అతని ముఖంపై ఉంచేవారు, కాబట్టి అతను మరో దిక్కువైపు తిరిగి చూచేవాడు. వారు ముహస్సిర్ (లోయను)

చేరుకున్నప్పుడు, ఆయన కాస్త తొందరగా, దారి మధ్య భాగానికి వచ్చారు - అది జమరతుల్-కుబ్రాకు వెళుతుంది. ఆయన చెట్టు దగ్గర ఉన్న జమ్‌రహ్‌ను చేరినప్పుడు, దానిని ఆయన తక్బీర్ పలుకుతూ ఏడు రాళ్ళతో కొట్టారు, ప్రతీ రాయి ఖజ్ఫ్ కొరకు (ఉపయోగించిన) రాళ్ళ పరిమాణంలో ఉండేది. లోయ మధ్య భాగం నుండి ఆయన(స) విసిరారు. తరువాత జంతువులను జిబహ్ చేసే ప్రదేశానికి చేరుకున్నారు మరియు స్వహస్తాలతో 63 (ఒంటెలను) జిబహ్ చేశారు మరియు మిగతా వాటిని జిబహ్ చేయమని అలీ(రజి)వారికి ఆదేశించారు, ఆయన(స)తో పాటు ఖుర్బానీ పశువులను పంచుకున్నారు కనుక.

తరువాత ఆయన(స) ప్రతీ ఒంటె యొక్క చిన్న భాగాన్ని తీసి ఓ పాత్రలో వండమని ఆదేశించారు. మరియు వారు ఆ మాంసాన్ని తిన్నారు మరియు దాని షేర్వాని త్రాగారు.

సులైమాన్ అన్నారు :తరువాత ఆయన(స) (తన ఒంటెను) అధిరోహించి (కాబా) గృహానికి వెళ్లారు. మక్కాలో జుహ్ర్ ప్రార్థన చేసుకున్నారు. తరువాత ఆయన అబ్దుల్ ముత్తలిబ్ వంశీయుల దగ్గరకు వెళ్లారు. వారు జమ్‌జమ్ (నీటిని) తోడుతుండగా. మరియు చెప్పారు: దానిని (జమ్‌జమ్ జలాన్ని) బయటికి తీస్తూ ఉండండి ఓ అబ్దుల్ ముత్తలిబ్ వంశీయులారా! ప్రజలు నీటిని తోడే మీ (హక్కును) మీ నుండి లాగివేసుకుంటారని కాదు, నేను కూడా మీతో (నీటిని బావి నుండి) పైకితీస్తాను. వారు ఆయనకు బకెట్ ఇచ్చారు మరియు ఆయన దాని నుండి త్రాగారు.

**(సునన్ అబూదావూద్, హదీస్ నెం. 1905, పుస్తకం 11, అధ్యాయం 56, సంపుటి 2)**

**ఈ హదీస్ కొరకు అబూదావూద్ గ్రంథంలో ఇచ్చిన వివరణ :**

ప్రవక్త(స)వారితో పాటు హజ్జ్ చేసిన వారు 90,000 మంది. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం 1,30,000 (ఒక లక్షా ముప్ఫైవేల మంది). ఖుర్బానీ పశువును తమ చేతితోనే జిబహ్ చేయడం ఉత్తమం. రసూలుల్లాహ్(స) తన వయస్సు (63 సంవత్సరాల)కి సమానమైన పశువులను జిబహ్ చేశారు. జుల్-హిజ్జా 10వ రోజుకు అదనంగా, మరో 3 రోజుల వరకూ జిబహ్ చేయవచ్చు. కాని మొదటి రోజు ఖుర్బానీ ఇవ్వడమే మేలు. ఎందుకంటే రసూలుల్లాహ్(స)వారు మొదటి రోజే అన్నింటిని జిబహ్ చేశారు కనుక.

జుల్-హిజ్జా పదవరోజు తవాఫ్ హజ్జ్‌కి మూలస్తంభం వంటిది. దీనినే తవాఫుల్-ఇఫాదహ్ అంటారు.

## పోస్టల్ సమస్యలు

**కొన్ని ప్రాంతాలకు శాంతిబాట కాపీలు బుక్ పోస్ట్ ద్వారా పంపించినవి చేరలేదని తెలిసి, రెండవ సారి మరలా పంపించాము. అవి కూడా చేరలేదని తెలిసింది. దయచేసి సంబంధిత పోస్ట్‌మేన్‌ని సంప్రదించ వలసిందిగా కోరుతున్నాము.**

**ఏ పుస్తకమైనా రిటర్న్ అయి మాకు అందితేనే, సదరు పాఠకునికి పత్రిక చేరలేదని తెలుస్తుంది.**

**కొత్తగా చేరిన పాఠకులకు వెంటనే 'శాంతిబాట' సంచిక అందించాలని అధిక మొత్తం చెల్లించి డిటిడిసి కొరియర్ ద్వారా పంపించి నప్పటికీ, కొందరికి పుస్తకాలు చేరలేదు. మరలా వారికి గవర్నమెంట్ బుక్‌పోస్ట్‌లో పంపడం జరిగింది.**

**మీ ఎడ్రస్ మారినా లేక ఫోన్ నంబర్ మారినా 9491103017కి ఫోన్ చేసిగాని లేదా ఎస్.ఎమ్.ఎస్. ద్వారాగాని తెలియజేయండి.**

**ఇన్షా అల్లాహ్! వచ్చే సంచిక నుండి పోస్ట్ చేసిన వెంటనే SMS ద్వారా సమాచారం అందజేయబడుతుంది.**

**'శాంతిబాట' పత్రిక వ్యాపార పత్రిక కాదు కాబట్టి పత్రిక కొరకు 'ఏజెంట్లు'గాని, 'డిస్ట్రిబ్యూటర్లు'గాని లేరు.**

**ఏ పాఠక సోదరుడైనా తన ఊరిలో ఇతర 'శాంతిబాట' పాఠకులతో పరిచయముండి, వారికి స్వచ్ఛందంగా మా తరపున శాంతిబాట అందించి మాకు సహకరించదలిస్తే, దయచేసి 9491103017కి ఫోన్ చేసి తెలియజేయండి.**

**పుస్తకాలు మిస్ కాకుండా మాకు సహకరించిన వారవుతారు.**

**DTDC ద్వారాగాని లేదా ఆర్టీసీ ANL ద్వారాగాని పంపించగలము, ఇన్షా అల్లాహ్!**

# పాఠకుల అభిప్రాయాలు

### జకాత్ ...

'మీరున్నది ఉన్నట్లుగా వ్రాస్తున్నారు' అని ఓ పాఠకుడు అన్నారు. పాఠకులకు మా విశ్వసనీయత అర్థం అయ్యేలా చేసినందుకు అల్లాహ్‌కు మా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. జకాత్‌ను సేకరించడం దగ్గర నుండి, దాని పంపిణీ వరకూ నేడు సమాజంలో అమలులో ఉన్న విధానానికి, వాస్తవ విధానానికి మధ్య చాలా తేడా ఉందని గమనించాము. కాని ఈ విషయాలు సగటు ముస్లిమ్ దృష్టికి రాలేదు. ఒక పాఠక సోదరుని కోరిక మేరకు 'జకాత్' ప్రత్యేక వ్యాసాన్ని అందించాము. మేము ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల ద్వారా ప్రస్తుతం అమలులో నున్న విధానాన్ని ఖండించాము కనుక, మాకు వ్యతిరేకంగా చాలా విమర్శలు వస్తాయని భావించాము. అయితే మాకు అందుబాటులో నున్న 6 హదీస్ గ్రంథాలలోని 709 హదీస్‌లను అధ్యయనం చేయడమే కాకుండా, అందుబాటులో నున్న తఫ్సీర్ గ్రంథాలను కూడా బాగుగా అధ్యయనం చేయడం వలన, ప్రామాణిక విషయాలను చూపించి అల్లాహ్ పేరుతో వారికి సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నాము. కాని ప్రత్యేకంగా ఆ వ్యాసంపైనే ప్రశంసలు ఎక్కువగా అందాయి. **అల్‌హమ్‌దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్.** పత్రికను రమదాన్‌లో అందించాలని ఎంత ప్రయత్నం చేసినా, మాకు సాధ్యం కాలేదు. అయినప్పటికీ 'జకాత్' గురించి చదివాక, దాని ప్రకారమే జకాత్ చెల్లించామని కొందరు సోదరులు చెబుతుంటే మాకు చాలా సంతోషం కలిగింది. పత్రిక కొరకు కొందరు మాకు జకాత్ సొమ్మును ఆఫర్ చేశారు. కాని మాకు తీసుకునే అర్హత లేదని వారికి నచ్చ చెప్పి, సున్నితంగా తిరస్కరించాము. ఎవరో ఒకరిద్దరు తప్ప, దాదాపు అందరూ జకాత్ వ్యాసాన్ని ప్రశంసించారు.

### ఉమర్(రజి) ...

పత్రికకు ఈ వ్యాసమే హైలైట్ అని ఎక్కువమంది పాఠకులు తెలియజేశారు. ఈ వ్యాసం కొరకు విషయాలను సేకరించే టప్పుడే కన్నీరు ఆపుకోలేకపోయాము. అప్పుడే అనిపించింది, ఈ వ్యాసం అందరికీ నచ్చుతుందని. ఈ వ్యాసం విషయంలో టీచర్ల దగ్గర నుండి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇది మాకు చాలా సంతోషించదగిన విషయం. ఎందుకంటే టీచర్లద్వారా ఆ విషయం విద్యార్థులకు అందుతుంది. ఉమర్(రజి)వారి గురించి ఇంకా తెలుసుకోవాలని ఉందని ఒక సోదరుడు మెస్సేజ్ పంపారు. ఇన్షా అల్లాహ్, తప్పకుండా ఉమర్(రజి)వారికి సంబంధించిన ప్రామాణిక విషయాలన్నింటినీ అందిస్తాము. ముస్లిమేతర సోదరులు కూడా ఈ విషయాలు రాజకీయ నాయకులకు అందేలా చూడమని సలహా ఇచ్చారు. వారందరికీ మా ధన్యవాదాలు.

### హదీస్‌లపై ...

క్రిందటి సంచికలో కొత్తగా ప్రారంభించ బడిన హదీస్ విజ్ఞానం (సైన్స్ ఆఫ్ హదీస్) శీర్షిక నచ్చి కొందరు సోదరులు 'శాంతిబాట' పత్రికకు చందా దారులయ్యారు. హదీస్‌లపై నున్న రెండు వ్యాసాలు చదివాక, ఎప్పటి నుండో ఉన్న కొన్ని సందేహాలు తీరాయని ఒకరు చెప్పారు. సైన్స్ ఆఫ్ హదీస్ అనేది చాలా గొప్ప సబ్జెక్ట్. 'ప్రామాణికత' అంటే ఏమిటో దీనిని అధ్యయనం చేస్తే చాలా స్పష్టంగా అర్థమౌతుంది. హదీస్‌లు 'సహీహ్'? లేదా 'దయీఫ్'? అని చెప్పడానికి నాశిరుద్దీన్ అల్బానీ ఎవరు? అంటూ ఓ సోదరుడు ప్రశ్నించారు. ఎందరో స్కాలర్స్ సైన్స్ ఆఫ్ హదీస్‌పై అధ్యయనం చేశారు మరియు చేస్తూ ఉన్నారు. ఇటువంటి పరిశోధకులలో ఆయన కూడా ఒకరు. మేము ఎప్పుడూ వ్యక్తులకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చి వ్యక్తి పూజ చేసేవారము కాదు.

స్కాలర్స్ చేసిన మంచి వర్క్‌కి మాత్రమే మేము ప్రాధాన్యత నిస్తాము. నాశిరుద్దీన్ అల్బానీగారు సహీహ్ అంటేనే అది సహీహ్ అని ఇవ్వాలి, లేకపోతే 'సహీహ్'అని ఇవ్వకూడదని ఓ సోదరుడు మా పత్రికపై కామెంట్ చేశారని తెలిసి, ఆయన భావించినట్లే ఎవరైనా భావించవచ్చని, అటువంటి వారికొరకు 'శాంతిబాట'లో ప్రచురించబడే హదీస్‌లపై వివరణను వ్యాసరూపంలో అందించడం జరిగింది.

'శాంతిబాట'ద్వారా ప్రామాణిక హదీస్‌లనే అందించడం కోసం అల్లాహ్ పేరుతో ప్రయత్నం చేస్తున్నాము. ఏదో ఒక హదీస్ గ్రంథంపైనే ఆధారపడకుండా, అందుబాటులో నున్న అన్ని హదీస్ గ్రంథాలను అధ్యయనం చేస్తున్నాము.

మా ఈ ప్రయత్నం మీకు అర్థం కావాలంటే, హదీస్ విజ్ఞానం శీర్షిక క్రమం తప్పకుండా చదవండి.

### ఆరాధనపై ...

ఖుర్'ఆన్ తఫ్సీర్‌లో 'ఆరాధన' గురించి అందరికీ అర్థమయ్యే విధంగా వివరించడానికి 'ఇమామ్ గజాలీ'గారి వివరణను అందించాము. ఒక సోదరుడు ఇతర ఇమామ్‌ల గురించి కూడా ఇవ్వవచ్చు కదా! అని అభిప్రాయపడ్డారు. ఇక్కడ ఓ విషయాన్ని పాఠకులందరికీ తెలియజేయ వలసి ఉంది. మానవ శరీరభాగాల గురించి ఒకటవ తరగతిలో టీచర్ చెబుతారు, రెండవ తరగతిలో చెబుతారు ..... ఇంటర్‌లోనూ ఆ తరువాత మెడిసిన్‌లోనూ చెబుతారు. ఈ విధంగా ఒకే సబ్జక్టును ప్రతీ సంవత్సరం చెప్పినప్పటికీ, ఒక తరగతి నుండి మరో తరగతికి వెళ్ళినప్పుడు, ఆ సబ్జక్టు గురించి మరింత లోతుగా ఎక్కువ విషయాలను చెబుతారు.

వారి జ్ఞానానికి మరియు వయస్సుకు సరిపోయే విధంగానే ఆ పాఠాలు ఉంటాయి. 'శాంతిబాట'ద్వారా ఇస్లామీయ సమాచారాన్ని అందరికీ అందించాలనేది మా ప్రయత్నం. 'శాంతిబాట' చదివే పాఠకులలో అన్ని వయస్సులకు చెందిన వారున్నారు. అదే విధంగా ఇస్లామ్‌పై పెద్దగా అవగాహన లేనివారితో పాటు ఇస్లామ్‌పై అవసరమైనంత జ్ఞానాన్ని కలిగి ఉన్నవారు కూడా శాంతిబాట పాఠకులలో ఉన్నారు. వీరందరికీ సరిపోయే విధంగా మా వివరణ ఉండాలి. అందుకోసం మాకు అందుబాటులో నున్న అన్ని వివరణలను అధ్యయనం చేసి మా పాఠకులకు బాగా అర్థమవుతుందని నమ్మకం మాకు కలిగిన తరవాతే పత్రికలో అందిస్తున్నాము. మా దగ్గర వివిధ జమియత్‌లకు చెందినవారు చేసిన అనువాద ఖుర్'ఆన్ కాపీలు మరియు వాటి తఫ్సీర్‌లు

**మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.**

ఉన్నాయి. ప్రత్యేకంగా ఓ జమియత్‌పై అభిమానంగాని లేదా ద్వేషంగాని మాకు లేవు. అన్నింటిని అధ్యయనం చేసి ఆ ప్రత్యేక సందర్భానికి ఏది సరిపోతుందో అది మాత్రమే అందిస్తున్నాము. ఎంత పెద్ద విద్వాంసులైనా సరే, వారు కూడా మానవమాత్రులే కదా! వివరణలలో ఎక్కడైనా పొరపాట్లు జరగడం సహజం. 'ఇస్లామ్' ప్రకారంగా జీవించే విద్వాంసుల నందరినీ మేము గౌరవిస్తాము.

మా ఏకైక ప్రాధాన్యత ఖుర్‌ఆన్ మరియు ముహమ్మద్(స) వారి బోధనల ద్వారా ముస్లిమ్ సోదరులకు సంతోషమయ జీవనం కొరకు అత్యంత విలువైన సమాచారాన్ని అందించడమే!

ఒకరి వివరణ 'శాంతిబాట'లో అందించేటప్పుడు అది ఎవరు తెలిపారో వారిపేరు తప్పనిసరిగా తెలపాలనేది 'శాంతిబాట' విధానం. ఒక ఇమామ్‌గారి మీద ప్రత్యేక అభిమానం చూపి, ఇతరులను చిన్న చూపు చూశామని మాత్రం భావించవద్దని కోరుతున్నాము.

### దావత్ ...

'దావత్'ని ఉపాధిగా చేసుకోవద్దని ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల ద్వారా తెలియజేసిన విషయాలపై కొందరు అనుకూలంగా స్పందించి, వేరే ఉపాధి కొరకు ప్రయత్నించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ శీర్షికలో వ్రాసిన ప్రతీ విషయాన్ని తమ గురించే వ్రాశామని అనుకుంటున్నారని తెలిసింది. కాని ఈ విషయాలు కేవలం ఓ ప్రాంతానికి పరిమితం అయినవి కావు. ఆటో డ్రైవర్, లారీ డ్రైవర్ అని చెప్పడానికి కారణం, కష్టపడి సంపాదించు కోగలిగేవారు కూడా, వాటిని వదిలేసి సులభ సంపాదనకు అలవాటు పడిపోయారనేది తెలియజేయడానికే. సులభ సంపాదనకు అలవాటు పడినవారు, ఒకవేళ ఆ సంపాదన ఆగిపోతే, వారు తిరిగి కష్టపడి పనిచేయలేరు.

జాకిర్ నాయక్‌గారి అభిమానులు కూడా చాలా ఫీలయ్యారు. ఆయన గురించి వ్రాసినవే కాకుండా, ఆ వ్యాసంలో వ్రాసిన ప్రతీ విషయాన్ని ఆయనకే ముడిపెట్టారు. ఉమర్(రజి)వారు పదిమందిలో కూర్చుని ఉన్నప్పుడు, కొత్తవారికి 'ఖలీఫా' ఎవరనేది ఎవరైనా చెబితేనే గాని తెలియలేదు. ఎందుకంటే ఆయన ఖరీదైన బట్టలు వేసుకోకుండా, చిరుగులకు మాసికలు కుట్టిన చొక్కాను ధరించి అతి నిరాడంబరంగా జీవించారు. ఇస్లామ్‌లో దైవభీతి ఎక్కువున్నవారు అతి నిరాడంబరంగా ఉంటారు. మక్కాలో అత్యంత ధనవంతుడైన 'అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్' గారు ఎంత నిరాడంబరంగా జీవించారో ఈ సంచికలో అందించాము. ప్రజల సొమ్మును ఆర్భాటాల కొరకు ఉమర్(రజి) ఏనాడూ ఖర్చు పెట్టలేదు. నేడు దాయీలు అట్టహాసంగా ఖర్చుపెట్టే సొమ్ము ఎవరిది? పేద ప్రజలది. పేద ప్రజలకు అందవలసిన జకాత్ సొమ్ము అది. 'దావా' అనేది సలాత్(నమాజ్) వలే ప్రతీ ముస్లిమ్‌పై నున్న ఫర్జ్ (విధి) అయినప్పుడు, ఆ ఫర్జ్‌ను కూడా 'వృత్తి'గా చేసినవారు ఎవరైనా సరే, వారిని మనం ప్రోత్సహించ కూడదు.

కూలిపని చేసుకునే ఓ సోదరునికి, అతని స్థాయికి సరిపోయే విధంగా ఇస్లామ్ జ్ఞానం అతనికి లభిస్తే, తోటి కూలీలకు ఇస్లామ్ గురించి చెప్పగలుగుతాడు. ఒక విద్యార్థికి తెలిస్తే తోటి విద్యార్థులకు తెలియజేయ గలుగుతాడు. అదే విధంగా సమాజంలో అన్ని రంగాలలో ఉన్న ముస్లిమ్‌లకు ఇస్లామ్‌పై కనీస జ్ఞానం అందినప్పుడు, అన్ని రంగాలలో నున్న ఇతరులకు వారి ద్వారా అల్లాహ్ మార్గం గురించి తెలుస్తుంది.

స్వార్థపరులు ఏర్పాటుచేసుకున్న ప్రస్తుత 'దావా వ్యవస్థ'ను పూర్తిగా ముస్లిమ్ సమాజం నుండి తుడిచేసి, అందరూ కనీస జ్ఞానాన్ని పొందే విధంగా మస్జిద్‌లలో ఆదివారం స్కూల్స్ ఏర్పాటు చేస్తే, ఏ ఖర్చూ లేకుండా ఎటువంటి ఆడంబరాలు లేకుండా అందరికీ జ్ఞానం అందుతుంది. మంచి జ్ఞానమున్న ఆలిమ్‌లను మస్జిద్‌లలో నియమించుకుని, వారిచేత శిక్షణ నిప్పించాలి. వారు టీచర్లు. కాబట్టి వారికి తగిన విధంగా జీతాలు ఏర్పాటు చేస్తే, వారు 'శిక్షణ' ఇవ్వడం పైనే పూర్తి దృష్టి పెడతారు. వాస్తవానికి అటువంటి వారికి అరకొర జీతాలు ఏర్పాటు చేసి, ప్రోగ్రామ్స్ కొరకు మాత్రం కోట్లాది రూపాయలు వృథా చేస్తున్నారు. 'ఇల్మ్'ని (జ్ఞానాన్ని) గౌరవించడం లేదు.

ఇల్మ్‌ను గౌరవిస్తే, సమాజం బావుంటుంది. మనలో 'ఇల్మ్' పెరిగే కొద్దీ అల్లాహ్‌పై భయం పెరుగుతుంది. దైవభీతి పెరిగేకొద్దీ, మనిషి సన్మార్గంలో స్థిరంగా ఉండగలుగుతాడు.

### చొక్కా కాలర్ పట్టుకుని ...

"ఇస్లామ్‌పై దుష్ప్రచారం చేసే ముస్లిమ్ ముసుగులోని ఆ కాకినాడ జోకర్ ఎవరు? ధైర్యంగా పేరు చెప్పవచ్చు కదా! మన దగ్గర సత్యముంటే వాడి కాలర్ పట్టుకుని అడగవచ్చు" అని ఓ సోదరుడు ఫోన్‌లో ఎమోషనల్‌గా మాట్లాడారు. ఆ జోకర్ ఎవరో ఆ పరిసర ప్రాంతాలలోని వారందరికీ స్పష్టంగా తెలుసు. వాడొక్కడి పేరు చెబితే సరిపోతుందా? వాడు తన వంటి జోకర్‌లను ఎందరినో తయారుచేసి అన్ని జమియత్‌లలోకి పంపి, వారిద్వారా ఆ జమియత్‌లలోని అమాయకులను అపోహలకు గురి చేస్తున్నాడు.

పేరు చెప్పడానికి మాకెందుకు భయం? మా దగ్గర సత్యముంది. అల్లాహ్‌పై పరిపూర్ణ విశ్వాసముంది. కాబట్టే వైజాగ్ నుండి కాకినాడ వెళ్ళి 2008 అక్టోబర్‌లో, ఆ జోకర్‌యొక్క స్థావరంలోనే, అతని పూర్తి బెటాలియన్ ముందే వార్నింగ్ ఇవ్వడం జరిగింది. ఆ వార్నింగ్ తొలి వార్నింగ్ మాత్రమే కాదు, చివరి వార్నింగ్ అని కూడా చెప్పడం జరిగింది.

మాకు ధైర్యం ఉంది కనుకనే, ఇస్లామ్‌పై ఓ మతవర్గంవారి సహకారంతో దుష్ప్రచారం చేస్తున్నారని తెలుసుకున్న వెంటనే, మేము భారతీయులం కనుక భారతదేశ చట్టపరిధిలో ఇస్లామీయ ఆదేశాలను అతిక్రమించకుండా కాకినాడ వెళ్ళి హెచ్చరిక చేయగలిగాము. మరి అక్కడి వారెందుకు ఆ పని చేయలేక పోయారు? కారణం వారే చెప్పాలి.

వార్నింగ్ ఇవ్వడానికి కొన్ని రోజుల ముందునుండి అసత్యాలు పలికే ఆ కేంద్రం ప్రతినిధితో జరిపిన ఉత్తర ప్రత్యుత్తారాలన్నీ భద్రపరచడం జరిగింది. మేము ఏ సిడి గురించి అయితే మాట్లాడామో, ఆ సిడిని స్క్రీన్‌పై ప్రొజెక్ట్ చేసి రాజమండ్రి మరియు వైజాగ్ నగరాలలో ముస్లిమ్ సోదరులకు చూపించడం జరిగింది.

ఇదంతా మాకు అల్లాహ్‌పై విశ్వాసం ఉంది కనుకనే చేయగలిగాము. ఇవన్నీ ఎందుకు చేశామంటే, ఆ దుర్మార్గుని గురించి తెలుసుకుని, ఆ సంస్థ వలలో పడకుండా ముస్లిములు జాగ్రత్తపడతారని. మరి మమ్మల్ని అడిగిన సోదరుడు, ఈ పాటికే అతని చొక్కా కాలర్ పట్టుకున్నారేమో! ఆయన నుండి ఇంకా సమాచారమందలేదు. ఇస్లామ్‌పై ప్రాథమిక జ్ఞానం కలిగి ఉంటే, దుష్ప్రచారాల భండారాన్ని గుర్తించడం వీలవుతుంది. 'ఇల్మ్'కి విలువివ్వండి. మంచిని బోధించడం, చెడును నిరోధించడం ప్రతీ ముస్లిమ్‌పైనున్న తప్పనిసరి బాధ్యత.

---

క్రిందటి సంచికలో ఈ శీర్షికలో స్థలాభావం వలన ఓ సందేహానికి సమాధానం ఈ సంచికలో అందిస్తామని చెప్పడం జరిగింది.

ఆ సందేహం ఏమిటంటే ఓ పాఠక సోదరుడితో ఒక ముస్లిమేతర వ్యక్తి 27 రకాల ఖుర్ఆన్‌లు ఉన్నాయని చెబుతూ, సహీహ్ బుఖారీ హదీస్ గ్రంథం నుండి ఓ రిఫరెన్స్ ఇచ్చి వెళ్ళారట.

27 రకాల ఖుర్ఆన్‌లు ఉన్నాయా? అనేది పాఠక సోదరుని సందేహం. ఖుర్ఆన్ ఒక్కటే. 27 రకాలు లేవు.

అది అవతరించిన దగ్గర నుండి ఇప్పటి వరకూ (1400 సం॥లకు పైబడి) అల్లాహ్ రక్షణలోనే భద్రంగా ఉంది.

**"నిశ్చయంగా మేమే ఈ ఖుర్ఆన్‌ను అవతరింపజేసిన వారము మరియు నిశ్చయంగా మేమే దీనిని కాపాడేవారము."** (ఖుర్ఆన్ 15:9)

ఖుర్ఆన్‌లో పై విధంగా అల్లాహ్ వాగ్దానం చేయబట్టి ఈ గ్రంథం భద్రంగా మార్పులకు లోనుకాకుండా ఉంది.

టర్కీ, రష్యా మ్యూజియంలలో ఇప్పటికీ రెండు ఒరిజనల్ గ్రంథాలలో ఒకదాని ఫొటోగ్రాఫ్‌ను క్రిందటి సంచికలో అందించాము.

వాస్తవానికి 27 రకాలు కాదు. ''అది 7 విధాలుగా పఠించే ఖుర్ఆన్ పఠనం'' అని తెలుసుకోవాలి.

బహుశా రిఫరెన్స్ ఇచ్చిన ముస్లిమేతర వ్యక్తి ఇంగ్లీష్ లేదా ఉర్దూలో ఉన్న అనువాదాన్ని సరిగ్గా అర్థం చేసుకుని ఉండరు. 7 రకాల పఠనం గురించి అర్థం కావడానికి యాసలు, మాండలీకాల గురించి తెలిసి ఉంటే సులభంగా అర్థమౌతుంది.

మన రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా నుండి హైదరాబాద్ వరకూ తెలుగు మాట్లాడే వారిలో ఎన్నో రకాల యాసలున్నాయి. ఒకే పదాన్ని వేర్వేరుగా ఉచ్చరించడం జరుగుతుంది.

7 రకాల ఉచ్చారణలు మాత్రమే. అంతేగాని 7 రకాల ఖుర్ఆన్‌లు లేవు. ఆరాధ్యుడు ఒక్కడే! గ్రంథమూ ఒక్కటే!

ప్రవక్త(స)వారి కాలంలో ఎన్నో అరబ్ తెగలున్నాయి. ఇస్లామ్ వ్యాపిస్తూ ఉండటంతో వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు ఇస్లామ్ పరిధిలోకి రావడంతో వారందరికీ సులభంగా ఉండే విధంగా 7 యాసలలో పఠించడానికి అనుమతి నిచ్చారు.

పై విషయాలను స్పష్టంగా వివరించే 3 హదీస్‌లను ఇక్కడ అందిస్తున్నాము.

أَخبَرَنَا مُحَمَّدُ بْنُ بَشَّارٍ قَالَ : حَدَّثَنَا مُحَمَّدُ بْنُ جَعْفَرٍ غُنْدَرٌ قَالَ: حَدَّثَنَا شُعْبَةُ عَنِ الْحَكَمِ، عَنْ مُجَاهِدٍ، عَنِ ابْنِ أَبِي لَيْلَى، عَنْ أُبَيِّ بْنِ كَعْبٍ: أَنَّ رَسُولُ اللهِ ﷺ كَنَ عِنْدَ أَضَاةِ بَنِي غِفَارٍ، فَأَتَاهُ جِبْرِيلُ عَلَيْهِ السَّلام فَقَالَ : اِنَّ اللهَ عَزَّ وَجَلَّ يَأْمُرُكَ أَنْ تُقْرِيءَ أُمَّتَكَ الْقُرْآنَ عَلَى حَرْفٍ. قَالَ: ((أَسْأَلُ اللهَ مُعَافَاتَهُ و مَغفِرَتَهُ وإِنَّ أُمَّتِي لَا تُطِيقُ ذٰلِكَ))، ثُمَّ أَتَاهُ الثَّانِيَةَ فَقَالَ : اِنَّ اللهَ عَزَّ وَجَلَّ يَأْمُرُكَ أَنْ تُقْرِيءَ أُمَّتَكَ الْقُرْآنَ عَلَى حَرْفَيْنِ، قَالَ: ((أَسْأَلُ اللهَ مُعَافَاتَهُ و مَغفِرَتَهُ فَإِنَّ أُمَّتِي لَا تُطِيقُ ذٰلِكَ))، ثُمَّ جَاءَهُ الثَّالِثَةَ فَقَالَ : اِنَّ اللهَ عَزَّ وَجَلَّ يَأْمُرُكَ أَنْ تُقْرِيءَ أُمَّتَكَ الْقُرْآنَ عَلَى ثَلَاثَةِ أَحْرُفٍ، فَقَالَ: ((أَسْأَلُ اللهَ مُعَافَاتَهُ و مَغفِرَتَهُ وَإِنَّ أُمَّتِي لَا تُطِيقُ ذٰلِكَ)). ثُمَّ جَاءَهُ الرَّابِعَةَ فَقَالَ : اِنَّ اللهَ عَزَّ وَجَلَّ يَأْمُرُكَ أَنْ تُقْرِيءَ أُمَّتَكَ الْقُرْآنَ عَلَى سَبْعَةِ أَحْرُفٍ، فَأَيُّمَا حَرفٍ قَرَؤُوا عَلَيْهِ فَقَدْ أَصَابُوا))

ఉబై బిన్ కాబ్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు బనూ గిఫార్‌కు చెందిన చెరువు దగ్గర ఉన్నప్పుడు జి(బ్రీల్(అ) ఆయన దగ్గరికి వచ్చి చెప్పారు : "అల్లాహ్ మిమ్మల్ని ఆదేశించారు మీ ఉమ్మత్(అనుచర సమాజానికి) ఖుర్'ఆన్‌ను ఒకే విధానంతో పఠించేలా నేర్పమని". ఆయన(స) చెప్పారు, "నేను నా ప్రభువు నుండి రక్షణ మరియు క్షమాపణను వేడుకుంటున్నాను, నా ఉమ్మత్ దానిని తట్టుకోలేదు". తరువాత రెండవసారి అతను (జి(బ్రీల్-అ) ఆయన(స) దగ్గరికి వచ్చి చెప్పారు: "అల్లాహ్ మిమ్మల్ని ఆదేశించారు మీ ఉమ్మత్(అనుచర సమాజానికి) ఖుర్'ఆన్‌ను రెండు విధాలుగా పఠించేలా నేర్పమని". ఆయన(స) చెప్పారు, "నేను నా ప్రభువు నుండి రక్షణ మరియు క్షమాపణను వేడుకుంటున్నాను, నా ఉమ్మత్ దానిని తట్టుకోలేదు". తరువాత మూడవసారి అతను (జి(బ్రీల్-అ) ఆయన(స) దగ్గరికి వచ్చి చెప్పారు: "అల్లాహ్ మిమ్మల్ని ఆదేశించారు మీ ఉమ్మత్(అనుచర సమాజానికి) ఖుర్'ఆన్‌ను మూడు విధాల పఠించేలా నేర్పమని". ఆయన(స) చెప్పారు, "నేను నా ప్రభువు నుండి రక్షణ మరియు క్షమాపణను వేడుకుంటున్నాను, నా ఉమ్మత్ దానిని తట్టుకోలేదు". తరువాత నాలుగవసారి అతను (జి(బ్రీల్-అ) ఆయన(స) దగ్గరికి వచ్చి చెప్పారు: "అల్లాహ్ మిమ్మల్ని ఆదేశించారు మీ ఉమ్మత్(అనుచర సమాజానికి) ఖుర్'ఆన్‌ను 7 విధాలుగా పఠించేలా నేర్పమని మరియు (వాటిలో నుండి) ఏ విధానంలో పఠించినా అది సరియైనది". **(నసాయీ, సహీహ్, 940, పుస్తకం 11, అధ్యా. 37, సంపుటి 2)**

أَخْبَرَنَا نَصْرُ بْنُ عَلِيٍّ : أَخْبَرَنَا عَبْدُ الْأَعْلَى: حَدَّثَنَا مَعْمَرٌ عَنِ الزُّهْرِيِّ، عَنْ عُرْوَةَ، عَنِ ابْنِ مَخْرَمَةَ أَنَّ عُمَرَ بْنَ الْخَطَّابِ رَضِيَ اللهُ عَنْهُ قَالَ : سَمِعْتُ هِشَامَ بْنَ حَكِيمِ ابْنِ حِزَامٍ يَقْرَأُ سُورَةَ الْفُرْقَانِ، فَقَرَأَ فِيهَا حُرُوفًا لَمْ يَكُنْ نَبِيُّ اللهِ ﷺ أَقْرَأَنِيهَا، قُلْتُ: مَنْ أَقْرَأَكَ هٰذِهِ السُّورَةَ؟ قَالَ: رَسُولُ اللهِ ﷺ ، قُلْتُ: كَذَبْتَ مَا كَذَاكَ أَقْرَأَكَ رَسُولُ اللهِ ﷺ ؟ فَأَخَذْتُ بِيَدِهِ أَقُودُهُ الَى رَسُولِ اللهِ ﷺ فَقُلْتُ: يَا رَسُولَ اللهِ! اِنَّكَ أَقْرَأْتَنِي سُورَةَ الْفُرْقَانَ وَاِنِّي سَمِعْتُ هٰذَا يَقْرَأُ فِيهَا حُرُوفًا لَمْ تَكُنْ أَقْرَأْتَنِيهَا، فَقَالَ رَسُولُ اللهِ ﷺ : ((اقْرَأْ يَا هِشَامُ!)) فَقَرَأَ كَمَا كَانَ يَقْرَأُ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ : ((هٰكَذَا أُنْزِلَتْ)). ثُمَّ قَالَ : ((اقْرَأْ يَا عُمَرُ!)) فَقَرَأْتُ، فَقَالَ: ((هٰكَذَا أُنْزِلَتْ)) ثُمَّ قَالَ رَسُولُ اللهِ ﷺ : ((اِنَّ الْقُرْآنَ أُنْزِلَ عَلَى سَبْعَةِ أَحْرُفٍ)).

ఇబ్నె మఖ్‌రమా ఉల్లేఖనం : ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) చెప్పారు, "హిషామ్ బిన్ హకీమ్ బిన్ హిజామ్ సూరతుల్ ఫుర్ఖాన్ పఠిస్తుండగా నేను విన్నాను. అందులో ఒక అక్షరం పఠించారు, ప్రవక్త(స) పఠించగా (ఎన్నడూ) వినలేదు. నేను అడిగాను, 'ఈ సూరహ్‌ను నీకెవరు నేర్పారు?' అతను చెప్పాడు, "అల్లాహ్ యొక్క సందేశహరులు". నేను చెప్పాను, 'నీవు అబద్ధం చెబుతున్నావు. ఈ విధంగా నీకు రసూలుల్లాహ్(స) నేర్పలేదు'. నేను అతని చేయి పట్టుకుని అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారి వద్దకు తీసుకు వెళ్ళి చెప్పాను, "ఓ రసూలుల్లాహ్! మీరు నాకు సూరతుల్ ఫుర్ఖాన్ నేర్పారు, ఈ సూరహ్‌లో ఒక అక్షరం పఠించగా విన్నాను. అది మీ దగ్గర నేను వినలేదు. రసూలుల్లాహ్(స) చెప్పారు, "పఠించు, ఓ హిషామ్". అతను దానిని పఠించాడు (ముందుగా) పఠించినట్లే. రసూలుల్లాహ్(స) చెప్పారు, 'ఇది ఈ విధంగా అవతరించబడింది'. తరువాత ఆయన(స) అన్నారు: 'పఠించు, ఓ ఉమర్' నేను దానిని పఠించాను మరియు ఆయన చెప్పారు : 'ఇది ఈ విధంగానే అవతరించబడినది'. తరువాత అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "ఖుర్'ఆన్ ఏడు విధాలుగా పఠించేలా అవతరించ బడింది". **(నసాయీ, సహీహ్, 937, పుస్తకం 11, అధ్యా. 37, సంపుటి 2)**

**(3వ హదీస్ కొరకు పేజీ 41 చూడండి....)**

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650



FLASH Introduction
SAANTHIBAATA
skip
About Us
శాంతిబాట
SAANTHIBAATA
OUR TEAM
SUBSCRIPTION
DOWNLOAD
Contact Us
Contact Us Form
Disclaimer
Flash
Books
Magazine
Articles
Other
www.saanthibaata.net
అక్టోబర్ 10, 2010
నుండి అందరికీ అందుబాటులో
శాంతిబాట
మాసపత్రిక
వెబ్‌సైట్
విదేశాలలో ఉండి తెలుగు చదవగలిగే
మీ బంధువులకు, స్నేహితులకు
ఈ రోజే ఈ వెబ్‌సైట్ గురించి తెలియజేయండి
DOWNLOAD Magazine
VOL 1 ISSUE 3
SAKALA LOKAALANU SRUSHTINCHINA AA SRUSHTIKARTHA PERU EMITI
(116 Pages)
OPEN BOOK
సకల లోకాలను సృష్టించిన ఆ సృష్టికర్త పేరు ఏమిటి ?
DOWNLOAD Books
MAANAVA CHARITRALONE MOHONNATHAMUGA NIROOPINCHABADINA DAIVA SANDESHAHARUDU MUHAMMAD (PBH) VAARIPAI PRAPANCHA WYAPTHANGA JARUGUCHUNNA DRUSPRACHARAM
PART - 1 (8 Pages)
PART - 2 (56 Pages)
PART - 3 (92 Pages)
PART - 4 (47 Pages)
ముహమ్మద్
దుష్ప్రచారం
A Page from 3rd Isue
ఖుర్'ఆన్ మరియు సైన్స్
2. ఇస్లాంలో విద్య - మస్జిద్ (Mosque) యొక్క పాత్ర
చందా వివరాలు
SUBSCRIPTION DETAILS
సంప్రదించండి
CONTACT US
Contact us
Visakhapatnam, Andhra Pradesh
Cell: +919491103017
Permanent Postal Address
VELUGUBAATA Educational Society
SAANTHIBAATA
Your Guide for
HAPPY LIFE

SAANTHIBAATA MONTHLY June & July, 2010 Samalkot-533440 (East Godavari Dist.)
Registered with Registrar of News Papers for India RNI Reg. No. APTEL/2009/29650

الله

وَيُطْعِمُونَ الطَّعَامَ عَلَىٰ حُبِّهِ مِسْكِينًا وَيَتِيمًا وَأَسِيرًا
إِنَّمَا نُطْعِمُكُمْ لِوَجْهِ اللَّهِ لَا نُرِيدُ مِنكُمْ جَزَاءً وَلَا شُكُورًا

మరియు అది తమకు ప్రీతికరమైనప్పటికీ,
వారు నిరుపేదలకు మరియు అనాధలకు
మరియు ఖైదీలకు ఆహారం పెట్టేవారై
ఉంటారు.

వారు
(నిరుపేదలు, అనాథలు, ఖైదీలతో అంటారు) :
"వాస్తవానికి మేము అల్లాహ్ ప్రసన్నత కొరకే
మీకు ఆహారం పెడుతున్నాము. మేము మీ
నుండి ఎలాంటి ప్రతిఫలంగానీ, లేదా
కృతజ్ఞతలుగానీ ఆశించడం లేదు"

(ఖుర్'ఆన్ 76:8,9)

www.saanthibaata.net